
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 151

గురువారం 15-2-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


బుధవారం అబుదాబిలో 'బాప్స్' ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా అర్చకులతో ప్రధాని మోదీ

మానవ చరిత్రలోనే సువర్ణాధ్యాయం

6లో

- అబుదాబిలో ఆలయ నిర్మాణంపై ప్రధాని మోదీ ప్రశంసలు.. లాంఛనంగా ప్రారంభించిన పీఎం
- యూఏఈ అధ్యక్షునికి కృతజ్ఞతలు



రెండో రోజూ అదే ఉద్రిక్తత

రైతు సంఘాలు తలపెట్టిన 'ఢిల్లీ చలో' ఉద్రిక్తతలు బుధవారం కూడా కొనసాగాయి. పంజాబ్–హరియాణా సరిహద్దులో యుద్ధ వాతావరణం నెలకొంది. రైతులు, పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది.

వివరాలు 6లో ▸



పాకిస్తాన్ ప్రధానిగా షెహబాజ్ షరీఫ్!

పాకిస్తాన్‌లో రాజకీయ అనిశ్చితికి దాదాపు తెరపడింది. నూతన ప్రధానిగా పీఎంఎల్–ఎన్ పార్టీ అధినేత, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ తమ్ముడు షెహబాజ్ షరీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

వివరాలు 6లో ▸

బాబు ముడుపులకు రోహిత్ వేషం!

సీఎం హోదాలో 'సినిమా'తో వైట్.. బ్లాక్‌గా మళ్లింపు

సినిమా నిర్మాణం పేరుతో నిధుల ప్రవాహం

- రూ.5–6 కోట్ల ఖర్చుతో తూతూమంత్రంగా సినిమాలు
- రూ.30–40 కోట్లు ఖర్చయినట్లు తప్పుడు లెక్కలు
- ఇలా ఆ ఐదేళ్లలో ఫ్లాపు హీరోకు 17 సినిమాల ఛాన్స్‌లు
- ఆ తర్వాత ఇప్పటి దాకా ఒక్క సినిమా కూడా లేని వైనం
- ఖర్చులు పోగా మిగిలిన రూ.300 కోట్లు బాబు ఇంటికి
- టాక్ ఆఫ్ ది సినీ ఇండస్ట్రీగా మారిన వ్యవహారం

2లో



బహుశా.. ఇలాంటి ఆలోచన ఎవరికీ వచ్చి ఉండదు. కానీ చంద్రబాబు నాయుడు ఇక్కడ!! ఆయన 'స్కిల్' మామూలుదా!! ముడుపులు పుచ్చుకోవడంలో, తీసుకున్న వాటిని తెలివిగా దారి మళ్లించి తన జేబులోకి తెచ్చుకోవడంలో ఆయన 'స్కిల్స్'ను బయటపెట్టే 'సినిమా' కథ తాజాగా బయటపడింది. ఈ కథకు హీరో ఒక్కడే. బాబు సోదరుడి కొడుకు నారా రోహిత్. నిర్మాతలుగా బయటకు వేరేవారు కనిపించినా... సహ నిర్మాతలుగా, ఫైనాన్షియర్లుగా వ్యవహరించింది మాత్రం బాబు హయాంలో వివిధ ప్రాజెక్టుల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు. తీసిందేమో ఫ్లాపు సినిమాలు. భారీగా నష్టం వచ్చిందంటూ ప్రకటనలు. చంద్రబాబుకు మాత్రం లాభాలే లాభాలు!. అదెలాగని ఆశ్చర్యపోతున్నారా? లంచాలు దిగమింగడంలో బాబు మాస్టర్‌మైండ్‌ను కళ్లకు కట్టినట్లు చూపించే టాలీవుడ్ సినిమాల కథ ఇదిగో...



ఫేక్ పోస్టింగ్‌ల నిందితుడు అరెస్టు

- టీడీపీ కుట్ర బట్టబయలు
- షర్మిలపై టీడీపీ మద్దతుదారుడు ఉదయ్ అసభ్య పోస్టింగ్‌లు
- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యుడి పేరుతో ఫేక్ అకౌంట్ సృష్టి.. వర్రా రవీంద్రారెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు

- వివరాలు 14లో

ఎన్నికల విధుల్లో సచివాలయాల ఉద్యోగులు

- తమకు అభ్యంతరం లేదని ఈసీ స్పష్టీకరణ
- కలెక్టర్లకు మెమో ద్వారా వెల్లడి
- ఓటర్లకు ఇంకు గుర్తు తదితర విధులకు వినియోగం

3లో

ఏపీపీఎస్సీ.. మరో ఐదు

వారంలో వెలువడనున్న నోటిఫికేషన్లు

- అటవీ శాఖలో 861 పోస్టుల భర్తీకి సిద్ధం.. విద్యుత్, మత్స్య, జైళ్ల శాఖలు, గణాంకాల విభాగంలో ఖాళీల భర్తీ
- ఇప్పటికే గ్రూప్–2తో పాటు 11 నోటిఫికేషన్లు జారీ.. 25న గ్రూప్ 2 ప్రిలిమ్స్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- మొదలైన హాల్ టికెట్ల జారీ.. తొలిరోజు 2 లక్షల మంది డౌన్‌లోడ్

- వివరాలు 3లో



మే 13 నుంచి ఏపీఈఏపీ సెట్..



- 7 రోజులు నిర్వహణ
- మే 6న ఐసెట్, 8న ఈసెట్.. జూన్ 3 నుంచి పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్టు
- వివిధ ప్రవేశపరీక్షల తేదీలు విడుదల చేసిన ఉన్నత విద్యామండలి
- వర్సిటీలకు సెట్స్ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ కన్వీనర్ల నియామకం
- మే 6 నుంచి జూన్ 13 వరకు 9 సెట్స్ నిర్వహణ.. త్వరలో దశలవారీగా సెట్స్ షెడ్యూల్ విడుదల

3లో

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో రైల్వేలైన్‌కు భూసేకరణ సర్వే చేస్తున్న అధికారులు



చకచకా కోనసీమ రైల్వే లైన్ పనులు

- భూసేకరణకు నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- మలికిపురం, అమలాపురం తదితర మండలాల్లో మొదలైన సర్వే
- కాకినాడ నుంచి నరసాపురం వరకు మొత్తం ట్రాక్ పొడవు 104 కి.మీ.
- గతంలోనే కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వే ట్రాక్ నిర్మాణం
- ఇంకా నిర్మించాల్సిన రైల్వే ట్రాక్ పొడవు 57 కిలోమీటర్లు

సాక్షి అమలాపురం: కోనసీమ ప్రాంత వాసుల రైల్వేలైన్ కల సాకారమయ్యే దిశగా ఒకదాని తరువాత ఒకటి శుభవార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ రైల్వేలైన్ నిర్మాణానికి రూ. 300 కోట్లు కేటాయించగా.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కూడా భూ సేకరణకు రూ. 50 కోట్లు ఇచ్చింది. దీంతో పనులు ఊపందుకున్నాయి. గతంలో టెండర్లు ఖరారైన గౌతమీ నదిపై వంతెన గడ్డర్ల పనులు త్వరలోనే మొదలు కానున్నాయని రైల్వే శాఖ తెలిపింది. భూసేకరణకు జిల్లా యంత్రాంగం సర్వే చేపట్టడంతో ఈ ప్రాజెక్టు త్వరలోనే పూర్తవుతుందనే ఆశలు ఈ ప్రాంత ప్రజల్లో రేకెత్తాయి. కాకినాడ–కోటిపల్లి– అమలాపురం– నరసాపురం రైల్వేలైన్ మొత్తం పొడవు 102.507 కిలోమీటర్లు. కాకినాడ నుంచి కోటిపల్లి వరకు 45.30 కి.మీ.ల ట్రాక్ గతంలోనే ఉంది. కోటిపల్లి నుంచి 57.207 కి.మీ.ల వరకు నిర్మించాల్సి ఉంది. కోటిపల్లి నుంచి అమలాపురం శివారు భట్లువిల్లి వరకు 12.05 కి.మీ.ల వరకు భూసేకరణ పూర్తయ్యింది. అమలాపురం నుంచి నరసాపురం వరకు 45.157 కిమీల వరకు నిర్మించాల్సిన రైల్వేలైన్‌కు భూసేకరణ పెండింగ్‌లో ఉంది. వైనతేయ, వశిష్టలపై వంతెన నిర్మాణాలకు భూసేకరణ గతంలో జరిగింది. రైల్వే ట్రాక్, పేరూరు, జగ్గన్నపేట, రాజోలు, చించినాడ వద్ద నిర్మించ తలపెట్టిన స్టేషన్లకు భూమి సేకరించాల్సి ఉంది.

మొదలైన భూమి సర్వే పనులు

ఈ ట్రాక్ నిర్మాణానికి ఇంకా సుమారు 600 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని అంచనా. నిధులు మంజూరు కావడం మొదలు కావడంతో బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం, రైల్వేశాఖ అధికారులు అమలాపురం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో అవసరమైన భూమిని గుర్తించేందుకు సర్వే చేపట్టారు. అమలాపురం మండలంలో పేరూరులో 80.50 ఎకరాలు, కామనగరువు, రోళ్లపాలెంలో 68 ఎకరాలు, అల్లవరం మండలం బోడసకుర్రులో 59 ఎకరాలు, మలికిపురం మండలం గుడిమెల్లంకలో 60 ఎకరాల చొప్పున భూమిని గుర్తించారు. మిగిలిన గ్రామాలలో సైతం భూ సేకరణకు సర్వే పనులు వేగంగా సాగుతున్నాయి. రైల్వే లైన్‌లో కీలకమైన గౌతమీ నదిపై వంతెన నిర్మాణానికి అవసరమైన గెడ్డర్ల నిర్మాణానికి రూ.275 కోట్లకు గత ఏడాది టెండర్లు ఖరారైన విషయం తెలిసిందే. ఈ పనులకు పేపర్ వర్క్ (బ్లూ ప్రింట్) పూర్తికాగానే సంబంధిత నిర్మాణ సంస్థ పనులు ప్రారంభించనుంది.

"సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



కోనసీమ రైల్వే లైన్‌కు కావాల్సిన భూసేకరణకు రూ.50 కోట్లు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలి నుంచి చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఇప్పటి వరకు దీని నిర్మాణానికి రూ. 1,409 కోట్లు సాధించిన ఘనత మా ప్రభుత్వానిదే. గత టీడీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు కానీ తమ వల్లే నిధులు వచ్చాయని చెప్పుకోవడం హాస్యాస్పదం.

– చింతా అనూరాధ,
ఎంపీ, అమలాపురం

ఏడాదిలోనే రూ.2.46 లక్షల కోట్లు

- వడివడిగా వాస్తవ రూపంలోకి పెట్టుబడులు
- జీఐఎస్‌లో రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు.. అత్యధికంగా ఉపాధి కల్పించే ఎంఎస్‌ఎంఈ రంగానికి పెద్ద పీట
- 2.5 లక్షలకు పైగా యూనిట్ల ఏర్పాటుతో 6 లక్షల మందికి ఉపాధి
- రూ.1,000 కోట్లతో నక్కపల్లి, శ్రీకాళహస్తి నోడ్‌ల అభివృద్ధి.. వీటి ద్వారా సుమారు రూ.60,000 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం
- రూ.4,178 కోట్ల విలువైన ప్రాజెక్టుల పనులను వర్చువల్‌గా ప్రారంభించిన పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

- వివరాలు 2లో



పొత్తు.. టీడీపీ సీనియర్లు చిత్తు

- జనసేనకు 50, బీజేపీకి 25
- మొత్తంగా టీడీపీ 75 సీట్లు వదులుకోవాల్సిన పరిస్థితి
- గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బండారు సత్యనారాయణ మూర్తి సీట్లకు ఎసరు
- బోండా ఉమా, భూమా అఖిలప్రియకూ నిరాశే
- బీజేపీ లిస్ట్‌లో విజయవాడ, విశాఖ ఎంపీ సీట్లు
- చంద్రబాబు తీరు వల్లే ఇన్ని కష్టాలంటూ టీడీపీ నేతల ఆందోళన

5లో

నేడే వలంటీర్లకు నగదు పురస్కారాలు

- గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో అందించనున్న సీఎం జగన్
- ప్రతి శాసనసభా నియోజకవర్గంలో ఐదుగురికి సేవా వజ్ర అవార్డు.. నగదు పురస్కారం రూ.30 వేల నుంచి రూ.45 వేలకు పెంపు
- ప్రతి మండలం, మున్సిపాలిటీ నుంచి ఐదుగురికి సేవారత్న
- పురస్కారం రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంపు
- మిగిలిన వలంటీర్లందరికీ సేవామిత్ర అవార్డు
- బహుమతి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంపు
- మొత్తం 2.55 లక్షల మంది వలంటీర్లకు రూ.392 కోట్లు

10లో

కొత్తగా మరో 2.32 లక్షల ఇళ్లు

వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం

- నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకం కింద నిర్మాణం
- కేంద్ర గృహ నిర్మాణ శాఖకు ప్రతిపాదనలు
- అనుమతులు రాగానే నిర్మాణం ప్రారంభం
- ఈలోగా మౌలిక వసతుల కల్పన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిరుపేదలైన అక్కచెల్లెమ్మలు మరింతమందికి సొంతింటి కలను సాకారం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించారు. ఇప్పటికే దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద 31 లక్షలకు పైగా నిరుపేద మహిళల పేరిట ఉచితంగా స్థలాలను పంపిణీ చేసి రికార్డు సృష్టించారు. 17 వేల వైఎస్సార్, జగనన్న కాలనీల్లో పేదలకు స్థలాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణం ద్వారా కొత్తగా ఊళ్లనే నిర్మిస్తున్నారు. ఇప్పటికే 22 లక్షలకు పైగా ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి, శరవేగంగా నిర్మాణాలు చేపడుతున్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద జగనన్న కాలనీల్లోనే మరో 2,32,686 ఇళ్లు నిర్మించడానికి తాజాగా ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ నుంచి కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖకు ప్రతిపాదనలు వెళ్లాయి.

వేగంగా ఇళ్ల నిర్మాణం

జగనన్న కాలనీల్లో అనుమతులు ఇచ్చిన 22 లక్షలకు పైగా ఇళ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటిలో 19.13 లక్షలు సాధారణ ఇళ్లు కాగా, మిగిలినవి టిడ్కో ఇళ్లు. సాధారణ ఇళ్లలో ఇప్పటికే 7.25 లక్షల గృహాల నిర్మాణం పూర్తయింది. మరో 4.15 లక్షల ఇళ్లు పునాది నుంచి రూఫ్ లెవల్ వరకు వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లాల వారీగా రోజువారి లక్ష్యాలను నిర్దేశించి నిర్మాణ పనులను గృహ నిర్మాణ శాఖ పర్యవేక్షిస్తోంది. వేగంగా బిల్లులు చెల్లిస్తూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటోంది.

అత్యధికంగా కర్నూలు జిల్లాలో

కొత్తగా నిర్మించనున్న 2.32 లక్షల ఇళ్లలో అత్యధికంగా కర్నూలు జిల్లాలో 30,652 ఉన్నాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 29,892, కాకినాడ జిల్లాలో 25,826, పల్నాడు జిల్లాలో 22,202 ఇళ్లు ఉన్నాయి. పేదల ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు చొప్పున ఇవ్వడమే కాకుండా, ఉచితంగా ఇసుక సరఫరా ద్వారా రూ.15వేలు, సిమెంట్, స్టీలు, మెటల్ ఫ్రేమ్స్, ఇతర నిర్మాణ సామగ్రిని తక్కువ ధరకే అందించడం ద్వారా మరో రూ.40 వేల మేర ప్రభుత్వం పేదలకు లబ్ధి చేకూరుస్తోంది. అదేవిధంగా పావలా వడ్డీకే రూ.35 వేలు చొప్పున బ్యాంకు రుణం అందిస్తున్నారు. ఇలా మొత్తంగా ఒక్కో లబ్ధిదారుకు రూ.2.70 లక్షలు చొప్పున మేలు కలుగుతోంది. దీనికి అదనంగా మౌలిక వసతుల కోసం ప్రతి ఇంటిపై మరో రూ.లక్షకు పైగా వైఎస్ జగన్ ప్రభుత్వం ఖర్చు పెడుతోంది.





ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఒంటరి బతుకులకు సర్కారు ఆసరా..



మా ఆయన శివశంకర్‌రెడ్డి పన్నెండేళ్ల క్రితం కాలం చేశారు. ఆ తర్వాత వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలోని బద్రిపల్లె నుంచి ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని గిడ్డంగి వీధికి ముగ్గురు పిల్లల్ని వెంటబెట్టుకుని వలస వచ్చాను. పదో తరగతి వరకు చదువుకున్న నేను ఇంట్లోనే కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, టైలరింగ్ పనులు చేస్తూ పిల్లలను పోషించుకుంటున్నా. భర్త మరణించగా వచ్చిన ఎల్ఐసీ డబ్బులతో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మెషిన్ కొనుగోలు చేశాను. సీజన్‌ను బట్టి వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. అయితే పిల్లల చదువులు ఎలాగన్నది నాకు దిగులుగా ఉండేది. అదే సమయంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నా సమస్యకు పరిష్కారం చూపింది. కుమారుడు నాగహితేష్‌రెడ్డి ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. తనకు అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు వంతున నా ఖాతాలో జమవుతోంది. మా చిన్నపాప రమ్యశ్రీ ప్రస్తుతం ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆమెకు రెండేళ్లపాటు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన మంజూరైంది. దివ్యాంగురాలైన పెద్దకుమార్తె లావణ్యకు ప్రతి నెలా రూ.3 వేలు వంతున పింఛన్ వస్తోంది. నాకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.24 వేలు అందింది. వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా గతేడాది నుంచి రూ.15 వేలు బ్యాంక్ ఖాతాలో జమవుతోంది. అంతేగాకుండా బొల్లవరం జగనన్న కాలనీలో స్థలం మంజూరైంది. అందులో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరైంది. ప్రస్తుతం ఇంటి నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. సొంత ఊరిలో ఉన్న పంట పొలానికి ఏటా రూ.13,500 చొప్పున రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. జగనన్న ప్రభుత్వంలో మంజూరైన సంక్షేమ పథకాలే మాలాంటి కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తున్నాయి. ఆయన రుణం ఎన్నటికీ తీర్చుకోలేం.

– చందా వీర పద్మావతి, ప్రొద్దుటూరు
(కుదుముల వీరారెడ్డి, విలేకరి, ప్రొద్దుటూరు)

మళ్లీ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నా



మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. మా ఆయన రమేష్ ఒక బట్టల షాపులో పని చేస్తున్నారు. ఆయనకు తోడుగా నేను శ్రీకాకుళంలోని అరసవల్లిలో ఇంటి దగ్గరే టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాం. మా ఇద్దరి సంపాదనతోనే ఇద్దరు పిల్లల్ని చదివించుకున్నాం. వారు వేర్వేరుగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వారిద్దరికీ పెళ్లిళ్లు కూడా చేశాక వేరేగా బతుకుతున్నారు. అయితే 30 ఏళ్లుగా మేము అద్దె ఇంట్లోనే ఉంటూ కాలం గడిపాం. కానీ సొంత ఇల్లు కలగానే మిగిలిపోయింది. మాకు ఇంటి స్థలం మంజూరు చేయాలని ఎన్నో పర్యాయాలు గత ప్రభుత్వ హయాంలో విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. ఇక సొంత ఇంటిపై ఆశలు వదులుకున్నాం. ఇంతలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాకు ఇంటి స్థలం మంజూరు చేసింది. పట్టాలో నాపేరు చూసినప్పుడు ఇది కలా.. నిజమా.. అనిపించింది. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం కూడా చేసింది. ఇన్నాళ్లకు నా సొంతింటి కల నెరవేరింది. అద్దె ఇంటి బాధలు పోయాయి. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నాకు ఏటా రూ.18,750 అందుతోంది. జగన్ మాత్రమే పేదలు, సామాన్యుల కష్టాలను పట్టించుకున్నారు. మంచి పథకాలు అమలు చేస్తున్నారు. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని ఆదిత్యుడికి.. అదే సూర్యనారాయణ స్వామికి మొక్కుకుంటున్నా.

– కళ్లేపల్లి విద్యావతి, అరసవల్లి
(బలివాడ శివప్రసాద్, విలేకరి, అరసవల్లి)

గత ప్రభుత్వం కంటే బాగా పనిచేస్తున్నామని చెప్పుకోకూడదా?

గత ప్రభుత్వంతో ప్రస్తుత ప్రభుత్వం పోల్చుకోవడం తప్పెలా అవుతుంది?

- ప్రకటనల్లో గత ప్రభుత్వం అంటున్నారే తప్ప ఫలానా రాజకీయ పార్టీ అని అనడం లేదే
- ప్రభుత్వ ప్రకటనల్లో లబ్ధిదారుల అభిప్రాయాలుంటే అభ్యంతరం దేనికి?
- గత ప్రభుత్వంతో ప్రస్తుత ప్రభుత్వం పోల్చుకోవడాన్ని మేం ఎలా నిరోధించగలం?
- పిటిషనర్‌ను నిలదీసిన హైకోర్టు సీజే ధర్మాసనం
- పలువురికి నోటీసులు.. విచారణ మార్చి 6కి వాయిదా



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఆయా పత్రికల్లో ఇచ్చే ప్రకటనల్లో గత ప్రభుత్వంతో పోల్చుకోవడం తప్పెలా అవుతుందని హైకోర్టు బుధవారం పిటిషనర్‌ను ప్రశ్నించింది. గత ప్రభుత్వం కంటే తాము బాగా చేస్తున్నామని ప్రస్తుత ప్రభుత్వం చెప్పుకోకూడదా? అంటూ నిలదీసింది. అలా చెప్పుకోవడం తప్పెలా అవుతుందంది. ప్రభుత్వాలు తమ పనితనం గురించి వివరించడం తప్పెలా అవుతుందని ప్రశ్నించింది. గత ప్రభుత్వంతో పోల్చుకోవడాన్ని తామెలా నిరోధించగలమని నిలదీసింది. అలాగే ప్రభుత్వ ప్రకటనల్లో లబ్ధిదారుల చిత్రాలు, వారి అభిప్రాయాలు ఉండటం కూడా తప్పెలా అవుతుందని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం తన ప్రకటనల్లో గత ప్రభుత్వం అన్నదే తప్ప, ఫలానా రాజకీయ పార్టీ అని పేర్కొనలేదని గుర్తు చేసింది. గత ప్రభుత్వం అని అనే దానికి, రాజకీయ పార్టీ అని అనే దానికి తేడా ఉందని తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వ స్పందనను తెలుసుకోవాలని భావిస్తున్నామని పేర్కొంది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి తదితరులతో పాటు వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా ఉన్న సీఎం వైఎస్ జగన్‌కు, జగతి పబ్లికేషన్స్, ఇందిరా టెలివిజన్, వైఎస్సార్ సీపీ, సీబీఐ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మార్చి 6కి వాయిదా వేసింది. ఈ లోపు జారీ చేసే ప్రకటనల విషయంలో సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అనుసరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

చంద్రబాబును విమర్శిస్తున్నారు.. అడ్డుకోండి

రాష్ట్ర ప్రభుత్వం ఆయా పత్రికల్లో ఇచ్చే ప్రకటనల్లో గత ప్రభుత్వం అంటూ టీడీపీ అధినేత చంద్రబాబును విమర్శిస్తోందని.. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ బాపట్ల జిల్లాకు చెందిన చెన్నుపాటి సింగయ్య హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేరు మీద కాకుండా సీఎం వైఎస్ జగన్ పేరుతో పత్రికల్లో ప్రకటనలు వస్తున్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వం ప్రకటనల విషయంలో సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు నడుచుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ప్రకటనల ద్వారా ప్రజాధనాన్ని వృథా చేసిందని.. దీనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ సింగయ్య తరఫు న్యాయవాది అంబటి సుధాకరరావు వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ప్రకటనల్లో ప్రతిపక్షాలను విమర్శించడానికి వీల్లేదన్నారు. గత ప్రభుత్వాన్ని కించపరిచే విధంగా ప్రస్తుత ప్రభుత్వం ప్రకటనలు ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని గొప్పగా చూపేలా ఈ ప్రకటనలు ఉంటున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలంటూ పోల్చిచూడటానికి వీల్లేదని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ పిటిషనర్‌కు పలు ప్రశ్నలు సంధించింది. 'ఓ పథకానికి అప్పుడు ఇంత ఇచ్చేవారు.. మేం ఇప్పుడు ఇంత ఇస్తున్నాం' అని చెప్పుకోవడం ఎలా తప్పు అవుతుందని నిలదీసింది.

పిటిషనర్ దురుద్దేశాన్ని చూడండి

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ప్రకటనలనే పిటిషనర్ సవాల్ చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ప్రకటనల గురించి కనీసం ప్రస్తావించలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్నిబట్టి ఈ వ్యాజ్యం దాఖలు వెనుక పిటిషనర్‌కున్న దురుద్దేశాలను సులువుగా అర్థం చేసుకోవచ్చన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ప్రకటనలను కోర్టు ముందుంచుతామని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఒక్క ఏడాదిలోనే రూ. 2.46 లక్షల కోట్లు

వడివడిగా వాస్తవ రూపంలోకి పెట్టుబడులు

- దేశవ్యాప్తంగా ఒప్పందాల్లో వాస్తవ రూపం దాల్చేది 17 శాతంలోపే
- ఏపీలో ఏడాదిలోపే 19 శాతం వాస్తవ రూపంలోకి..
- మౌలిక వసతుల కల్పనలో భాగంగా రూ.1,000 కోట్లతో నక్కపల్లి, శ్రీకాళహస్తి నోడ్‌ల అభివృద్ధి
- ఈ రెండు పారిశ్రామిక పార్కుల ద్వారా సుమారు రూ.60,000 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం
- రూ.4,178 కోట్ల విలువైన ప్రాజెక్టుల పనులను వర్చువల్‌గా ప్రారంభించిన పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

ఏపీలో తాజా పెట్టుబడులు ఇలా..

కంపెనీ పేరు	రంగం	ప్రాంతం	పెట్టుబడి (రూ.కోట్లల్లో)	ఉపాధి
బిర్లా కార్బన్ లిమిటెడ్	కార్బన్ బ్లాక్ తయారీ	నాయుడుపేట, తిరుపతి జిల్లా	1700	250
రిలయన్స్ బయో ఎనర్జీ	కంప్రెస్డ్ బయోగ్యాస్	రాష్ట్రంలో 8 చోట్ల యూనిట్లు	1,024	576
హెల్లా ఇన్‌ఫ్రా మార్కెట్	పీవీసీ పైప్స్, ఫిట్టింగ్స్	తిరుపతి	260	400
వెసువియస్ ఇండియా	రిఫ్రాక్టరీస్ తయారీ	పరవాడ, అనకాపల్లి	250	500
ఏపీఐఐసీ	పారిశ్రామికవాడ	శ్రీకాళహస్తి నోడ్	423	42,680(అంచనా)
ఏపీఐఐసీ	పారిశ్రామికవాడ	నక్కపల్లి, అనాకపల్లి	395	26,700(అంచనా)
ఎంఎస్ఎంఈ కార్ప్	ర్యాంప్ కార్యక్రమం	రాష్ట్రమంతా	118	-
ఎంఎస్ఎంఈ కార్ప్	గోల్డ్ క్లస్టర్	జగ్గయ్యపేట, ఎన్టీఆర్‌జిల్లా	8	200
మొత్తం			4,178	1,926



వివిధ ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

సాక్షి, అమరావతి: పారిశ్రామిక రంగాన్ని సీఎం జగన్ వెన్నుతట్టి ప్రోత్సహిస్తుండటంతో రిలయన్స్, బిర్లా, టాటా లాంటి పారిశ్రామిక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. గతేడాది మార్చిలో విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో కుదిరిన ఒప్పందాలు వేగంగా వాస్తవ రూపంలోకి వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రూ.4,178 కోట్లతో ఆదిత్య బిర్లా గ్రూప్, రిలయన్స్ ఎనర్జీ, హెల్లా ఇన్‌ఫ్రా, వెసువియస్ ఇండియా లిమిటెడ్, ఏపీఐఐసీ, ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్‌కు సంబంధించిన మొత్తం 8 ప్రాజెక్టులకు బుధవారం వెలగపూడి సచివాలయం నుంచి ఆయన వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 'ఏపీ ఎంఎస్ఎంఈ వన్' వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. పెట్టుబడులు పెడుతున్న రిలయన్స్, ఆదిత్య బిర్లా, హెల్లా ఇన్‌ఫ్రా సంస్థలకు సీఎం తరఫున ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలను అందిస్తుందని పునరుద్ఘాటించారు. సాధారణంగా దేశంలో పెట్టుబడుల సదస్సులో జరిగే ఒప్పందాల్లో 16 నుంచి 17 శాతం మాత్రమే వాస్తవ రూపంలోకి వస్తాయని, మన రాష్ట్రంలో మాత్రం సదస్సు జరిగి ఏడాది కాకుండానే 19 శాతం పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రావడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. జీఐఎస్‌లో మొత్తం రూ.13.11 లక్షల కోట్ల విలువైన 386 ఒప్పందాలు జరగ్గా రూ.2.46 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన పనులు వేర్వేరు దశల్లో ఉన్నాట్లు వివరించారు. పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉందని ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన భరోసాతో పెట్టుబడులకు పరిశ్రమలు ముందుకొస్తున్నాయని చెప్పారు. గత మూడేళ్లుగా దేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా 11 పారిశ్రామిక కారిడార్లను నెలకొల్పుతుండగా ఏపీ పరిధిలో విశాఖ–చెన్నై, చెన్నై–బెంగళూరు, బెంగళూరు–హైదరాబాదు పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటవుతున్నట్లు చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా రూ.1,000 కోట్లతో నక్కపల్లి, శ్రీకాళహస్తి నోడ్‌లను అభివృద్ధి చేస్తున్నామని, ఈ రెండు పారిశ్రామిక పార్కుల ద్వారా సుమారు రూ.60,000 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు.

తీర ప్రాంత అభివృద్ధిపై దృష్టి

సుదీర్ఘంగా 974 కి.మీ. పొడవైన సముద్ర తీరాన్ని కలిగి ఉన్న మన రాష్ట్రం పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనుకూలమని మంత్రి అమర్‌నాథ్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక సుమారు రూ.20 వేల కోట్లతో నాలుగు ప్రధాన పోర్టులను నిర్మిస్తుండగా రామాయపట్నం పోర్టు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మరో రూ.నాలుగు వేల కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానిక యువత ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే గత నాలుగేళ్లలో 2.50 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటు ద్వారా ఆరు లక్షల మందికి పైగా ఉపాధి కల్పించినట్లు వెల్లడించారు. యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలను విస్తృతం చేసేందుకు 50కిపైగా పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటుకు కృషి జరుగుతోందన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్‌కుమార్, పరిశ్రమల శాఖ కమిషనర్ సిహెచ్.రాజేశ్వర్‌రెడ్డితో పాటు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాబు ముడుపులకు రోహిత్ వేషం!

సీఎం హోదాలో 'సినిమా'తో వైట్.. బ్లాక్‌గా మళ్లింపు

సాక్షి, హైదరాబాద్: అరె! ఒక్కటంటే ఒక్క సినిమా కూడా రూపాయి లాభం తెచ్చిన పాపాన పోలేదు. ఒక్కటంటే ఒక్కటి కూడా కనీసం బ్రేక్ ఈవెన్ (లాభనష్టాలు లేని స్థితి) సాధించింది లేదు. ప్రతి సినిమాకూ పెట్టిన పెట్టుబడిలో కనీసం 80 శాతం తిరిగి రాలేదని నిర్మాతలే చెబుతున్నారు. అలాగని అవేవీ చిన్న సినిమాలు కావు. అన్నీ 30–40 కోట్ల రేంజి బడ్జెట్ సినిమాలేనట? మరి ఇలా నష్టాలొచ్చినా సరే వదలకుండా అదే హీరోను పెట్టి వరసగా ఏడాదిలో ఆరేడు సినిమాలు తీసేశారంటే ఏమనుకోవాలి? బ్లాక్ మనీ దండిగా ఉన్నవాళ్లు కూడా నేరుగా డబ్బును కాల్చేయటం ఎందుకున్న ఉద్దేశంతో ఇలాంటి సినిమాలు తీయరు. కానీ నారా రోహిత్‌తో మాత్రం కొందరు నిర్మాతలు పదేపదే ఫ్లాప్ సినిమాలు తీశారు. ఫ్లాపు సినిమాలిచ్చిన దర్శకులతోనే మళ్లీ మళ్లీ ఫ్లాపు సినిమాలు తీశారు. ఒకసారి దర్శకత్వం వహించి ఫ్లాపు సినిమా ఇచ్చిన వ్యక్తి అదే హీరోతో మరో సినిమాకు నిర్మాతగా కూడా మారాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదీ... 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక సూపర్ స్టార్‌గా మారిపోయిన 'నారా రోహిత్' కథ. విచిత్రమేంటంటే రోహిత్‌కు 2014కు ముందు పెద్దగా సినిమాలు లేవు. 2019లో చంద్రబాబు అధికారంలో నుంచి దిగిపోయాక కూడా సినిమాలు లేవు. కానీ 2014–1019 మధ్య మాత్రం ఏకంగా 17 సినిమాలు వచ్చాయి. అంటే... చంద్రబాబు అధికారానికీ, నారా రోహిత్ సినిమాలకూ ఏదో సంబంధం ఉందనేగా అర్థం. అది ఏ సంబంధమంటే... ముడుపుల సంబంధం. బ్లాక్ మనీ సంబంధం. బాబు ప్రభుత్వంలో కాంట్రాక్టులు పొందిన వ్యక్తులు, సంస్థలు ఆయనకు నేరుగా ముడుపులివ్వటానికి ఇబ్బంది పడ్డారు. జీఎస్టీ వచ్చాక కాంట్రాక్టర్లకు మొత్తం బిల్లులు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే చెల్లించాల్సి వచ్చింది. దీంతో వారు ఆ డబ్బుల్లో నుంచి ఎవరికి ఎంత చెల్లించినా ఐటీకి లెక్కలు చెప్పాల్సి వచ్చేంది. మరి బాబుకు ఇవ్వాల్సిన వాటా ఇవ్వడమెలా? దీనికోసం మాస్టర్ మైండ్ చంద్రబాబు ఒక మార్గం కనిపెట్టాడు. తన తమ్ముడు రామ్మూర్తి నాయుడి కొడుకు నారా రోహిత్‌ను హీరోగా పెట్టి సినిమాలు తీయాల్సిందిగా తెలిసిన నిర్మాతలు, దర్శకులకు పురమాయించాడు. దానికి కావాల్సిన డబ్బులు మాత్రం ఈ కాంట్రాక్టర్లు, తన ప్రభుత్వంలో లబ్ధి పొందిన వాళ్లు సహ నిర్మాతల రూపంలోనో, ఫైనాన్సియర్లగానో చెల్లిస్తారు. ఓ 5 కోట్లతో పూర్తయ్యే సినిమాకు ఏకంగా రూ.40 కోట్ల బడ్జెట్ కేటాయించటమే కాక... అంతా ఖర్చుపెట్టినట్లు చూపిస్తారు. వాస్తవంగా రూ.5 కోట్లు ఖర్చయితే.... మిగతా రూ.35 కోట్లు నేరుగా బాబు బంగళాకు చేరిపోతాయి. ఇక ఈ సినిమా ఎలాగూ ఐదారు కోట్ల కన్నా ఎక్కువ వసూలు చేయదు. దీంతో తాము భారీగా నష్టపోయామని నిర్మాతలు ప్రకటిస్తారు. విచిత్రమేంటంటే ఇలా డిజాస్టర్ అయి నష్టపోయిన నిర్మాతలు... మళ్లీ అదే హీరోతో, మళ్లీ భారీ బడ్జెట్‌తో మరో సినిమా తీయటం. ఇలా ఏడాదిలోనే ఆరేడు సినిమాలు తీశారంటే పరిస్థితిని ఈజీగా అర్థం చేసుకోవచ్చు.

ఇదీ... రోహిత్ ఫ్లాపుల కథ

నారా రోహిత్ యావరేజ్ నటుడు. 2009 నుంచి 2014 వరకు.. అంటే చంద్రబాబు సీఎం కుర్చీలో లేని ఆ ఐదేళ్లలో అతను నటించిన సినిమాలు నాలుగే,. బాణం (2009), సోలో (2011), సారొచ్చారు (2012), ఒక్కడినే (2013). మొదటి రెండూ యావరేజ్ కాగా, మిగిలిన రెండూ డిజాస్టర్లు. దాంతో రోహిత్‌కి సినిమా అవకాశాలు తగ్గిపోయాయి. అయితే ఏడాది తర్వాత చంద్రబాబు సీఎం కాగానే రోహిత్ ముఖ 'చిత్రం' మారిపోయింది. హిట్ హీరోలకు సైతం సాధ్యం కాని స్థాయిలో వరుస పెట్టి సినీ అవకాశాలొచ్చాయి. 2019లో బాబు దిగిపోయేనాటికి ఏకంగా 17 సినిమాలు. అన్నీ ఫ్లాపులు, డిజాస్టర్లే. నిజానికి వీటిలో చాలా సినిమాలు రిలీజ్ అయిన సంగతి కూడా ప్రేక్షకులకు తెలీదు. మళ్లీ 2019లో చంద్రబాబు దిగిపోయినప్పటి నుంచి ఈ రోజు వరకు ఒక్కటంటే ఒక్క సినిమా కూడా రోహిత్ చేయలేదు.



ఇలా, అలా తిప్పి.. కొడుకు చేతికి డబ్బులు

ఒక ప్రాజెక్టు నిర్మించిన కాంట్రాక్టరుకు ప్రభుత్వం రూ.500 కోట్లు బ్యాంకు ద్వారా చెల్లింపులు చేసిందనుకోండి. ఒప్పందం ప్రకారం దీన్లో 50 శాతం అంటే రూ.250 కోట్లు ముడుపులు బాబుకివ్వాలి. నగదు రూపంలో ఇవ్వటం సాధ్యం కాదు కదా? మరి ఎలా? దీంతో కొన్ని సినిమా నిర్మాణ సంస్థలను పుట్టించారు. ఆ సంస్థల పేరిట అనేక బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేశారు. ఒక్కో ఖాతాకు చిన్న చిన్న మొత్తాల్లో ఈ రూ.250 కోట్లు తరలించారు. ఇక ఆయా ఖాతాల నుంచి డబ్బు డ్రా చేయటం కోసం సినిమా నిర్మాణం అనే పేరు పెట్టారు. రూ.2–3 కోట్లలో చుట్టేసిన చిన్న చిన్న సినిమాలకు కూడా రూ.30–40 కోట్లు అయిందని దొంగ లెక్కలు చూపించారు. సినిమాలో రోజు వారీ ఖర్చులు కింద / ప్రొడక్షన్ ఖర్చుల కింద వాటికి దొంగ బిల్లులు పెట్టారు. ప్రతి సినిమాకు రూ.20 కోట్లు– రూ.30 కోట్లు నష్టం వచ్చిందని రికార్డులు తయారు చేశారు. అలా ఎక్కడా టాక్స్ చెల్లించే సమస్య రాకుండా చూసుకున్నారు. ఇలా మొత్తం డబ్బును బ్లాక్‌గా మార్చి, అటుతిప్పి ఇటుతిప్పి ఆఖరుకు చంద్రబాబు కుటుంబ సభ్యుల చేతికి భద్రంగా చేర్చారు. ఇలా గుంటూరు జిల్లాకు చెందిన ఒక కాంట్రాక్టర్ ఒక్కడి దగ్గరే రూ.250 కోట్లు చిన్న చిన్న మొత్తాల్లో ట్రాన్స్‌ఫర్ చేయించారని ఆయనే ఇటీవల వాపోయారు. ఇలా నారా రోహిత్‌ను వాడేసుకుని 17 సినిమాలు హడావుడిగా చుట్టేసి.. చాలా మంది కాంట్రాక్టర్ల నుంచి ముడుపుల డబ్బును నారా లోకేష్‌కు అందించారు. కాంట్రాక్టర్లే కాకుండా కొన్ని వ్యాపార సంస్థల నుంచి కూడా ఇదే తరహాలో డబ్బులు దండుకున్నారని తెలిసింది.

దొంగ లెక్కలతో బురిడీ

ఆయా సినిమాల అంచనా వ్యయం, లాభనష్టాలు, వాస్తవ బడ్జెట్ వంటివన్నీ పరిగణనలోకి తీసుకుంటే.. హీరో రెమ్యునరేషన్‌తో సహా నారా రోహిత్ సినిమా బడ్జెట్ ప్రొడక్షన్ స్టార్ కాంబినేషన్‌ను బట్టి రూ.5–10 కోట్లు లోపు మాత్రమే. అయితే రోహిత్‌తో సినిమాలు తీసిన నిర్మాతలు మాత్రం వీటి బడ్జెట్ రూ.30 నుంచి 40, 45 కోట్ల దాకా కూడా చెబుతూవచ్చారు. అదే విధంగా వాళ్ల బంధు గణంతోనే డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ అవతారాలు ఎత్తించి థియేట్రికల్ రైట్స్‌ను రూ.30 కోట్లు నుంచి రూ.40 కోట్లకు కొనిపించినట్లు చూపారు. అంటే ఆ సినిమాలు తీసేవాడూ, వాటిని కొనేవాడూ ఇద్దరూ ఒకరేనని తెలుస్తోంది. సినిమా ఆడలేదు కాబట్టి.. తమకు ఇంత నష్టం వచ్చిందని ప్రభుత్వానికి ఈ ముఠా దొంగ లెక్కలు చూపించింది. ఇలా రోహిత్ సినిమాల ద్వారా లంచాల రూపంలో వచ్చిన బ్లాక్ మనీ సుమారు రూ.300 నుంచి 400 కోట్ల వరకు దండుకున్నారని అంచనా.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- బడా స్టార్స్, క్రేజీ హీరోలకు తప్ప మరే హీరోదైనా ఒక సినిమా డిజాస్టర్ అయింది అంటే రెండో సినిమా అవకాశం కనాకష్టం. అలాంటిది వరుసగా ఇన్ని సినిమాల్లో నారా రోహిత్ ఎలా చేయగలిగాడు?
- ఆయన సినిమాల బిజినెస్, కలెక్షన్ల ప్రకారం.. ప్రతి సినిమా రూ.20, 30 కోట్లకు పైగా భారీ నష్టాలు మూటగట్టుకుంది. అయినా కూడా నిర్మాతలు వరుస కట్టి అదే హీరోతో పదే పదే సినిమాలు ఎందుకు తీశారు?
- అతి కొద్ది మంది తప్ప నారా రోహిత్ సినిమాలు తీసిన వారిలో ఎవరూ అంతకు ముందు భారీ చిత్రాలు తీసిన చరిత్ర ఉన్న నిర్మాతలు కాకపోవడం ఇక్కడ గమనార్హం. అలాంటప్పుడు వారు ఈయనతో మాత్రమే భారీ చిత్రాలు ఎందుకు తీశారు?
- ఆయా నిర్మాతలు, నిర్మాణ సంస్థల్లో కొందరు.. నారా రోహిత్ సినిమాల కోసమే పుట్టినట్టుగా పుట్టి ఆ తర్వాత కనిపించక పోవడం వెనుక అంతరార్థం ఏమిటి?
- నారా రోహిత్ సినిమా నిర్మాతల్లో పలువురికి తెలుగుదేశం పార్టీతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు ఉండడం వెనుక మతలబు ఏమిటి?

బాబు హయాంలో ఏకంగా 17 సినిమాలు

2014: ప్రతినిధి
2015: రౌడీ ఫెలో, అసుర, తుంటరి, సావిత్రి,
2016: రాజా చెయ్యి వేస్తే, జో అచ్యుతానంద, శంకర, అప్పట్లో ఒకడుండేవాడు
2017: శమంతకమణి, ఒక్కడు మిగిలాడు, కథలో రాజకుమారి, బాలకృష్ణుడు, మెంటల్ మదిలో
2018: నీది నాది ఒకే కథ, ఆటగాళ్లు, వీరభోగ వసంతరాయలు

రోహిత్ సినిమాల వాస్తవ లెక్కలు ఇలా.. (రూపాయల్లో)

సినిమా	నిర్మాత	బడ్జెట్	శాటిలైట్	కలెక్షన్స్	నష్టం	వాస్తవ బడ్జెట్
రౌడీ ఫెలో	టి.ప్రకాష్‌రెడ్డి	30 కోట్లు	3 కోట్లు	4 కోట్లు	23 కోట్లు	10 కోట్లు
అసుర	శ్యామ్ దేవభక్తుని కృష్ణ విజయ్, నారా రోహిత్	28 కోట్లు	2.5 కోట్లు	3 కోట్లు	22.5 కోట్లు	10 కోట్లు
తుంటరి	శ్రీకీర్తి ఫిలింస్ అశోక్,నాగార్జున	35 కోట్లు	3 కోట్లు	2 కోట్లు	30 కోట్లు	12 కోట్లు
సావిత్రి	వి.బి.రాజేంద్రప్రసాద్	30 కోట్లు	3 కోట్లు	2 కోట్లు	25 కోట్లు	10 కోట్లు
రాజాచెయ్యివేస్తే..	సాయి కొర్రపాటి	30 కోట్లు	3.5 కోట్లు	3 కోట్లు	23.5 కోట్లు	10 కోట్లు
జో అచ్యుతానంద	సాయి కొర్రపాటి	40 కోట్లు	5 కోట్లు	5 కోట్లు	30 కోట్లు	15 కోట్లు
శంకర	ఆర్ వి చంద్రమౌళిప్రసాద్	35 కోట్లు	4 కోట్లు	2 కోట్లు	29 కోట్లు	10 కోట్లు
అప్పట్లో ఒకడుండేవాడు	ప్రశాంతి, కృష్ణ విజయ్	35 కోట్లు	5 కోట్లు	3 కోట్లు	27 కోట్లు	12 కోట్లు
శమంతకమణి	భవ్య ఆనంద్ ప్రసాద్	40 కోట్లు	5 కోట్లు	4 కోట్లు	31 కోట్లు	15 కోట్లు
కథలో రాజకుమారి	నర్రా సౌందర్య, బీరం సుధాకర్ రెడ్డి, ప్రశాంతి, కృష్ణ విజయ్	40 కోట్లు	5 కోట్లు	4 కోట్లు	31 కోట్లు	12 కోట్లు
బాల కృష్ణుడు	మహేంద్రబాబు, ముసునూరు వంశీ కృష్ణ, నందమూరి శ్రీ వినోద్	45 కోట్లు	5 కోట్లు	4 కోట్లు	36 కోట్లు	15 కోట్లు
ఆటగాళ్లు	వాసిరెడ్డి రవీంద్ర, శివాజీ, వడ్లపుడి జితేంద్ర, మక్కిన రాము	40 కోట్లు	5 కోట్లు	4 కోట్లు	31 కోట్లు	13 కోట్లు
వీరభోగవసంతరాయలు	బెల్లన అప్పారావు	45 కోట్లు	5 కోట్లు	4 కోట్లు	36 కోట్లు	15 కోట్లు

క్లుప్తంగా...

రెండు డిస్కంలకు కొత్త డైరెక్టర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రెండు డిస్కంలకు ప్రభుత్వం కొత్త డైరెక్టర్లను నియమించింది. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సి.శ్రీనివాసమూర్తి నియమితులయ్యారు. విశాఖపట్నంలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన విధులు నిర్వర్తించనున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా ఎస్.వనజ ఎంపికయ్యారు. ఈమె విజయవాడలోని విద్యుత్ సౌధ నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తారు. వీరిద్దరూ రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నూతన కార్యాలయం ప్రారంభం

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నూతన కార్యాలయాన్ని బుధవారం ఆ శాఖ కమిషనర్ ఎస్. సురేశ్ కుమార్ ప్రారంభించారు. ఇంతకాలం ఇబ్రహీంపట్నంలో కొనసాగుతున్న ఈ కార్యాలయాన్ని మంగళగిరి సమీపంలోని ఆత్మకూరు సర్వీస్ రోడ్డులో ఉన్న వెంకటాద్రి టవర్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సురేశ్ కుమార్ మాట్లాడుతూ ఇకపై కొత్త చిరునామాలో విధులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

వర్సిటీల్లోని బోధనేతర సిబ్బంది ఉద్యోగ విరమణ వయసు పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ జీవో విడుదలైంది. ఉన్నత విద్య, వైద్య, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, లా అండ్ రెవెన్యూ శాఖల పరిధిలోని అన్ని యూనివర్సిటీలకు దీనిని వర్తింపజేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 10వ షెడ్యూల్‌లోని పొట్టిశ్రీరాములు, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీల్లోని ఏపీ కేడర్ బోధనేతర సిబ్బందిని కూడా పెంపు పరిధిలోకి తీసుకొస్తున్నట్టు పేర్కొన్నారు. జీవో వచ్చిన తేదీ నుంచే పెంపు అమలులోకి వస్తుందని స్పష్టం చేశారు.

గ్రంథాలయాల్లో పుస్తక సంపద పెంపు



సుబ్బారావును సత్కరిస్తున్న గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో పుస్తక సంపదను పెంచనున్నట్టు గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. బుధవారం మంగళగిరిలోని గ్రంథాలయ పరిషత్ కార్యాలయంలో రాష్ట్రస్థాయి పుస్తక ఎంపిక కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మారిన సిలబస్‌కు అనుగుణంగా, పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను పాఠకులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. తెలుగు విశ్రాంత అధ్యాపకుడు, ఎస్ఎల్‌బీసీ సభ్యుడు వావిలాల సుబ్బారావు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ పాలనలో విద్యారంగం ప్రగతి పథంలో పయనిస్తోందని తెలిపారు. తనవద్ద విద్యాబుద్ధులు నేర్చిన శిష్యుడు శేషగిరిరావు చైర్మన్ హోదాలో ఉన్న సంస్థలో తాను సభ్యుడిగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఇదే సామాజిక న్యాయ సాధికారతకు నిదర్శనమని కొనియాడారు. అనంతరం సుబ్బారావును శేషగిరిరావు తదితరులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో పుస్తకాల సైటేషన్‌పై విస్తృతంగా చర్చించారు.

స్టాఫ్ నర్స్ నియామకాల్లో సీహెచ్‌వోలకు వెయిటేజ్

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)లకు సీఎం జగన్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వైద్య శాఖలోని శాశ్వత, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాల్లో సీహెచ్‌వోలకు 15 శాతం వరకు వెయిటేజ్ కల్పిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు నెలల కాలానికి గిరిజన ప్రాంతాల్లో 2.5, గ్రామీణ ప్రాంతాల్లో 2, పట్టణ ప్రాంతాల్లో ఒక మార్కు చొప్పున వెయిటేజ్ ఇవ్వనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్య సేవలను చేరువ చేసి.. మెరుగైన ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 10,032 విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. ప్రతి క్లినిక్‌లో సేవలందించడానికి బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత కలిగిన సీహెచ్‌వోలను నియమించింది.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

స్టాఫ్ నర్సు నియామకాల్లో వెయిటేజ్ కల్పించిన సీఎం జగన్‌కు సీహెచ్‌వో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలనే సీఎం జగన్ లక్ష్యానికి అనుగుణంగా వైద్య సేవలందిస్తున్నామన్నారు. అలాంటి తమకు ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ కల్పించడం శుభపరిణామమని, ఇన్సెంటివ్స్ కూడా ఎలాంటి కోతలు లేకుండా అందజేస్తే మేలు జరుగుతుందన్నారు.

ఏపీపీఎస్సీ.. మరో ఐదు

వారంలో వెలువడనున్న నోటిఫికేషన్లు.. 25న గ్రూప్ 2 ప్రిలిమ్స్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి, అమరావతి: నిరుద్యోగ యువతకు శుభవార్త! ఇప్పటికే గ్రూప్‌- 1, 2 పోస్టులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చిన ఏపీపీఎస్సీ త్వరలో అటవీ శాఖలో పలు ఉద్యోగాలను భర్తీ చేయనుంది. ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వడంతో ఈమేరకు వివిధ కేటగిరీల్లో 861 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ల జారీకి చర్యలు చేపట్టింది. ఒకవైపు గ్రూప్‌-2 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు చేస్తూనే మరోవైపు అటవీశాఖ ఉద్యోగాల భర్తీకి సన్నద్ధమైంది. మరో వారం రోజుల్లో ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లు వెలువడనున్నట్లు సమాచారం. వీటిలో 37 ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు, 70 ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, 175 ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, 375 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, 10 తానాదార్లు, 12 టెక్నికల్ అసిస్టెంట్లు, మరో 10 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కలిపి 689 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి లభించింది. ఇవి కాకుండా ఎఫ్ఎస్‌ఓ, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ లాంటి మరో 172 క్యారీ ఫార్వర్డ్ పోస్టులతో కలిపి మొత్తం 861 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌తో పాటు పరీక్షల షెడ్యూల్‌ను కమిషన్ త్వరలో ప్రకటించనుంది. ఇవే కాకుండా



విద్యుత్తు శాఖలో అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, మత్స్యశాఖలో ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, జైళ్ల శాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్టు పోస్టు, ఏపీ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ విభాగంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్లు వెలువడనున్నాయి.

గ్రూప్‌-2 హాల్ టికెట్ల విడుదల

గ్రూప్‌-2 ప్రిలిమినరీ (స్క్రీనింగ్ టెస్ట్) పరీక్షకు సంబంధించి హాల్ టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఒక్క రోజులోనే 2 లక్షల మందికిపైగా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈనెల 25న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏపీపీఎస్సీ 24 జిల్లాల్లో సెంటర్లను ఏర్పాటు చేసింది. గ్రూప్‌-2లో మొత్తం 899 పోస్టులకు 4,83,525 మంది దరఖాస్తు చేసుకున్నారు.

పక్కా ప్రణాళికతో పోస్టుల భర్తీ

నిరుద్యోగ యువతకు మేలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పలు ఉద్యోగ నియామకాలను చేపడుతోంది. శాఖల వారీగా ఖాళీలను సేకరించి ఎప్పటికప్పుడు ఏపీపీఎస్సీతో సమన్వయంతో వ్యవహరిస్తోంది. నోటిఫికేషన్ ఇచ్చే ముందు వివాదాలకు తావులేకుండా కమిషన్ జాగ్రత్తలు తీసుకుంటోంది. నాలుగేళ్లల్లో 78 నోటిఫికేషన్ల ద్వారా కోర్టుల్లో ఒక్క వివాదం లేకుండా, ఒక్క నిరుద్యోగికీ అన్యాయం జరగకుండా దాదాపు 6,300 పోస్టులను భర్తీ చేయడం గమనార్హం. గత డిసెంబర్‌లో గ్రూప్‌-1, గ్రూప్‌-2, పాలిటెక్నిక్ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో గ్రేడ్‌-2 అనలిస్టులు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సర్వీసులో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు, మెడికల్ ఎడ్యుకేషన్‌లో లైబ్రేరియన్ పోస్టులు, ట్రైబల్ వెల్ఫేర్ సర్వీసులో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, సీనియర్ సిటిజన్ సర్వీసెస్‌లో అసిస్టెంట్ డైరెక్టర్లు, గ్రౌండ్ వాటర్ సర్వీసెస్‌లో ఖాళీల భర్తీకి ఇటీవల కమిషన్ నోటిఫికేషన్లు ఇచ్చింది. గత డిసెంబర్‌లో ఇచ్చిన నోటిఫికేషన్లకు పరీక్షల షెడ్యూల్‌ను ఖరారు చేసింది. గ్రూప్‌-2 పోస్టులకు ఈనెల 25న ప్రిలిమ్స్ జరగనుండగా మార్చి 13న గ్రూప్‌-1 ప్రిలిమ్స్ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 13న డీవైఈవో పోస్టులకు పరీక్ష జరగనుంది. అదే నెలలో పాలిటెక్నిక్ లెక్చరర్లతో పాటు డీఎల్, జేఎల్, ఎన్విరాన్‌మెంటల్ పోస్టుల భర్తీకి కూడా ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహించనుంది. ఇంత పక్కా ప్రణాళికతో సర్వీస్ కమిషన్ ఉద్యోగాల భర్తీని చేపట్టడం ఇదే తొలిసారి.

ఎన్నికల విధుల్లో సచివాలయాల ఉద్యోగులు

అభ్యంతరం లేదని ఈసీ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: త్వరలో లోక్‌సభ, రాష్ట్ర శాసన సభకు ఏకకాలంలో జరిగే ఎన్నికల విధుల్లో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు పాల్గొనేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అర్హులైన రెగ్యులర్ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను పోలింగ్ పార్టీల్లో వినియోగించుకునేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని ఈసీ స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ముకేశ్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లకు బుధవారం మెమో ద్వారా తెలియజేశారు. అయితే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఓటర్లకు ఇంకు గుర్తు వేయడం, తదితర విధులకు వినియోగించుకోవాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. ప్రతి పోలింగ్ పార్టీలో గ్రామ, వార్డు సచివాలయాలకు చెందిన ఒక ఉద్యోగి ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను బూత్ లెవల్ అధికారిగా నియమించినట్టైతే.. అలాంటి వారిని పోలింగ్ పార్టీల్లో నియమించవద్దని సూచించింది. వారిని పోలింగ్ రోజు ఇతర విధుల్లో వినియోగించుకోవాలని ఆదేశించింది. కాగా ఎన్నికలకు సంబంధించి ఎటువంటి కార్యకలాపాలకు గ్రామ, వార్డు వలంటీర్లను వినియోగించకూడదని స్పష్టం చేసింది. అలాగే ఏ అభ్యర్థికి కూడా పోలింగ్ ఏజెంట్‌గా వలంటీర్లు ఉండేందుకు వీల్లేదని తెలిపింది. ఇందుకనుగుణంగా కలెక్టర్లు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా కోరారు.

మే 13 నుంచి ఏపీఈఏపీ సెట్

త్వరలో దశలవారీగా సెట్స్ షెడ్యూల్ విడుదల



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంప్రదాయ, సాంకేతిక విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కామన్ ఎంట్రన్స్ టెస్టు (సెట్)ల తేదీలను ఉన్నత విద్యామండలి బుధవారం విడుదల చేసింది. మే 6వ తేదీ నుంచి జూన్ 13వ తేదీ వరకు 9 రకాల సెట్స్‌ను నిర్వహించనుంది. ఆయా వర్సిటీలకు ఒక్కో సెట్ నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తూ కన్వీనర్లను నియమించింది. త్వరలోనే సెట్స్ కమిటీలతో సమావేశం నిర్వహించి దశలవారీగా ప్రవేశాల షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపరీక్షల విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. విద్యార్థులకు మేలుచేస్తూ ఎంసెట్ స్థానంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు ఒకే ఎంట్రన్స్ టెస్టు (ఈఏపీసెట్) నిర్వహిస్తున్నారు. ఈ విధానం సత్ఫలితాలివ్వడంతో తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ ఏడాది నుంచి అక్కడి ఎంసెట్‌ను ఈఏపీసెట్‌గా మార్చింది. గతంలో పీజీ ప్రవేశాలకు వర్సిటీల వారీగా నోటిఫికేషన్లు వచ్చేవి. విద్యార్థి వర్సిటీలకు విడివిడిగా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ఫలితంగా పేద విద్యార్థులపై ఆర్థికభారం ఎక్కువయ్యేది. దీన్ని గమనించిన ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు ఒకే ఎంట్రన్స్ టెస్టును తీసుకొచ్చింది. ఇందులో అర్హత సాధించిన విద్యార్థుల ర్యాంకుల ఆధారంగా వర్సిటీల్లో సీట్లు భర్తీచేస్తోంది. దీంతో ప్రతిభగల విద్యార్థికి ఏ వర్సిటీలోనైనా చదువుకునే అవకాశం దక్కుతోంది.

వివిధ సెట్‌ల నిర్వహణ తేదీల వివరాలు

సెట్	నిర్వహించనున్న వర్సిటీ	పరీక్ష తేదీ
ఈఏపీసెట్ (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ)	జేఎన్‌టీయూ కాకినాడ	మే 13 నుంచి 19 వరకు
ఈసెట్	జేఎన్‌టీయూ అనంతపురం	మే 8
ఐసెట్	ఎస్కేయూ అనంతపురం	మే 6
పీజీఈసెట్ (ఎంటెక్/ఎంఫార్మసీ)	శ్రీవేంకటేశ్వర వర్సిటీ	మే 29 నుంచి 31 వరకు
ఎడ్.సెట్	ఆంధ్రా యూనివర్సిటీ	జూన్ 8
లాసెట్	ఏఎన్‌యూ గుంటూరు	జూన్ 9
పీఈసెట్ (బీపీఈడీ/ యూజీ డీపీడీ)	ఏఎన్‌యూ గుంటూరు	త్వరలో ప్రకటన
పీజీసెట్	ఆంధ్రా యూనివర్సిటీ	జూన్ 3 నుంచి 7వరకు
ఏడీసెట్ (డీఎఫ్ఏ/ బి డిజైన్)	వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీ	జూన్ 13

ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను పదేళ్లు పొడిగించాలి

మీడియాతో పరిపాలనా వికేంద్రీకరణ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను మరో పదేళ్ల పాటు పొడిగించాలని పరిపాలనా వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ డిమాండ్ చేశారు. బుధవారం విశాఖలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. విశాఖ పరిపాలనా రాజధాని అయ్యేవరకు అమరావతిని సీఎం క్యాంప్ ఆఫీస్‌గానే పరిగణించాలని అభిప్రాయపడ్డారు. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా విశాఖ పరిపాలన రాజధానికి న్యాయపరమైన చిక్కులు సృష్టించి అడ్డుకుంటున్నారని, భవిష్యత్‌లో అన్నీ పరిష్కారమై విశాఖ పరిపాలన రాజధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజధాని లేకుండా రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీకి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. విభజన అనంతరం పదేళ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంచడంతోపాటు ఉమ్మడి హైదరాబాద్ నుంచి వచ్చిన ఆదాయంతో ఏపీలో




కొత్త రాజధాని ఏర్పాటు చేసుకోవాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సూచించిందని గుర్తు చేశారు.

అమరావతి పేరిట రాజధాని లేకుండా చేశారు

ఏపీకి రాజధాని లేకపోవడానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, సోనియాగాంధీ కారణమైతే.. విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరో కారణమని లజపతిరాయ్ పేర్కొన్నారు. అప్పట్లో ఓటుకు నోటు కేసులో ఇరుక్కుని రాత్రికి రాత్రే చంద్రబాబు అమరావతి పేరిట ఇక్కడకు మకాం మార్చి రాజధాని లేకుండా చేశాడన్నారు. ఇప్పుడు పరిపాలనా వికేంద్రకరణలో భాగంగా విశాఖ పరిపాలనా రాజధాని కాకుండా న్యాయపరమైన చిక్కులు సృష్టించి అడ్డుకుంటున్నారన్నారు. త్వరలో ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించుకుంటామని, విశాఖను పరిపాలనా రాజధానిని చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అప్పటివరకు ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌గా గడుపు పెంచాలని కేంద్రాన్ని జేఏసీ కోరుతుందన్నారు.

పవన్‌కున్నాయ్.. ప్రత్యేక కారణాలు



- జనసేన అధినేత పర్యటనల వాయిదాకు టీడీపీ – జనసేన విభేదాలే అసలు కారణం
- వాటిని కప్పిపుచ్చి ప్రభుత్వం హెలికాప్టర్‌కు అనుమతించలేదంటూ వంక
- కొద్ది కాలంగా ఉప్పు–నిప్పుగా ఉంటున్న టీడీపీ – జనసేన నేతలు
- మళ్లీ బుధవారం నుంచి గోదావరి జిల్లాల పర్యటనలు

సాక్షి, అమరావతి/సాక్షి, భీమవరం: హెలికాప్టర్ లాండింగ్‌కు అనుమతించలేదన్న కారణంతో ప్రతిపక్ష నాయకుడు ఎవరైనా పార్టీ సమావేశాలను వాయిదా వేసుకుంటారా? కానే కాదు. దాని వెనుక సొంత పార్టీ కారణాలు ఉంటాయి. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గోదావరి జిల్లాల పర్యటన వాయిదా వెనుక కూడా టీడీపీ–జనసేన కూటమి గొడవలు, ఇతరత్రా కారణాలు ఉన్నాయి. అవి బయటపడకుండా హెలికాప్టర్ లాండింగ్‌కు అనుకూలంగా లేదన్న అధికారుల సూచనను రాజకీయం చేసేసి, అన్ని సమావేశాల్ని మంగళగిరికి మార్చేసుకున్నారు పవన్.

ఇదీ అసలు కారణం

జనసేన – టీడీపీ పొత్తు నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాలలో రెండు పార్టీల నాయకుల మధ్య ఉప్పు– నిప్పుగా ఉంది. ఈ కారణంతోనే ఇటీవలి కాలంలో పవన్ జిల్లా పర్యటనలకు వెళ్లడం లేదు. వారాహి యాత్రా ఆగిపోయింది. చివరాఖరికి ఉభయ గోదావరి జిల్లాల పర్యటనకు ఉపక్రమించారు. బుధవారం నుంచి ఈనెల 17 వరకు మూడు రోజులు భీమవరంలోనే మకాం ఉండి భీమవరం, అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంలలో జరిగే జనసేన, టీడీపీ ముఖ్య నాయకుల సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే, నియోజకవర్గాల్లో జనసేన, టీడీపీ వర్గాల మధ్య బొత్తిగా పొసగడంలేదు. టీడీపీ పశ్చిమ గోదావరి జిల్లా నేతలు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), మాజీ ఏఎంసీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు మధ్య వివాదాలు తీవ్రంగా ఉన్నాయి. వీరి గ్రూపు రాజకీయాలు పవన్ పర్యటనకు చేటుచేస్తాయని జనసేన నేతలు భావించినట్టు సమాచారం. దీనికి తోడు పెళ్లిళ్ల ముహూర్తాల కారణంగా పవన్ మకాం చేసేందుకు భీమవరం పరిసర ప్రాంతాల్లో గెస్ట్ హౌస్‌లు, సమావేశాలకు ఫంక్షన్ హాళ్లు దొరకలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పవన్ పర్యటన వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

ప్రభుత్వంపై నెపం వేసి..

టీడీపీ–జనసేన కూటమిలో విభేదాలు, వసతి దొరకలేదన్న కారణాన్ని బయటకు చెప్పలేక, హెలిప్యాడ్‌కు ప్రత్యామ్నాయం చూడాలన్న అధికారుల సూచనను రాజకీయం చేసి, పబ్బం గడిపేసుకుంటున్నారు పవన్. హెలికాప్టర్ లాండింగ్‌కు అనుమతులివ్వడంలేదంటూ ప్రభుత్వంపై బురదజల్లేసి కార్యక్రమాలను మంగళగిరికి మార్చేసుకున్నారు. వాస్తవానికి పట్టణంలోని విష్ణు కళాశాలల వద్ద ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌ను జనసేన నాయకులు ఎంచుకున్నారు. ఈ హెలిప్యాడ్ వినియోగించి చాలా కాలమైంది. ఆ ప్రాంతంలో కొత్తగా భవనాలు, అపార్ట్‌మెంట్స్ నిర్మించడం, చెట్లు పెరిగిపోవడంతో ల్యాండింగ్‌కు సురక్షితం కాదని అనుమతి ఇవ్వలేదని ఆర్ అండ్ బీ ఈఈ ఎస్ లోకేశ్వరరావు తెలిపారు. గత నెలలో సీఎం జగన్ భీమవరం పర్యటన సందర్భంగా విష్ణు కళాశాల హెలిప్యాడ్ అనుకూలంగా ఉండదని భావించడం వల్లే పట్టణంలోని లూథరన్ హైస్కూల్ ఆవరణలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. పవన్ హెలికాప్టర్ కోసం కూడా ప్రత్యామ్నాయ స్థలాలు చూడాలని జనసేన నేతలకు సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు తదితరులు ఉండి సమీపంలోని ఫంక్షన్ హాలుకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అయినా, అసలు కారణాలను కప్పిపుచ్చుతూ, పవన్‌కళ్యాణ్ ప్రయాణించే హెలికాప్టర్ ల్యాండింగ్‌కు ఆర్ అండ్ బీ అధికారులు అనుమతులు మంజూరు చేయకుండా అడ్డంకులు సృష్టిస్తున్న కారణంగా బుధవారం (14వ తేదీ) నుంచి జరగాల్సిన పర్యటన వాయిదా వేసుకున్నట్టు జనసేన ఓ ప్రకటనలో పేర్కొంది. మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనే ఆయా నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశాలు జరగనున్నట్లు తెలిపింది. ఇది కేవలం ఒక వంకేనని, అసలు కారణం టీడీపీ, జనసేన మధ్య విభేదాలేనని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఐదారు నెలల క్రితం బాబు అరెస్టు సమయంలో తన హెలికాప్టర్ ప్రయాణానికి అడ్డంకులు సృష్టిస్తున్నారని అప్పట్లో హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా విజయవాడ వచ్చి, మధ్యలో రోడ్డుపైనే పడుకొని హడావుడి చేసిన పవన్.. ఇప్పుడు రోడ్డు మార్గంలో ఎందుకు రాలేరని వారు ప్రశ్నిస్తున్నారు. మంగళగిరి కార్యాలయం నుంచి 150 కి.మీ. లోపే ఉన్న భీమవరానికి రోడ్డు మార్గంలో రావడం సులువైన పని అయినప్పటికీ, హెలికాప్టర్‌కు అడ్డంకుల పేరుతో పర్యటననే వాయిదా వేసుకోవడం విచిత్రంగానే ఉందని జనసేన నేతలు సైతం వ్యాఖ్యానిస్తున్నారు.

టీడీపీ గోబెల్స్ పార్టీగా మళ్లీ రుజువైంది

- మా కుటుంబం ఓట్లపై టీడీపీ దుష్ప్రచారం: సజ్జల
- పొన్నూరు జాబితా నుంచి ఇప్పటికే తొలగించారు





ఓట్ల తొలగింపునకు సజ్జల డిలీషన్ దరఖాస్తు

సాక్షి, అమరావతి: టీడీపీ అంటే గోబెల్స్ పార్టీ అని మరోసారి రుజువైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను, తన కుటుంబ సభ్యుల ఓట్లకు సంబంధించి ఒక అబద్ధాన్ని పదేపదే ప్రచారం చేస్తూ నమ్మించేందుకు టీడీపీ చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావన్నారు. ప్రజలకు తప్పుడు సమాచారం చేరకూడదనే ఉద్దేశంతో ఈ అంశానికి సంబంధించి మరోసారి స్పష్టత ఇస్తున్నట్లు తెలిపారు.

➢ 2023 అక్టోబరు 13న నాతో సహా నా కుటుంబ సభ్యులు పొన్నూరు నియోజకవర్గంలో ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నాం. అయితే రెయిన్‌ట్రీ సముదాయంలోని అపార్ట్‌మెంట్ల భాగం పొన్నూరులోకి, రోడ్డుకు ఇటువైపు మేం నివాసం ఉంటున్న విల్లాల ప్రాంతం మంగళగిరి నియోజకవర్గంలోకి వస్తుందని సంబంధిత సిబ్బంది ద్వారా తరువాత తెలిసింది.

➢ అనంతరం 2023 అక్టోబరు 27న మంగళగిరి నియోజకవర్గంలో ఓటర్లుగా చేరేందుకు దరఖాస్తు చేసుకున్నాం. ➢ మొదటి దరఖాస్తుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో దాన్ని ఉపసంహరించుకునేందుకు ఆస్కారం లేదు. జాబితా వెలువడిన తర్వాతే ఆయా పేర్లను సంబంధిత జాబితా నుంచి ఉపసంహరణ, తొలగించేందుకు వీలుంటుంది.

➢ 2024 జనవరి 22న కొత్త జాబితాలు తయారవగానే పొన్నూరు నియోజకవర్గ జాబితా నుంచి నాతో సహా నా కుటుంబ సభ్యుల పేర్లు తొలగించాలని కోరుతూ జనవరి 31న దరఖాస్తు సమర్పించాం. ➢ ఎన్నికల అధికారులు మేం చేసిన డిలీషన్ దరఖాస్తును పరిశీలించి వాటిని తొలగించడం కూడా జరిగింది. ఈ అంశంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించామని చెప్పేందుకు ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి?

మరింత పకడ్బందీగా రైతుబజార్లు

- స్టాల్స్ కేటాయింపులో మరింత పారదర్శకత
- ఈ–క్రాప్ ప్రామాణికంగా రైతుల గుర్తింపు
- ఈ–ఆక్షన్ ద్వారా గ్రూపులకు స్టాల్స్ కేటాయింపు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైతుబజార్ల పనితీరును మరింత మెరుగుపర్చే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంస్కరణలు తీసుకొస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 119 రైతుబజార్లున్నాయి. వీటిద్వారా 10 వేలమందికి ప్రత్యక్షంగా, 15 వేలమందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. రోజూ 150–200 టన్నుల కూరగాయలతోపాటు ఇతర నిత్యావసరాల విక్రయాలు జరుగుతున్నాయి. సగటున రోజూ ఆరులక్షల మంది రైతుబజార్లను వినియోగించు కుంటున్నారు. స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా రైతుబజార్ల పనితీరును క్రమబద్ధీకరిస్తున్నారు. గతంలో స్టాల్స్ పొందిన వారిలో బినామీలను ఏరివేస్తూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డులు జారీచేస్తున్నారు. మరోవైపు నూతన రైతుబజార్లు, ఉన్న రైతుబజార్ల ఆధునికీకరణ ద్వారా పెరిగిన స్టాల్స్ కేటాయింపులో పైరవీలకు ఆస్కారం లేకుండా పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేలా చర్యలు చేపట్టారు.


బినామీలకు అవకాశం లేకుండా..

రైతుబజార్లలో రైతులకు అద్దెరహిత స్టాల్స్ కేటాయింపు వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, మార్కెటింగ్‌శాఖల భాగస్వామ్యంతో చేస్తుంటారు. ఇప్పటివరకు మాన్యువల్ పద్ధతిలో వీటిని కేటాయిస్తున్నారు. ఫలితంగా పైరవీలు, అవకతవకలకు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితికి చెక్‌పెడుతూ ఇకనుంచి అద్దెరహిత స్టాల్స్ కేటాయింపు విషయంలో ఈ–క్రాప్‌లో నమోదు ప్రామాణికంగా రైతులను ఎంపిక చేయాలని ప్రతిపాదించారు. స్టాల్స్ ద్వారా విక్రయించే పంట ఉత్పత్తుల్లో కనీసం కొన్ని రకాలైనా సొంతంగా పండించే వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఒక స్టాల్ కోసం ఎక్కువమంది పోటీపడితే లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. స్వయం సహాయక, సహకార సంఘాలకు, చిరువ్యాపారులకు అద్దె ప్రాతిపదికన కేటాయించే స్టాల్స్ కోసం ఇప్పటివరకు జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీలు ఎంపిక చేస్తున్నాయి. ఇకనుంచి ప్రభుత్వ ఈ–ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసిన వారిని ఈ–వేలం ద్వారా ఎంపిక చేయాలని సంకల్పించారు. ఇందుకోసం అర్హత ప్రమాణాలను నిర్ణయించే బాధ్యతలను జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీలకు అప్పగిస్తున్నారు.

నోడల్ ఖాతాలో రైతుబజార్ల ఆదాయం


రైతుబజార్లలో ఖాళీగా ఉన్న అన్ని స్టాల్స్ కేటాయింపుతోపాటు పాలు, సేంద్రియ పంట ఉత్పత్తుల విక్రయం వంటి వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు. హార్టికల్చర్, పౌల్ట్రీ, ఫిషరీస్ వంటి రంగాలకు ప్రత్యేకంగా స్టాళ్లు కేటాయించారు. ఇప్పటికే 21 రైతుబజార్లలో ఫిష్ ఆంధ్రా, సహజ వ్యవసాయ స్టాల్స్ కేటాయించారు. క్యాంటీన్లు, పార్కింగ్, ఇతర సౌకర్యాల నిర్వహణ కోసం గుర్తించిన స్థలాలను వేలం ద్వారా కేటాయిస్తున్నారు. ప్రతి రైతుబజారులో ధరల వివరాలను వినియోగదారులకు తెలియజేసేలా ఎల్ఈడీ డిస్‌ప్లేలను ఏర్పాటు చేశారు. వ్యాపారులు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనార్థం ప్రకటనల కోసం గుర్తించిన ప్రదేశాలతోపాటు ఖాళీ స్థలాలను సైతం ఈ–ఆక్షన్ ద్వారా కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇలా వచ్చే ఆదాయాన్ని రైతుబజార్ల సీఈవో ఖాతాలో జమచేస్తూ సిబ్బంది వేతనాలు, నిర్వహణ ఖర్చులకు ఇబ్బంది లేకుండా సర్దుబాటు చేయనున్నారు. ఇప్పటివరకు వేతనాలు, నిర్వహణ కోసం స్థానిక మార్కెట్ కమిటీలపై ఆధారపడాల్సి వచ్చేది. సొంతంగా ఆదాయవనరులు సమకూర్చుకోవడం ద్వారా రైతుబజార్లు స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా ఈ సంస్కరణలు తీసుకొచ్చారు.

70 రైతుబజార్లు స్వయం సమృద్ధి



సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రైతుబజార్లు స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నాం. స్టాల్స్ కేటాయింపులో పారదర్శకత తీసుకురావడంతోపాటు ఆదాయం పెంపొందించే దిశగా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే 70 రైతుబజార్లు స్వయం సమృద్ధి సాధించగా, మిగిలినవి కూడా ఆర్థిక పరిపుష్టి సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– ముల్లంగి నందకిషోర్, సీఈవో, రైతుబజార్లు



స్నేహం విషయంలో నెమ్మదిగా వ్యవహరించాలి; కానీ ఒక్కసారి స్నేహం అంటూ చేశాక స్థిరంగా, దృఢంగా కొనసాగించాలి.

– సోక్రటీస్

సాక్షి

గురువారం, 15 ఫిబ్రవరి 2024

వలసపోయిన మందహాసం

పురిటిలోనే సంధి కొట్టింది. కేంద్రంలోని అధికార ఎన్డీఏకి వ్యతిరేకంగా జట్టుకట్టిన ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి పరిస్థితి ఒక్క మాటలో అదే. ఏడాదైనా కాక ముందే... ఎన్నికలు మరో రెండు నెలల దూరమైనా లేక ముందే... ఆ కూటమి అంతర్గత కుమ్ములాటలతో చతికిలపడిన పరిస్థితి. బిహార్ నుంచి మహారాష్ట్ర దాకా కూటమి నుంచి వలసపోతున్న నేతలు, సీట్ల పంపిణీ సమస్యలతో ఏకపక్ష నిర్ణయం తీసుకుంటున్న పార్టీలను చూస్తుంటే ఆ మాట అక్షరసత్యమని అర్థమవుతోంది. కొద్ది వారాల క్రితం బిహార్ సీఎం నితీశ్ కుమార్ 'ఇండియా' కూటమికి గుడ్‌బై చెప్పి, ఎన్డీఏ గూటికి తిరిగొచ్చారు. కొత్త కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి, సోమవారం అసెంబ్లీలో విశ్వాసపరీక్షలో కూడా నెగ్గారు. బిహార్‌లోనే కాదు... మహారాష్ట్రలోనూ 'ఇండియా' కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మాజీ ఎంపీ మిళింద్ దేవరా గత నెలలో గ్రాండ్ ఓల్డ్ పార్టీని వదిలేసి, శివసేనలో చేరారు. అది జరిగిన కొద్ది వారాలకే కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ చవాన్ హస్తాన్ని విడిచిపెట్టి, కమలం చేత ధరించారు. ఇలా సొంత కూటమిలోనే సవాలక్ష తలనొప్పులతో ఎన్నికలు రాకముందే బలహీనమైపోయింది. ఎన్డీఏకు సరైన ప్రత్యామ్నాయం తామేనంటూ చెప్పిన మాటలు రోజు రోజుకూ నీరుగారుతున్నాయి.

ఈ దుఃస్థితికి కారణం 'ఇండియా' కూటమి పక్షాల స్వయంకృతం కొంతయితే, భారతరత్న పురస్కారాలు – ఈడీ – సీబీఐ లాంటి సామ దాన భేద దండోపాయాలతో పరవారిని కూడా తమ వారిని చేసుకొనేలా బీజేపీ నడుపుతున్న చాణక్య తంత్రం మరికొంత. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పార్టీ కండువాలు మార్చే సీజన్ ప్రబలుతోంది. అధికారం, ఎన్నికల్లో విజయాలే పరమావధిగా ఒకప్పటి 'ఆయా రామ్, గయా రామ్' సంస్కృతిని బీజేపీయే మళ్ళీ యథేచ్ఛగా పెంచిపోషిస్తోందనే విమర్శ బలంగానే వినిపిస్తోంది. గమ్మత్తేమిటంటే, కీలక నేతలే కాదు... కూటములు మారుస్తున్న పార్టీలదీ అదే సంస్కృతి, అదే సరళి. నిరుడు బీజేపీని అడ్డమైన మాటలూ అని బయటకు వెళ్ళిన నితీశ్, ఆయన జేడీయూ ఇవాళ మళ్ళీ అదే కమలం పార్టీ చంకనెక్కారు. కొత్త కూటమితో మళ్ళీ సీఎం సీటులో కూర్చున్నారు. మహారాష్ట్ర సీఎం సహా అనేక ఉన్నత పదవులను అనుభవించిన అశోక్ చవాన్ 38 ఏళ్ళ కాంగ్రెస్ సాహచర్యాన్ని వదులుకొని, కమలనాథుల పంచన చేరారు. అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న ఆయన తీరా కాషాయ వస్త్రం కప్పుకొన్న మరునాడే రాజ్యసభ అభ్యర్థి కాగలిగారు. ఎవరెప్పుడు ఎటుంటారో, తిరిగి వదిలొచ్చిన పార్టీలోకే వెళతారో తెలియకపోవడంతో ఇప్పుడు 'ఆయా రామ్... గయా రామ్... మళ్ళీ ఆయేగా రామ్' అనేది తాజా ఛలోక్తి అయింది.

నిజానిజాలేమో కానీ, మధ్యప్రదేశ్‌లో మరో మాజీ సీఎం సైతం కాంగ్రెస్ గూడ్స్ బండి దిగిపోయి, బీజేపీ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతారని వార్త. వ్యక్తులు వెళ్ళిపోయినా, వ్యవస్థలు శాశ్వతమనే మాట నిజమే. కానీ, కాంగ్రెస్ అధినాయకత్వం కానీ, 'ఇండియా' కూటమి కానీ ముందున్న సవాళ్ళపై లోతుగా ఆలోచిస్తున్నాయా అన్నది ప్రశ్న. పార్టీని విడిచిపెట్టిపోయే ముందు రోజు సైతం అశోక్ చవాన్ రానున్న లోక్‌సభ ఎన్నికలకు పార్టీ వ్యూహాన్ని ఖరారు చేసే కీలక సమావేశంలో ఉన్నారంటే, చుట్టుపక్కల ఏం జరుగుతోందో పార్టీ చూడలేకపోతోందని అనుకోవాలా? ఒకపక్క బీజేపీ కొత్త కూటములు కట్టడంలో, పాత దోస్తీలు వదిలించుకోవడంలో చాలా చులాగ్గా వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ మాత్రం కనీసం ఎన్నికల్లో పోటీకి సీట్ల పంపిణీలో సైతం అడుగులు ముందుకు వేయలేకపోవడం విచిత్రం. గడచిన పక్షం రోజుల్లో పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ కానీ, పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ నేత కేజ్రీవాల్ కానీ ఏకపక్షంగా తామే అన్ని సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించారంటే ఏమనాలి? చివరకు ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఒకే ఒక్క సీటు మాత్రం ఇస్తామనే స్థాయికి తెగించిందంటే 'ఇండియా' కూటమిలో సయోధ్య ఏమున్నట్టు?

పార్టీల మధ్య వలసలు వెక్కిరిస్తుంటే, మరోపక్క ప్రజాస్వామ్యంలో అర్థవంతమైన చర్చలు కరవై, చట్టసభలు సైతం గౌరవం కోల్పోవడం మరో విషాదం. 1990 తర్వాత పార్లమెంట్ పనితీరు నానాటికీ తీసికట్టు నాగంభొట్లుగా మారింది. ఇటీవలే ఆఖరుసారి సమావేశమైన ప్రస్తుత 17వ లోక్‌సభలో అసలు డిప్యూటీ స్పీకర్ నియామకమే జరగలేదు. సాంప్రదాయికంగా ప్రతిపక్షాలకు కేటాయించాల్సిన డిప్యూటీ స్పీకర్ పదవి అనేదే భర్తీ కాకుండా అయిదేళ్ళు గడిచిపోవడం పార్లమెంటరీ చరిత్రలో ఇదే తొలిసారి. అలాగే, ప్రతిపక్ష ఎంపీలలో 70 శాతానికి పైగా సస్పెన్షన్‌లో ఉండగా కీలకమైన నేర సంస్కరణల చట్టాల లాంటివి ఆమోదం పొందాయి. ఒకే ఒక్క ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇవ్వడం తప్ప, ఏ ప్రశ్నకూ ప్రధాని మౌఖికంగా జవాబివ్వని లోక్‌సభా ఇదే. గద్దె మీది పార్టీలతో సంబంధం లేకుండా గత 30 ఏళ్ళుగా పెరిగిన ధోరణికి ఇది తార్కాణం.

ఈ పరిస్థితులకు ఎవరిని తప్పుబట్టాలో, ప్రజలు ఏ పార్టీ వైపు ఆశగా ఎదురుచూడాలో తెలియని పరిస్థితి. మోదీ తరహా రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా 'ఇండియా' కూటమి వైపు చూడవచ్చని కొందరు ఆశపడ్డా, ఇప్పుడదీ అంతంత మాత్రమేననే భావన కలుగుతోంది. నిజాలు ఏమైనా, అయోధ్య, అబూధాబీల్లో ఆలయాలతో అధికసంఖ్యాకుల్లో అనుభూతిపరంగా మార్కులు కొట్టేస్తున్న మోదీతో పోటీపడాలంటే ప్రతిపక్ష కూటమి ఇకనైనా కళ్ళు తెరవాలి. బలమైన ప్రత్యర్థిని ఢీ కొట్టాలంటే, ఎంత మంచిదైనా ఆఖరి నిమిషపు 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లు చాలవని రాహుల్ గాంధీ లాంటివారు గ్రహించాలి. కూటమిలో ఐక్యత కావాల్సిన కీలక క్షణాల్లో, నిర్ణయాలు తాత్సారం చేస్తే ఫలితాలు చేదుగా ఉంటాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే, త్వరపడి తగు చర్యలు తీసుకోకపోతే... 'ఇండియా' కూటమి ఎన్నికల్లో పోటీకి ముందే చేతులెత్తేయాల్సి వస్తుంది.

సైన్యం ప్రతిష్ఠను దిగజార్చిన తీర్పు

విశ్లేషణ



మనోజ్ జోషి

పాకిస్తాన్ తర్వాతి ప్రధానిగా మరోసారి షెహబాజ్ షరీఫ్ ఎన్నికయ్యే అవకాశం ఉంది. నాలుగోసారి ప్రధాని అవుతారని భావించిన నవాజ్ షరీఫ్ ఉన్నట్టుండి తన సోదరుడు షెహబాజ్ పేరును ముందుకు తెచ్చారు. అయితే ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పీటీఐ మద్దతు ఉన్న అభ్యర్థులు ఈ ఎన్నికల్లో బలమైన ప్రదర్శన ఇచ్చినందున, పాలనా సామర్థ్యానికి సంబంధించిన సమస్యలు అలాగే ఉంటాయి. ఇక, ఈ ఎన్నికలు పాక్‌లో సైన్యం ప్రాబల్యం తగ్గిందని సంకేతిస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ భారత్‌కు ముఖ్యమైనవే. ఆ దేశంతో మన సంబంధాలు సుప్తావస్థలో ఉండవచ్చు. కానీ అవి ఎప్పటికీ అలాగే ఉండవు. ఏ రకమైన ప్రపంచ శక్తిగా ఎదగడానికైనా, ఉపఖండ శాంతి, ఆర్థిక ఏకీకరణ మనకు చాలా కీలకం.

ఇస్లామిక్ రిపబ్లిక్ గమ్యానికి మధ్యవర్తిగా తన ప్రాబల్యాన్ని పాకిస్తాన్ సైన్యం రాను రానూ కోల్పోతోందని ఇటీవలే ముగిసిన ఆ దేశ ఎన్నికలకు చెందిన ఆశ్చర్యకరమైన ఫలితాలు సూచిస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం దేశాన్ని వాస్తవంగా నడిపిన మయన్మార్ సైన్యం... ఇప్పటి వరకూ ప్రజాస్వామ్య, వేర్పాటువాద శక్తులకు వ్యతిరేకంగా విజయవంతంగా పోరాడుతూ వచ్చినప్పటికీ వెనుకపట్టు పడుతోంది. మన దేశ తూర్పు సరిహద్దులలో జరుగుతున్న దానితో పోలిస్తే పాకిస్తాన్ పరిణామాలు కూడా మరీ భిన్నమైనవేమీ కాదు.

ప్రస్తుత తరుణంలో రాబోయే కాలంలో పాక్ రాజకీయాలు ఎలా రూపుదిద్దుకుంటాయో చెప్పడం కష్టమే. నవాజ్ షరీఫ్‌కు చెందిన 'పాకిస్తాన్ ముస్లిం లీగ్- నవాజ్'(పీఎంఎల్-ఎన్), బిలావల్ భుట్టో జర్దారీకి చెందిన 'పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ'(పీపీపీ) కలిసి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. అయితే ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన 'పాకిస్తాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్' (పీటీఐ) మద్దతు ఉన్న అభ్యర్థులు ఈ ఎన్నికల్లో బలమైన ప్రదర్శన ఇచ్చినందున, పాలనా సామర్థ్యానికి సంబంధించి తీవ్రమైన సమస్యలు అలాగే ఉంటాయి. ఇమ్రాన్ పార్టీని అణిచివేసేందుకు ఉద్దేశించిన చర్యలను ఆ పార్టీ నామినీలు అధిగమించి అత్యుత్తమ పనితీరు కనబరిచారు. అసమానతలకు వ్యతిరేకంగా వారు ప్రదర్శించిన పోరాట పటిమ మన దేశ ప్రతిపక్షానికి కూడా ప్రేరణగా ఉపయోగపడుతుంది.

ఎన్నికల ఫలితాలను చూస్తే పాకిస్తాన్ సైన్యం పెద్ద ఎత్తున పట్టు కోల్పోయిందని చెప్పవచ్చు. 2023 మే 9న ఇమ్రాన్ అరెస్టు తర్వాత, ఆయన పార్టీ మద్దతుదారులు దేశవ్యాప్తంగా హింసకు పాల్పడి, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసి, పాకిస్తాన్ పంజాబ్‌లోని సైనిక స్థావరాలపై కూడా దాడి చేసిన సంఘటనలను గుర్తు చేసుకోండి.

ఈ పరిణామాలన్నీ భారత్‌కు ముఖ్యమైనవే. పాకిస్తాన్ ప్రభుత్వంతో మన సంబంధాలు తీవ్రమైన సుప్తావస్థలో ఉండవచ్చు. కానీ అవి ఎప్పటికీ అలాగే ఉండలేవు. పాకిస్తాన్ తనకుతాను మునిగిపోనీ లేదా తేలియాడనీ అని భావించేవారు నిజంగానే భ్రమలో ఉన్నారు. ఏ రకమైన ప్రపంచ శక్తిగా ఎదగడానికైనా సరే, ఉపఖండ శాంతి, ఆర్థిక ఏకీకరణ అనేవి మన భవిష్యత్తుకు చాలా ముఖ్యమైనవి.

భారత్, పాకిస్తాన్ సంబంధాలు ఇటీవలి కాలంలో ఆసక్తికరమైన దశలో ఉన్నాయి. ఒకవైపు పాకిస్తాన్ జిహాదీల చొరబాట్లు, వారి దాడులు కొనసాగుతున్నాయి. మరోవైపు, పాకిస్తాన్ ప్రభుత్వం భారత ప్రభుత్వానికి చేరువ కావడానికి ప్రయత్నించింది. ఈలోగా, 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్'(ఎఫ్ఏటీఎఫ్) ఒత్తిడితో, హాఫీజ్ సయీద్(లష్కర్-ఎ-తైయబా సహ వ్యవస్థాపకుడు)కు పాక్ 31 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అలాగే (లష్కర్-ఎ-తైయబా మరో వ్యవస్థాపకుడు) జకీవుర్ రెహ్మాన్ లఖ్వీకి కూడా వరుసగా మూడు ఐదేళ్ల జైలు శిక్షలు విధించారు. ఇక, 2008 ముంబై దాడుల ప్రధాన నిర్వాహకుడు సాజిద్ మీర్‌ను కూడా పాకిస్తాన్ 'దొరికించుకుని' దోషిగా నిర్ధారించింది.



2023 జనవరిలో, అప్పటి పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ (నవాజ్ షరీఫ్ తమ్ముడు) దేశంలో అంధకార స్థితి మధ్య 'మేము మా గుణపాఠం నేర్చుకున్నాము. మా నిజమైన సమస్యలను పరిష్కరించు కోగలిగితే, మేము భారతదేశంతో శాంతియుతంగా జీవించాలనుకుంటున్నాము' అని ప్రకటించారు. కానీ మరుసటి రోజే, కశ్మీర్ రాజ్యాంగ హోదాను భారతదేశం పునరుద్ధరించనంత వరకూ ఎటువంటి సంభాషణా సాధ్యం కాదని పాక్ ప్రధాని కార్యాలయం ప్రకటించింది.

ఆ తర్వాత, భారత ప్రభుత్వం ఆమోదించిన ఆర్టికల్ 370 రద్దును మన సుప్రీం కోర్ట్ సమర్థించింది. జమ్మూ – కశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కూడా పిలుపునిచ్చింది. కానీ అది కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్ లేని కొత్త సరిహద్దులను కలిగి ఉంటుంది.

వాస్తవానికి, పుల్వామాలో సైనికులపై దాడి, ఆర్టికల్ 370 రద్దు కారణంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడానికి ముందే, రెండు దేశాలు ఐఎస్ఐ(పాకిస్తాన్ గూఢచార సంస్థ) మాజీ డిప్యూటీ చీఫ్‌తోనూ, భారతీయ ఇంటెలిజెన్స్ అధికారితోనూ తెరవెనుక సంభాషణను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించాయి. తర్వాత, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఒకానొక గల్ఫ్ దేశంలో అప్పటి ఐఎస్ఐ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఫైజ్ హమీద్‌ను కలిశారు. 2021లో ప్రధాని మోదీ పాకిస్తాన్ పర్యటనకూ, సింధ్‌లోని హింగ్లాజ్ మాతా ఆలయాన్ని సందర్శించడానికీ ప్రణాళికలు రూపొందాయి. కానీ అంతలోనే పాక్ ప్రధానిగా ఉన్న ఇమ్రాన్ ఖాన్ వెనక్కి తగ్గారు. ఆ తర్వాత 2022లో, ఆయన పదవి నుండి తొలగించబడ్డారు.

మోదీ, నవాజ్ షరీఫ్ మధ్య మంచి సంబంధాలు ఉన్నప్పటికీ, ఆ సంబంధాల సూత్రాలను ఎంచుకోవడం ఇప్పుడు సవాలుగా మారింది. 2015లో ప్రధానిగా ఉన్న నవాజ్ షరీఫ్ మాతృమూర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు భారత ప్రధాని లాహోర్‌లో దిగినప్పటి నుంచీ చాలా పరిణామాలే జరిగాయి. ముఖ్యంగా, 2019 బాలాకోట్ వైమానిక దాడులు, తీవ్రవాద దాడి జరిగినప్పుడు పాక్‌పై దాడి చేయడానికి న్యూఢిల్లీ వెనుకాడదని స్పష్టంగా సూచించింది.

భారత్ కంటే పాకిస్తాన్‌కే ఇప్పుడు శాంతియుత సరిహద్దు అవసరం. దాని ఆర్థిక పరిస్థితి భయంకరంగా కొనసాగుతోంది; జిహాదీ తీవ్రవాద ముప్పు రోజురోజుకూ పెరుగుతోంది; అంతర్జాతీయ సమాజం దాని పగ్గాలను బిగించడానికి 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్'ను ఉపయోగిస్తోంది. పైగా, అఫ్గానిస్తాన్‌లో తాలిబన్ల అధికార స్వీకారం నుండి ఆశించిన ప్రయోజనాలు కార్యరూపం దాల్చలేదు. బదులుగా ఇరాన్‌తో పాకిస్తాన్ ప్రమాదకరమైన గొడవకు దిగింది.

అమెరికా, చైనా తమ సొంత కారణాల వల్ల, పాకిస్తాన్‌లో ఉమ్మడి ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. ప్రధానంగా, అణ్వాయుధాలను కలిగి ఉన్న దేశంలో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక ఆరోగ్యం చాలా అవసరం. కాబట్టే, ఈ రెండు దేశాలూ, ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను మాత్రమే కాకుండా, పాక్-అఫ్గాన్ ప్రాంతం తీవ్రవాదులకు పుట్టిల్లు కాకుండా ఉండే వాతావరణాన్ని కోరుకుంటున్నాయి.

తన బీఆర్ఐ (బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్) పెట్టుబడులు ఉన్నప్పటికీ, తాను మాత్రమే పాకిస్తాన్ ఆర్థిక శ్రేయస్సుకు హామీ ఇవ్వలేననీ, ఇతర దేశాలు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) కూడా ముఖ్యమైన పాత్ర పోషించాలనీ చైనా గ్రహించింది. అమెరికాకు పాకిస్తాన్ ఒక ముఖ్యమైన వాణిజ్య భాగస్వామిగా ఉన్నదనీ, వాషింగ్టన్ కూడా పాక్‌లో లోతైన ప్రయోజనాలను కలిగి ఉందనీ కూడా చైనీయులకు తెలుసు. ఇస్లామిక్ స్టేట్ బలపడుతున్న అఫ్గానిస్తాన్‌లో ఏమి జరుగుతోందో తెలుసుకోవడానికి అమెరికాకు పాకిస్తాన్ ఒక ముఖ్యమైన సాధనం.

సైనిక కోణంలో భారత్ విషయానికొస్తే, భారతదేశ చర్యలు గత మూడేళ్లలో పాకిస్తాన్ నుండి చైనా వైపు దృష్టిని మరల్చినట్లు సూచిస్తున్నాయి. అయినప్పటికీ, పాకిస్తాన్ సరిహద్దును ప్రశాంతంగా ఉంచడం భారతదేశ ప్రయోజనాలలో భాగం. పాకిస్తాన్ మూలంలోనే పూర్తిగా గడబిడ ఉంటుంది. ఒక ఉన్నత స్థాయి బ్యాక్ ఛానల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా మరోసారి చర్చలు ప్రారంభించడమే మార్గం. ప్రబలమైన ఘర్షణను తగ్గించడం, రెండు దేశాల మధ్య సంబంధాలకు గానూ కొత్త విధానాన్ని రూపొందించడం తదుపరి కర్తవ్యం.

వ్యాసకర్త డిస్టింగ్విష్డ్ ఫెలో, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్, న్యూఢిల్లీ | ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రేమికుల కోసం



ప్రేమికులందరికీ 'వాలెంటైన్స్ డే' శుభాకాంక్షలు. మతం, కులం, జాతి, సంస్కృతి, దేశం లాంటి మనిషి సృష్టించుకున్న అన్ని హద్దులనూ దాటే ప్రేమికుల కోసమే ఈ ఉత్సవం!

– స్వాతి కె., న్యాయవాది

శుభాకాంక్షలు



సరస్వతీ దేవి మనందరికీ అపారమైన జ్ఞాన సాగరాన్ని అనుగ్రహించాలి. అందరికీ వసంత పంచమి (ఫిబ్రవరి 14) శుభాకాంక్షలు.

– అమ్జద్ అలీ ఖాన్, సరోద్ విద్వాంసుడు

అమర్ రహే



భయానకమైన తీవ్రవాద దాడికి జమ్ము కశ్మీర్ సాక్షిగా నిలిచిన రోజుగా 14 ఫిబ్రవరి 2019 గుర్తుండిపోతుంది. వంద కిలోల పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ప్రయాణిస్తున్న బస్సును పుల్వామాలో ఢీకొట్టించడం వల్ల 40 మంది సైనికులు అమరులయ్యారు.

– సాజిద్ యూసుఫ్ షా, కశ్మీర్ బీజేపీ నేత

ఇదా మీ నిర్వాకం?



టియర్ గ్యాస్ వాడకానికి దేశంలో డ్రోన్లను ఉపయోగించిన మొదటి పోలీసు బలగం హరియాణా పోలీసులు. 'ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను సర్వే చేయడానికి, వ్యవసాయ పంటలను పర్యవేక్షించడానికి' దృశ్య కంపెనీ 2021లో రూపొందించిన డ్రోన్లను రైతుల మీద గ్రెనేడ్లు వేయడానికి వాడారు.

– విజైతా సింగ్, జర్నలిస్ట్

పార్టీ ముగిసిందా?



ఎప్పుడైతే గాంధీలు రాజ్యసభలో ఆశ్రయం పొందారో, ఇక కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని తెలిసిపోతోంది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఇది ఎంతటి నైతిక స్థైర్యం కోల్పోయే సందేశం ఇస్తుందో ఆమె ఒక్కసారి కూడా ఆలోచించలేదా? (సోనియా గాంధీ రాజ్యసభకు పోటీపడనున్నారని వార్త.)

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

జయప్రదం చేయండి!

తెలంగాణ సామాజిక, రాజకీయార్థిక చలనాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఒక ప్రత్యక్ష సాక్ష్యం. 1919 సంవత్సరంలో ఏర్పడ్డ తెలుగు శాఖ బోధన, పరిశోధన రంగాల్లో ప్రమాణాలను నెలకొల్పుతూ వందేళ్లను పూర్తిచేసుకుంది. సాధికారకమైన పరిశోధక విలువలను తెలుగు సమాజానికి అందించిన తెలుగు శాఖ, ఆర్ట్స్ కాలేజి వేదికగా 2024, ఫిబ్రవరి 15, 16, 17 తేదీల్లో 'తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024'ను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో ఎంపిక చేయబడిన వారు ప్రతినిధులుగా పాల్గొంటున్నారు.

మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా తెలుగు భాష, సాహిత్య, పరిశోధనా రంగాల్లో కృషి చేస్తున్న ప్రముఖ కవులు, రచయితలు, పరిశోధకులు పాల్గొంటారు. అలాగే వివిధ భాష, సాహిత్య విషయాల్లో నిష్ణాతులైన 100 మంది విషయ నిపుణులు పత్ర సమర్పణ చేస్తారు. సాహిత్య శిల్పం, సాహిత్య మూల్యాంకనం అనే అంశాలపై ప్యానల్ డిస్కషన్లు ఉంటాయి.

అన్ని వర్గాలవారూ పాల్గొని ఈ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతున్నాము.

– ప్రొఫెసర్ సి. కాశీం | ఓయూ తెలుగు శాఖాధ్యక్షులు, లిటరరీ కాంగ్రెస్ కన్వీనర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

రైతు ప్రధానికి సముచిత గౌరవం

సందర్భం




డా॥ యలమంచిలి శివాజీ

పేదవర్గాలకు ఎనలేని సేవలందించిన భారత మాజీ ప్రధానమంత్రి దివంగత చరణ్ సింగ్‌కు ఆయన చనిపోయిన 45 ఏళ్ళ తర్వాత కేంద్ర ప్రభుత్వం 'భారత రత్న' అవార్డుకు ఎంపిక చేయటం హర్షణీయం. అదే విధంగా తెలుగుజాతికి ప్రపంచంలో గుర్తింపు తెచ్చిన ఎన్టీ రామారావుకు కూడా భారతరత్న ఇస్తే సముచితంగా ఉంటుంది.

1977లో ఎమర్జెన్సీ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఇందిరాగాంధీని ఓడించటంలో చరణ్ సింగ్‌ది ప్రధానపాత్ర. వాస్తవానికి 1971 ఎన్నికలలో రాయబరేలీలో ఇందిరమ్మపై పోటీచేసిన రాజ్ నారాయణ్ ఎన్నికల పిటిషన్ వేసి, అలహాబాద్ హైకోర్టులో నెగ్గడం వెనుక కూడా చరణ్‌సింగ్ చాణక్యం లేకపోలేదు. మధు లిమాయే 1977లో ఒక మాటన్నారు: 'ఉత్తరభారతంలో రామ్ మనోహర్ లోహియా విఫలం కాగా చరణ్ సింగ్ సమర్థంగా వ్యవసాయ కులాలను, మైనార్టీలను, వెనుకబడిన వర్గాలను గుదిగుచ్చి మాల తయారు చేయటంలో విజయం సాధించారు.'

1937లో చరణ్ సింగ్ రెవిన్యూ మంత్రిగా ఉత్తరప్రదేశ్‌లో రైతురుణ విమోచన చట్టం తెచ్చి, రైతాంగాన్ని ఆనాడే అప్పుల బాధ నుండి బయట పడేశారు. 1979లో చరణ్‌సింగ్ ఆర్థికశాఖను చేపట్టి 1979–80 ఫిబ్రవరి 28న బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఆ సందర్భంలో ఓ రోజు ఉదయం ఫిబ్రవరి మొదటివారంలో చరణ్‌సింగ్‌ను కలుద్దామని తుగ్లక్ రోడ్డుకెళ్ళాను. అప్పట్లో ఆయన ఉప ప్రధానిగా కూడా ఉన్నారు. చరణ్ సింగ్ ఇంటి ముందు మూడు కార్లున్నాయి. వాటినిండా ఫైళ్ళు మూట గట్టి నింపేస్తున్నారు. వ్యక్తిగత భద్రతాధికారి కర్తార్ సింగ్ నన్ను చూడగానే, 'చౌదరీ సాబ్ బడ్జెట్ రూపొందించేందుకై హరియాణాలోని సూరజ్‌కుండ్‌కు వెళ్తున్నారు. నీవు ఇక్కడే ఉండు, చౌదరీసాబ్ బయటకు రాగానే కనపడ' మని సలహా చెప్పారు. వాకిలి వద్దే నిలుచున్నాను.

చౌధరీ బయటకు రాగానే నన్ను చూసి 'ఏమిటింత ప్రొద్దున్నే వచ్చావు. గొడ్డుచలిలో?' అని వాకబు చేశారు. 'రెండు, మూడు సమస్యలున్నాయి. బడ్జెట్ ప్రతిపాదనలలో పొందుపరచాలి' అని వివరించాను. కారు ఎక్కమన్నారు. వెనుక సీటులో చౌధరీసాబ్ పక్కన కూర్చున్నాను. ముందు సీటులో కర్తార్ సింగ్ కూర్చున్నారు. రైతులు పండించే పొగాకుపై ఎక్సైజ్ సుంకం రద్దుచేయవలసిన అవసరాన్ని వివరించాను. అదే మాదిరి పేదవారు వాడుకొనే అల్యూమినియం పాత్రలపై కూడా సుంకం తొలగించాలని వివరించాను. దానికి సంబంధించిన వివరాలతో, ముసాయిదా పత్రాన్ని కూడా తయారు చేశానని చెప్పాను. ఆ పత్రాలు లాక్కొని తన ఫైలులో పెట్టుకొన్నారు. ఆ రెంటినీ బడ్జెట్ ప్రతిపాదనలలో పొందుపరిచారు. చాలా ఆశ్చర్యమేసింది. అంతకు ముందు బడ్జెట్లు రూపొందించే కసరత్తులో భాగంగా సలహాల కోసం బొంబాయి వెళ్ళి ఆర్థికవేత్తలు, ప్రణాళికా నిపుణులు, పారిశ్రామిక, వాణిజ్య వర్గాల వారు, పాలనాదక్షులతో చర్చలు జరిపితే బడ్జెట్ మరింత నాణ్యంగా రూపొందించడానికి ఉపయోగపడగలదని సూచించాను. సరేనన్నారు. బొంబాయి సమావేశంలో పాల్గొన్న పెద్దలు చెప్పినవన్నీ జాగ్రత్తగా రికార్డు చేయించి, ఆ కాగితాలు తీసుకొని ఆ



'భారతరత్న' చరణ్ సింగ్

సూచనలలో ప్రతి ఒక్కదానికీ పూర్తి వ్యతిరేకంగా బడ్జెట్ ప్రతిపాదనల్లో చేర్చారు. 'బొంబాయిలోని వారంతా బడా బాబులు. వారు చెప్పినదానికి పూర్తి వ్యతిరేకంగా చేస్తే, మనం సరైన మార్గంలో ఉన్నట్లు! మనం చేసిన పని బాగుందని వారు కితాబిస్తే మనం ఎక్కడో తప్పు చేశామని అర్థం! అని గీతోపదేశం చేశారు.

1979 జులైలో జనతాపార్టీ చీలిపోయింది. మొరార్జీ స్థానంలో చరణ్ సింగ్ ప్రధాన మంత్రి అయ్యారు. ఆయన కాలంలో లోక్ సభ రద్దయి, మధ్యంతర ఎన్నికలు ప్రకటించారు. డీసీఎం అధిపతి అయిన భరత్ రామ్ భారత వాణిజ్య, పారిశ్రామిక మండలి అధ్యక్షులుగా చరణ్ సింగ్ దగ్గరకు వెళ్లి ఆయనకు ఎన్నికల నిధి ఇవ్వజూపారు. ఏమిటిదని అడిగారు చరణ్ సింగ్. 'ఏమీ లేదు – ఇది మామూలే. ప్రతి ఎన్నికల సమయంలోనూ ప్రధానమంత్రులందరికీ మేము ఇలాగే సమర్పించుకొంటుంటాం. ఇందులో కొత్త ఏమీలేదు. ఇప్పుడు ప్రధాని కుర్చీలో మీరు కూర్చున్నారు గనుక మీకు సమర్పిస్తున్నాం' అన్నారు. 'ఏమిటీ నాకు డబ్బులిస్తావా? పోలీసులకు అప్ప జెబుతాను. నేను రైతుల దగ్గరికెళ్ళి రూపాయి – రూపాయి అడుక్కొంటాను గానీ, పారిశ్రామికవేత్తల విరాళాలతో ఎలక్షన్‌కు వెళ్తానా?' అని కోపగించారు చరణ్ సింగ్. భరత్ రామ్ రాష్ట్రపతి భవన్ కెళ్ళి రాష్ట్రపతిగా ఉన్న నీలం సంజీవరెడ్డిని కలిసి 'భలేవాడిని ప్రధాన మంత్రిగా చేశారు సార్. ఎన్నికల నిధికి ఏదో పదిరూపాయలిద్దామని వెడితే, అరెస్ట్ చేయిస్తానని వెంటబడతాడేమిటి సార్' అని వాపోయారు. ఎమ్‌వీఎస్ సుబ్బరాజు, గణపా రామస్వామి రెడ్డి, దొడ్డపనేని ఇందిర జనతాపార్టీ శాసనసభ్యులు, నీలం సంజీవరెడ్డికి ఆత్మీయులు. వారు వాస్తవానికి మానసికంగా లోక్ దళ్‌కూ, చరణ్ సింగ్ భావజాలానికీ దగ్గర. వారిని పిలిపించారు సంజీవరెడ్డి. 'ఇదెక్కడ గోలయ్యా. తుండు, తుపాకీ లేకుండా యుద్ధానికి వెళతానంటాడు. ఎవరో పెద్దమనిషి పది రూపాయలిస్తానంటే అరెస్టు చేయిస్తానంటాడు. ఈ సిద్ధాంత మూర్ఖుడితో కూడుగాదు, మీరు కాంగ్రెస్‌లో చేరిపోండి' అని సలహా ఇచ్చారు. అలాగే చేశారు వారు ముగ్గురూ.

ప్రధానమంత్రిగా నుండగా 1979 అక్టోబరులో గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ. చౌధరీ సాబ్ ఉపన్యాసాన్ని తెలుగులోకి నేనే తర్జుమా చేశాను. 'శివాజీ, నా ఉపన్యాసం కన్నా, నీ తర్జుమా మరింతగా శ్రోతలను ఆకట్టుకొంది. లేకుంటే సభ అంత రక్తికట్టేది కాదు' అని సభానంతరం మనసారా అభినందించారు చరణ్ సింగ్.

కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్న ఓట్ల చీలిక వల్లనే కాంగ్రెస్ నెగ్గుకొస్తున్నదనీ, ఆ పార్టీలన్నీ ఐక్యం అయితే కాంగ్రెస్ పాలన ముగుస్తుందనీ చరణ్ సింగ్ విశ్వాసం. ఆ దిశగా ఆలోచన చేసే 1974 ఆగస్టు 29న భారతీయ క్రాంతిదళ్, సోషలిస్టుపార్టీ, సంయుక్త సోషలిస్టు పార్టీలు, ముస్లిం మజ్లిస్, స్వతంత్ర పార్టీ, రాష్ట్రీయ లోక్ దళ్, మజ్దూర్ పార్టీ, పంజాబ్ ఖేతీ భారీ జమీందారీ యూనియన్లను విలీనం గావించి భారతీయ లోక్‌దళ్‌ను రూపొందించారు.

జాతీయ స్థాయిలో నిరంతరం రైతుల కోసం పరితపించిన చరణ్ సింగ్‌కు భారతరత్న ఇవ్వటం ఎంతో సముచితం. కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాన్ని రైతులందరూ స్వాగతిస్తున్నారు.

వ్యాసకర్త రాజ్యసభ మాజీ సభ్యుడు | 98663 76735

బంజారా ధర్మ గురు

బంజారా జాతిలో భగవత్ స్వరూపునిగా, అవతార పురుషునిగా, సామాజిక క్రాంతి వీరుడిగా పూజింపబడుతున్న వారు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాది వేసిన మహోన్నత వ్యక్తి ఆయన. మధ్యయుగంలో బంజారాలు ఉత్తర, మధ్య భారతాల నుంచి దక్షిణ భారత దేశం వైపుకు పశువులను మేపుకుంటూ వలస వచ్చారంటారు. రమావత్ రాంజీనాయక్ 360 కుటుంబాలతో పాటు 3775 గోవులతో కర్ణాటక రాష్ట్రంలోని గుత్తి గ్రామానికి అలా చేరుకున్నవారే. అనంతపురం అప్పట్లో కర్ణాటక పరిధిలోనే ఉంది. అక్కడ 'గొల్లయ్య దొడ్డి'లో నివాసం ఏర్పరుచుకున్నారు. ఆయన జన్మించిన ఈ ప్రాంతంలోనే 2000 సంవత్సరం తర్వాత సేవాగఢ్ మందిరం నిర్మించి శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్‌కు పూజలు నిర్వహిస్తున్నారు.



శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్

రాంజీ నాయక్‌కు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు భీమానాయక్‌కు కర్ణాటకలోని ధర్మిణీ బాయితో వివాహం జరిగింది. పిల్లలు లేని ఆ దంపతులు తమ ఏడుగురు దేవతలనూ మొక్కారు. ఇందులో మేరామాయాడి అంశతో 1739 ఫిబ్రవరి 15న ఆ దంపతులకు రమావత్ సంత్ సేవాలాల్ మహరాజ్ జన్మించారని ఓ కథ ప్రచారంలో ఉంది. ఈయన గోర్ బంజారాలను సంస్కరించడానికి ఎంతో కృషి చేశారు. ఆయన కాలంలోనే గుత్తిలో నివసిస్తున్న గోర్ బంజారా కుటుంబాలు గోవులతో తిరుపతికి పయనమయ్యాయి. వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని అక్కడి నుంచి రాయచూర్ మీదుగా హైదరాబాద్ చేరుకున్నారు.

గోర్ బంజారాల సంఘ సంస్కర్త సేవాలాల్ ధైర్య సాహసాలనూ, ఆధ్యాత్మిక శక్తినీ తెలుసుకున్న హైదరాబాద్ నిజాం నవాబు ఆయనను ఆహ్వానించి మహరాజ్ గంజ్, బంజారాహిల్స్ ప్రాంతాలను బహుమానంగా ఇచ్చారని లంబాడా గిరిజన పెద్దలు చెబుతారు. సంత్ సేవాలాల్ పొహరా గఢ్ ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పరచుకొని బంజారాలను సంస్కరించే బోధనలు కొనసాగించారు.

– నరేష్ రాథోడ్ | నల్లగొండ (నేడు సంత్ సేవాలాల్ జయంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.షష్ఠి సా.4.18 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: అశ్విని ప.3.21 వరకు, తదుపరి భరణి, వర్జ్యం: ఉ.11.31 నుండి 1.02 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.20 నుండి 11.04 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.40 వరకు, అమృత ఘడియలు: ఉ.8.30 నుండి 10.01 వరకు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 6.31, సూర్యాస్తమయం: 5.56.

క్లుప్తంగా...

తండ్రిలాంటి అన్నపై ఎందుకు దండయాత్ర?

షర్మిలను నిలదీసిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



గంగాధరనెల్లూరు (చిత్తూరు జిల్లా): జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టిన కాంగ్రెస్‌తో సహవాసం ఎందుకని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలపై ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలో బుధవారం జరిగిన డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తండ్రిలాంటి అన్నపై దుష్టులతో కలిసి షరిలమ్మ దండయాత్ర ఎందుకని నిలదీశారు. 'జగనన్న వదిలిన బాణం అని గతంలో అన్నావు.. ఇప్పుడు ఎందుకు చంద్రబాబు వదిలిన బాణంలా తయారయ్యావు..' అని ప్రశ్నించారు. వైఎస్సార్ మరణానంతరం కాంగ్రెస్ పార్టీ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి, మానసికంగా కుంగదీసిందని పేర్కొన్నారు. అన్నీ తెలిసిన షర్మిల ఏం ఆశించి ఈ విధంగా రాజకీయ ప్రత్యర్థుల పన్నాగంలో ఇరుక్కున్నారో అర్థం కాలేదని చెప్పారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సింహమని, అడవికి రాజు సింహం అయితే రాజకీయానికి రారాజు సీఎం జగన్ అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్తగా తనను నియమించినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

నేను పార్టీ మారే ప్రసక్తేలేదు

నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'మీకు పదేపదే చెబుతున్నా.. నేను పార్టీ మారుతున్నట్లు ఎల్లో మీడియా ప్రచారం చేస్తోంది. ప్రతిసారి కుట్రపూరితంగా పార్టీ వీడుతున్నట్లు ప్రచారం చేయడం, నేను వివరణ ఇచ్చుకోవడం ఇబ్బందిగా ఉంది. ఆఖరిసారిగా చెబుతున్నా వైఎస్సార్‌సీపీని వదిలిపోయే ప్రసక్తేలేదు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఎక్కడినుంచైనా పోటీచేస్తా..' అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నట్లు మీడియాలో వచ్చిన వార్తలపై ఆయన క్లారిటీ ఇచ్చారు. ఆయన బుధవారం నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడారు. తాను ఎట్టి పరిస్థితుల్లోను వైఎస్సార్‌సీపీని వీడేదిలేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు పార్టీలో ప్రాధాన్యత ఇచ్చి నెల్లూరు రూరల్ సమన్వయకర్తగా బాధ్యత అప్పజెప్పా రన్నారు. అంతటి ప్రాధాన్యత కల్పించిన వైఎస్ జగన్‌తోనే తన రాజకీయ ప్రయాణం ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోను పార్టీ మారే ప్రసక్తే లేదని చెప్పారు. ఎల్లో మీడియా ప్రతిసారి తాను పార్టీ వీడుతున్నట్లు ఓ మైండ్ గేమ్ ఆడుతోందన్నారు. కుట్రపూరితంగా తమపై దుష్ప్రచారం చేస్తూ మానసి కంగా ఇబ్బంది పెట్టేలా కొత్త డ్రామా క్రియేట్ చేస్తున్నారని చెప్పారు. తమ పార్టీ ఎంపీలైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డిలను కలవటం తప్పుకాదు కదా అన్నారు. వారు పార్టీని వీడిపోతున్నారనే సమాచారంతో తాను వెళ్లి మాట్లాడి కన్విన్స్ చేద్దామని చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదని చెప్పారు. తాను ఎంపీలను కలిస్తేనే పార్టీ మారిపోతున్నట్లు ట్రోల్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

పొత్తు.. సీనియర్లు చిత్తు

జనసేనకు 50, బీజేపీకి 25

మొత్తంగా టీడీపీ 75 సీట్లు వదులుకోవాల్సిన పరిస్థితి

- హతాశులవుతున్న అనేక మంది సీనియర్ నేతలు
- గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బండారు సత్యనారాయణమూర్తి సీట్లకు ఎసరు
- బోండా ఉమా, భూమా అఖిల ప్రియకు నిరాశే
- బీజేపీ జాబితాలో విజయవాడ, విశాఖ ఎంపీ సీట్లు
- దీంతో కేశినేని చిన్ని, లోకేశ్ తోడల్లుడు భరత్‌కు పొత్తుపోటు
- బాబు తీరు వల్లే ఇన్ని కష్టాలంటూ టీడీపీ నేతల ఆందోళన



జనసేన కోరుతున్న నియోజకవర్గాలు

- **ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా:** ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పలాస
- **ఉమ్మడి విజయనగరం జిల్లా:** విజయనగరం, నెల్లిమర్ల.
- **ఉమ్మడి విశాఖ పట్నం జిల్లా:** పెందుర్తి, యలమంచిలి, చోడవరం, విశాఖపట్నం దక్షిణం, విశాఖపట్నం ఉత్తరం, భీమిలి, అనకాపల్లి, గాజువాక.
- **ఉమ్మడి తూర్పు గోదావరి:** పిఠాపురం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, ముమ్మిడివరం, రాజమండ్రి రూరల్, రాజానగరం, కొత్తపేట, అమలాపురం, రామచంద్రాపురం, రాజోలు, పి.గన్నవరం.
- **ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా:** నర్సాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నిడదవోలు, ఉంగుటూరు, ఏలూరు, గోపాలపురం, కొవ్వూరు, పోలవరం, ఆచంట.
- **ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా:** విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, విజయవాడ తూర్పు, అవనిగడ్డ, పెడన, నూజివీడు, మచిలీపట్నం, కైకలూరు, పెనమలూరు, తెనాలి, గుంటూరు వెస్ట్, పెదకూరపాడు, తాడికొండ, పొన్నూరు, వేమూరు, గుంటూరు తూర్పు.
- **ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాలు :** దర్శి, గిద్దలూరు, నెల్లూరు సిటీ, కోవూరు, కావలి, తిరుపతి, మదనపల్లి, చిత్తూరు, నగరి, ఆళ్లగడ్డ, నంద్యాల, గుంతకల్లు, బద్వేలు, రైల్వే కోడూరు, రాజంపేట, పుట్టపర్తి, ధర్మవరం.

సాక్షి, అమరావతి : ప్రజల్లో ఆదరణ కోల్పోయినా, పొత్తుల ద్వారా గట్టెక్కుదామనుకుంటున్న తెలుగుదేశం పార్టీకి అవి కూడా శరాఘాతాల్లా మారాయి. పొత్తులో భారీగా సీట్లు కోల్పోయే పరిస్థితి నెలకొనడంతో చాలా మంది సీనియర్ల మెడపై కత్తులు వేలాడుతున్నాయి. దీంతో వారి రాజకీయ భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ 67 పేర్లతో జాబితాను చంద్రబాబుకు ఇచ్చారు. వాటిలో కనీసం 50కి పైగా సీట్లు తమకు కేటాయించాలని కోరుతున్నారు. తాజాగా బీజేపీతో పొత్తు కోసం వెంపర్లాడుతుండడంతో ఆ పార్టీకి ఆరు ఎంపీ, 25 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వక తప్పదని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఈ పొత్తులు ఖరారైతే బీజేపీ, జనసేనకు 75 ఎమ్మెల్యే, 10 ఎంపీ స్థానాలు వదులుకోక తప్పని పరిస్థితి నెలకొంది. దీంతో అనేక మంది సీనియర్ల సీట్లు గల్లంతవుతున్నాయి. పొత్తులతో పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని సీనియర్ నేతలు లబోదిబోమంటున్నారు. అన్ని సీట్లు వదులుకుంటే పార్టీ అధికారంలోకి రావడం అటుంచి అసలు విలువే లేకుండా పోతుందని నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అది నిజమే అయినా పొత్తులు లేకపోతే దిగజారిపోయిన పార్టీ మనుగడే కష్టమైపోతుందని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే పవన్ కళ్యాణ్, బీజేపీతో పొత్తు కోసం వెంపర్లాడుతున్నారు. తద్వారా పార్టీని రేసులోనైనా నిలపవచ్చని భావిస్తున్నారు. అయితే దీనివల్ల అనేక మంది సీనియర్ నాయకుల రాజకీయ జీవితాలకు ముగింపు తప్పదని పార్టీలో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉత్తరాంధ్ర కకావికలం

ఈ పొత్తులు ఖరారైతే ఉత్తరాంధ్రలో టీడీపీ సీనియర్ నేతలు కళా వెంకట్రావు, అశోక్ గజపతిరాజు, చింతకాయల అయ్యన్న పాత్రుడు, గౌతు శిరీష, బండారు సత్యనారాయణమూర్తి, గండి బాబ్జి, గంటా శ్రీనివాసరావు, పీలా గోవింద్, పల్లా శ్రీనివాసరావు తదితర నేతల పేర్లు గల్లంతవనున్నాయి. ఎచ్చెర్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కళా వెంకట్రావు పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారింది. విశాఖలో కీలక నేతగా ఉన్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి సీటు ఎగిరిపోనుంది. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అశోక్‌గజపతిరాజు వంటి సీనియర్ తన కుమార్తెకు సీటు ఇప్పించుకోలేక సతమతమవుతున్నారు.

కృష్ణా, గుంటూరు జిల్లాల నేతలకు తప్పని పొత్తు పోట్లు

కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కీలకమైన సీనియర్లకు పొత్తు పోట్లు తప్పేలా లేవు. విజయవాడలో మాజీ ఎమ్మెల్యేలు జలీల్‌ఖాన్, బొండా ఉమామహేశ్వరరావులను పక్కన పెట్టే పరిస్థితి ఏర్పడనుంది. అవనిగడ్డలో మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, పెడనలో కాగిత కృష్ణప్రసాద్, మచిలీపట్నంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, తెనాలిలో ఆలపాటి రాజా, నక్కా ఆనంద్‌బాబు వంటి నేతలకు షాక్ తగలనుంది. ఆలపాటి రాజా ఇప్పటికే తన సీటు పోతే ఒప్పుకునేది లేదని అనుచరులను ముందుపెట్టి హడావుడి చేస్తున్నారు.

పరిటాల శ్రీరామ్, భూమా అఖిలప్రియకు టాటా

నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో పలువురు కీలక నాయకులు పొత్తుతో రాజకీయంగా కనుమరుగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సత్యసాయి జిల్లా ధర్మవరంలో పరిటాల శ్రీరామ్, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో భూమా అఖిలప్రియ, అనంతపురంలో ప్రభాకర్ చౌదరి, నగరిలో గాలి భానుప్రకాష్, తిరుపతిలో సుగుణమ్మ, శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డి, రాజంపేటలో బత్యాల చెంగల్రాయుడు, జమ్మలమడుగులో భూపేష్‌రెడ్డి వంటి నేతలు పోటీ నుంచి తప్పుకోక తప్పదంటున్నారు. పొత్తులో బీజేపీ విశాఖ, విజయవాడ, నర్సాపురం, రాజమండ్రి, తిరుపతి, రాజంపేట పార్లమెంట్ సీట్లు ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. విశాఖ నుంచి గత ఎన్నికల్లో లోకేశ్ తోడల్లుడు భరత్ పోటీ చేసి ఓడిపోయారు. ఆయన అక్కడి నుంచి మళ్లీ పోటీ చేయాలని భావిస్తున్న తరుణంలో ఆ సీటు బీజేపీకి పోతే ఆయన భవితవ్యం ప్రశ్నార్థకం కానుంది. విజయవాడ సీటును సిట్టింగ్ ఎంపీ కేశినేని నానిని కాదని ఆయన సోదరుడు కేశినేని చిన్నికి ఇస్తున్నట్లు చంద్రబాబు స్పష్టం చేశారు. పొత్తులో అక్కడి నుంచి బీజేపీ తరఫున సుజనా చౌదరి పోటీ చేయాలని చూస్తున్నారు. దీంతో కేశినేని చిన్నికి సీటు పోయినట్లేనని భావిస్తున్నారు.

గోదావరి జిల్లాల్లో సీనియర్ల సీట్లు గల్లంతే

గోదావరి జిల్లాల్లోనూ చాలా మంది ముఖ్య నాయకుల మెడపై కత్తి వేలాడుతోంది. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గొల్లపల్లి సూర్యారావు, తోట సీతారామలక్ష్మి, కేఎస్ జవహర్, ఎస్వీఎస్ వర్మ వంటి వారు పోటీ చేసే అవకాశాన్ని కోల్పోనున్నారు. బుచ్చయ్యచౌదరి సిట్టింగ్ ఎమ్మెల్యేను కాబట్టి తన సీటు ఉంటుందని చెప్పుకుంటున్నా దానికి గ్యారంటీ లేదు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సీటు ఇప్పటికే ఎగిరి పోయింది. రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి భీమవరం సీటును నిరాకరిస్తుండడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం సీటు జనసేనకు పోతుండడంతో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ వర్మ ఇప్పటికే తిరుగుబాటు స్వరం వినిపిస్తున్నారు. వీరు కాకుండా నర్సాపురంలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, కాకినాడ వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ రూరల్ పిల్లి అనంతలక్ష్మి, ఐతాబత్తుల ఆనందరావు, బూరుగుపల్లి శేషారావు, గన్ని వీరాంజనేయులు వంటి నేతలకు టికెట్లు గల్లంతవనున్నాయి.

ఒంటరిగా పోటీ చేయలేని దద్దమ్మ చంద్రబాబు

- ఒక పక్క దత్త పుత్రుడు, మరోపక్క ఉత్తపుత్రుడు
- ముందు బీజేపీ వదినమ్మ, వెనుక కాంగ్రెస్ చెల్లమ్మతో ఎన్నికలకు చంద్రబాబు
- మాజీమంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేని చవట దద్దమ్మ చంద్రబాబునాయుడు అని మాజీమంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) విమర్శించారు. కృష్ణాజిల్లా మల్లాయపాలెంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒంటరిగా సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేక ఒక పక్క దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, మరోపక్క ఉత్తపుత్రుడు లోకేశ్, ముందు బీజేపీ వదినమ్మ, లేటెస్ట్‌గా వెనుక కాంగ్రెస్ చెల్లెమ్మను నిలబెట్టుకుని ఎన్నికలకు వస్తున్నాడని ఎద్దేవా చేశారు. వాళ్లందరూ ఉన్నా ధైర్యం సరిపోక బీజేపీ పెద్దలను మభ్యపెడదామని చంద్రబాబు ఇటీవల ఢిల్లీ వెళ్లాడని విమర్శించారు. గతంలోలాగా చంద్రబాబు కల్లబొల్లి మాటలు, డ్రామాలు నమ్మేందుకు అక్కడ ఉన్నది వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ లాంటి వారు కాదని, నరేంద్రమోదీ, అమిత్‌షా అని చెప్పారు. బీజేపీ పెద్దలు ఇచ్చిన ఆఫర్‌తో చంద్రబాబు కంగుతిన్నాడని, 150 సీట్లలో తామే పోటీ చేస్తాం, మిగిలిన 25 సీట్లలో టీడీపీ పోటీ చేయాలని బీజేపీ పెద్దలు చెప్పడంతోనే చంద్రబాబు హైదరాబాద్‌లో అనారోగ్యం బారినపడి ఉంటారని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. సీఎం వైఎస్ జగన్.. పైన ఉన్న భగవంతుడిని, నేలమీద ఉన్న ప్రజలను మాత్రమే నమ్ముకుని ఎన్నికలకు సిద్ధం అవుతున్నారని, ఎంతమంది దుష్టశక్తులు కలిసినా శూన్యమని, ప్రజలు జగన్‌కే మద్దతుగా ఉండాలని నాని కోరారు.

హెలికాప్టర్ లేకపోతే పవన్ భీమవరం వెళ్లలేడా?

ఇంజినీరింగ్ కళాశాల, ఇళ్ల మధ్య హెలికాప్టర్ దిగడానికి అధికారులు ఒప్పుకోకపోవడంతో పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటన వాయిదా వేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే కొడాలి నాని విమర్శించారు. జనసేన పోటీ చేసే సీట్లు ఎన్నో చెప్పాలని ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తారన్న భయంతోనే పవన్ డ్రామాలు ఆడుతున్నారన్నారు. రోడ్డు మార్గంలో మంగళగిరి నుంచి గంటన్నరలో భీమవరం చేరుకునే అవకాశం ఉందన్నారు. ఊరి బయట హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అవకాశం కల్పిస్తామని అక్కడి అధికారులు చెబితే దానికి కూడా పవన్ ఒప్పుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఒకవేళ ఎమ్మెల్యేగా పవన్ గెలిస్తే హెలికాప్టర్ లేకపోతే భీమవరం రానంటాడేమో అంటూ ఎద్దేవా చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భీమవరం ప్రజలు నిర్ణయం తీసుకోవాలని కొడాలి నాని సూచించారు.

రాజ్యసభ రేసు నుంచి టీడీపీ ఔట్

- చివరి నిమిషంలో వెనక్కి తగ్గిన చంద్రబాబు
- సంఖ్యా బలం లేకపోయినా పోటీకి సిద్ధమైన టీడీపీ
- కోట్లు కుమ్మరించి ఓట్లు కొనేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం

సాక్షి, అమరావతి: రాజ్యసభ ఎన్నికల రేసు నుంచి టీడీపీ తప్పుకుంది. ఎమ్మెల్యేల సంఖ్యా బలం లేకపోయినా కోట్లు కుమ్మరించి తమ అభ్యర్థిని పోటీకి నిలపడానికి చంద్రబాబు చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో చివరి నిమిషంలో వెనక్కి తగ్గారు. రాజ్యసభ సీటు కోసం రూ.200 కోట్లు సిద్ధం చేసి, అధికార పార్టీలో అసంతృప్తితో ఉన్న కొందరు సభ్యులకు ఎరవేయడానికి విఫలయత్నం చేసినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. అధికార పార్టీ సభ్యులు చంద్రబాబు ఆఫర్‌ను తిరస్కరించడంతో వెనక్కి తగ్గక తప్పలేదు. దీంతో రాష్ట్ర కోటాలో ఏప్రిల్ 2వ తేదీతో ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. నామినేషన్ల దాఖలుకు తుది గడువు గురువారంతో ముగుస్తుంది. ఇప్పటికే మూడు స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ పోటీలో లేకపోవడంతో మూడు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం లాంఛనంగా ప్రకటన చేయనుంది.

సంఖ్యా బలంలేకపోయినా డబ్బుతో సీటు కొనాలని యత్నం

రాజ్యసభ, శాసన మండలి ఎన్నికల్లో ప్రతిసారీ డబ్బుతో ఓట్లు కొనాలని చంద్రబాబు ప్రయత్నిస్తుంటారు. గతంలో తెలంగాణలో ఇలా కోట్లతో ఓట్లు కొనే ప్రయత్నం చేసి అడ్డంగా దొరికిపోయారు. ప్రస్తుతం రాష్ట్ర కోటాలో 3 రాజ్యసభ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లోనూ ఇదే విధంగా కోట్లు కుమ్మరించేందుకు సిద్ధమయ్యారు. నేరుగా టీడీపీ అభ్యర్థి కాకుండా ఇండిపెండెంట్ అభ్యర్థిని పోటీకి దింపి, అతనికి మద్దతిచ్చేలా అధికార పార్టీ నుంచి కొందరు ఎమ్మెల్యేలను ఆకర్షించాలనే ప్రయత్నాలు చేశారు. నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ మరికొందరిని పోటీకి సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే టీడీపీ పోటీలో ఉంటుందని ఆ పార్టీ నేతలు కొద్ది రోజులుగా ప్రచారం చేస్తున్నారు.

ఉన్నది 18 మంది ఎమ్మెల్యేలే.. కావల్సింది 42 మంది

రాజ్యసభ సీటును గెలుచుకోవాలంటే 42 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయాలి. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి 18 మంది సభ్యుల బలం మాత్రమే ఉంది. 2019 ఎన్నికల్లో 23 మంది ఎమ్మెల్యేలు గెలిచినా, నలుగురు ఆ పార్టీని వీడారు. గంటా శ్రీనివాసరావుపై అనర్హత వేటు పడింది. దీంతో బలం 18కి పడిపోయింది. మరో నలుగురు వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలు టీడీపీకి మద్దతిచ్చినా వారిపై అనర్హత పిటీషన్ పెండింగ్‌లో ఉంది. అయినా వైఎస్సార్‌సీపీలో సీట్లు దక్కక అసంతృప్తితో ఉన్న కొందరు ఎమ్మెల్యేలకు ఎర వేసి తమ వైపు తిప్పుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. రూ.200 కోట్లతో టీడీపీ తెర వెనుక ఈ ఆపరేషన్‌కు తెరతీసినట్లు ప్రచారం జరిగింది. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.5 కోట్లు ఇవ్వడానికి సిద్ధపడినట్లు టీడీపీ నేతల ద్వారా తెలిసింది. కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఎమ్మెల్యేలు ఎవరూ టీడీపీకి మద్దతివ్వడానికి ముందుకు రాలేదు. నామినేషన్లకు ఒక్క రోజు గడువుండటంతో రాజ్యసభ ద్వారాలు మూసుకుపోయినట్లేనని స్పష్టమైపోయింది. దీంతో చంద్రబాబు ప్లేటు ఫిరాయించారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో జరిగిన పార్టీ నేతల సమావేశంలో ఆ విషయాన్ని లేవనెత్తించి, పోటీ చేసే ఆలోచన లేదని చెప్పారు. సాధారణ ఎన్నికలపైనే దృష్టంతా ఉందని, రాజ్యసభ సీటు గురించి ఆలోచన కూడా చేయడంలేదని బిల్డప్ ఇచ్చేందుకు ప్రయత్నించారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన లేదని ఈ సమావేశంలో చంద్రబాబు చెప్పినట్లు టీడీపీ కార్యాలయం మీడియాకు లీకులిచ్చింది. పోటీ నుంచి టీడీపీ తప్పుకోవడంతో వైఎస్సార్‌సీపీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

వెన్నుపోటుకు స్కెచ్ రెడీ!

జనసేన సీట్ల కోతకు టీడీపీ కొత్త ఎత్తుగడ

- అన్నదమ్ములే ఓడారంటూ తాజా ప్రచారాస్త్రం
- ఆ నలుగురు ఆరు చోట్ల పోటీ..
- గెలిచింది ఒకే ఒక్కరు.. ఒక్క స్థానం నుంచే..
- ఇలాంటి వారికెందుకన్ని సీట్లంటూ సీనియర్ల సన్నాయి నొక్కులు
- బలం కాదది వాపేనని ప్రజల్లోకి తీసుకెళ్లాలని క్యాడర్‌కు సంకేతాలు
- బీజేపీతో చర్చల అనంతరం మారుతున్న బాబు ఎత్తుగడ!
- తెలంగాణలో పవన్ పవర్ ఏంటో తేలిపోయిందంటూ ఎద్దేవా



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి : నమ్మకద్రోహం, వెన్నుపోట్లకు పేటెంట్‌దారుడైన చంద్రబాబు జనసేనకు సీట్ల కేటాయింపులో వ్యూహం మార్చారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎన్నిసీట్లు విసిరేసినా మహద్భాగ్యంగా స్వీకరించడానికి జనసేనఅధినేత పవన్ కళ్యాణ్ సంసిద్ధంగా ఉన్నా, ఆ పార్టీలోని ఆశావహులు, హరిరామజోగయ్య లాంటి సామాజిక పెద్దలు ససేమిరా అంటున్నారనేందుకు వారి నిత్యాభిప్రాయాలే నిదర్శనం. సీఎం పదవిలో పవన్ షేర్ దక్కించుకోవాలంటే అందుకు తగిన సంఖ్యలో పొత్తులో సీట్లు పొందాల్సిందేనని పట్టు పడుతున్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం.. పొత్తు ధర్మం కోసం.. అనే 'ప్యాక్ట్' పదాలను పక్కన పెట్టాల్సిందేనని పవన్‌కు స్పష్టం చేస్తున్నారు. తమకు ప్రధాన పట్టు ఇక్కడేనని భావిస్తూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో మెజార్టీ సీట్లను డిమాండ్ చేస్తున్న పవన్ బృందాన్ని ఆ జిల్లాల్లోనే దెబ్బ తీయాలనేది బాబు తాజా ప్రణాళికగా తెలుస్తోంది. ఇందుకుగాను పక్కా వ్యూహంతో కొణిదెల ఫ్యామిలీ రాజకీయ ఓటములను తెరపైకి తీసుకొస్తున్నారనేది సమాచారం. ఇందులో భాగంగా 'ఆ నలుగురూ కుటుంబ సభ్యులే. అందులో ముగ్గురు స్వయానా అన్నదమ్ములే. అయిదు చోట్ల పోటీ చేయగా గెలిచింది ఒక్క చోటే. ఒకేఒక్కడు. తక్కిన ఇద్దరిదీ మూడో స్థానమే. ఈ విషయాన్నే విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అనే సూచనలు టీడీపీ అధిష్టానం నుంచి ఆ పార్టీ ముఖ్యులకు చేరాయి. ప్రధానంగా టికెట్లు ఎక్కువగా ఆశిస్తున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో చాప కింద నీరులా ప్రచారం కొనసాగించే బాధ్యతలను తన నమ్మకస్తులకు బాబు అప్పగించారనేది విశ్వసనీయ సమాచారం.

ఆ ముగ్గురికీ తప్పని ఘోర పరాజయం

- ప్రజారాజ్యం పార్టీని స్థాపించిన కొణిదెల చిరంజీవి 2009 ఎన్నికల్లో రెండు స్థానాల నుంచి పోటీ చేసి, తిరుపతిలో మాత్రమే గెలుపొందారు. పాలకొల్లు నుంచి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి ఉషారాణి చేతిలో 5,446 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.
- జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ 2019 ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి పోటీపడి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ చేతిలో 8,357 ఓట్లతో ఓడిపోయారు. గాజువాక నుంచి కూడా బరిలోకి దిగిన పవన్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాగిరెడ్డి చేతిలో 16,753 ఓట్ల తేడాతో ఘోర పరాజయం చవిచూశారు.
- వీరిద్దరికీ స్వయానా సోదరుడైన కె.నాగబాబు 2019 ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి మూడవ స్థానంలో నిలిచారు. ప్రస్తుతం జనసేనలో క్రియాశీలకంగా ఉంటూ రాజకీయ వ్యవహారాలను చక్కదిద్దే పనిలో జిల్లాల పర్యటనల్లో నిమగ్నమయ్యారు.
- ప్రజారాజ్యం పార్టీలో అత్యంత కీలక వ్యక్తిగా చలామణి అయిన, చిరంజీవికి స్వయానా బావ అయిన అల్లు అరవింద్ 2009 ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి, మూడో స్థానానికే పరిమితమైన సంగతి తెలిసిందే.

ఇప్పుడిదే ప్రచారాస్త్రం

అన్నదమ్ములైన చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లు ప్రజారాజ్యం, జనసేనలను స్థాపించి వారి సొంత జిల్లాలోని నరసాపురం లోక్‌సభ పరిధిలోనే పోటీ చేసి ఓడిపోయారు. పాలకొల్లు నుంచి చిరంజీవి, భీమవరం నుంచి పవన్, నరసాపురం లోక్‌సభ నుంచి నాగబాబుల ఓటమిని ప్రజల్లోకి తీసుకెళ్లలనేది టీడీపీ అధిష్టానం తాజా వ్యూహం. తద్వారా జనసేన ఆశిస్తున్న సీట్ల సంఖ్యను భారీగా తగ్గించవచ్చనే అంచనాలో బాబు అండ్ కో ఉందని తెలుస్తోంది. బీజేపీతో ఎలాగైనా పొత్తు కుదుర్చుకుని ఎన్నికలకు వెళ్లాలనేది బాబు తపన. పొత్తు కోసం ప్రణమిల్లిన బాబు బీజేపీ అడిగినన్ని సీట్లను కేటాయించక తప్పని స్థితి. మరోవైపు జనసేన 50 నుంచి 60 అసెంబ్లీ సీట్లను ఆశిస్తున్న నేపథ్యంలో ఆ సంఖ్యను ముప్పావు వంతుకన్నా తక్కువ చేయాలనేది బాబు బృందం ఆలోచన. వీటన్నింటి నేపథ్యంలో జనసేనకు సీట్లను తగ్గించాలంటే కొణిదల సోదరుల ఓటములను 70 ఎంఎం స్కోప్‌లో చూపి రాజకీయంగా, మానసికంగా పైచేయి సాధించాలనే వ్యూహానికి బాబు పదును పెట్టినట్లు తెలిసింది.

ఇక్కడా వెన్నుపోటుకే మొగ్గు

తాము పోటీ చేసి తీరుతామని టీడీపీలోని ఆశావహులు గట్టిగానే చెబుతున్నారు. ఒక్క ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచే 10 నుంచి 12.. పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఏడెనిమిది సీట్లను జనసేన ఆశిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ ఇంతకంటే తక్కువ స్థానాలకు అంగీకరించకూడదనుకుంటోంది. ఈ నేపథ్యంలో ఏళ్ల తరబడి రాజకీయాల్లో ఉన్న తమను పక్కనపెట్టి పొత్తు ధర్మం పేరిట జనసేనకు సీట్లు ఇచ్చేస్తామంటే అంగీకరించేది లేదనే ధిక్కార స్వరం టీడీపీ నేతల నుంచి వినిపిస్తోంది. ప్రధానంగా ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన సీనియర్లు విభిన్న పద్ధతుల్లో తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, జ్యోతుల నెహ్రూ, గొల్లపల్లి సూర్యారావు, అయితాబత్తుల ఆనందరావు, బుద్దా వెంకన్న లాంటివారు ఆయా స్థానాల టిక్కెట్లను ఆశిస్తున్నారు. ఈ పరిస్థితిలో చంద్రబాబు జనసేనకు వెన్నుపోటే ప్రత్యామ్నాయ మార్గంగా ఎంచుకున్నారని తెలియవచ్చింది. ఆనాడు ఈనాడులో 'జెండా పీకేస్తున్నారు' అంటూ 'ప్రజారాజ్యం'పై అచ్చేయించిన రీతిలోనే కొణిదెల బ్రదర్స్ ఓటమిని హైలైట్ చేయడమే బెస్ట్ అనే నిర్ణయానికి తమ అధినేత వచ్చారని, ఆ పనిలో తాము నిమగ్నమయ్యామని సీనియర్ నేత ఒకరు లోగుట్టు విప్పారు.

నమ్మకం నిలుపుకోవడం కత్తిమీద సామే

కొణిదెల బ్రదర్స్‌పై నెగటివ్ ప్రచారం చేయాలనుకోవడం నిజం కాదనడానికి వీల్లేదని ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. జనసేనకు నమ్మకం కలగాలంటే వారు అడిగినన్ని సీట్లు ఇవ్వాల్సి వస్తుందని, కనీసం ముప్పావు వంతుకు పైగా అయినా సర్దుబాటు చేయక తప్పదని అన్నారు. మరోవైపు పొత్తు కోసం పాకులాడుతున్నందున బీజేపీకి కూడా వారు కోరిన మేరకు సీట్లు ఇవ్వాలని, ఇప్పుడు బాస్ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైందని గుంటూరు జిల్లాకు చెందిన ముఖ్య నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు.

తెలంగాణలో తెల్లారిపోయింది..

ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన ఘోర పరాజయం చవి చూసింది. బీజేపీతో పొత్తులో భాగంగా 8 సీట్లలో పోటీ చేసిన జనసేన అభ్యర్థులు అన్నిచోట్లా ఓడిపోవడమే కాదు.. కనీసం డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయారు. కూకట్‌పల్లిలో పోటీ చేసిన ప్రేమ్‌కుమార్‌కు అత్యధికంగా 39,830 ఓట్లు దక్కాయి. తక్కిన ఏడుగురు అభ్యర్థులకు కలిపి 15 వేల ఓట్లకులోపే రావడమంటే.. సగటున ఒక్కో అభ్యర్థికి సగటున రెండు వేల ఓట్లు దక్కాయన్నమాట. ఈ విషయాన్ని కూడా టీడీపీ అధిష్టానం ప్రజల్లోకి తీసుకెళ్లమంటోందని వినికిడి.

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులు మరో సెట్ నామినేషన్లు దాఖలు

నామినేషన్లు వేసిన గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి బుధవారం మరో సెట్ నామినేషన్లను దాఖలు చేశారు. అసెంబ్లీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన సంయుక్త కార్యదర్శి యం.విజయరాజు వద్ద నామినేషన్లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పి.వి.సుబ్బారెడ్డి, ఉప కార్యదర్శి వనితా రాణి, అభ్యర్థులు తరఫున ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు, డిప్యూటీ సీఎం బి. ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జున రెడ్డి, కంభాల జోగులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఓడించే సత్తా చంద్రబాబుకు లేదు : వైవీ సుబ్బారెడ్డి

చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసి వైఎస్సార్‌సీపీని ఓడించే సత్తా లేదని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థి వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. బుధవారం రాజ్యసభ అభ్యర్థిత్వానికి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాబు ఎన్ని హామీలిచ్చినా వాటికి విశ్వసనీయత లేదన్నారు. విలువలు, విశ్వసనీయత అంటే గుర్తుకు వచ్చేది ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని తెలిపారు. చంద్రబాబు తీరు ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ముఖ్యమంత్రిగా దేశంలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు వరుసలో నిలిచారని అన్నారు.

దళితుడిని రాజ్యసభకి పంపిన ఘనత సీఎం జగన్‌కే దక్కింది : గొల్ల బాబూరావు

ఒక దళిత శాసన సభ్యుడిని రాజ్యసభకు పంపుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థి గొల్ల బాబూరావు అన్నారు. టీడీపీ పోటీ చేస్తే ఫలితం ఎలా ఉంటుందో చంద్రబాబుకు తెలుసని, అందుకే తప్పుకున్నారని తెలిపారు. రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవం అవబోతోందని చెప్పారు. ఎస్సీ,, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని, ఆయనది బడుగు, బలహీన, వర్గాలను గుండెల్లో పెట్టుకొనే తత్త్వమని చెప్పారు. ఈ వర్గాలను నమ్మించి, వంచించే తత్త్వం చంద్రబాబుదన్నారు.



రెండోసెట్ నామినేషన్లను రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులు

ఏకగ్రీవంగానే విజయం సాధిస్తాం : మేడా రఘునాథరెడ్డి

రాజ్యసభ ఎన్నికల్లో మూడు స్థానాలనూ వైఎస్సార్‌సీపీ ఏకగ్రీవంగా గెల్చుకుంటుందని మేడా రఘునాథరెడ్డి చెప్పారు. ప్రజలు సీఎం జగన్ వెంటే ఉన్నారని, అందుకే టీడీపీ రాజ్య సభలోఖాళీ అయ్యిందని అన్నారు. విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టుకు రావాల్సిన నిధులపై రాజ్యసభలో ప్రస్తావిస్తామన్నారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న 17 మెడికల్ కాలేజీలకు సహాయ సహకారాలు అందించాలని పార్లమెంట్ వేదికగా ప్రధానిని డిమాండ్ చేస్తానన్నారు. విశాఖ నగరాన్ని భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుతో అనుసంధానించే భోగాపురం, భీమిలి, రుషికొండ, విశాఖ పోర్టును కలిపే 55 కిలోమీటర్ల 6 లేన్ల రహదారికి సహకారం అందించాలని కేంద్రాన్ని కోరనున్నట్లు చెప్పారు. విభజన చట్టంలో పేర్కొన్న విశాఖపట్నం – కర్నూలు హైస్పీడ్ కారిడార్ కడప మీదుగా బెంగుళూరు వరకూ పొడిగించాలని, ఈ ప్రాజెక్టు సాకారం చేయాలని ప్రధాని మోడీకి విన్నవిస్తానన్నారు. కడప – పులివెందుల – ముదిగుబ్బ – సత్యసాయి ప్రశాంతి నిలయం – హిందూపూర్ కొత్త రైల్వే లైన్‌ను దీంట్లో భాగంగా చేపట్టేలా పోరాటం చేస్తానని తెలిపారు.



బుధవారం అబుదాబిలో స్వామి నారాయణ్ ఆలయ ప్రారంభోత్సవంలో జలాభిషేకం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

సువర్ణాధ్యాయం

అబుదాబిలో ఆలయ నిర్మాణంపై మోదీ

- భారతీయుల మది గెలిచిన యూఏఈ
- అధ్యక్షుడు షేక్ జాయేద్‌కు కృతజ్ఞతలు
- ఆలయ ప్రారంభోత్సవంలో ప్రధాని



ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా మహంత్ స్వామి మహరాజ్‌తో మోదీ

అబుదాబి: యూఏఈ రాజధాని అబుదాబీలో రూపుదిద్దుకున్న హిందూ ఆలయాన్ని ప్రపంచ మానవాళి ఉమ్మడి వారసత్వ విలువలకు నూతన ప్రతీకగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. అంతర్జాతీయ స్థాయిలో మత సామరస్యానికి, ఐక్యతకు చిహ్నంగా అది విలసిల్లుతుందని ఆశాభావం వెలిబుచ్చారు. బోచాసన్వాసి అక్షర్ పురుషోత్తం సంస్థ (బాప్స్) ఆధ్వర్యంలో నిర్మితమైన ఈ స్వామి నారాయణ్ ఆలయాన్ని బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సంప్రదాయ పద్ధతిలో లేత గులాబీ రంగు ధోవతి, కుర్తా, స్లీవ్ లెస్ జాకెట్ ధరించి అర్చకులు, పురోహితులతో కలిసి పూజాదికాలు తదితరాల్లో పాల్గొన్నారు. దేవతా మూర్తులకు హారతులిచ్చారు. యూఏఈ మంత్రి షేక్ నహ్యాన్ బిన్ ముబారక్ అల్ నహ్యాన్, స్వామి నారాయణ్ సాంప్రదాయికులతో పాటు పలు మత సంప్రదాయాలకు చెందిన ఆధ్యాత్మిక పెద్దలు ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. అనంతరం వేలాదిగా పాల్గొన్న భక్తులనుద్దేశించి మోదీ మాట్లాడారు. ''ఈ ఆలయ నిర్మాణం ద్వారా మానవ చరిత్రలోనే సువర్ణాధ్యాయానికి యూఏఈ తెర తీసింది. 140 కోట్ల మంది భారతీయుల మది గెలుచుకుంది'' అంటూ కొనియాడారు. భారతీయుల ఆకాంక్షలను సాకారం చేసినందుకు యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌కు కృతజ్ఞతలన్నారు. ఆలయ నిర్మాణానికి ఆయన అందించిన అండదండలు మరవలేనివని ప్రశంసించారు. ''ఈ ఆలయంలో అడుగడుగునా మత వైవిధ్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. యూఏఈ అనగానే గుర్తొచ్చే బుర్జ్ ఖలీఫా, షేక్ జాయేద్ మసీదులకు ఇకపై స్వామి నారాయణ్ ఆలయం కూడా తోడవుతుంది. దీని సందర్శనకు ముమ్ముందు భారీగా భక్తులు తరలి వస్తారు'' అని ఆశాభావం వెలిబుచ్చారు. ఇటీవలే అయోధ్యలో భవ్య రామ మందిరాన్ని ప్రారంభించుకున్నామంటూ గుర్తు చేసుకున్నారు. ఆ వెంటనే అబుదాబీలోనూ ఆలయాన్ని ప్రారంభించే అదృష్టం తనకు దక్కిందన్నారు. ఇది భారత్‌తో పాటు దేశ మత విశ్వాసానికి, సంస్కృతికి కూడా అమృత కాలమేనన్నారు.

సుత్తి, ఉలి చేబట్టిన మోదీ...

అంతకుముందు ఆలయ నిర్మాణంలో పాలుపంచుకున్న వారందరినీ మోదీ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సుత్తి, ఉలి చేబూని అక్కడి రాతిపై వసుధైవ కుటుంబకం అంటూ స్వయంగా చెక్కారు. ఆలయ నిర్మాణ విశేషాలను అడిగి తెలుసుకున్నారు.

సర్కారు 'మద్దతు' లేదనే..!

రాజధాని బాట పట్టిన రైతు ఉద్యమం

సాగు గిట్టుబాటు కావడం లేదంటూ రైతన్న మరోసారి కన్నెర్రజేశాడు. డిమాండ్ల సాధనకు రాజధాని బాట పట్టాడు. దాంతో రెండు రోజులుగా ఢిల్లీ శివార్లలో యుద్ధ వాతావరణం నెలకొంది. అవసరమైతే మరోసారి నెలల తరబడి ఆందోళనలు కొనసాగించేందుకే రైతులు సిద్ధమవుతున్నారు. పంజాబ్, హరియాణాతో పాటు ఉత్తర యూపీకి చెందిన రైతులు భారీ సంఖ్యలో నిరసనల్లో పాల్గొంటున్నారు. అన్ని పంటలకూ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించడంతో పాటు దానికి చట్టబద్ధత కల్పించాలన్నది వారి ప్రధాన డిమాండ్. దాంతోపాటు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలుకు కూడా రైతులు పట్టుబడుతున్నారు. ఇంతకీ ఏమిటీ ఎంఎస్‌పీ? రైతు సంక్షేమానికి స్వామినాథన్ కమిటీ చేసిన సిఫార్సులేమిటి...?



ఎంఎస్‌పీ కీలకం..

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడంలో కనీస మద్దతు ధర (మినిమం సపోర్ట్ ప్రైస్-ఎంఎస్‌పీ)ది కీలక పాత్ర.

- రైతుల నుంచి పంటను సేకరించేందుకు ప్రభుత్వం చెల్లించే కనీస ధరే ఎంఎస్‌పీ.
- ఇది వారికి మార్కెట్ ఒడిదొడుకుల బారినుంచి రక్షణతో పాటు స్థిరత్వాన్ని, ఆదాయ భద్రతను కల్పిస్తుంది.
- దీన్ని కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సీఏసీపీ) నిర్ణయిస్తుంటుంది. ఈ విషయంలో ఉత్పత్తి వ్యయం, మార్కెట్ ధోరణులు, డిమాండ్-సరఫరా తదితరాలను పరిగణనలోకి తీసుకుంటుని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీకి ఎంఎస్‌పీపై సిఫార్సులు చేస్తుంది. వాటి ఆధారంగా సీసీఈఏ తుది నిర్ణయం తీసుకుంటుంది. సీఏసీపీ 1965లో ఏర్పాటైంది.

ఇలా లెక్కిస్తారు...

ఎంఎస్‌పీ లెక్కింపు సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం రైతులకయ్యే ప్రత్యక్ష, పరోక్ష ఉత్పత్తి వ్యయాలు రెండింటినీ పరిగణనలోకి తీసుకుంటారు.

- ఎరువులు, విత్తనాలు, కూలీల వంటివి ప్రత్యక్ష వ్యయం కాగా రైతు సొంత కుటుంబం పడే కష్టం, అద్దెలు తదితరాలు పరోక్ష వ్యయం.
- వీటిని స్థూలంగా ఏ2, ఎఫ్ఎల్, సీ2గా వర్గీకరిస్తారు.
- పంట ఎదుగుదల, ఉత్పత్తి, నిర్వహణ నిమిత్తం చేసే ఎరువులు, విత్తనాలు, కూలీల వ్యయం ఏ2 కిందకు వస్తుంది.
- ఈ అసలు ఖర్చులకు కుటుంబ కష్టం తదితర పరోక్ష ఉత్పత్తి వ్యయాన్ని కలిపితే ఎఫ్ఎల్.
- ఏ2, ఎఫ్ఎల్ రెండింటికీ మూలధన ఆస్తులు, రైతు చెల్లించే అద్దెలను కలిపితే వచ్చేదే సీ2.
- వీటికి తోడు పలు ఇతర అంశాలను కూడా సీఏసీపీ పరిగణలోకి తీసుకుంటుంది. ఉదాహరణకు సాగు వ్యయం ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంటుంది. ప్రతి క్వింటా పంట దిగుబడికి అయ్యే వ్యయమూ అంతే. అలాగే మార్కెట్ ధరలు, వాటి ఒడిదొడుకులు, కూలీల వ్యయం తదితరాలు కూడా ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి. వీటన్నింటితో పాటు సదరు పంట ఎగుమతులు, దిగుమతులు, మొత్తం నిల్వలు, డిమాండ్, తలసరి వినియోగం, ప్రాసెసింగ్ పరిశ్రమ ధోరణులు తదితరాలన్నింటినీ ఎంఎస్‌పీ లెక్కింపు కోసం సీఏసీపీ పరిగణనలోకి తీసుకుంటుంది.

స్వామినాథన్ సిఫార్సులు...

- అన్ని పంటలకూ ఎంఎస్‌పీ హామీ ఇస్తూ చట్టం తేవాలి. ఎంఎస్‌పీ మొత్తం పంట సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50 శాతం ఎక్కువగా ఉండాలి (దీన్ని సీ2+50 పద్ధతిగా పిలుస్తారు).
- రైతు ఆత్మహత్యలను అరికట్టేలా భూమి, నీరు, సేంద్రియ వనరులు, రుణం, బీమా, టెక్నాలజీ, పరిజ్ఞానం, మార్కెట్ల వంటి మౌలిక సదుపాయాలు వారందరికీ అందుబాటులో తేవాలి.
- రాష్ట్రాల జాబితాలో ఉన్న వ్యవసాయాన్ని ఉమ్మడి జాబితాలో చేర్చాలి.
- రైతు, వినియోగదారుల మధ్య ప్రత్యక్ష సంబంధం ద్వారా మెరుగైన ధర కల్పించాలి.
- వ్యవసాయోత్పత్తుల సేకరణ, ప్యాకేజింగ్, బ్రాండింగ్ స్థానిక, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల ప్రమాణాలకు తగ్గట్టు ఉండాలి.

– సాక్షి, నేషనల్ డెస్క్

రెండో రోజూ ఉద్రిక్తత

- పంజాబ్-హరియాణా శంభు బోర్డర్ వద్ద యుద్ధ వాతావరణం
- రైతులు, పోలీసుల మధ్య ఘర్షణ
- డ్రోన్లతో బాష్పవాయువు గోళాలు ప్రయోగించిన పోలీసులు



శంభు సరిహద్దు వద్ద భద్రతా బలగాలతో ఘర్షణకు దిగిన రైతులు

చండీగఢ్: డిమాండ్ల సాధన కోసం రైతు సంఘాలు తలపెట్టిన 'చలో ఢిల్లీ' ఉద్రిక్తతలు వరుసగా రెండో రోజు బుధవారం సైతం కొనసాగాయి. ఢిల్లీకి చేరుకోకుండా రైతులను పోలీసులు ఎక్కడికక్కడ నిలువరించారు. పంజాబ్-హరియాణా శంభు సరిహద్దులో మళ్లీ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మంగళవారం ఇక్కడికి చేరుకున్న వేలాది మంది రైతులు రాత్రంతా ట్రాక్టర్లపైనే ఉండిపోయారు. బుధవారం ఉదయం రక్షణ వలయాన్ని ఛేదించుకొని, ఢిల్లీవైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేసి, తమను అడ్డుకున్న పోలీసులపై నిరసనకారులు ఆగ్రహావేశాలతో రాళ్లు విసిరారు. అప్రమత్తమైన పోలీసులు వారిని చెదరగొట్టడానికి డ్రోన్లతో బాష్ప వాయువు గోళాలు ప్రయోగించారు. ఇలాంటి ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి. శంభు బోర్డర్‌లో రోజంతా యుద్ధ వాతావరణం కనిపించింది. పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. హరియాణా ప్రభుత్వం రాష్ట్రంలో పలు జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఢిల్లీకి చేరుకొని తమ గళం వినిపించడం తథ్యమని, ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రైతులు తేల్చి చెప్పారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్న తమ డిమాండ్‌లో ఎలాంటి మార్పు లేదని, ఈ విషయంలో ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని రైతు సంఘం నేత జగజీత్ సింగ్ దలీవాల్ చెప్పారు. మరోవైపు, ఢిల్లీ సరిహద్దుల్లోనూ బుధవారం ఉద్రిక్తత కొనసాగింది. రైతులను పోలీసులు అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.

డ్రోన్లను కూల్చడానికి పతంగులు

శంభు బోర్డర్ వద్ద పోలీసులు ప్రయోగించిన డ్రోన్లను నేల కూల్చడానికి కొందరు యువ రైతులు వినూత్న ప్రయత్నం చేశారు. పతంగులు ఎగురవేశారు. పతంగుల దారాలతో డ్రోన్లను బంధించి, కూల్చివేయాలన్నదే వారి ఆలోచన. డ్రోన్లతో నిరసనకారులపై పోలీసులు బాష్పవాయువు గోళాలు ప్రయోగించడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శంభు సరిహద్దులో హరియాణా పోలీసులు డ్రోన్లు ప్రయోగించడం పట్ల పంజాబ్ పోలీసులు అభ్యంతరం తెలిపారు. తమ రాష్ట్ర భూభాగంలోకి డ్రోన్లను పంపొద్దని స్పష్టం చేశారు. తమ ఆందోళన కొనసాగిస్తామని, గురువారం పంజాబ్‌లో పలు ప్రాంతాల్లో రైలు పట్టాలపై బైఠాయిస్తామని రైతు సంఘాల నాయకులు చెప్పారు.

నేడు మూడో దశ చర్చలు!

రైతుల డిమాండ్ల విషయంలో రైతు సంఘాలతో నిర్మాణాత్మక చర్చలకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా బుధవారం చెప్పారు. చర్చలకు సానుకూల వాతావరణం కల్పించాలని, నిరసన కార్యక్రమాలు విరమించాలని రైతులకు సూచించారు. అసాంఘిక శక్తుల వలలో చిక్కుకోవద్దని చెప్పారు. కేంద్ర మంత్రులు, రైతు సంఘాల నేతల మధ్య ఇటీవల జరిగిన రెండు దశల చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. చర్చలకు ఇరుపక్షాలు సముఖంగా ఉన్నాయి. మూడో దశ చర్చలు గురువారం మధ్యాహ్నం చండీగఢ్‌లో జరుగనున్నట్లు తెలిసింది.

పాకిస్తాన్ ప్రధానిగా షహబాజ్ షరీఫ్!

ఆరు పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో రాజకీయ అనిశ్చితికి దాదాపు తెరపడింది. నూతన ప్రధాన మంత్రిగా పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) పార్టీ అధినేత, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ తమ్ముడు షహబాజ్ షరీఫ్(72) బాధ్యతలు చేపట్టనున్నారు. తమ పార్టీ అభ్యర్థిగా షహబాజ్ షరీఫ్ పేరును పీఎంఎల్-ఎన్ మంగళవారం రాత్రి హఠాత్తుగా ప్రతిపాదించింది. ప్రధానమంత్రి పదవిని నవాజ్ షరీఫ్ స్వీకరించబోతున్నారని మొదట విస్తృతంగా ప్రచారం జరిగింది. చివరకు అనూహ్యంగా షహబాజ్ షరీఫ్ పేరు తెరపైకి వచ్చింది. పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. దీంతో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. పీఎంఎల్-ఎన్‌తో పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ), ముత్తాహిదా ఖ్వామీ మూవ్‌మెంట్ పాకిస్తాన్(ఎంక్యూఎం-పి), పాకిస్తాన్ ముస్లిం లీగ్-ఖ్వాయిద్(పీఎంఎల్-క్యూ), ఇస్తెహ్‌కామ్-ఇ-పాకిస్తాన్ పార్టీ(ఐపీపీ), బలూచిస్తాన్ అవామీ పార్టీ(బీఏపీ) చేతులు కలిపాయి. షహబాజ్ షరీఫ్‌తో ఆయా పార్టీల అగ్రనేతలు సమావేశమయ్యారు. కలిసికట్టుగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. తమకు మద్దతు ప్రకటించినందుకు పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ నేతలు అసిఫ్ అలీ జర్దారీ, బిలావల్ భుట్టోకు షెహబాజ్ షరీఫ్ కృతజ్ఞతలు తెలియజేశారు.



రాజ్యసభ నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న సోనియా. చిత్రంలో రాహుల్, ప్రియాంక

రాజ్యసభకు సోనియా నామినేషన్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ మొట్టమొదటిసారి లోక్‌సభ ఎన్నికల సమరం నుంచి వైదొలగి పెద్దలసభ బాటపట్టారు. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం సోనియా రాజస్తాన్ నుంచి రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలుచేశారు. బుధవారం జైపూర్‌లో రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, పీసీసీ చీఫ్ గోవింద్‌ల సమక్షంలో సోనియా తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఏప్రిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభ సభ్యత్వ పదవీకాలం పూర్తవుతున్న నేపథ్యంలో ఆ స్థానం నుంచే సోనియా బరిలో నిలిచారు. 77 ఏళ్ల సోనియా రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు విజయంసాధించారు. కాగా, మరోసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయబోనని 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోనియా ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఆమె పెద్దలసభను ఎంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటకల్లోనూ ఆమె పోటీచేస్తే గెలుపు ఖాయమని తెలిసినా హిందీ భాషా రాష్ట్రాల నుంచి గాంధీలు దూరంకాబోరనే సంకేతం ఇచ్చేందుకే ఆమె రాజస్తాన్‌ను ఎంచుకున్నారని వార్తలొచ్చాయి.

10 మందితో మరో జాబితా

10 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ బుధవారం మరో జాబితా విడుదలచేసింది. బిహార్ నుంచి అఖిలేశ్ ప్రసాద్ సింగ్, హిమాచల్ ప్రదేశ్ నుంచి అభిషేక్ మను సింఘ్వీలకు కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులుగా అవకాశం కల్పించింది. మహారాష్ట్ర నుంచి చంద్రకాంత్ హందోర్, కర్ణాటక నుంచి అజయ్ మాకెన్, సయ్యద్ నసీర్ హుస్సేన్, జీసీ చంద్రశేఖర్, మధ్యప్రదేశ్ నుంచి అశోక్ సింగ్, తెలంగాణ నుంచి రేణుకా చౌదరి, ఎం.అనిల్ కుమార్ యాదవ్‌లకు అవకాశమిచ్చింది.

యూపీఎస్సీ సివిల్స్ నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ: అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) 2024 ఏడాదికి నోటిఫికేషన్‌ను బుధవారం విడుదలచేసింది. సివిల్స్‌లో మొత్తంగా 1,056 పోస్టుల భర్తీకోసం నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తుల స్వీకరణనూ యూపీఎస్సీ మొదలుపెట్టింది. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ మార్చి ఐదు. ఆ రోజు సాయంత్రం ఆరింటిలోపు వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. అర్హత గల అభ్యర్థులు అధికార upsconline.nic.in. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రిలిమ్స్ పరీక్ష మే 26వ తేదీన నిర్వహించనున్నారు. మెయిన్స్ పరీక్షలు సెప్టెంబర్ 20వ తేదీ నుంచి ఐదో రోజులపాటు కొనసాగనున్నాయి. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో 150 పోస్టులకూ యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. సివిల్స్ పరీక్ష ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ దశలో జరుగుతుంది. మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూకు పిలుస్తారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ప్రిలిమ్స్ పరీక్ష హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్‌లో జరగనుంది. మెయిన్స్ పరీక్ష హైదరాబాద్, విజయవాడలో జరగనుంది.



బుధవారం త్రివర్ణ శోభితంగా వెలిగిపోతున్న బుర్జ్ ఖలీఫా

సమీకృత, అవినీతిరహిత ప్రభుత్వాలు కావాలి

దుబాయ్‌లో ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ

దుబాయ్: సమీకృత, అవినీతిరహిత ప్రభుత్వాలు ప్రపంచానికి అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. 'కనిష్ట ప్రభుత్వం, గరిష్ట పాలన' తమ మంత్రమన్నారు. బుధవారం దుబాయ్‌లో బుధవారం ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రజల జీవితాల్లో ప్రభుత్వ జోక్యం సాధ్యమైనంత తక్కువగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం లేదనే భావన ప్రజలకు కలగకూడదని, ప్రభుత్వాల ఒత్తిడి వారిపై ఉండకూడదని అన్నారు. భారత్‌లో కొన్నేళ్లుగా ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం పెరుగుతోందని చెప్పారు. ప్రజల మనోభావాలకు ప్రాధాన్యమివ్వడం వల్లే ఇది సాధ్యమైందని వివరించారు. అనంతరం దుబాయ్ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్-మక్తూమ్‌తో మోదీ సమావేశమయ్యారు.



సదస్సులో ప్రసంగిస్తున్న మోదీ

గుజరాత్ నుంచి నడ్డా

12 మంది రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ బుధవారం 12 మంది అభ్యర్థుల జాబితాను బుధవారం ప్రకటించింది. బీజేపీ అధ్యక్షుడితోపాటు ఇద్దరు కేంద్ర మంత్రులు, ఒక్క రోజు ముందు పార్టీలో చేరిన అశోక్ చవాన్ పేరు సైతం ఈ జాబితాలో ఉన్నారు. ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎంపికైన పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాను బీజేపీ ఈసారి గుజరాత్ నుంచి బరిలోకి దింపుతోంది. కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఒడిశా నుంచి, కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్‌కు మధ్యప్రదేశ్ నుంచి చోటు కల్పించింది. అశ్వినీ వైష్ణవ్, మురుగన్‌లు ఈ ఎన్నికల్లో గెలిస్తే రాజ్యసభకు ఎన్నికవడం ఇది రెండోసారి అవుతుంది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్‌ను మహారాష్ట్ర నుంచి రాజ్యసభకు నామినేట్ చేసింది. బీజేపీ విడుదల చేసిన జాబితాలో గుజరాత్ నుంచి గోవింద్‌భాయ్ ధోలాకియా, మయాంక్‌భాయ్ నాయక్, జశ్వంత్‌సింగ్ సలాంసింగ్ పర్మార్ ఉన్నారు. మహారాష్ట్ర నుంచి మేధా కులకర్ణి, డాక్టర్ అజిత్ గోప్‌చాడే, మధ్యప్రదేశ్ నుంచి ఉమేశ్‌నాథ్ మహరాజ్, మాయా నరోలియా, బన్సీలాల్ గుర్జర్ ఉన్నారు.

28 మందిలో నలుగురికే మళ్లీ అవకాశం

రాజ్యసభలో పదవీకాలం ముగుస్తున్న 28 మంది పార్టీ ఎంపీల్లో కేవలం నలుగురికి మాత్రమే బీజేపీ మరోసారి అవకాశం ఇస్తోంది. మిగతావారిలో కొందరు ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగే వీలుంది.

ఇండోనేసియా అధ్యక్ష ఎన్నికల్లో ప్రబొవో విజయం

జకార్తా(ఇండోనేసియా): మానవ హక్కులను కాలరాశాడని అప్రతిష్ట మూటగట్టుకున్న రక్షణ మంత్రి, మాజీ సైన్యాధికారి ప్రబొవో సుబియాంటో ఇండోనేసియా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించారు. ఇంకా అధికారికంగా వెల్లడికాని ఫలితాల గణాంకాల ప్రకారం ప్రబొవో 57-59 శాతం ఓట్లు సాధించారు. ఇప్పటికే 80 శాతానికిపైగా ఓట్ల లెక్కింపు పూర్తయిన నేపథ్యంలో 72 ఏళ్ల ప్రబొవో గెలుపు దాదాపు ఖాయమైనట్లే. దీంతో దేశ రాజధాని జకార్తాలో ఆయన విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ విజయం మొత్తం ఇండోనేసియన్లదని వ్యాఖ్యానించారు. జాతీయవాద పార్టీ అయిన గెరింద్రా నుంచి ఆయన పోటీచేశారు. 17,000 ద్వీపాల దేశమైన ఇండోనేసియాలో బుధవారం అధ్యక్ష, ఉపాధ్యక్ష, నేషనల్, ప్రావిన్షియల్, రీజినల్, రిజన్సీ, సిటీ స్థాయిలో ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. జాతీయ, స్థానిక ఎన్నికలు ఒకేసారి జరగడం ఇండోనేసియా ప్రత్యేకత.

అమెరికాలో భారతీయ కుటుంబం

అనుమానాస్పద మృతి

న్యూయార్క్: కేరళకు చెందిన ఒక కుటుంబం అమెరికాలోని సొంతింట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతులను ఆనంద్ సుజిత్ హెన్రీ, భార్య అలీస్ ప్రియాంక, వారి నాలుగేళ్ల కవల కుమారులుగా గుర్తించారు. కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాన్ మాటెయోలో తల్లిదండ్రుల్లో ఒకరు పిల్లలకు విషమిచ్చి, తర్వాత జీవిత భాగస్వామిని కాల్చిచంపి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. స్థానికుల యోగక్షేమాలను తెల్సుకునే 'వెల్ఫేర్ చెక్'లో భాగంగా అధికారులు ఈ కుటుంబం గురించి ఆరాతీయగా కొద్దిరోజులుగా ఆ ఇంట్లోకి రాకపోకలే లేవని ఇరుగుపొరుగు వారు చెప్పారు. దీంతో కిటికీ గుండా లోనికి ప్రవేశించిన పోలీసులు బాత్‌రూమ్‌లో భార్యాభర్తల, పడకగదిలో చిన్నారుల మృతదేహాలను గుర్తించారు. భార్యాభర్తలకు బేధాభిప్రాయాలు ఉన్నట్లు తెలుస్తోంది. భార్య నుంచి విడాకులు కోరుతూ ఆనంద్ సుజిత్ 2016లో దరఖాస్తుచేశారు. ఘటనాస్థలిలో 9ఎంఎం పిస్టల్, బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కేజ్రీవాల్‌కు ఆరోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం అవకతవకల కేసులో ప్రశ్నించేందుకు తమ ఆఫీస్‌కు రావాలంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆరోసారి సమన్లు జారీచేసింది! ఆయన ఒక్కసారి కూడా విచారణకు రాలేదంటూ ఈడీ ఢిల్లీ కోర్టును ఆశ్రయించడం, ఫిబ్రవరి 17న తమ ఎదుట హాజరవాలని కేజ్రీవాల్‌ను కోర్టు ఆదేశించడం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 19వ తేదీన తమ ఆఫీస్‌కు రావాలని ఈడీ బుధవారం ఆరోసారి సమన్లు పంపింది.

కాంగ్రెస్‌ను వీడిన మాజీ ప్రధాని మనవడు

న్యూఢిల్లీ/లక్నో: కాంగ్రెస్ నుంచి నేతల నిష్క్రమణ పర్వం కొనసాగుతోంది. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మనవడు విభాకర్ శాస్త్రి బుధవారం కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. లక్నోలో యూపీ బీజేపీ చీఫ్ భూపేందర్ సింగ్, ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ సమక్షంలో బీజేపీలో చేరారు.

పూలన్ దేవి ముఠా ఊచకోత కేసు...

చిట్టచివరి దోషికి శిక్ష

కాన్పూర్(ఉత్తరప్రదేశ్): అగ్రకులస్తులు తనపై వారాలపాటు సామూహిక అత్యాచారానికి పాల్పడినందుకు ప్రతీకారంగా 20 మంది అగ్రకులస్తులను బందిపోటు రాణి పూలన్ దేవి కాల్చిచంపిన ఉదంతంలో 43 ఏళ్ల తర్వాత తీర్పు వెలువడింది. నాటి హత్యోదంతంలో నిందితులుగా ఉన్న వారిలో శ్యామ్‌బాబు, విశ్వనాథ్ మినహా మిగతావారెవరూ ఇప్పుడు బతికిలేరు. ఈ కేసులో శ్యామ్‌బాబుకు జీవితఖైదు విధిస్తూ దోపిడీల నిరోధక న్యాయస్థానం న్యాయమూర్తి అమిత్ మాలవీయ బుధవారం తీర్పు చెప్పారు. సరైన సాక్ష్యాధారాలు లభించని కారణంగా మిగిలిన ఒకే ఒక్క నిందితుడు విశ్వనాథ్‌ను నిర్దోషిగా కోర్టు విడిచిపెట్టింది. కోర్టు తీర్పు తర్వాత శ్యామ్‌బాబును కాన్పూర్ దెహాత్ జైలుకు తరలించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో తీర్పు ఇన్నాళ్లకు వెలువడింది. ఈ వివరాలను కాన్పూర్ దెహాత్ జిల్లా ప్రభుత్వ న్యాయవాది రాజు పోర్వాల్ వెల్లడించారు. ఆనాడు అగ్రకులస్తులను వరసబెట్టి కాల్చేసిన ఘటనలో బందిపోటు రాణి పూలన్ దేవి సహా 35 మంది నిందితులుగా ఉన్న విషయం తెల్సిందే.

బందిపోటు రాణి.. జైలు జీవితం.. ఎంపీ

సరిగ్గా 43 సంవత్సరాల క్రితం అంటే 1981 ఫిబ్రవరి 14వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని రాజ్‌పూర్ పోలీస్‌స్టేషన్ కాన్పూర్ దెహాత్ పరిధిలోని బెహ్మాయి గ్రామంలో 20 మందిని పూలన్ దేవి ముఠా కాల్చిచంపింది. హతమైన వారిలో 17 మంది అగ్రవర్ణ ఠాకూర్‌లు ఉన్నారు. బందిపోటు ముఠా చేతిలో పౌరులు మరణించారంటూ దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో నాటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి వీపీ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. అణగారిన వర్గానికి చెందిన తనపై ఇద్దరు అగ్రకులస్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడినందుకు ప్రతీకారంగా ఆ అగ్రకులం వారిని హతమార్చాక రెండేళ్లకు మధ్యప్రదేశ్‌లో పూలన్ దేవి పోలీసులకు లొంగిపోయారు. 1994 వరకు జైలులో గడిపారు. తర్వాత కొద్దికాలానికి రాజకీయాల్లో చేరి పార్లమెంట్ సభ్యురాలు అయ్యారు. 1996, 1999 లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. తమ వర్గీయులను చంపేసిందన్న కక్షతో కొందరు పూలన్‌దేవి హత్యకు కుట్ర పన్నారు. మిర్జాపూర్ లోక్‌సభ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ ఎంపీగా పూలన్ కొనసాగుతున్న కాలంలో లోక్‌సభ నుంచి తిరిగొస్తుండగా ఆమెను హత్యచేశారు. 2001 జూలై 25వ తేదీన పూలన్ దేవిని ఢిల్లీలోని ఆమె నివాసం బయట ముగ్గురు పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో విచక్షణారహితంగా కాల్చి చంపారు. పూలన్ దేవి విషాదగాథను రచయిత మాలాసేన్ 'ఇండియాస్ బందిట్ క్వీన్: ది ట్రూ స్టోరీ ఆఫ్ పూలన్ దేవి' అని గ్రంథస్తం చేయగా దానిని ప్రముఖ దర్శకుడు శేఖర్ కపూర్ సినిమాగా తీశారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 15 : ఫిబ్రవరి : 2024



తేరు సంబరం

బుధవారం ధార్వాడలో వైభవంగా జరిగిన మహాధని మురుగేంద్ర శివయోగి జాతర తేరు ఉత్సవం. పరిసర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు

న్యూస్‌రీల్

అక్షరాయ నమః



సామూహిక అక్షరాభ్యాస వేడుక

మైసూరు: ఇక్కడి విశ్వేశ్వరనగరలో ఉన్న పబ్లిక్ స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాసం, సరస్వతి పూజను నిర్వహించారు. వసంత పంచమి శుభదినం సందర్భంగా బుధవారం జరిగిన ఈ వేడుకలో 150కి పైగా చిన్నారులతో తల్లులు అక్షరాభ్యాసం చేయించారు. అవని శృంగేరి మఠానికి చెందిన వేదబ్రహ్మ నాగరాజశాస్త్రి నేతృత్వంలో సరస్వతి పూజను నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చేతివేళ్లను బియ్యంలో ఓంకారం రాయించారు.

వారందరూ ఖలిస్తానీలు!

మైసూరు: దేశ రాజధాని ఢిల్లీలో రైతు ఆందోళనలో పాల్గొంటున్న వారు ఖరీదైన కార్లలో వచ్చారని, వారంతా నిజమైన రైతులు కాదని, రైతుల పేరిట ఆందోళన చేస్తున్న వారు ఖలిస్తానీలు అని బీజేపీ నేత, విశ్రాంత ఐపీఎస్ భాస్కర్‌రావు ఎద్దేవా చేశారు. బుధవారం నగరంలోని హోటల్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, చెప్పారు. అయినప్పటికీ ఈ ఆందోళనలు చేస్తుండడం సరికాదన్నారు. ఈ ఆందోళన ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై ఏమాత్రం ఉండబోదన్నారు.

ఆస్తి పన్ను కట్టలేదని మాల్ బంద్



మాల్‌కు తాళం వేస్తున్న దృశ్యం

దొడ్డబళ్లాపురం: బెంగళూరులో ప్రముఖ సినీ నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్‌కు చెందిన రాక్‌లైన్ మాల్‌కు రెవిన్యూ అధికారులు తాళం వేశారు. ఆయనకు దాసరహళ్లిలో మాల్ ఉంది. బీబీఎంపీకి కట్టాల్సిన ఆస్తి పన్ను భారీగా బకాయి ఉండడంతో పలుమార్లు నోటీసులు ఇచ్చారు. స్పందించలేదంటూ పాలికె రెవెన్యూ అధికారులు బుధవారం ఉదయం మాల్‌కు తాళం వేసారు.

డ్రైవర్ రహిత మెట్రో బోగీల రాక

బనశంకరి: ఆర్‌వీ రోడ్డు–బొమ్మసంద్ర మార్గంలో సంచరించే డ్రైవర్ రహిత మెట్రో రైలు బోగీలు బుధవారం ఎలక్ట్రానిక్ సిటీ వద్ద ఉన్న హెబ్బగోడి డిపోకు చేరుకున్నట్లు నమ్మ మెట్రో అధికారులు తెలిపారు. 6 బోగీలు చైనాలోని షాంఘై నుంచి ఇవి ఓడలో జనవరి 24న బయలుదేరి ఈ నెల 6వ తేదీన చెన్నైకు చేరాయి. వాటిని రోడ్డు మార్గంలో హెబ్బగోడి డిపో కు తరలించారు. హెబ్బగోడి డిపో నుంచి మూడునెలల పాటు ప్రయోగాత్మకంగా నడుపుతారు. ప్రస్తుతం మెట్రో రైళ్లకు ఒకరు, లేదా ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. కొత్త రైలు బోగీలకు డ్రైవర్ ఉండరు.

హైకోర్టు జరిమానాపై సుప్రీంకు సీఎం

దొడ్డబళ్లాపురం: గతంలో ధర్నా చేసిన కేసును కొట్టివేయాలని సీఎం సిద్దరామయ్య హైకోర్టులో అర్జీ వేయగా, దానిని విచారించి సీఎంకే రూ.10వేలు జరిమానా విధించడం తెలిసిందే. దీనిపై సిద్దరామయ్య సుప్రీం కోర్టును ఆశ్రయించారు. 2022లో ఏప్రిల్ 14న రేస్‌వ్యూ హోటల్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేయగా, ప్రజలకు ఇబ్బంది కలిగించారని స్థానిక పోలీసులు సిద్దు సహా పలువురు నేతలపై కేసులు పెట్టారు. ఈ కేసులో మార్చి 6న ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణకు హాజరు కావాలని కూడా హైకోర్టు ఆదేశించింది. అయితే చట్టబద్ధంగానే ధర్నా చేసామని, రూ.10 వేల జరిమానా తదితరాలను ప్రశ్నిస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

పిల్లలతో నటనపై సర్కారు ఆంక్షలు



దొడ్డబళ్లాపురం: ప్రస్తుతం ఏ సీరియల్, ఏ షో చూసినా బుడతల సందడి లేకుండా ఉండదు. ఇకపై సినిమాలు, టీవీ సీరియళ్లలో పిల్లల చేత నటింపచేయాలంటే స్థానిక జిల్లా కలెక్టర్ అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఒక రోజులో 5 గంటలకు మించి పిల్లలచేత నటింపచేయరాదు. నెలలో 27 రోజులు మాత్రమే నటనకు ఉపయోగించుకోవాలి. పిల్లల విద్యా భవిష్యత్తు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర కార్మికశాఖ తెలిపింది. వీటిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

సౌధలో కెరగోడు ప్రతిధ్వని

- హనుమ ధ్వజాన్ని తొలగించడంపై బీజేపీ భగ్గు
- జాతీయ పతాకాన్ని కించపరిచారని హస్తం ఆగ్రహం



ఇటీవల మండ్య వద్ద కెరగోడులో హనుమాన్ జెండా వివాదం

శివాజీనగర: మండ్య తాలూకా కెరగోడు గ్రామంలో హనుమ జెండా వివాదం విధానసభలో ప్రతిధ్వనించింది. అసెంబ్లీ సమావేశాలు బుధవారం మూడవ రోజుకు చేరగా శాంతిభద్రతలపై విపక్ష బీజేపీ దృష్టి పెట్టింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య దీనిపై వాగ్వివాదం నెలకొంది. ప్రత్యేక చర్చ కింద బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి మాట్లాడేటప్పుడు కెరగోడు హనుమధ్వజం విషయాన్ని ప్రస్తావించారు. ఆ జిల్లాకు చెందిన వ్యవసాయ మంత్రి చెలువరాయస్వామి అభ్యంతరం వ్యక్తం చేస్తూ, జాతీయ జెండాను తొలగించడానిని సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నయనా మోటమ్మ మాట్లాడుతూ మీకు జాతీయ జెండా కావాలా, హనుమ జెండా కావాలని అడిగారు. సభాపతి యూ.టీ.ఖాదర్ స్పందిస్తూ జాతీయ జెండాకు అవమానం చేసినవారిని జైలుకు పంపండి, ప్రభుత్వం మీదే కదా అని నయనకు సూచించారు.

అరుపులు, కేకలు

బీజేపీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ జెండాపై మీరు చూపిస్తున్న ఆసక్తికి అభినందనలు, హుబ్లీలో జాతీయ జెండాకు అవమానం చేసినపుడు కాంగ్రెస్‌కు ఈ ఆసక్తి లేదా? అని హేళన చేశారు. కొంతసేపు అరుపులతో గందరగోళం నెలకొంది. సభాపతి ఇరుపార్టీల సభ్యులను సమాధానపరిచారు. అశోక్ మాట్లాడుతూ గ్రామస్తులే డబ్బులువేసుకుని 108 అడుగుల ఎత్తైన జెండాను నిర్మించారని, అప్పుడే ఎందుకు చర్యలు తీసుకోలేదు, హనుమ జెండాను ఎగురవేశాక అధికారులు తెల్లవారుజామున 3 గంటలకు ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. అయోధ్యలో రామ మందిర ప్రారంభమైన సమయంలో ద్వేషంతో ఇలా చేశారు, హనుమ జెండా తీసేసి జాతీయ పతాకం ఎగురవేసినప్పుడు జాతీయ గీతాన్ని ఆలపించలేదు అని ఆరోపించారు.

శాంతిభద్రతల చర్చపై రచ్చ

రాష్ట్రంలో శాంతిభద్రతల విషయాన్ని వాయిదా తీర్మానం కింద ప్రస్తావించేందుకు అవకాశం లేదనడంపై విధానసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాతావరణం వేడెక్కింది. వాయిదా తీర్మానానికి అనుమతివ్వాలని బీజేపీ ఎమ్మెల్యేలు కోరారు. మాట్లాడిన హోం మంత్రి జీ.పరమేశ్వర్, శాంతిభద్రత గురించి వాయిదా తీర్మానం క్రింద చర్చించేందుకు అవకాశం లేదు అని చెప్పారు. బీజేపీ నేత ఆర్.అశోక్ స్పందిస్తూ రాష్ట్రంలో హత్య, అత్యాచారాలు, మోసాలు వంటివి పెచ్చరిల్లాయి. ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. వాయిదా తీర్మానం కింద చర్చించాలని డిమాండ్ చేశారు. దీనికి హోం మంత్రి మళ్లీ అడ్డు చెప్పారు. శాంతిభద్రతలను వాయిదా తీర్మానం క్రింద చర్చించలేము అని సభాపతి ఖాదర్ ప్రకటించారు. నియమం 69 క్రింద అవకాశమిస్తానని సూచించారు. ఆ తరువాత చర్చ ప్రారంభమైంది.

అసెంబ్లీలో కన్నడ బోర్డుల బిల్లు

బనశంకరి: రాష్ట్రంలో షాపులు, సంస్థలు, పరిశ్రమలు, ఆస్పత్రులు తదితరాలు ముందు ఉంచే బోర్డుల్లో 60 శాతం కన్నడ భాష ఉండాలని ప్రభుత్వం మరోసారి ప్రకటించింది. విధానసభలో బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అన్ని బోర్డుల్లో 60 శాతం కన్నడ వినియోగం వాడాలని అందులో తెలిపారు. ఈ మేరకు కన్నడ భాషా సమగ్రాభివృద్ధి బిల్లు–2024 ను శాసనసభలో హోంమంత్రి పరమేశ్వర్ ప్రవేశపెట్టారు. ఉభయసభల్లో ఈ చట్టాన్ని ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపిస్తారు. గతంలో ఫైల్‌ను పంపగా, అసెంబ్లీలో చట్టం చేసి పంపాలని గవర్నర్ గెహ్లాట్ ఆదేశించారు.



విధానసభలో చర్చ

గాడిదలారా వర్ధిల్లండి

- ప్రేమికుల రోజున మూగజీవాలకు పెళ్లి



గార్దభాలకు పెళ్లి చేస్తున్న వాటాళ్

యశవంతపుర: ప్రేమికుల దినోత్సవం నాడు కన్నడ ఉద్యమకారుడు వాటాళ్ నాగరాజ్ వినూత్నంగా గాడిదలకు పెళ్లి చేశారు. బుధవారం నగరంలోని మైసూరు బ్యాంక్ సర్కిల్‌లో ఒక గాడిదకు చీర, మరో గాడిదకు పంచె కట్టి పండ్లు, తాంబులాలతో శాస్త్రోక్తంగా పెళ్లి తంతు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేమికుల దినోత్సవాన్ని జరుపుకొంటున్నవారిని అభినందిస్తున్నానన్నారు. వెనకడుగు వేయకుండా అందరూ ప్రేమించుకోవాలి, ప్రేమికులను ప్రభుత్వం ప్రోత్సహించాలి, వారికి భద్రత కల్పించాలని నాగరాజ్ అన్నారు. ప్రేమించి పెళ్లి చేసుకునే దంపతులకు సర్కారు రూ.1.50 లక్షలు సాయం చేయాలని కోరారు.

సిటీలో 16, 20న మద్యం బంద్

శివాజీనగర: బెంగళూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలను మూడురోజులు బంద్ చేయడం తెలిసిందే. దీనిని రెండు రోజులకు కుదించారు. సర్కారు ఆదేశంపై మద్యం షాపులవారు హైకోర్టులో కేసు వేశారు. ఈ నెల 16న ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు, 20న ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు మాత్రం మద్యం అమ్మకాలు జరుపరాదని న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఆర్.కృష్ణ కుమార్ ధర్మాసనం ఆదేశాలిచ్చింది. బెంగళూరు, రూరల్‌కు ఇవి వర్తిస్తాయి.

మహిళ మీద పోలీసు జులుం

- స్టేషన్‌కు తీసుకొచ్చి చితకబాదారు
- పశువులు రోడ్డు మీదకు రావడమే కారణం
- మండ్యలో దారుణం



పోలీస్ స్టేషన్ ముందు రైతుసంఘాల ధర్నా



విలపిస్తున్న బాధితురాలు రూపాదేవి

మండ్య: రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏమాత్రం లేవు, ఎక్కడ చూసినా అలజడే అని అసెంబ్లీలో ప్రతిపక్షం బీజేపీ ఆరోపిస్తుంటే, అవి నిజం అనిపించే ఘటనలు జరుగుతున్నాయి. పోలీసులు ఉత్తి పుణ్యానికే మహిళను ఠాణాకు తీసుకొచ్చి చిత్రహింసలు పెట్టారు. ఈ సంఘటన మండ్య నగరంలోని తూర్పు పోలీసు స్టేషన్‌లో జరిగింది. మండ్య రవి నర్సింగ్‌హోం పక్కనే నివాసం ఉండే రూపాదేవి (39)ని పోలీసులు ఇష్టమొచ్చినట్లు కొట్టి గాయపరిచారు. పశువులను పెంచుకునే రూపాదేవీ, ఆమె తల్లి చుట్టుపక్కలవారికి పాలు విక్రయించి జీవిస్తుంటారు. వారి ఆవులు బయట రోడ్లపై తిరుగుతూ ఉండడం కొందరికి ఇబ్బందిగా ఉంది, దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మగ పోలీసులే వచ్చి రూపాదేవీని జీపులో తీసుకెళ్లారు. ఆమెను లాఠీ, బెల్టులతో ఇష్టమొచ్చినట్లు చితకబాదారు. దీంతో రూపాదేవి రెండు కాళ్లు, చేతులకు తీవ్రంగా గాయాలయ్యాయి. శరీరంపై లాఠీ దెబ్బలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రైతు నేతల ధర్నా

ఈ విషయం తెలిసి రైతు పోరాట నాయకులు సునందా జయరాం, పూర్ణిమా, కర్ణాటక జనశక్తి సిద్ధరాజు, మంగళ లంకేశ్, కమల తదితరులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఆమెను బయటకు తీసుకొచ్చి నీరు తాగించారు. మహిళ మీద పోలీసులు గూండాల మాదిరిగా దాడి చేయడం దుర్మార్గమని వారు మండిపడ్డారు. ప్రస్తుతం మిమ్స్ ఆస్పత్రిలో రూపాదేవి చికిత్స పొందుతున్నారు.

ఎస్ఐ సస్పెండ్

మహిళపై దాడి చేసిన ఎస్ఐ అయ్యన్‌గౌడ, సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిపర సంఘాల కార్యకర్తలు నగరంలో ఆందోళన చేశారు. అయ్యన్‌గౌడను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ యతీశ్ తెలిపారు.

రెండు కార్లు ఢీ, ఒకరు మృతి



మండ్య: రెండు కార్లు ఢీ కొట్టుకున్న ప్రమాదంలో ఒకరు మరణించగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండ్య జిల్లా శ్రీరంగపట్టణ తాలూకా శ్రీనివాస అగ్రహార గ్రామం వద్ద జరిగింది. బుధవారం మైసూరు–బెంగళూరు జాతీయ రహదారిపై రెండు కార్లు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. దీంతో కార్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. మైసూరు ఇట్టిగోడు నివాసి అక్షయ్ (26) మరణించాడు. సుధీర్‌తో పాటు మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స కోసం మైసూరు ఆస్పత్రికి తరలించారు. శ్రీరంగపట్టణ పోలీసులు చేరుకుని కార్లను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను సరిదిద్దారు.

కన్నతల్లి కాఠిన్యం

- చిన్నారిని చంపి, తాను ఆత్మహత్య



చిన్నారి కూతురు, శివలీల (ఫైల్)

సాక్షి, బళ్లారి: జీవితంలో ఏం కష్టమొచ్చిందో ఆ కర్కశ తల్లికి అభం, శుభం తెలియని రెండేళ్ల చిన్నారిని ఉరి వేసి చంపి తాను కూడా ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం కలబురిగి జిల్లా చించోళి తాలూకా మరపల్లిలో కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన శివలీలా (24) అనే మహిళ తన రెండేళ్ల కుమార్తెకు ఉరి వేసి ప్రాణాలు తీసింది. ఆపై తాను ఆత్మహత్య చేసుకుంది. భర్త, అత్తల వేధింపులే ఈ ఘోరానికి కారణమని పోలీసులు తెలిపారు. భర్త ఆనంద్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఆ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం

బనశంకరి: రాష్ట్ర ప్రభుత్వం 2006 ఏప్రిల్ 1 కి ముందు ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరినవారికి పాత పెన్షన్ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు బుధవారం గెజిట్‌ను విడుదల చేసింది. దీనివల్ల 11 వేల మందికి పైగా లబ్ధి కలుగుతుందని అంచనా. కొత్త పెన్షన్ వల్ల నష్టపోతామని ఉద్యోగ సంఘాలు తరచూ ప్రభుత్వానికి డిమాండ్ చేశాయి. దీంతో పాత పథకాన్ని తీసుకొచ్చింది. కొత్త పెన్షన్ పథకం కావాలా, లేక పాత పద్ధతా అనేది ప్రతి ఉద్యోగి ఈ ఏడాది జూన్ 30 నాటికి ప్రభుత్వానికి తెలియజేయాలి.

కిల్లర్ ప్రేమికునిపై చార్జిషీటు

- ఉడుపిలో తల్లీ పిల్లల హత్య కేసు..
- 2,250 పేజీలు, 300 మంది సాక్షుల వాంగ్మూలాలు





అయ్‌నాజ్, నిందితుడు ప్రవీణ్ (ఫైల్)

యశవంతపుర: ఉడుపి నగరంలో సంచలనం సృష్టించిన ఒకే కుటుంబంలో తల్లీ పిల్లల దారుణ హత్యాకాండలో పోలీసులు కోర్టుకు చార్జిషీట్‌ను సమర్పించారు. 2023 నవంబర్ 12న సంతెకట్ట నేజారు సమీపంలోని తృప్తి లేఔట్‌లో నివాసం ఉంటున్న నూరు మహమ్మద్ భార్య హసీనా (46), ఆమె కూతురు అఫ్నాన్ (23), అయ్‌నాజ్ (21), కొడుకు అసీం (12)ని నిందితుడు ప్రవీణ్ అరుణ్ చౌగలే (39) ఇంట్లోకి దూరి కత్తితో నరికి చంపాడు. మూడు రోజుల తరువాత నిందితున్ని బెళగావిలో అరెస్టు చేశారు. హత్యలకు కారణాలను పోలీసులు చార్జిషీటులో పూసగుచ్చినట్లు వివరించారు. అయ్‌నాజ్, చౌగలే ఎయిర్ ఇండియాలో విమానంలో సేవకులుగా పనిచేసేవారు. ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడి ప్రేమ, పెళ్లి విషయంలో విభేదాలు వచ్చాయి. దాంతో అయ్‌నాజ్ అతనితో మాటలు బంద్‌చేసింది. ఈ కసితో ఘాతుకానికి పాల్పడ్డాడు.

విస్తృతమైన అభియోగపత్రం

ఇరు కుటుంబ సభ్యులు, స్థానికులు, సహ ఉద్యోగులు ఇలా 300 మంది నుంచి అనేక వివరాలను సేకరించి 2,250 పేజీల చార్జిషీటును రూపొందించారు. వీటితో పాటు సీసీ కేమెరా చిత్రాలు, ఫోన్ కాల్స్, ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలను జత చేశారు. ఈ కేసును చూస్తున్న పోలీస్ అధికారి మంజునాథగౌడ చార్జిషీటు, నిందితుడు వాడిన చాకు, రక్తపు బట్టలు తదితరాలను కోర్టుకు సమర్పించారు. ఉడుపిలో ఇంత విస్తృతంగా చార్జిషీటు వేసిన కేసు ఇదేనని పోలీసులు తెలిపారు. నిందితుడు ప్రవీణ్ చౌగలే బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైల్లో ఉన్నాడు. విచారణకు అతనిని గట్టి భద్రత మధ్య ఉడుపికి తీసుకొచ్చే అవకాశముంది. ప్రేమ గొడవ గురించి ప్రేమికుల రోజే చార్జిషీటు దాఖలు చేయడం విశేషం.

వాట్సాప్‌లో డెత్‌నోట్..4 రోజుల తరువాత క్షేమం

మైసూరు: కంపెనీ అధికారికి వాట్సాప్ ద్వారా డెత్‌నోట్ పంపించి అదృశ్యమైన మెకానికల్ ఇంజనీర్ ఒకరు నాలుగు రోజుల తర్వాత ప్రత్యక్షమయ్యాడు. ఈ ఘటన మైసూరు మేదర బ్లాక్‌లో జరిగింది. సయ్యద్ మహమ్మద్ అనే వ్యక్తి కుమారుడు సయ్యద్ షరన్ (27) బెంగళూరులోని ఒక ప్రైవేటు కంపెనీలో డిజైన్ ఇంజనీర్‌గా పని చేసేవాడు. ఈ నెల 10న మైసూరుకు వచ్చాడు. ఫిబ్రవరి 11న మటన్ తీసుకొస్తానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. అప్పటి నుంచి కనిపించలేదు. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎంత వెతికినా కనిపించలేదు. అతడు తాను పని చేసే కంపెనీ చీఫ్‌కు వాట్సాప్ ద్వారా సూసైడ్‌నోట్ పంపినట్లు తెలిసింది. 'రేపటి నుంచి ఆఫీసుకు రాలేను. ఆత్మహత్య చేసుకుంటున్నాను. ఎవరికి చెప్పొద్దు' అని ఉంది. ఈ క్రమంలో బుధవారం బెళగావిలో సయ్యద్ క్షేమంగా కనిపించగా, పోలీసులు మైసూరుకు తీసుకొచ్చారు. చదువుకు తగిన ఉద్యోగం లభించలేదనే ఆవేదనతో ఇలా చేసినట్లు చెప్పాడు. నాలుగు రోజులు అందరికీ టెన్షన్ మిగిలింది.

ఎమ్మెల్యే వర్సెస్ మాజీ కార్పొరేటర్



ఎమ్మెల్యే గోపాలయ్య



మాజీ కార్పొరేటర్ పద్మరాజ్

- ఇల్లు దోచుకుని, హత్య చేయిస్తానని బెదిరించాడు: ఎమ్మెల్యే
- నాకు రావాల్సిన డబ్బుల్ని అడిగా
- కేసు నమోదు, అరెస్టు, విడుదల

శివాజీనగర: నాకు హత్యా బెదిరింపులు వచ్చాయని మాజీ మంత్రి, బెంగళూరు నగర బీజేపీ ఎమ్మెల్యే గోపాలయ్య అసెంబ్లీలో ప్రకటించడం తీవ్ర కలకలం రేపింది. ఆయనకు భద్రత కల్పించాలని, బెదిరింపులు చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని బీజేపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. బుధవారం విధానసభ జీరో అవర్‌లో గోపాలయ్య ఈ విషయాన్ని ప్రస్తావించారు. సోమవారం రాత్రి 11 గంటలకు మాజీ కార్పొరేటర్ పద్మరాజ్ నాకు ఫోన్ చేసి డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. నీకు డబ్బు ఇచ్చేందుకు నేనేమైనా నీకు చిన్నాయనా, పెద్దనాయనా అని అడిగాను. పద్మరాజ్ నా గురించి, కుటుంబం గురించి అసభ్యకరంగా మాట్లాడారు. యువకులను పంపి ఇంటిని దోపిడీ చేయిస్తానని, హత్య చేయిస్తానని బెదిరించాడు. ఇతనికి బసవేశ్వరనగరలో క్లబ్ ఉంది. మద్యం తాగి మత్తు తలకెక్కి ఈ విధంగా హత్యా బెదిరింపులకు పాల్పడ్డాడు. నాకు మాత్రమే కాదు. సీనియర్ ఎమ్మెల్యే అయిన సురేశ్‌కుమార్‌కు కూడా అనేకసార్లు ఈ విధంగా దుర్భాషలతో మాట్లాడాడు. ఈ హత్యా బెదిరింపుపై సోమవారం రాత్రి తాను సంబంధించిన పోలీస్ డీసీపీ, ఏసీపీలతో మాట్లాడాను. వారు పద్మరాజ్ ఇంటికి వెళ్లి బయట వారు కుక్కలా కాపలా కాస్తున్నారు. అతను బయటికి రాలేదు. ఇంట్లో ఉన్నా కూడా ఏమి చేసుకుంటారో చేసుకోని అని చెప్పాడు. ఇలాగైతే ఎలా? అని మండిపడ్డారు. పద్మరాజ్‌ను రాష్ట్రం నుంచి పారద్రోలాలి, సంఘ విద్రోహ శక్తులను ప్రభుత్వం అంతం చేయాలని డిమాండ్ చేశారు. తనపై ఎప్పుడైనా దాడి జరగవచ్చని, భద్రత కల్పించాలని కోరారు. దీంతో అనేకమంది బీజేపీ సభ్యులు గోపాలయ్యకు మద్దతుగా గళమెత్తారు. ఎమ్మెల్యేలకు హత్యా బెదిరింపు చేసిన వ్యక్తి అరెస్ట్ ఇంతవరకు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అతడు ఇంట్లో కూర్చొని పోలీసులకు ఫోన్లలో ఆదేశాలిస్తాడని ఆరోపించారు. బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ మాట్లాడుతూ హత్యా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేయకపోవడం ఏమిటని అన్నారు. సభాపతి ఖాదర్, హోం మంత్రి పరమేశ్వర్ కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

పద్మరాజ్‌పై ఎఫ్ఐఆర్

పద్మరాజ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పాత గొడవల నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి గోపాలయ్య ఇంటి వద్దకు వచ్చి పద్మరాజ్ గొడవ చేసి బెదిరింపుకు పాల్పడ్డారని కామాక్షిపాళ్య పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. బుధవారం ఉదయం అరెస్టు చేశారు.

ఇచ్చిన డబ్బుల్ని అడిగానంతే

బనశంకరి: పోలీసులు పద్మరాజ్‌ను అరెస్టు చేసి 39వ ఏసీఎంఎం కోర్టులో హాజరుపరచగా కోర్టు అతనికి బెయిల్ మంజూరు చేసింది. విడుదలైన తరువాత విలేకరులతో పద్మరాజ్ మాట్లాడుతూ మరిన్ని ఆరోపణలు చేయడం గమనార్హం. ఎమ్మెల్యేకు బెదిరింపు ఆరోపణలు అబద్ధమని, దేవునిపై ప్రమాణం చేస్తానని అన్నాడు. ఒక కాంట్రాక్టు కోసం ఎమ్మెల్యేకు రూ.15 లక్షలు ఇచ్చానని, కానీ కాంట్రాక్టు ఇవ్వకపోవడంతో ఫోన్ చేశానని, గోపాలయ్య కోపంగా మాట్లాడారని, నేను అలాగే మాట్లాడానని తెలిపాడు. అలాగే బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ 2010లో మేయర్ పదవి ఇప్పిస్తానని రూ.కోటి డబ్బు తీసుకున్నారని పద్మరాజ్ ఆరోపించాడు. అప్పుడు మైసూరు నాగేంద్ర మధ్యవర్తిగా ఉన్నాడని అన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలోకి చేరిన తరవాత డబ్బు వెనక్కి ఇవ్వాలని అశోక్‌ను అడిగానని చెప్పాడు.



యల్లమ్మ వస్తామమ్మా

బెళగావి జిల్లా సవదత్తిలో ప్రసిద్ధ రేణుకా యల్లమ్మ జాతర ఆరంభమైంది. బుధవారం ఎద్దులబండ్లలో వెళ్తున్న గ్రామీణులు

క్లుప్తంగా

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి కల్యాణం నిర్వహించిన దృశ్యం

రోణ్ల: మండల పరిధిలోని చారిత్రాత్మక ప్రదేశమైన రత్నగిరి గ్రామంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. కువజామున స్వామివారి మూల ప్రతిమకు కుంకుమార్చన, అభిషేకం, అంకురార్పణ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. తర్వాత శ్రీవల్లీదేవసేన సమేతంగా సుబ్రహ్మణ్యస్వామికి వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. ముందుగా ఆలయ ఆవరణలో గణపతిపూజ, కళసస్థాపన చేశారు. తర్వాత వేదపండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా శ్రీవల్లీదేవసేన సమేతంగా సుబ్రహ్మణ్యస్వామికి కల్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని వీక్షించి తరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వైభవంగా బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోలేరా ?



మాట్లాడుతున్న సిద్ధనగౌడ

రాయచూరు రూరల్: దేవదుర్గ తాలూకాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు సిద్ధనగౌడ ఆరోపించారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ కానిస్టేబుల్ హన్మంతరాయపై ఎమ్మెల్యే కరెమ్మ కుటుంబ సభ్యులు దాడి చేశారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాలూకాలో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక రవాణాను అడ్డుకోవడంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

కోలారు: జాతీయ న్యాయ సేవల ప్రాధికార, రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కోర్టుల్లో మార్చి 9న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా సెషన్స్ జడ్జి జీఏ మంజునాథ్ తెలిపారు. బుధవారం జిల్లా సెషన్స్ జడ్జి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోజు న్యాయాలయంలో నిర్వహించే లోక్ అదాలత్‌లో బకాయి ఉన్న కేసులను రాజీ సంధానం ద్వారా, సివిల్, మోటారు వాహన ప్రమాద, విద్యుత్, భూ స్వాధీనం, బ్యాంకు చెక్ బౌన్స్ తదితర కేసులను పరిష్కరించుకోవాలన్నారు. గత డిసెంబర్ 9న నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 13,522 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. సివిల్ జడ్జి పరశురామ, సునీల్ హొసమనిలున్నారు.

అక్రమ బియ్యం, గోధుమల పట్టివేత



బియ్యం, గోధుమల నిల్వను స్వాధీనపరచుకున్న అధికారులు

బళ్లారిఅర్బన్: తాలూకా సరిహద్దుల్లోని కుంటన హాళ్ గ్రామంలోని గోదాముపై బుధవారం ఆహార పౌరసరఫరాల శాఖ అధికారులు దాడి చేసి అక్రమంగా నిల్వ చేసిన చౌకడిపోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ప్రభుత్వం అన్నభాగ్య పథకం కింద పేదలకు అందిస్తున్న బియ్యాన్ని ఓ వ్యాపారి అక్రమంగా సేకరించి ఆ గ్రామంలో గోధుమలు నిల్వ చేసే గోదాములో నిల్వ ఉంచి లారీలోకి లోడ్ చేస్తున్న విషయం తెలిసిన అధికారులు గ్రామానికి వెళ్లి దాడి చేశారు. సుమారు రూ.2,93,320 విలువ గల రేషన్ బియ్యం, రూ.41,850 విలువ గల గోధుమలను సీజ్ చేసినట్లు అధికారి తెలిపారు. సుమారు 40 కేజీల బరువుగల 252 ప్యాకెట్ల బియ్యం కలిపి మొత్తం 10,080 కేజీల బియ్యం, అలాగే 50 కేజీల బరువుగల సంచుల్లోని 15 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం చేసుకొన్నారు. పీడీహళ్లి(హగరి) పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి బియ్యాన్ని ఏపీఎంసీకి తరలించినట్లు అధికారి తెలిపారు.

ఇద్దరి అరెస్ట్

హుబ్లీ: నగరంలోని నవనగర ఓ ఇంట్లో వేశ్యావాటిక నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి ఓ మహిళను కాపాడారు. నిందితులు ఇంట్లో మహిళలను తెచ్చి పెట్టుకొని వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు ఈ దాడి చేశారు. ఘటనపై ఏపీఎంసీ నగర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కలబుర్గి కందిపప్పుకు భలే గిరాకీ

- కళ్యాణ కర్ణాటకలో వేధిస్తున్న దాల్ మిల్లుల కొరత
- ప్రధాన మార్కెట్‌గా రాయచూరు ఏపీఎంసీ యార్డు



రాయచూరులోని రాజేంద్ర గంజ్ ఏపీఎంసీ మార్కెట్ యార్డు ప్రవేశ ద్వారం



నాణ్యమైన కందిపప్పు

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలోని కలబుర్గి జిల్లా కందిపప్పు మంచి రుచికి పేరుగాంచింది. ఈ రకం కంది బ్యాళ్లు బీదర్, కలబుర్గి జిల్లాల్లో ఎక్కువగా పండిస్తున్నారు. అయితే జిల్లాల్లో మార్కెటింగ్ సౌకర్యం, దాల్ మిల్లులు లేకపోవడంతో ప్రత్యేక గుర్తింపు లేకుండా పోయింది. కళ్యాణ కర్ణాటకలో బీదర్, కలబుర్గి జిల్లాలకు సమీపంలో ఉన్న రాయచూరు జిల్లాలో వ్యాపారులు, దాల్ మిల్లులుండడంతో కందిపప్పుకు ప్రధాన మార్కెట్‌గా ఎదిగింది. కలబుర్గి జిల్లా కంది పప్పుకు పేటెంట్ హక్కులు రావడంతో అధిక మొత్తంలో పంటను పండిస్తున్నారు. బ్రాండ్ వ్యాల్యూని సద్వినియోగం చేసుకొని కందులను పప్పులుగా మార్చుకొని విక్రయించేలా రైతాంగం ఎదగాలని జిల్లాధికార యంత్రాంగం సూచిస్తోంది. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాధికార యంత్రాంగం రూపొందించిన అడ్వాంటేజ్ కలబుర్గి డివిజన్ సమావేశంలో కంది పప్పును చేర్చేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు.

వర్షాధార పంటగా ఖరారు

జిల్లాలో లక్ష టన్నుల మేర ఉత్పత్తి అవుతున్న కంది పంటను వర్షాధారిత పంటగా నిర్ణయించారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో సాధారణంగా 1.50 లక్షల హెక్టార్లలో పంటను పండిస్తారు. ఈ ఏడాది కరువు అధికంగా నెలకొంది. కలబుర్గి, సేడం, చిత్తాపుర, గురుమఠకల్ ప్రాంతాల్లో కంది పంటను అధికంగా పండిస్తున్నారు. నీటి వనరులు ఉండే భూముల్లో ఎకరాకు 12–15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. తగిన సమయంలో వానలు కురిస్తే ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు ఉత్పత్తి అవుతుంది. కలబుర్గి, సేడం, చిత్తాపుర, గురుమఠకల్‌లో పండే కంది పంటకు మంచి బేరం ఉంది. ఈ కంది పప్పు బ్రాండ్ పేరుతో మధ్య దళారులు లబ్ధి పొందుతున్నారు.

ధరల పతనంపై రైతుల్లో భయం

కాగా కందిపప్పు ధరలు తగ్గుముఖం పడతాయనే భయం రైతుల్లో నెలకొంది. ప్రతి క్వింటాల్ రూ.5,800 కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఉత్తర కర్ణాటకలోని కలబుర్గి, రాయచూరు, బీదర్, కొప్పళ, బాగల్‌కోట, విజయపుర జిల్లాల్లో 11.99 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు కంది పంటను పండిస్తున్నారు. ప్రభుత్వం 1,82,875 మెట్రిక్ టన్నుల కందులను కొనుగోలు చేయాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏపీఎంసీ మార్కెట్‌లో ప్రతి క్వింటాల్‌కు రూ.4,105–5,472 ధర పలుకుతోంది. రైతులు కంది పంట రాశులు చేస్తున్న సమయానికి దాని ధర తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. కంది పంట పండిస్తున్న రైతులు కలబుర్గి, సేడం, చిత్తాపుర, గురుమఠకల్‌లో దాల్ మిల్లుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అనుక్షణం నీకోసమే సాయీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: 'అనుక్షణం నీకోసమే సాయీ' అంటూ ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బుధవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో ఈశ్వరమ్మ పాఠశాల పదో తరగతి విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చక్కటి భక్తిగీతాలతో సంగీత కచేరీతో పాటు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సత్యసాయిపై తమ భక్తి భావనను చాటుతూ గ్రీటింగ్స్‌ను మహాసమాధి చెంత ఉంచి ఆశీర్వాదం కోరారు. బోర్డు పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు అభినందించారు.



నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

బెంగళూరు రూరల్ వాసులకు అరుదైన అవకాశం

- అంతర్జాతీయ సమ్మేళనానికి ఎంపిక



మహాత్ముడు, బుద్ధుడి చిత్రపటాలతో రణసింగ్ ఫార్మా

విజయపుర: నేపాల్ రాజధాని ఖాట్మాండులో ఈనెల 15నుంచి 19వరకు జరిగే అంతర్జాతీయ సమ్మేళనానికి బెంగళూరు గ్రామీణ జిల్లా వాసులు ఎంపికయ్యారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ఏకతా పరిషత్, వరల్డ్ సోషల్ ఫోరమ్ నేపాల్ సంస్థల ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం జరగనుంది. గాంధీ నుంచి బుద్ధుడి వరకు విశ్వశాంతి, సౌభ్రాతృత్వం పేరిట జరిగే ఈ సమ్మేళనంలో ముగ్గురు బెంగళూరు గ్రామీణ వాసులు పాల్గొనడం సంతోషంగా ఉందని జాతీయ ఏకతా పరిషత్ జాతీయ అధ్యక్షుడు రణసింగ్ ఫార్మ తెలిపారు. బెంగళూరు గ్రామీణ జిల్లా సర్వోదయ మండలి అధ్యక్షుడు డాక్టర్ వి.ప్రశాంత్, జాతీయ యువ యోజన రాష్ట్ర సీనియర్ స్వయం సేవకుడు దేవనహళ్లికి చెందిన ఎం ఆర్ గిరీశ్, సావనకనహళ్లి గ్రామానికి చెందిన సంతోష్ కుమార్‌లు ఈ సమ్మేళనానికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 40 వేల మంది, భారతదేశం నుంచి 300 మంది ఈ సమ్మేళనంలో పాల్గొంటున్నారని వెల్లడించారు.

క్రీడా పోటీల్లో పాల్గొనండి

పావగడ: రాజ్యాంగ జాగృతి జాతా సందర్భంగా నిర్వహించే క్రీడా పోటీల్లో ప్రభుత్వ అధికారులు, విలేకరులు పాల్గొనాలని స్థానిక తహసీల్దార్ ఎస్.ఎం.మూర్తి సూచించారు. స్థానిక తాలూకా కార్యాలయం మీటింగ్ హాల్‌లో బుధవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 23 వరకు తాలూకాలోని 35 గ్రామ పంచాయతీల కేంద్రాలలో నిర్వహించే అంబేడ్కర్ రాజ్యాంగ జాగృతి జాతా కార్యక్రమాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసే క్రీడా పోటీల్లో పాల్గొనేవారు పాలనాధికారికి పేర్లతో కూడిన జాబితా అందించాలన్నారు.

ఎన్.నాగరాజుకు పురస్కారం



ఎన్.నాగరాజుకు గోల్డెన్‌అచీవర్స్ పురస్కారం అందజేస్తున్న మంత్రి ఎంబి.పాటిల్

బనశంకరి: సమాజంలో వివిధ రంగాల్లో సేవలందించిన పలువురికి సువర్ణన్యూస్, కన్నడప్రభ దినపత్రిక గోల్డెన్‌అచీవర్స్ పురస్కారం ప్రదానం చేసి గౌరవించింది. జయనగర నియోజకవర్గం బైరసంద్ర వార్డు మాజీ కార్పొరేటర్, బీబీఎంపీ మాజీ పాలనా విభాగం నేత ఎన్.నాగరాజు సమాజానికి అందించిన సేవలను గుర్తించి గోల్డెన్‌అచీవర్స్ పురస్కారానికి ఎంపి చేశారు. మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మంత్రి ఎం.బి.పాటిల్ చేతుల మీదుగా ఎన్.నాగరాజు పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో సువర్ణన్యూస్ అజిత్ హనుమక్కనవర్, రవిహెగ్డే తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందనే నా గెలుపునకు నాంది



ఎమ్మెల్సీ నారాయణస్వామిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోలారు: ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా గత రెండు పర్యాయాలు తన గెలుపునకు కారణం ఉపాధ్యాయుల సమస్యలపై తాను తక్షణం స్పందించడమేనని ఎమ్మెల్సీ వైఏ నారాయణస్వామి అన్నారు. బుధవారం ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల ప్రకటనకు ముందుగా వివిధ ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు డిసెంబర్ లోపు 7వ వేతన సంఘం, ఓపీఎస్ అమలు చేస్తామని ప్రకటించిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత సిద్దరామయ్య ప్రభుత్వం ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఎన్‌పీఎస్ కింద ఇప్పటికే రిటైరైన కొంత మంది ఉపాధ్యాయుల జీవితం నరకప్రాయమైందన్నారు. కనీసం రూ.2–3 వేల పెన్షన్ కూడా రావడం లేదన్నారు. ఇలాంటి రిటైర్డ్ ఉద్యోగులను ప్రభుత్వం ముందుకు వచ్చి ఆదుకోవాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలన్నారు. సహ్యాద్రి కళాశాల పాలనాధికారి ఉదయ కుమార్, ఇంటర్ ఉపన్యాసకుల సంఘం అధ్యక్షుడు నటరాజ్ తదితరులు ఉన్నారు.

గుండెపోటు మరణాలే అధికం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: దేశంలో 35 శాతం గుండెపోటుతోనే మరణాలు సంభవిస్తున్నాయని, వీటిలో 40 ఏళ్ల లోపు వయస్సు వారే ఎక్కువగా గుండెపోటుకు గురవుతుండడం ఆందోళనకరమని బెంగళూరు జయదేవ హృద్రోగ సంస్థ మాజీ డైరెక్టర్ డాక్టర్ సీఎన్ మంజునాథ్ తెలిపారు. బుధవారం నగర సమీపంలోని దేవరాజ్ అరస్ ఉన్నత విద్యా సంస్థ రజత మహోత్సవ సభాంగణంలో నేషనల్ సైంటిఫిక్ కాన్‌క్లేవ్ ఆఫ్ సైంటిఫిక్ రీసెర్చ్ చర్చాగోష్ఠిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో 65 శాతం మరణాలకు జీవనశైలే కారణం అవుతోందన్నారు. హృద్రోగం, మధుమేహం, క్యాన్సర్ వల్ల అధిక మరణాలు నమోదవుతున్నాయన్నారు. దేశంలో సుమారు 8 వేల ఉన్నత విద్యా సంస్థలుండగా కొన్ని సంస్థలు మాత్రమే మూల పరిశోధనకు ప్రాధాన్యతనిస్తూ నిధులు, సమయం వెచ్చిస్తున్నాయన్నారు. వాటిలో దేవరాజ్ అరస్ అకాడమి కూడా ఒకటని శ్లాఘించారు. కోవిడ్ దేశానికి పెద్ద గుణపాఠం నేర్పిందన్నారు. కోవిడ్ టీకాను కేవలం ఏడాదిన్నర కాలంలో అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. పదేళ్ల తర్వాత క్యాన్సర్ వస్తుందని, ఐదేళ్ల తరువాత హృద్రోగ సమస్యలు వస్తాయని ముందుగానే తెలుసుకునేలా పరిశోధనలు జరగాలన్నారు. కార్యక్రమంలో అరసు శిక్షణా ట్రస్టు అధ్యక్షుడు, అకాడమి చాన్సలర్ జీహెచ్ నాగరాజ్, ఉపాధ్యక్షుడు జే రాజేంద్ర, కార్యదర్శి కేజీ హనుమంతరాజు, ట్రస్టీ రాజేష్ జగ్దాళె పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

కాంగ్రెస్ నాయకుల డిష్యుం..డిష్యుం

- కార్యాలయంలో ఘర్షణ పడి పరస్పరం కొట్టుకున్న కార్యకర్తలు



కాంగ్రెస్ కార్యకర్తలను అదుపు చేస్తున్న పోలీసులు

కోలారు: కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం రెండు గ్రూపుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుని పరస్పరం కొట్టుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. దీంతో జిల్లా కాంగ్రెస్‌లోని విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. రెండు గుంపుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుని పరస్పరం చేయి చేసుకున్నారు. కేపీసీసీ ఉపాధ్యక్షుడు పీఆర్ రమేష్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ సమక్షంలో బూత్ స్థాయి సమావేశాన్ని నగరంలోని కాంగ్రెస్ భవనంలో ఉదయం 11.30 గంటలకు నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ అనుచరులు ఫ్లెక్సీల్లో తమ నాయకుడి ఫోటో వేయలేదని అభ్యంతరం తెలిపారు. దీంతో ప్రారంభమైన వాగ్వాదం చివరికి చేయి చేసుకునే దాకా వెళ్లింది.

నాయకుల ఫొటోలు వేయలేదని ఆక్షేపణ

ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్, ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు రమేష్‌కుమార్‌ల ఫోటోలు వేయలేదని నగరసభ సభ్యుడు అంబరీష్ ఆక్షేపణ వ్యక్తం చేశారు. అప్పుడే కాంగ్రెస్ నాయకుడు శివకుమార్ గట్టిగా అరుస్తూ కాంగ్రెస్ నాయకుల ప్రసంగానికి అడ్డుపడి అనంతరం వేదికపైకి చేరి కేపీసీసీ జిల్లా కార్యాధ్యక్షుడు ఊరుబాగిలు శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చొక్కా పట్టుకుని కిందకు లాగి తలతో శ్రీనివాస్ తలను సినిమా స్టైల్‌లో ఢీకొట్టాడు. ఇదంతా ప్రత్యక్షంగా చూసిన కేపీసీసీ ఉపాధ్యక్షుడు పీఆర్ రమేష్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ ఖంగుతిని నిశ్చేష్టులై నిలబడి పోయారు. అక్కడే ఉన్న గల్‌పేట పోలీసులు మరింత మంది సిబ్బందిని రప్పించి పరిస్థితిని అదుపు చేశారు.

గత ఎన్నికల్లో అభ్యర్థి ఓటమికి కారకులు

జిల్లా కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా ఉన్న రెండు గ్రూపులు గత లోక్‌సభ ఎన్నికల్లో మరింత ఉధృతమై కాంగ్రెస్ అభ్యర్థి కెహెచ్ మునియప్ప ఘోర పరాజయానికి కారకులయ్యారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు కెహెచ్ మునియప్ప మళ్లీ కాంగ్రెస్ తరపున పోటీ చేయడానికి సన్నద్ధమవుతున్న తరుణంలో కెహెచ్ మునియప్ప వ్యతిరేక వర్గంలో ఉన్న కేఆర్ రమేష్ కుమార్, ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్ వర్గం వారు కేహెచ్ మునియప్పకు టికెట్ తప్పించి తమకు అనుకూలమైన వ్యక్తికి ఇప్పించాలనే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ భవనంలో జరిగిన ఘటనపై స్పందించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఇదంతా కుటుంబ గొడవ అని, లోక్‌సభ ఎన్నికల నాటికి అందరూ ఒక్క తాటిపై నిలబడి అభ్యర్థి విజయానికి కృషి చేస్తారన్నారు.

పట్టు రీలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న సిల్క్ రీలర్లు

కోలారు: తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న పట్టు రీలర్లను ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోలార్ సిల్క్ రీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ఖలీల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో సిల్క్ ఎక్స్చేంజ్ ద్వారా పట్టు నూలును ఖరీదు చేస్తుండేవారని, గత 15–18 సంవత్సరాలుగా సిల్క్ ఎక్స్చేంజ్‌ను మూసివేయడం వల్ల ఆర్థికంగా కష్టాల్లో ఉన్న సిల్క్ రీలర్లకు పెట్టుబడి కోసం రూ.15 లక్షలను ఇవ్వాలని ఒత్తిడి చేశారు. జాయింట్ సెక్రటరీ జే.జబీవుల్లా మాట్లాడుతూ పట్టు గూళ్లు, పట్టు నూలు ధర 50 శాతం తగ్గడం వల్ల ట్రేడర్స్ అడిగిన ధరలకు పట్టు నూలును ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అందువల్ల గత మూడేళ్లుగా ఆగిపోయిన కేఎస్ఎంబీని ప్రభుత్వం తెరిచి పట్టు నూలు ఖరీదులో పాల్గొనడానికి అవకాశం కల్పించాలని కోరారు. తక్షణ పరిహారంగా రైతులు పండించే ప్రతి కిలో పట్టుకు 60 రూాలు, రీలర్స్ ఉత్పత్తి చేసే ప్రతి కిలో పట్టు నూలుకు రూ.100 ప్రోత్సాహధనం అందించాలని మనవి చేశారు. అసోసియేషన్ డైరెక్టర్ అబ్దుల్ జబీర్ పాషా, ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం, కార్యదర్శి సయ్యద్ అనీస్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

కోలారు: వేసవి సమీపిస్తున్నందున జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లాధికారి అక్రం పాషా అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సభాంగణంలో జిల్లా విపత్తు నిర్వహణ ప్రాధికార సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలోని ఆరు తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. ప్రస్తుతానికి ఎక్కడా తాగునీరు, పశువులకు మేత సమస్య కనిపించడం లేదు. అయితే మార్చి, ఏప్రిల్ నెలల్లో సమస్య ఎదురయ్యే అవకాశం ఉన్నందున నీటి కొరత రాకుండా చూసుకోవాలన్నారు. బోరుబావులను మరమ్మతు చేయాల్సిన చోట వెంటనే చేయించాలని, రక్షిత తాగునీటి యూనిట్లు సక్రమంగా పని చేయకుంటే గుర్తించి వెంటనే వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. పశువులకు తాగునీటి కోసం గ్రామీణ ప్రాంతాల్లో పబ్లిక్ తొట్టెలను నీటితో నింపాలన్నారు. కావలసినంత మేత కిట్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప, డిప్యూటీ కలెక్టర్ శంకర్ వణిక్యాల్, జిల్లా, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సాధకులకు సన్మానం



సాధకులను సన్మానించిన దృశ్యం

మాలూరు: పట్టణంలోని శ్రీక్షేత్ర మారికాంబ ఆలయానికి అధిక సంఖ్యలో వస్తున్న భక్తులతో ఆలయానికి వచ్చే ఆదాయం ద్వారా ఆలయ ట్రస్టు పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. బుధవారం పట్టణంలోని కుంబేశ్వర రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలను శ్రీక్షేత్ర మారికాంబ ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.65 లక్షల వ్యయంతో అభివృద్ధి పరుస్తూ నిర్మించిన నూతన కట్టడాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణంతో పాటు తాలూకా వ్యాప్తంగా పలు సామాజిక సేవలను ట్రస్టు నిర్వహిస్తోందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సాధన చేసిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు పి.వెంకటేష్, తహసీల్దార్ కె.రమేష్, బీఈఓ చంద్రకళ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

హుబ్లీ: కాలు జారి చెరువులో పడి ఓ వ్యక్తి చెందిన ఘటన ధార్వాడ తాలూకా మురుకట్టిలో బుధవారం వెలుగు చూసింది. మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన భగవాన్ గోపీనాథ్(35) అనే వ్యక్తి మృతుడు. కూలీ పని కోసం వెళ్లి నింగప్ప పొలంలో గుడిసెలోనే నివాసం ఉండేవాడు. ఈ క్రమంలో స్నానం చేయడానికి చెరువు వద్దకు వెళ్లి కాలు జారడంతో ఈత రాక మునిగి చనిపోయినట్లు ధార్వాడ గ్రామీణ పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం.. విక్రేతల అరెస్టు

కేజీఎఫ్: కేజీఎఫ్ పోలీస్ జిల్లాలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి రూ.5.4 లక్షల విలువ చేసే 6.745 కిలోల గంజాయిని, ఒక కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. పారాండహళ్లి గ్రామ సమీపంలో గంజాయిని విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో అందుకున్న రాబర్ట్‌సన్‌పేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీహెచ్ రామకృష్ణయ్య, సిబ్బంది దాడి జరిపి కేజీఎఫ్ ఛాంపియన్‌రీఫ్‌కు చెందిన సురేంద్రన్, కుప్పం సమీపంలోని పెద్దకురుబలపల్లి శ్రీకాంత్, బెంగళూరు బసవేశ్వర నగర నివాసి సంతోష్, రామకుప్పం సమీపంలోని జాంపూరు గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డిలను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

మార్చి 12 వరకు ఈ-ఖాతా అభియాన్



ముఖ్యాధికారి సత్యనారాయణ

శ్రీనివాసపురం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి సారిగా ఈ నెల 12 నుంచి మార్చి 12 వరకు పట్టణంలో ఈ-ఖాతా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పురసభ ముఖ్యాధికారి సత్యనారాయణ తెలిపారు. పురసభ అధికారుల బృందం ఇంటి వద్దకు వచ్చినప్పుడు ఈ-ఆస్తి చేసుకోవడానికి ఖాతాదారులు తమ ఫోటో, ఇంటి/స్థలం ఫోటో, ఎన్నికల గుర్తింపు కార్డు, పాన్ కార్డు, సొత్తు క్రయపత్రం, ఈసీ, 2023–24 ప్రస్తుత సంవత్సర ఆస్తి పన్ను రశీదును చూపించాలన్నారు. భూ పరివర్తన పత్రాలు, ఈ-ఆస్తి ఖాతా చేయించుకోదలచిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అత్యాచార నిందితుడికి జైలు

కోలారు: బాలికపై అత్యాచార కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తూ బుధవారం న్యాయమూర్తి బీపీ దేవమానె తీర్పు వెలువరించారు. తాలూకాలోని చిన్నాపుర గ్రామానికి చెందిన మనోజ్ అనే వ్యక్తి ఓ బాలికను అపహరించి అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై 2023 సెప్టెంబర్ 19న కోలారు మహిళా పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. తనిఖీ చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి పైవిధంగా జైలు శిక్ష, జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం కూడా అందించాలని జడ్జి తీర్పునిచ్చారు.

క్లుప్తంగా

అన్నదాతల అరెస్ట్ ఖండనీయం



మాట్లాడుతున్న బడగలపుర నాగేంద్ర

మైసూరు: డిమాండ్ల సాధన కోసం చలో ఢిల్లీ నిర్వహిస్తున్న రైతులను అరెస్టు చేస్తుండడం ఖండనీయమని, తక్షణమే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని రాష్ట్ర రైతు సంఘం రాష్ట్రాధ్యక్షుడు బడగలపుర నాగేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. చరిత్రలో రైతులను ఎదురించి ఏ ప్రభుత్వమూ నిలబడ లేదని, కేంద్ర ప్రభుత్వ దౌర్జన్యాన్ని తాము ఖండిస్తున్నట్లు తెలిపారు. 383 రోజుల పోరాటం వల్ల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకుందని తెలిపారు. ఇక ఇప్పుడు ఇచ్చిన మాటను కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదని మండిపడ్డారు.

లో ఓల్టేజీ సమస్యపై రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

చింతామణి: విద్యుత్ సమస్యలపై రైతులు కన్నెర్ర చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బెస్కాం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సంఘం నాయకుడు రమణారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు లో ఓల్టేజీ సరఫరా చేస్తుండంతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోతున్నాయన్నారు. నీరు లేక పంటలు ఎండుతున్నాయన్నారు. తక్షణమే పది గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అంజనేయరెడ్డి నారాయణస్వామి, అల్లాబకాష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత

బనశంకరి: కేఎస్ఆర్‌టీసీలో వివిధ కారణాలతో మృతిచెందిన 16మంది ఉద్యోగుల కుటుంబాలకు మొదటిసారిగా కుటుంబ కల్యాణ పథకం కింద తలా రూ.10 లక్షల పరిహారాన్ని సంస్థ అందజేసింది. విధుల్లో ఉండగా లేదా విధుల్లో లేని సమయంలో ప్రమాదంలో మృతిచెందడం, అంగవైకల్యానికి గురవ్వడం తదితర వాటికి పరిహారం అందజేస్తున్నారు. ఈ పథకం అమల్లోకి వచ్చిన అనంతరం 17 మంది ఉద్యోగులు మృతిచెందగా ఇప్పటి వరకు 13 కుటుంబాలకు బీమా ప్రమాద మొత్తం ఇప్పటికే అందజేశామని కేఎస్ఆర్‌టీసీ సంస్థ తెలిపింది.

సరస్వతిదేవి పూజను అడ్డుకున్న విద్యార్థి



పూజను అడ్డుకున్న నందకుమార్

యశవంతపుర: కలబురగి వర్సిటీ గ్రంథాలయంలో బుధవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతి పూజ చేశారు. ఇదే సమయంలో విద్యార్థి నందకుమార్ పూజను అడ్డుకున్నారు. సరస్వతి మాతపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. నందకుమార్ తీరుతో తోటి విద్యార్థులు ఆక్రోశం వ్యక్తం చేశారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నందకుమార్ ప్రవర్తనపై నెటిజన్లు మండిపడ్డారు.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధంగా ఉండండి



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విజయేంద్ర

యశవంతపుర: లోక్‌సభ ఎన్నికలకు ఏ క్షణంలో అయినా నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని, ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర పిలుపునిచ్చారు. బెంగళూరు భూపసంద్ర మెయిన్ రోడ్డు సంజయనగరలో హెబ్బాళలో ఏర్పాటు చేసిన పార్టీ మండల కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. హెబ్బాళ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ సాధించాలని నాయకులకు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ 3వసారి ప్రధానమంత్రి పీఠం అధిష్టించేలా రాష్ట్రంలో 28 స్థానాల్లో విజయం సాధించేలా శ్రమించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సీఎం సదానందగౌడ పాల్గొన్నారు.

సాంకీ చెరువులో మృతదేహం

యశవంతపుర: బెంగళూరులోని సాంకీ చెరువులో 50 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి శవమై తేలాడు. నీటిపై తేలియాడుతున్న శవాన్ని చూసిన ఉద్యానవనశాఖ సిబ్బంది సదాశివనగర పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని వెలికి తీసి ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఐటీ రాజధానిలో సైబర్ నేరాల జోరు

- పేర్ల విక్రయం పేరుతో పారిశ్రామికవేత్త కు రూ.6 కోట్ల వంచన
- అధికలాభం పేరుతో టెక్కీకి రూ.27.65 లక్షలు, బ్యాంకు అధికారికి రూ.26.42 లక్షలు టోపీ







బనశంకరి: క్లిక్ చేస్తే మోసం..మెసేజ్ ఓపెన్ చేస్తే వంచన..కాల్ చేస్తే లక్షల రూపాయలకు టోపీ ఇది ఐటీ రాజధాని బెంగళూరు వాసులకు నిత్యం ఎదురవుతున్న సమస్య. చదువు రాని వారే కాదు..ఉన్నత విద్యావంతులు, మేధావులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు సైబర్ వంచగాళ్లబారిన పడి కోట్ల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. సైబర్ కేటుగాళ్లు దేశంలో ఎక్కడో తిష్టవేసి బెంగళూరును టార్గెట్ చేసి వంచనలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరాలపై పోలీసులు జాగృతం చేస్తున్నా కొందరు అత్యాశకు పోయి సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కుతున్నారు. ఏమరుపాటుతో సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌ను ఓపెన్ చేసినా బ్యాంకు ఖాతాలు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది.

అధిక లాభం ఆశచూపి...

వైట్‌ఫీల్డ్ ప్రెస్టేజ్ ఓజోన్‌రోడ్డు నివాసి, మహిళా టెక్కీకి ఫేస్‌బుక్‌లో పరిచయమైన గుర్తుతెలియని వ్యక్తి షేరుమార్కెట్‌లో డబ్బు పెట్టుబడి పెడితే అధికలాభం ఇస్తామని ఆశచూపాడు. మొబైల్ నెంబరు తీసుకుని వాట్సాప్ గ్రూప్‌లో టెక్కీని చేర్చి లింక్ పంపించి కేకేఆర్ యాప్ డౌన్‌లోడ్ చేయించాడు. రూ.50 వేల విలువచేసే షేర్ విక్రయించి కొంత లాభాన్ని మహిళా టెక్కీ బ్యాంకు ఖాతాకు పంపారు. ఎక్కువగా డబ్బు పెట్టుబడి పెడితే మరింత లాభం వస్తుందని నమ్మబలికాడు. దీంతో ఆ టెక్కీ దశల వారీగా రూ.32.65 లక్షలు వారు చెప్పిన బ్యాంకు ఖాతాకు జమ చేసింది. రూ.5 లక్షల లాభం వచ్చిందని చెప్పి ఆమె ఖాతాకు జమ చేశారు. మిగతా మొత్తం వెనక్కు ఇవ్వాలని కోరితే సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేశారు. దీంతో బాధితురాలు వైట్‌ఫీల్డ్ సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



పార్ట్‌టైం ఉద్యోగం పేరుతో..

జనవరి నెలలో బ్యాంకు అధికారికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం ఉద్యోగం ఉందని తెలిపాడు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.10 వేలు తీసుకున్నారు. అనంతరం లింక్ పంపించి వీడియో, ఫొటోలు లైక్‌చేసి షేర్ చేయాలని వంచకుడు సూచించాడు. ఒకదానికి రూ.150 ఇస్తామని చెప్పి తొలుత కొంత మొత్తం పంపారు. పెట్టుబడి పెడితే లాభాలు అందజేస్తామని చెప్పడంత దశలవారీగా రూ.26.42 లక్షలు చెల్లించాడు. కొంత నగదు ఇచ్చి మోసానికి పాల్పడ్డారు. మిగిలిన నగదు డ్రా చేయడానికి ప్రయత్నించగా ఖాతా ఖాళీ అయ్యింది. దీంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రూ.6 కోట్ల వంచన

ఇందిరానగర నివాసి 72 ఏళ్ల పారిశ్రామికవేత్తకు గత ఏడాది డిసెంబరులో గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. రెండు కంపెనీల్లో తక్కువ ధరకు షేర్లు విక్రయిస్తున్నారని, పెట్టుబడి పెడితే భారీ లాభాలు అందుతాయని వంచకులు ఆశపెటాడు. దీంతో గత డిసెంబరు 26 నుంచి 2024 ఫిబ్రవరి 8 తేదీ వరకు వివిధ బ్యాంకు ఖాతాలనుంచి రూ.6.01కోట్లు జమ చేయించుకున్నారు. అనుమానం వచ్చి కంపెనీ గురించి ఆరా తీయగా కేరళలో ఇదే తరహాలో మోసం చేసినట్లు తేలింది. దీంతో సదరు పారిశ్రామికవేత్త నగర సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అయోధ్యకు బయల్దేరిన ప్రత్యేక రైలు



జెండా ఊపి రైలు సంచారాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పీసీ.మోహన్



రైల్వే స్టేషన్‌లో శ్రీరామ భక్తులు

బనశంకరి: శ్రీరామ దర్శనం కోసం వందలాది మంది భక్తులతో ప్రత్యేక రైలు బుధవారం బెంగళూరు నగరం నుంచి అయోధ్యకు బయలుదేరింది. బయప్పనహళ్లి సర్‌ఎం.విశ్వేశ్వరయ్య రైల్వేస్టేషన్‌లో బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ.మోహన్ జెండా ఊపి రైలును ప్రారంభించారు. బెంగళూరు నగరంలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో 1450 మంది అయోధ్యకు రైలులో బయలుదేరారు. బుధవారం తెల్లవారుజామున 3.40 గంటలకు బయల్దేరిన ఈ రైలు ఈనెల 16 తేదీ మధ్యాహ్నం అయోధ్యకు చేరుకుంటుంది. 17వ తేదీ ఉదయం ఈ ప్రత్యేక రైలు అయోధ్య నుంచి తిరుగు ప్రయాణమై 20వ తేదీ ఉదయం బెంగళూరుకు చేరుకుంటుంది.

కరెంటు చార్జీల పెంపునకు అనుమతి ఇవ్వండి

మైసూరు: ప్రతి యూనిట్‌కు 50 పైసలు చొప్పున విద్యుత్ చార్జీలు పెంచేందుకు అనుమతి ఇవ్వాలని విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు చాముండేశ్వరి విద్యుత్ సరఫర సంస్థ (సెస్కాం) ప్రతిపాదనలు పంపించింది. బుధవారం మైసూరు జిల్లా పంచాయతీ ఆడిటోరియంలో జరిగిన కర్ణాటక విద్యుత్ నియంత్రణ కమిషన్ సమావేశంలో సెస్కాం ఎండీ జి.శీల మాట్లాడుతూ 2024–25 ఏడాదిలో విద్యుత్ సరఫరా వ్యయం రూ. 7,379.89 కోట్ల మేర ఖర్చు అవుతోందన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల నుంచి రూ. 6,940.34 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. మిగిలిన లోటును భర్తీ చేయాలంటే రూ. 439.55 కోట్లు అవసరం అవుతుందన్నారు. వ్యత్యాసాన్ని పూడ్చేందుకు ప్రతి యూనిట్‌కు 50 పైసల చొప్పుల ధరను పెంచేందుకు అనుమతించాలని కోరారు.

సెస్కాం ప్రతిపాదనపై వ్యతిరేకత

కరెంటు చార్జీల పెంపు ప్రతిపాదనపై సామాన్య ప్రజలు, సంస్థల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చార్జీల పెంపునకు బదులుగా సంస్థలో అనవసర ఖర్చు తగ్గించాలని, విద్యుత్ లీకేజీని అడ్డుకట్ట వేయాలని సామాన్య ప్రజలు సూచిస్తున్నారు.

నవజాత శిశువుల రక్షణకు బేబీ అంబులెన్స్

శివాజీనగర: శిశు మరణాలు అరికట్టే దిశలో రాష్ట్రంలో బేబీ అంబులెన్స్ సేవలను రాష్ట్ర ఆరోగ్య మంత్రి దినేశ్ గుండురావు పారంభించారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదు సంవత్సరాల లోపు బాలలకు అత్యవసర చికిత్స కోసం ఈ అంబులెన్స్‌లను వినియోగిస్తారు. పుట్టిన అనంతరం నవజాత శిశువు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటుంది. ఈక్రమంలో అవసరమైన వైద్యం, ఇతర వైద్య పరీక్షల నిమిత్తం ఒక ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి బిడ్డను తరలించాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం బేబీ అంబులెన్స్ సేవలను ప్రారంభించినట్లు మంత్రి దినేశ్ గుండురావు తెలిపారు.

ఎక్కెడెక్కడ పని చేస్తాయి?

బేబి అంబులెన్స్‌లు బెంగళూరుతోపాటు హుబ్లీ, మైసూరు, కల్బుర్గిలో పని చేస్తున్నాయి. బెంగళూరులోని వాణీవిలాస్ ఆసుపత్రి, మైసూరులోని చలువాంబ ఆసుపత్రి, రాయచూరులోని రాయచూరు వైద్యవిద్యా విజ్ఞాన సంస్థ, హుబ్లీలోని కర్ణాటక వైద్య విజ్ఞాన సంస్థకు నవజాత అంబులెన్స్‌లను కేటాయించారు. ఈ అంబులెన్స్‌ల్లో వైద్య నిపుణులు, నర్సులు ఉంటారు. వెంటిలేటర్, ఆక్సిజన్, పల్స్ చెకప్, సిరంజీతో పాటు అత్యాధునిక ప్రాణ రక్షణ సాధనాలు ఉంటాయని మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు.

శ్మశానవాటిక కార్మికుల నిరసన

చిక్కబళ్లాపురం: డిమాండ్ల పరిష్కారానికి శ్మశాన వాటిక కార్మికులు ఉద్యమించారు. బుధవారం డప్పు వాయిద్య కళాకారుల సంఘం, దళిత హక్కు సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ఉన్న పూజనహళ్లి గ్రామ శ్మశానంలో డప్పు వాయిస్తూ ఆందోళన నిర్వహించారు. శ్మశాన కార్మికుల సంఘం జిల్లా సంచాలకులు కే మునియప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో 50 వేలకు పైగా ఉన్న శ్మశానవాటికల్లో దాదాపు రెండున్నర లక్షలమందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి సదుపాయాలు అందడం లేదన్నారు. ప్రతి నెల రూ.5వేలు ఇవ్వాలని, కార్మికులను పంచాయతీ నౌకర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ తిప్పేస్వామి ఆందోళనకారు వద్దకు వెళ్లి వినతిపత్రం స్వీకరించారు. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.



శ్మశాన వాటికలో ఏడీసీ తిప్పేస్వామికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి



మండ్యలో ఆందోళనలో పాల్గొన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు



చిక్కబళ్లాపురంలో ధర్నా చేస్తున్న సిబ్బంది

మండ్య: నగర స్థానిక సంస్థల ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేసి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సదుపాయాలు కల్పించాలని, పౌరకార్మికుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది బుధవారం ఆందోళనబాట పట్టారు. నగరసభ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. నగర స్థానిక సంస్థల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిని పర్మినెంట్ చేయడం వల్ల ప్రభుత్వానికి జీఎస్టీ ఆదా అవ్వడంతో పాటు ఉద్యోగులకు సేవా భద్రత లభిస్తుందని గుర్తు చేశారు.

చిక్కబళ్లాపురం: తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఔట్ సోర్సింగ్ పౌర కార్మికులు, వాటర్‌మెన్లు నగరసభ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కాంట్రాక్ట్ నౌకర్ల సంఘం జిల్లాధ్యక్షుడు సురేశ్ బాబు మాట్లాడారు. వేతనాలు కార్మికుల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈనెల 15న సీఎం ఇంటి ముందు ధర్నా చేస్తామన్నారు.

ఎంపీ సీట్లకు అభ్యర్థులు ఎవరు?

- కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీలో చర్చ



శివాజీనగర: లోక్‌సభ, రాజ్యసభ ఎన్నికల అభ్యర్థుల ఎంపిక గురించి మంగళవారం కాంగ్రెస్ నేతలు బుధవారం ముఖ్య సమావేశం జరిపారు. సీఎం సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్, ఏఐసీసీ నేత హరీశ్ చౌధరి, రణదీప్ సింగ్ సుర్జెవాలా, విశ్వజిత్ కదం, జిగ్నేశ్ మేవాని పాల్గొన్నారు. 20కు పైగా లోక్‌సభ స్థానాలను గెలవాలని చర్చించారు. ప్రస్తుత మంత్రులు, లేదా మంత్రుల పిల్లలు, సోదరులు, బంధువులు, మాజీ ఎంపీలు ఇలా పలువురి పేర్లు జాబితాలో ఉన్నాయి. బలమైన అభ్యర్థులను పోటీ చేయించాలని సూచనలు వచ్చాయి.

మంత్రులు పోటీ చేయాలి

కొన్ని సీట్లలో 10 వరకు ఆకాంక్షులున్నారు. సుమారు 15 నియోజకవర్గాలకు ఒకే అభ్యర్థి పేరు వినిపించింది. బెళగావి, తుమకూరు, మండ్య, మైసూరు, ఉడుపి- చిక్కమగళూరు, బెంగళూరు గ్రామీణ, కోలారు నియోజకవర్గాల్లో టికెట్ కోసం తీవ్ర పోటీ కనిపించింది. హైకమాండ్ సర్వే ప్రకారం కొన్ని నియోజకవర్గాల్లో మంత్రులను పోటీ చేయిస్తే గెలుపు సులువని తేలింది. కానీ మంత్రులు పోటీపై అంత ఆసక్తిగా లేరు. గెలిస్తే మంత్రి పదవి పోతుందనే బాధే కారణం. తమ కుటుంబ సభ్యులకు సీటు ఇస్తే గెలిపించుకుంటామని ప్రతిపాదనలు చేస్తున్నారు.

లిస్టు ఇంకా రెడీ కాలేదు: డీకే

అనంతరం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడారు. పార్టీ అభ్యర్థుల జాబితా ఇంకా సిద్ధం కాలేదన్నారు. ఇంకోసారి ఢిల్లీలో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ నెలాఖరు నాటికి అభ్యర్థుల ఖరారు పూర్తి కావాల్సి ఉందని చెప్పారు. మంత్రులే కాదు ఎవరైనా పోటీ చేయనీ, కాంగ్రెస్ గెలవడం ముఖ్యమని అన్నారు.

హోసూరు వార్తలు..

కర్పగ వినాయక స్వామికి లక్షార్చన



విశేష అలంకరణలో కర్పగ వినాయకస్వామి

కెలమంగలం: హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారి వసంత్‌నగర్ ప్రాంతంలో వెలసిన కర్పగ వినాయకస్వామి ఆలయ 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం లక్షార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి హోమం, మహాదీపారాధన, గురుప్రార్థన, మహాసంకల్పం, గణపతి పూజ, పున్యకవాసనం, నవగ్రహ పూజ, కళశపూజ, లక్ష్మీ, సరస్వతి, దేవతారాధన, అలంకార దీపారాధన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పట్టణంలోని బండాంజనేయస్వామి ఆలయం నుంచి మహిళా భక్తులు పాలకుండలతో ఊరేగింపుగా వెళ్లి వినాయకస్వామికి పాలాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. శ్రీనివాసన్, వెంకటేశప్ప, ఎన్.ఎస్.మాదేశ్వరన్, చెన్నీరప్ప పాల్గొన్నారు.

వసంత పంచమి పూజలు



ప్రత్యేక అలంకరణలో బనశంకరీదేవి

బనశంకరి: వసంత పంచమి సందర్భంగా బనశంకరీదేవి సన్నిధిలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. బుధవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, ప్రత్యేక అలంకరణచేసి విశేష పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధనచేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ల ఏర్పాటుకు గడువు పెంపు

శివాజీనగర: రాష్ట్రంలో వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ (హెచ్ఎస్ఆర్) నంబర్ ప్లేట్ అమర్చేందుకు మూడు నెలలు గడువు ఇచ్చినట్లు కాంగ్రెస్ సభ్యుడు మధు జీ మాదేగౌడ అడిగిన ప్రశ్నకు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి బుధవారం విధానపరిషత్‌లో పైవిధంగా సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే 18 లక్షల వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ అమర్చారన్నారు మిగతా వాహనాలకు నెంబర్ ప్లేట్ అమర్చేందుకు మూడు నెలలు గడువు పెంచినట్లు తెలిపారు. హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ అమర్చే నకిలీ వెబ్‌సైట్‌లపై నిఘా పెట్టినట్లు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



సంక్షేమ పథకాలను అందజేస్తున్న కలెక్టర్

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ శరయు తెలిపారు. వేపనపల్లి సమితి చెన్నసంద్రం గ్రామపంచాయతీలో ప్రజల వద్దకు పాలనను నిర్వహించారు. వివిధ సమస్యలపై 187 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, బాల్య వివాహాలను చేయరాదని ప్రజలకు చెప్పారు. 169 మంది లబ్ధిదారులకు రూ. 42.98 లక్షల విలువ చేసే సంక్షేమ ఫలాలను అందజేశారు.

హిజ్రాలు మంచిమార్గంలో నడవాలి

హోసూరు: హోసూరులో నివాసముంటున్న హిజ్రాలు దోపిడీలు, దొంగతనాలకు పాల్పడడంతో పాటు బస్టాండులో ప్రయాణికులను డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారని, ఇటువంటివి మానుకోవాలని డీఎస్పీ బాబు ప్రశాంత్ సూచించారు. బుధవారం ఆయన హిజ్రాలతో సమావేశమయ్యారు. హోసూరు పట్టణంలో వందకు పైగా హిజ్రాలు ఉన్నారని, అసాంఘిక పనుల నుంచి దూరంగా ఉంటూ, స్వయంగా ఉపాధితో జీవితాలను గడపాలని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వందకు పైగా హిజ్రాలు పాల్గొన్నారు.

ఘనంగా నివాళులు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా ఇరుదుకోట గ్రామానికి చెందిన విడుదల చిరుత పార్టీ నాయకుడు సెల్వం కూతుళ్లు తమిళరసి (19), తమిళ్ ప్రియ (16), బంధువు మునిరాజ్ కొడుకు అంబేత్కాళన్ (12). ముగ్గురూ కలిసి గత ఏడాది ఫిబ్రవరి 14వ తేదీ ద్విచక్రవాహనంలో డెంకణీకోటకు వెళుతూ ఈచర్ లారీ ఢీకొనడంతో దుర్మరణం చెందారు. వారి వర్ధంతి సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, పవరసు, గోవిందన్, సంద్రకుమార్, శక్తి, ఇళయరాజా, రాజప్ప, సంపంగిరామన్, యువరాజ్, లగుమన్, మునిరాజ్, నాగరాజ్, క్రిష్ణన్ తదితర నాయకులు ఇరుదుకోట గ్రామానికి చేరుకొని నివాళులర్పించారు.

టిప్పర్ ఢీకొని యువకుడు మృతి



ఘటనా స్థలంలో విజయభాస్కర్ మృతదేహం



విజయ్‌భాస్కర్ (ఫైల్)

క్రిష్ణగిరి: ద్విచక్రవాహనాన్ని టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో బైకిస్ట్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటన సూళగిరి వద్ద బుధవారం ఉదయం చోటు చేసుకొంది. సూళగిరి సమీపంలోని బుక్కసాగరం గ్రామానికి చెందిన విజయభాస్కర్ (28) హోసూరు వైపు వెళుతుండగా పేరండపల్లి వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన విజయభాస్కర్ అక్కడే మృతి చెందాడు. సూళగిరి పోలీసులు చేరుకొని శవాన్ని హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు. విజయభాస్కర్ క్రిష్ణగిరి సాక్షి విలేఖరి శ్రీనివాస్‌కు అక్క కొడుకు అవుతాడు. ఇంటికి పెద్దదిక్కుగా ఉంటాడనుకున్న కొడుకు మృతితో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. పలువురు స్థానికులు విజయభాస్కర్ మృతికి నివాళులర్పించారు.

హోటల్ యజమాని అరెస్ట్

బనశంకరి: హోటల్ ఫ్రాంచైజ్ ఇస్తామని వంచనకు పాల్పడ్డారని ఆరోపిస్తూ చైతన్య అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఓ హోటల్ యజమాని కార్తీక్‌శెట్టిని బుధవారం కామాక్షీపాళ్య పోలీసులు అరెస్ట్‌చేశారు. ప్రారంభంలో ఫ్రాంచైజ్ ఇస్తామని నమ్మించి రూ.3 లక్షలు తీసుకున్నారని, అనంతరం కమీషన్ ఇస్తామని చెప్పి మోసగించారని, దుకాణానికి ఖర్చుచేసిన డబ్బు కూడా ఇవ్వలేదన్నారు. కార్తీక్ శెట్టిని అడిగితే బెదిరింపులకు పాల్పడినట్లు చేతన్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా కేసు నమోదు కావడంతో కార్తీక్‌శెట్టి ముంబైకి ఉడాయించాడు. పోలీసులు ముంబైకి వెళ్లి అరెస్ట్ చేసి బెంగళూరుకు తీసుకొని వస్తున్నారు.

బైక్‌ల దొంగకు కటకటాలు

మైసూరు: నగరానికి చెందిన నజరాబాద్ పోలీసు స్టేషన్ సిబ్బంది బైక్ దొంగను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ. 9 లక్షల విలువ చేసే 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఫోరం మాల్ వద్ద డియో బైక్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా మైసూరు, మండ్య, బెంగళూరు తదితర ప్రాంతాల్లో వివిధ ద్విచక్రవాహనాలను దొంగతనం చేసినట్లు అంగీకరించాడు.

నీరా డెయిరీ ప్రారంభించండి



సమావేశంలో పాల్గొన్న హొసహళ్లి చంద్రణ్ణ

తుమకూరు: కొబ్బరి రైతుల బతుకులు బాగుపడాలంటే పాల డెయిరీ తరహాలో నీరా డెయిరీని కూడా ప్రారంభించాలని హొసహళ్లి చంద్రణ్ణ వర్గం రాష్ట్ర రైతు సంఘం రాష్ట్రాధ్యక్షుడు హొసహళ్లి చంద్రణ్ణ డిమాండ్ చేశారు. హుళియారులో జరిగిన రైతు సమావేశంలో చంద్రణ్ణ మాట్లాడుతూ కొబ్బరి నీరు ఆరోగ్యకరమైన పానీయమని, అందులో అనేక పౌష్టిక విలువలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ క్రమంలో కొబ్బరి సాగును ప్రోత్సహించేలా రైతులకు లబ్ధి చేకూర్చేందుకు నీరా డెయిరీని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

సవితా మహర్షి జయంతి

గౌరిబిదనూరు: సవితా సమాజం ఉత్తమ పరంపరను కలిగి ఉందని, సమాజంలో క్షురకులకు ప్రత్యేక స్థానం ఉందని యువ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రక్షారామయ్య అన్నారు. తాలూకాలోని రమాపురం గ్రామంలో సవితా సమాజం వారిచే జరిగిన సవితా మహర్షి జయంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. శివుని దివ్య దృష్టితో జన్మించిన సవితా మహర్షి పురాణాలలో ప్రత్యేక స్థానాన్ని పొందారన్నారు. కెహెచ్‌పీ ఫౌండేషన్ మేనేజరు శ్రీనివాసగౌడ ప్రసంగిస్తూ సవితా మహర్షి సామవేదాన్ని రచించారన్నారు. కార్యక్రమంలో త్యాగరాజు, హెచ్ఎన్ ప్రకాశరెడ్డి, వెంకట్, మంజునాథరామ్, శివకుమార్ పాల్గొన్నారు.

గులాబీ రైతుకు నిరాశ

- సగానికిపైగా తగ్గిన గిరాకీ

హోసూరు: కెన్యా తదితర ఆఫ్రికా దేశాలల్లో గులాబీ పుష్పాల ఉత్పత్తి పెరగడంతో హోసూరు రోజాలకు గిరాకీ క్షీణించింది. ప్రేమికుల రోజుకు 60 శాతం ఎగుమతి పడిపోయిందని పూల ఎగుమతి సంఘం అధ్యక్షుడు వెంకటాచలపతి చెప్పారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రేమికుల రోజును పురస్కరించుకొని ప్రతి సంవత్సరం హోసూరు ప్రాంతం నుంచి ఎక్కువ సంఖ్యలో గులాబీలను ఎగుమతి చేసేవారమన్నారు. ఈ ఏడాది విదేశీ ఉత్పత్తులు అధికం కావడంతో ఇక్కడ ఎగుమతి పడిపోయి రోజా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నామని తెలిపారు. 5 కోట్లకు పైగా పూలను ఎగుమతికి సిద్ధం చేశారని, కానీ 60 శాతం ఎగుమతి పడిపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. ఇక్కడ పండే పూలను ఎగుమతి చేసేందుకు హోసూరులో అంతర్జాతీయ పూల ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం పూర్తిగా వినియోగంలోకి రాలేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

తిరుమలకు కాయగూరలు

హోసూరు: తిరుమల తిరుపతి దేవస్థానంలో 16వ తేదీ జరుగనున్న రథసప్తమి కార్యక్రమానికి హోసూరు మార్కెట్ అసోసియేషన్ ద్వారా ఉచితంగా కాయగూరలను పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం కోసం హోసూరు బత్తలపల్లి మార్కెట్ వ్యాపారుల సంఘం ద్వారా బుధవారం రూ. 4 లక్షల విలువ చేసే 12 టన్నుల కాయగూరలను లారీలో తరలించారు. సెల్వరాజ్, నారాయణప్ప, రంగనాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

గనులశాఖ సంచాలకుడి నియామకాన్ని రద్దుచేయండి

- హైకోర్టులో పిల్

సాక్షి, అమరావతి: గనులశాఖ సంచాలకుడు వి.జి.వెంకటరెడ్డికి బుధవారం హైకోర్టు నోటీసులు జారీచేసింది. సంచాలకుడిగా నియమించేందుకు అర్హతలు లేనప్పుడు వెంకటరెడ్డిని ఎలా ఆ పోస్టులో నియమించారో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను మార్చి 27కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. నిబంధనలకు విరుద్ధంగా గనులశాఖ సంచాలకుడిగా వెంకటరెడ్డిని నియమించారని, ఆయన నియామక జీవోను రద్దుచేయాలని కోరుతూ టి.గంగాధర్ అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్ న్యాయవాది చుక్కపల్లి భానుప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. సర్వీసు నిబంధనల ప్రకారం గనులశాఖలో సంచాలకుడిగా నియమితులయ్యే వ్యక్తి ఆ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా కనీసం రెండేళ్లు పనిచేసి ఉండాలన్నారు. వెంకటరెడ్డి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేయలేదని చెప్పారు. అందువల్ల వెంకటరెడ్డి నియామకం నిబంధనలకు విరుద్ధమన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గనులశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీలతోపాటు గనులశాఖ డైరెక్టర్ వెంకటరెడ్డికి నోటీసులు జారీచేసింది.

మాతా శిశు సంరక్షణలో మెరుగైన ఫలితాలు

సాక్షి, అమరావతి: మాతా, శిశు సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ మెరుగైన ఫలితాల్ని సాధించిందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె. నివాస్ తెలిపారు. ఏపీ నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం), నూరా హెల్త్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కేర్ కంపానియన్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని బుధవారం విజయవాడలో నివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో సేవలు అందించే ఏఎన్‌ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)లను ప్రజారోగ్య పరిరక్షణలో మరింత సుశిక్షితులను చేయడానికి కేర్ కంపానియన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. 26 జిల్లాల నుంచి జిల్లాకు నలుగురు చొప్పున మెడికల్ ఆఫీసర్‌లను మాస్టర్ ట్రైనర్‌లుగా ఎంపిక చేసి వారికి రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు జిల్లాలకు వెళ్లి సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన, వైద్యులు, సిబ్బందికి సమగ్ర శిక్షణ విషయంలో ఏపీ ముందంజలో ఉందన్నారు.

రెండో రోజూ విద్యుదుత్పాదక కేంద్రాల సందర్శన


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌కుమార్

విజయపురిసౌత్: సాగర్‌డ్యాం దిగువన గల జల విద్యుదుత్పాదన కేంద్రాలను నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) బృందం రెండో రోజు బుధవారం సందర్శించింది. ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంతో పాటు కుడికాల్వపై గల విద్యుదుత్పాదన కేంద్రాన్ని పరిశీలించింది. ముందుగా విజయవిహార్ బోర్డు రూములో సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేశ్‌కుమార్ అధ్యక్షతన జెన్‌కో అధికారులతో సమావేశం జరిగింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం, భద్రత, నీటివినియోగం, విద్యుదుత్పత్తి తదితర అంశాలపై జెన్‌కో చీఫ్ ఇంజనీర్ మంగేష్‌కుమార్‌తో చర్చించారు. అనంతరం రూట్‌మ్యాప్‌తో జలవిద్యుదుత్పాదక కేంద్రాల సందర్శనకు వెళ్లారు. నాగార్జున కొండను సందర్శించారు. సీడబ్ల్యూసీ మరో డైరెక్టర్ అశిష్‌కుమార్, నేషనల్ డ్యాంసేఫ్టీఅథారిటీ డైరెక్టర్ మహేంద్రసింగ్, డిప్యూటీ డైరెక్టర్ మహ్మద్‌జిషన్, సాంకేతిక నిపుణులు రాకేష్, తెలంగాణ స్టేట్‌డ్యాం సేఫ్టీ అథారిటీ చీఫ్ ఇంజనీర్ కుమార్, ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్గనైజేషన్ సీఈ ప్రమీల, ఎస్ఈ శ్రీనివాసులు, ఈఈ విజయలక్ష్మీ, డీఈ సతీష్, ఆంధ్రప్రదేశ్ నాగార్జునసాగర్ సీఈ మురళీధర్‌రెడ్డి, కృష్ణారివర్ బోర్డు ఎస్ఈ వరలక్ష్మీదేవి, ఈఈ శ్రీహరి, తెలంగాణా నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ నాగేశ్వరరావు, ఈఈ మల్లిఖార్జున్‌రావు పాల్గొన్నారు. గురువారం కుడికాల్వపై ఈ బృందం పర్యటించనున్నట్లు సమాచారం.

జనం లేక లోకేశ్ సభలు వెలవెల

పార్వతీపురం టౌన్/సాలూరు: సాలూరు, పార్వతీపురం పట్టణంలో టీడీపీ కార్యదర్శి లోకేశ్ బుధవారం నిర్వహించిన శంఖారావం సభలు జనం లేక తుస్సుమన్నాయి. అధికారంలోకి వస్తే తాము ఏం చేస్తామో చెప్పకుండా కేవలం ప్రభుత్వంపై విమర్శలు మాత్రమే చేయడంతో కార్యకర్తల్లో నిరుత్సాహం అలుముకుంది. లోకేశ్ ప్రసంగిస్తున్న సమయంలో సభలకు వచ్చిన కొద్దిపాటిమంది కూడా వెనుదిరగడం మొదలుపెట్టారు. దీంతో సభాస్థలిలో కుర్చీలు ఖాళీ అయ్యాయి. పార్వతీపురం సభలో ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జి విజయచంద్రపై పార్టీ కేడర్ ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా సిబ్బంది అనుమతించలేదు. సాలూరు సభకు లోకేశ్ వచ్చేసరికి వందల సంఖ్యలో కూడా జనం లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే సంధ్యారాణి నాయకులకు ఫోన్‌లు చేస్తూ జనాలను త్వరగా తేవాలని కోరడం కనిపించింది. జనం వచ్చేవరకు లోకేశ్ టెంట్‌లో రెస్ట్ తీసుకున్నారు. తమకు ప్రాధాన్యం ఇవ్వలేదని జనసేన నేతలు శివ, జగదీష్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేడే వలంటీర్లకు నగదు పురస్కారాలు

గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో అందించనున్న సీఎం వైఎస్ జగన్

- ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఐదుగురికి సేవావజ్ర అవార్డు
- నగదు పురస్కారం రూ.30 వేల నుంచి రూ.45 వేలకు పెంపు
- ప్రతి మండలం, మున్సిపాలిటీ నుంచి ఐదుగురికి సేవారత్న
- పురస్కారం రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంపు
- మిగిలిన వలంటీర్లందరికీ సేవామిత్ర అవార్డు
- నగదు బహుమతి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంపు
- 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కార్యక్రమం
- రాష్ట్రవ్యాప్తంగా 2.55 లక్షల మంది వలంటీర్లకు రూ.392 కోట్లు


ఫిరంగిపురంలో చురుగ్గా సాగుతున్న వేదిక ఏర్పాట్లు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, గుంటూరు: సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల అమల్లో ఎలాంటి పక్షపాతం, అవినీతికి తావు లేకుండా క్షేత్ర స్థాయిలో విశేష సేవలు అందిస్తున్న వలంటీర్లను రాష్ట్ర ప్రభుత్వం గురువారం నగదు పురస్కారాలతో సత్కరించనుంది. గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. కాగా ప్రభుత్వం ఈ ఏడాది నగదు పురస్కారాలను భారీగా పెంచింది. ప్రతి శాసనసభా నియోజకవర్గంలో ఉత్తమ సేవలు అందించిన ఐదుగురికి సేవావజ్ర అవార్డులను అందించనుంది. వీటి కింద గత మూడేళ్లుగా రూ.30 వేల చొప్పున ప్రభుత్వం నగదు బహుమతి అందజేయగా.. ఇప్పుడు ఆ మొత్తాన్ని 50 శాతం పెంచి ఏకంగా రూ.45 వేలు చేసింది. అలాగే మండలాలు, మున్సిపాలిటీల స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన ప్రతి ఐదుగురు వలంటీర్లకు సేవారత్న అవార్డులను అందించనుంది. వీటి కింద గత మూడేళ్లు రూ. 20 వేల చొప్పున నగదు బహుమతి అందజేయగా.. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.30 వేలకు పెంచింది. అదేవిధంగా కనీసం ఏడాదికాలంగా పనిచేస్తూ.. ఎటువంటి ఫిర్యాదులు, వివాదాలు లేకుండా పనిచేసిన మిగిలిన వలంటీర్లందరికీ సేవామిత్ర అవార్డులు అందించనుంది. వీటి కింద గత మూడేళ్లుగా రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందజేయగా.. ఇప్పుడు ఈ మొత్తాన్ని రూ.15 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెంచిన నగదు బహుమతులను తాజా పురస్కారాల ప్రదానోత్సవంలో వలంటీర్లకు అందించనుంది.

2.55 లక్షల మంది వలంటీర్లకూ అవార్డులు..

ప్రతి లబ్ధిదారు ఇంటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేయడంతోపాటు రేషన్ డెలివరీ, ఆరోగ్యశ్రీ కార్డు, ఇళ్ల పట్టాలతో సహా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను, అమలు తేదీలను లబ్ధిదారులకు వలంటీర్లు వివరిస్తున్నారు. లబ్ధిదారులతో ఆయా పథకాలకు దరఖాస్తులు చేయిస్తున్నారు. అలాగే కోవిడ్, వరదలు, విపత్తులు, ప్రమాదాల సమయంలో వలంటీర్లు వివిధ సహాయ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు. ఇలా విశేష సేవలు అందిస్తున్న వలంటీర్లకు నగదు పురస్కారాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సత్కరించనున్నారు. తర్వాత ఈ నెల 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాసనసభా నియోజకవర్గాల పరిధిలో స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు వలంటీర్లకు నగదు పురస్కారాలు అందించనున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

పురస్కారాలు ఇలా..

- ప్రతి శాసనసభా నియోజకవర్గంలో అత్యుత్తమ ర్యాంకు సాధించిన మొదటి ఐదుగురు వలంటీర్ల చొప్పున.. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 875 మంది వలంటీర్లకు సేవావజ్ర అవార్డుతోపాటు సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్, రూ.45,000 చొప్పున నగదు బహుమతి అందజేస్తారు.
- ప్రతి మండలం లేదా మున్సిపాలిటీ పరిధిలో ఐదుగురు చొప్పున, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 10 మంది చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4,150 మందికి సేవారత్న అవార్డుతోపాటు సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్, రూ.30,000 చొప్పున నగదు బహుమతి అందిస్తారు.
- రాష్ట్రవ్యాప్తంగా ఏడాది పాటు ఎటువంటి ఫిర్యాదులు, వివాదాలు లేకుండా పనిచేసిన మిగిలిన 2,50,439 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డుతోపాటు సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, రూ.15,000 చొప్పున నగదు బహుమతిని అందజేయనున్నారు.
- సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర కలిపి మూడు కేటగిరీల్లో రాష్ట్రవ్యాప్తంగా 2,55,464 మందికి మొత్తం రూ.392.05 కోట్ల నగదును బహుమతుల రూపంలో అందిస్తారు.
- సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర మూడు కేటగిరీ అవార్డులకు అదనంగా వైఎస్సార్ పెన్షన్ కానుక, ఆసరా తదితర పథకాల లబ్ధిదారుల మనోభావాలను అత్యుత్తమంగా సేకరించి, జిల్లా కలెక్టర్లు ఎంపిక చేసిన 997 మంది వలంటీర్లకు వేరేగా ప్రత్యేకంగా నగదు బహుమతులను కూడా ప్రభుత్వం గురువారం అందించనుంది. ఈ ప్రత్యేక నగదు బహుమతి కింద మండల, పట్టణ, మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిలో ఎంపికయ్యే వలంటీర్లకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున అందిస్తారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన ఒక్కో వలంటీర్‌కు రూ.20 వేలు చొప్పున అందజేస్తారు. జిల్లా స్థాయిలో ఎంపికయ్యే వారికి రూ. 25 వేల చొప్పున అందజేయనున్నారు. మొత్తం 997 మంది వలంటీర్లకు ప్రత్యేక నగదు బహుమతుల రూపంలో మొత్తం రూ.1.61 కోట్లు అందిస్తారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు


మంత్రి కారుమూరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు

మంత్రి కారుమూరి సమక్షంలో పార్టీలో చేరిన జనసేన, టీడీపీ నేతలు

ఇరగవరం: పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలంలో టీడీపీ, జనసేన పార్టీలకు షాక్ తగిలింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమాభివృద్ధి పాలన మెచ్చి టీడీపీ, జనసేన నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన 100 మంది టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలకు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్య, వైద్య రంగాల్లో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని వివరించారు. ప్రపంచస్థాయి విద్య, నాణ్యమైన వైద్యం పేదలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్ సొంతమన్నారు. ఈ ప్రభుత్వం వల్ల మీ ఇంట్లో మేలు జరిగి ఉంటేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ధైర్యంగా అడిగిన ఏకైక ముఖ్యమంత్రి.. వైఎస్ జగన్ అని అన్నారు. ప్రజలకు ఎంతో మంచి చేస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వంపై ఎల్లో మీడియా, ప్రతిపక్ష పార్టీలు విషం చిమ్ముతున్నాయని.. వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి.. మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు.

ప్రజారోగ్య భద్రతే.. ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- అనారోగ్యంతో మృతి చెందిన పద్మ కుటుంబసభ్యులకు రూ.5లక్షల ఆర్థికసాయం


మృతిచెందిన పద్మ కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న మంత్రి విడదల రజిని

నెహ్రూనగర్: రాష్ట్రంలోని ప్రజలకు ఎలాంటి కష్టమొచ్చినా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంటున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. గుంటూరులో అనారోగ్య కారణాలతో మృతి చెందిన శారదాకాలనీకి చెందిన పద్మ కుటుంబాన్ని బుధవారం మంత్రి రజిని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి రూ.5లక్షల ఆర్థికసాయం అందజేశారు. అక్కడే యూపీహెచ్‌సీలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మంత్రి మాట్లాడుతూ గుంటూరులో పలువురికి అనారోగ్య సమస్యలు వచ్చాయని, అందుకు గల కారణాలపై విచారణ కొనసాగుతుందని తెలిపారు. మంచినీటి సమస్యే కారణమై ఉండొచ్చనే అనుమానాలతో ప్రభావిత ప్రాంతాల్లో పాత పైపు లైన్లను పూర్తిగా తొలగిస్తున్నామన్నారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేస్తున్నామని తెలిపారు. మురుగు కాలువలకు సమీపంలోని మంచినీటి పైపు లైనులను మారుస్తున్నామన్నారు. ఈ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని వివరించారు.

మెరుగైన వైద్యం..

మరోవైపు అనారోగ్య కారణాలతో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి వస్తున్న వారికి మెరుగైన వైద్యం అందించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నామని మంత్రి రజిని తెలిపారు. నగరంలో మొత్తం ఏడు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఏమార్చే 'గంటా'తోనే తంటా

- నెల్లిమర్లలో గంటా శ్రీనివాసరావు పోటీకి స్థానిక నేతల విముఖత
- ప్రతిసారీ నియోజకవరాలు మార్చే నేత మాకొద్దంటూ స్పష్టీకరణ
- గెలిచిన తర్వాత పట్టించుకోకపోవడంతో సర్వత్రా వ్యతిరేకత
- కొత్త నియోజకవర్గం కోసం సీనియర్ నాయకుడి వెదుకులాట



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ప్రతి ఎన్నికలకు నియోజకవర్గాన్ని మార్చి గెలిచిన తర్వాత ప్రజలను ఏమార్చే టీడీపీ సీనియర్ నాయకుడు గంటా శ్రీనివాసరావు ఈ సారి పోటీకి కొత్త నియోజకవర్గాన్ని వెదుక్కుంటున్నారు. మొన్నటివరకూ విశాఖ నుంచి ఏకంగా విజయనగరం వెళ్లి నెల్లిమర్లల్లో అదృష్టాన్ని పరీక్షించుకుందామనుకున్న ఆయనకు అక్కడి స్థానిక నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తరచూ సీటు మార్చే నేత మాకొద్దంటూ వారు స్పష్టం చేయడంతో మళ్లీ విశాఖవైపు గంటా చూపు పడింది. గాజువాకలో పరిస్థితి పరీక్షించుకుందామన్నా.. తన శిష్యుడు పల్లా శ్రీనివాస్ సీటుకు ఎసరుపెడితే ఇబ్బందులు తప్పవని వెనుకడుగువేసినట్టు తెలుస్తోంది. మరోవైపు విశాఖలో ఇప్పటికే తన సామాజికవర్గ ప్రాబల్యం ఉన్న అన్ని నియోజకవర్గాల్లో గంటా పోటీ చేసి ఉండటంతో పాటు జనసేనతో పొత్తు నేపథ్యంలో ఏ సీటు మిగులుతుందో కూడా తెలియని సంకటస్థితి నెలకొంది.

ఆరంభం నుంచీ అదే తీరు.

1999లో టీడీపీ నుంచి రాజకీయరంగ ప్రవేశం చేసిన గంటా శ్రీనివాసరావు తొలుత అనకాపల్లి ఎంపీగా పోటీ చేశారు. 2004లో చోడవరం ఎమ్మెల్యేగా అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. 2009లో అనకాపల్లి నియోజకవర్గానికి మకాం మార్చి ప్రజా రాజ్యం పార్టీ తరపున ఎమ్మెల్యేగా బరిలో నిలిచారు. 2014లో భీమిలి నుంచి టీడీపీ తరపున పోటీ చేశారు. 2019లో విశాఖ ఉత్తరం నుంచి గెలుపొందారు. ఇలా ప్రతిసారీ నియోజకవర్గాలను మార్చే గంటా గెలిచిన తర్వాత ప్రజలనూ పట్టించుకోరనే పేరుంది. ఈయన వ్యవహారం కాస్తా ఉత్తరాంధ్ర వాసులందరికీ తెలిసిపోవడంతో ఇప్పుడు అంతటా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రతి నియోజకవర్గంలోనూ గంటాకు సీటు ఇవ్వవద్దని స్థానిక టీడీపీ నేతలు చెబుతున్నారు. దీంతో ఆయన ఎక్కడి నుంచి పోటీ చేయాలనే మీమాంసలో పడిపోయారు. తనకంటూ నియోజకవర్గం లేకుండా పోయిందని మదనపడుతున్నారు. భీమిలి నుంచి పోటీ చేస్తానని సన్నిహితుల వద్ద చెబుతున్నా.. సొంత పార్టీతోపాటు జనసేన నేతల నుంచి కూడా విముఖత వ్యక్తమవుతోంది. భీమిలిలో పోటీ చేసినా నిత్యం ప్రజల్లో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఢీకొట్టడం సాధ్యం కాదనే వాదన వినిపిస్తోంది. దీంతో గంటాకు సీటు విషయంలో పార్టీ కూడా స్పష్టమైన హామీ ఇవ్వట్లేదని సమాచారం.

రాజధాని ఫైల్స్ సినిమా నిలిపివేయాలి



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

- బహుజన పరిరక్షణ సమితి నేతల డిమాండ్
- మూడు రాజధానులకు మద్దతుగా 1,235వ రోజుకు చేరిన దీక్షలు

తాడికొండ: రాజధాని ఫైల్స్ పేరుతో కులవాదులు తీసిన సినిమా విడుదలను నిలిపివేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం 1,235వ రోజుకు చేరాయి. అమరావతి పేరుతో జరిగిన లంక, అసైన్డ్ భూముల దోపిడీ, మూడు రాజధానుల ఉద్యమం, రాజధాని నిర్మాణం పేరుతో జరిగిన అవినీతి, సీఐడీ కేసులు, ఇన్నర్ రింగ్ రోడ్డు స్కామ్, తాత్కాలిక నిర్మాణం పేరిట దోచుకున్న ప్రజాధనం, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఐదేళ్లలో చేసిన నిధుల దుర్వినియోగం వంటి అంశాలు కూడా ఆ సినిమాలో చూపిస్తే మంచిదని నాయకులు అన్నారు. అలా చేయకుండా కులవాదులకు అనుకూలంగా సినిమా తీస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. శివరామకృష్ణన్ కమిటీ, బోస్టన్ కమిటీ, జీఎన్ రావు కమిటీ నివేదికలు కూడా ఆ సినిమాలో చూపిస్తే మంచిది కానీ, నిజాలను దాచిపెట్టి ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టాలని చూడటం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, బూదాల సలోమి, పులి దాసు, బోదాల సౌమ్య, బొలిమేర శామ్యేలు, కొమరపల్లి కిషోర్‌బాబు, ఇందుపల్లి సుభాషిణి, కారుమూరి పుష్పరాజు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఈఎల్ఐటీ సెంటర్లు

సికింద్రాబాద్, తిరుపతిలలో ఏర్పాటుకు కేంద్రం ఆమోదం

- ఇన్ఫర్మేషన్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్న సంస్థలు
- వచ్చే మూడేళ్లలో ఒక్కో కేంద్రం ద్వారా కనీసం 5,000 మందికి నైపుణ్య శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ఐటీ ఎగుమతులు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు సంబంధించి దేశం మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన మానవ వనరుల అభివృద్ధి దిశగా తెలుగు రాష్ట్రాల్లో రెండు కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో ఇన్ఫర్మేషన్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ టెక్నాలజీ సంబంధిత రంగాలలో శిక్షణ ఇచ్చే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటీ) సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. సికింద్రాబాద్, తిరుపతిల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ ప్రకటించింది. చెన్నై ఎన్ఐఈఎల్ఐటీ ఆధ్వర్యంలో వెంటనే ఈ కేంద్రాల కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు కేంద్ర ఐటీ, టెలికమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ తెలిపింది. వచ్చే మూడేళ్లలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇవి పూర్తిస్థాయిలో సిద్ధమవుతాయి. ఒక్కో కేంద్రం ద్వారా రాబోయే మూడేళ్లలో కనీసం ఐదువేల మందికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించారు.

టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు

తెలుగు రాష్ట్రాల్లోని యువత, ఇంజనీరింగ్ విద్యార్థులకు, సంబంధిత రంగాలలో ముందుకు వెళ్లాలని చూస్తున్న నిరుద్యోగులకు ఈ కేంద్రాలు ఒక చక్కటి అవకాశమని అధికారులు చెబుతున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి టెక్నాలజీ కంపెనీల్లో మంచి ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని అంటున్నారు. ఇక ఆయా రంగాలలో పరిశోధనలకు వేదికలుగా కూడా ఈ కేంద్రాలు ఉపయోగపడనున్నాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలలో నూతన ఆవిష్కరణలకు, వ్యాపారాల ఏర్పాటు పెంపొందించడానికి కూడా ఈ కేంద్రాలు దోహదపడనున్నాయి. సికింద్రాబాద్, తిరుపతిల్లో ఎన్ఐఈఎల్ఐటీ కేంద్రాల ఏర్పాటుకు ఆమోదముద్ర పడటంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. టెక్నాలజీ రంగాలలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో శిక్షణ అందించే ఈ కేంద్రాలను యువత సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైవీ వ్యాఖ్యలు వక్రీకరించారు

- అది మా పార్టీ స్టాండ్ కాదు: మంత్రి బొత్స
- హైదరాబాద్ పదేళ్లు ఉమ్మడి రాజధాని అని చట్టంలో చేర్చారు
- అది పూర్తయితే కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది



సాక్షి, విశాఖపట్నం: పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను కొనసాగిస్తూ విభజన చట్టంలో పొందుపరిచారని, ఆ గడువు పూర్తయితే కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని, అది తమపరిధిలోని అంశం కాదని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించారని, అది తమ పార్టీ స్టాండ్ కాదని స్పష్టం చేశారు. విభజన చట్టంలో ఉన్న అంశాలను సాధించుకోవడమే తమ లక్ష్యమని, చట్టపరంగా రాష్ట్రానికి రావాల్సిన వాటన్నింటినీ సాధించుకుంటామన్నారు. బుధవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏదైనా మహా యజ్ఞం తలపెట్టినప్పుడు కొన్ని దుష్టశక్తులు అడ్డుకుంటూ ఉంటాయని, అంతమాత్రాన యజ్ఞం ఆగదని, విజయాన్ని ఎవరూ ఆపలేరని చెప్పారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తుంటే ప్రతిపక్షంలోని దుష్టశక్తులు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. వారితో పోరాడి విజయం సాధిస్తామన్నారు. విభజన తరువాత చంద్రబాబు కాలయాపన చేస్తే తమ ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కటీ సాధించుకుంటున్నామన్నారు. ఏపీలో ఓటు హక్కు లేని చంద్రబాబు, పవన్ లాంటి వారు మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించారు. సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకోవడం అవసరమని, అందులో భాగంగా రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే ప్రధానిని సీఎం జగన్ కలుస్తున్నారని చెప్పారు. డీఎస్సీలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటికీ నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. 'ఉద్యోగులు సమ్మెకు వెళ్లకూడదని కోరుకుంటున్నాం. త్వరలో అన్నీ పరిష్కరిస్తాం. ప్రభుత్వం బకాయిలున్నమాట వాస్తవమే. వాటిని ఇవ్వడం కాస్త ఆలస్యం కావచ్చేమో గానీ ఇవ్వడం మాత్రం పక్కా..' అని చెప్పారు.

టీడీపీని నమ్మి ఓటేస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు రానివ్వరు

- రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి



పలమనేరు(చిత్తూరు జిల్లా): టీడీపీ వాళ్ల మాటలు నమ్మి వారికి ఓటేస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు ఒక్కటి కూడా రావని, సచివాలయాల్లో జన్మభూమి కమిటీ సభ్యుల అరాచకాలు సాగుతాయని రాజంపేట ఎంపీ, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చెప్పారు. పలమనేరులో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమానికి సంబంధించి ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో బుధవారం బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు పట్టించుకోని టీడీపీ నాయకులు ఎన్నికలొస్తున్నాయని జనాల్లోకి వచ్చి హామీల పేరుతో జనాన్ని ఏమార్చేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. మన భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ జగన్‌నే సీఎంగా చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ప్రజలు ప్రశాంతంగా ఉండాలంటే చంద్రబాబును ఇంటికి పంపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్, మెప్మా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి డ్వాక్రా మహిళలకు 7.71 కోట్ల మెగా చెక్కును అందజేశారు.


అవినాష్‌రెడ్డికి చెక్కును అందిస్తున్న బలపనూరు డ్వాక్రా మహిళలు

సీఎం సహాయనిధికి డ్వాక్రా మహిళల సాయం

- రూ.5 లక్షల చెక్కును అందించిన వైఎస్సార్ జిల్లా బలపనూరు మహిళలు
- డ్వాక్రా మహిళలను అభినందించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు డ్వాక్రా మహిళలు మేము సైతం అంటూ బాసటగా నిలిచారు. ఈ మేరకు సీఎం సహాయనిధికి వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం బలపనూరుకు చెందిన డ్వాక్రా మహిళలు బుధవారం రూ.5 లక్షల చెక్కును అందజేశారు. రాబోయే ఎన్నికల్లో రెండోసారి కూడా అఖండ మెజార్టీతో గెలుపొంది పేద ప్రజలకు సీఎం వైఎస్ జగన్ మరింత అండగా నిలవాలని ఆకాంక్షించారు. నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాద్రిపురం మండలానికి సంబంధించి 524 డ్వాక్రా సంఘాలకు చెందిన 5,078 మంది మహిళలకు రూ.5,24,92,136 చెక్కును ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పులివెందుల ప్రాంత అభివృద్ధి సంస్థ (పాడా) ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ స్వగ్రామమైన బలపనూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత వెలుగోటి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో విజయలక్ష్మి డ్వాక్రా గ్రూపునకు చెందిన మహిళలు సీఎం అందిస్తున్న సంక్షేమ పథకాలకు తాము సైతం అంటూ ముందుకు వచ్చి రూ.5 లక్షల చెక్కును అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి డ్వాక్రా మహిళలు సాయం చేయడం పట్ల ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా బలపనూరు గ్రామ మహిళలు ఈ నెల 18న అనంతపురంలో జరిగే సిద్ధం సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు.

వల్లీ టీచర్... వెరీ స్పెషల్

మాతృదేవోభవ... పితృదేవోభవ... ఆచార్యదేవోభవ... అని నేర్చుకున్నాం.
స్పెషల్ ఎడ్యుకేటర్‌లో గురువుతోపాటు తల్లి, తండ్రి కూడా ఉంటారు.
ఆ ప్రత్యేక గురువులకు ఎన్ని వందల వందనాలు సమర్పించినా తక్కువే.
ఈ పిల్లలకు ప్రేమను పంచడానికే అంకితమైన వల్లీసుధీర్‌కి ప్రత్యేక వందనం!



● క్లాసులో పాఠాలు చెప్తున్న వల్లీటీచర్(ఫైల్)

భగవంతుడు కొంతమంది పిల్లలను భూమ్మీదకు ప్రత్యేకంగా పంపిస్తాడు. కల్మషం తెలియని ఆ స్పెషల్ కిడ్స్‌కి పాఠం చెప్పే టీచర్‌లు కూడా అంతే స్వచ్ఛమైన మనసు కలిగిన వారై ఉండాలి. ఆ టీచర్‌లు ప్రతి బిడ్డకూ అమ్మగా మారి తల్లిప్రేమను పంచాలి. స్పెషల్ టీచర్ అనేది ఉద్యోగం కాదు, అకుంఠిత దీక్షతో నిర్వహించే సేవ. నాలుగు దశాబ్దాలకు పైగా అలాంటి సేవకు తనను అంకితం చేసుకున్న మనీషి వల్లీసుధీర్. స్పెషల్ కిడ్స్‌కు సేవ చేయడానికి తన జీవితాన్ని అంకితం చేస్తానని ప్రమాణం చేసుకున్న మహోన్నతమైన వ్యక్తి ఆమె. తాను స్పెషల్ టీచర్‌గా మారిన వైనాన్ని సాక్షితో పంచుకున్నారు వల్లీసుధీర్.

సినిమారీళ్లన్ని మలుపులు!

''నేను స్పెషల్ టీచర్ కావడం వెనుక సినిమా కథలో ఉన్నన్ని మలుపులున్నాయి. మాది తెలుగు కుటుంబమే. కానీ పుట్టింది చెన్నైలో. మా నాన్న కెవీఎస్ శర్మ నటులు. ఎన్టీఆర్‌తో కలిసి చదువుకున్నారు, ఆయనతో కలిసి చెన్నైకి వెళ్లారు, ఆయనతో కలిసి సినిమాలు చేశారు. అమ్మానాన్నలకు నేను ఏకైక సంతానం. నాకు నాలుగేళ్లున్నప్పుడు నాన్న హఠాత్తుగా పోయారు. దాంతో నేను, అమ్మ మా అమ్మమ్మగారింటికి విజయవాడకు వచ్చేశాం. టెన్త్ క్లాసు పూర్తయ్యేసరికి తాతగారు కూడా పోయారు. ఇక నేను, అమ్మ హైదరాబాద్‌లోని పిన్ని వాళ్లింటికి వచ్చాం. పూర్తిగా వాళ్ల మీద ఆధారపడిపోకుండా ఏదో ఒక ఉద్యోగం చేయాలనుకున్నాను. స్వీకార్, ఉప్‌కార్ లో పిల్లలకు శిక్షకుల కోసం చూస్తున్నారని తెలిసింది. అలా స్పెషల్ చిల్డ్రన్ కోసం పని చేయాల్సిన రంగంలోకి అడుగుపెట్టాను. మొదటిరోజు నాకు ఇద్దరు కవల పిల్లలనిచ్చి చూసుకోమన్నారు. పిల్లల అవసరాలు తెలుసుకుని సముదాయించగలిగిన వయసు కాదది. ఇందులో ఇమడలేననుకుని, బాబాయ్‌కి చెప్తే 'భయపడి వదిలేయడం కాదు, నీ వంతు ప్రయత్నం చెయ్యి. తర్వాత చూద్దాం' అన్నారు. అలా కొనసాగుతున్న సమయంలో స్వీకార్ వాళ్లు నన్ను శిక్షణ కోసం మణిపాల్‌కి పంపించారు. ఆ శిక్షణ నా మీద అంతటి ప్రభావం చూపిస్తుందని ఏ మాత్రం ఊహించలేదు.

అమ్మకు పరీక్షలు పెట్టానట!

పిల్లలు మానసిక సమస్యలతో పుట్టడానికి దారి తీసే కారణాలను వివరించారు. నొప్పులు మొదలైన తర్వాత ప్రసవం జరగడానికి ఎక్కువ సమయం తీసుకోవడం, ఉమ్మనీరు పోవడం, పుట్టిన వెంటనే బిడ్డ ఏడవకపోవడం... వంటి సమస్యలను వివరిస్తూ ప్రసవం సమయంలో తల్లి మాత్రమే కాదు బిడ్డ కూడా తీవ్రమైన శారీరక, మానసిక ఒత్తిడికి లోనవుతుందని చెప్పారు. ఎక్కువ సమయం ఆక్సిజన్ అందక పోవడంతో ఎదురయ్యే పరిణామాలను వివరించారు. అంతే... నా గురించి అమ్మ ఎప్పుడూ చెప్పే ఒక విషయం గుర్తు వచ్చింది. 'నేను పుట్టినప్పుడు మా అమ్మ రెండు రోజులు నొప్పులు పడిందట. నార్మల్ డెలివరీ కాదని సిజేరియన్ చేశారు. ఉమ్మనీరు తాగడంతోపాటు, ఆక్సిజన్ అందక దేహం నీలిరంగులోకి మారిపోయిందట. పైగా పుట్టగానే ఏడవలేదు'. ఇన్ని కాంప్లికేషన్స్ మధ్య నేను నార్మల్‌గా పుట్టడం ఒక మిరకిల్. అవన్నీ మణిపాల్ శిక్షణ సమయంలో ఒక్కసారిగా రీలు తిరిగినట్లు కళ్ల ముందు మెదిలాయి. నాకు తెలియకుండానే చెంపల మీద కన్నీళ్లు కారిపోయాయి. భగవంతుడికి మనసులోనే దణ్ణం పెట్టుకుని, నార్మల్‌గా పుట్టించినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తూ... 'నా చివరి ఊపిరి వరకు స్పెషల్ కిడ్స్‌కి సర్వీస్ ఇస్తాను' అని ఒట్టుపెట్టుకున్నాను. అప్పటి నుంచి స్పెషల్ చిల్డ్రన్‌కి సర్వీస్ ఇవ్వడానికి అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవడం మీద మాత్రమే దృష్టి పెట్టాను. గ్రాడ్యుయేషన్, డీఎమ్ఆర్, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, సైకాలజీలో పీజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మరో పీజీతోపాటు లండన్‌లో 'కోర్స్ ఆఫ్ ఇంట్రడక్షన్' కోర్సు చేశాను.

స్వతంత్రులుగా నిలబెట్టాలి!

స్పెషల్ చిల్డ్రన్ గురించి సమగ్రంగా చదివిన తరవాత హైదరాబాద్‌లో 'శ్రద్ధ సెంటర్ ఫర్ స్పెషల్ చిల్డ్రన్' స్థాపించాను. ఈ పిల్లలు ప్రతి పనికీ ఒకరి మీద ఆధారపడకుండా తమ పనులు సొంతంగా చేసుకునేటట్లు తయారు చేయడం ప్రథమ లక్ష్యంగా పెట్టుకున్నాను. పర్సనల్ నీడ్స్... అంటే సొంతంగా తినడం, కాలకృత్యాలకు వెళ్లడం, శుభ్రం చేసుకోవడం వంటి పనులకు ఎవరి మీదా ఆధారపడకూడదు. రెండవది డొమెస్టిక్ స్కిల్స్, అంటే... తల దువ్వుకోవడం, దుస్తులు ధరించడం, చెప్పులు సరిగ్గా వేసుకోవడం వంటివి. ఇక మూడవది కాగ్నిటివ్ స్కిల్స్, అంటే... ప్రమాదాల గురించి తెలియచేయడం, అగ్నిప్రమాదం, జల ప్రమాదాలకు దూరంగా ఉండడం ఎలాగో నేర్పించడం, ప్రమాదాలు ఎదురైతే తప్పించుకోవడంలో శిక్షణనివ్వడంతోపాటు ఒక వస్తువు కొనడం, దుకాణానికి వెళ్లి డబ్బు ఇచ్చి కొనుగోలు చేసిన తరవాత చిల్లర డబ్బు తీసుకుని లెక్క చూసుకోవడం వంటి వాటిలో శిక్షణనివ్వడం అన్నమాట. ఈ మేరకు తర్ఫీదు ఇస్తే ఇక వాళ్ల జీవితంలో ఎవరికీ భారంగా పరిణమించరు. అందుకే ఈ మూడింటినే ప్రధానంగా తీసుకున్నాను. కానీ ముందే చెప్పాను కదా! నా జీవితంలో సినిమాకంటే ఎక్కువ మలుపులున్నాయని. నా ప్రయత్నం ఒకదారిలో పడే సమయానికి అమ్మ ఆరోగ్యం క్షీణించింది. ఇక నేను ఈ సెంటర్ మీద పూర్తి సమయం కేటాయించడం కుదిరేపని కాదని నా ఫ్రెండ్‌కి అప్పగించాను. శ్రద్ధ సెంటర్‌లో పిల్లలకు ఏ ఇబ్బంది లేకుండా చేయగలిగాను. కానీ నాకు రోజులు గడిచేదెలా? అమ్మకు వైద్యం చేయించేదెలా? అప్పుడు 'గీతాంజలి దేవశాల' స్పెషల్ స్కూల్‌లో చేరాను. అందులో 24 సంవత్సరాలు ఉద్యోగం చేశాను. స్వీకార్ ఉప్‌కార్ నుంచి చూసుకుంటే 44 ఏళ్లు పూర్తయ్యాయి.

> ### ఎవరికి వాళ్లు ప్రత్యేకమే!
>
> 
>
> ఇన్నేళ్ల నా అనుభవంలో తెలుసుకున్నదేమిటంటే... స్పెషల్ చిల్డ్రన్‌కి శిక్షణ ఇవ్వడానికి రూపొందించిన కోర్సులన్నీ ఒకరకమైన సాధనాలు మాత్రమే. వాటిని పిల్లవాడికి ఎలా అన్వయింపచేయాలనేది టీచర్ స్వీయ విచక్షణతో తెలుసుకుని ఆచరించాలి. ఒక సూత్రం ఏ ఇద్దరు పిల్లలకూ వర్తించదు. ఎవరికి వాళ్లు ప్రత్యేకమే. మా దగ్గరకు వచ్చిన పిల్లలకు ప్రేమ పంచాలి, బాధ్యతగా శిక్షణనివ్వాలి. అలా నేర్పిస్తూ పాతిక మందిని ఓపెన్ స్కూలింగ్‌లో టెన్త్ క్లాస్ పరీక్షకు సిద్ధం చేశాం. ఆటల్లో శిక్షణనిచ్చి పోటీలకు తీసుకెళ్లాం. మా దగ్గర శిక్షణ పొందిన పిల్లలు స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో ఇంగ్లండ్‌లో క్రీడల పోటీలకు కూడా వెళ్లారు.
>
> **- వల్లీ సుధీర్,** స్పెషల్ టీచర్

పిచ్చి టీచర్ అనేవాళ్లు!

సమాజంలో అప్పటికీ ఇప్పటికీ కొంత మార్పు వచ్చిన మాట నిజమే, కానీ రావలసినంత మార్పు రాలేదనే చెప్పాలి. అప్పట్లో మా గుర్తింపు 'పిచ్చి టీచర్', ఇప్పుడు స్పెషల్ ఎడ్యుకేటర్ బాధ్యత ఎంత క్లిష్టమైనదో అర్థం చేసుకుని మమ్మల్ని గౌరవంగా చూస్తున్నారు. ఈ సున్నితత్వం స్పెషల్ చిల్డ్రన్ విషయంలోనూ రావాలి. అప్పటిలాగ దూరం పెట్టడం లేదు కానీ దగ్గరకు రానివ్వడంలో ఒకింత సందిగ్ధంగానే ఉంటున్నారు. తమ పొరుగింట్లో స్పెషల్ కిడ్ ఉంటే ఆ కిడ్‌ని సానుభూతితో చూస్తున్నారు తప్ప, తమ పిల్లలతో ఆడుకోవడానికి అనుమతించలేకపోతున్నారు. విద్యావ్యవస్థ మాత్రం స్పెషల్ కిడ్స్ కోసం ఒక విభాగం ఉండాలనే నియమంతో ఓ ముందడుగు వేసిందనే చెప్పాలి. ఇద్దరు పిల్లల్లో ఒకరు స్పెషల్ కిడ్, ఒకరు నార్మల్ కిడ్ అయితే ఆ తల్లిదండ్రులు పిల్లలతో ఎలా వ్యవహరించాలి, స్పెషల్ కిడ్ తల్లి ఇరుగుపొరుగు వారితో, వారి పిల్లలతో ఎలా మెలగాలి వంటివన్నీ చెప్పడానికి ఒక వేదిక ఉంటే బావున్నని చూస్తున్నాను. ఇన్నాళ్లూ నా సర్వీస్‌కి వేదిక గీతాంజలి దేవశాల. ఇప్పుడు టెక్నాలజీ సాయంతో చెప్పాలా లేక వేరే మాధ్యమాలలో ప్రయత్నించాలా అనేది ఇంకా ఆలోచించలేదు. నాకు నేను పెట్టుకున్న ఒట్టు ప్రకారం చివరి శ్వాస వరకు స్పెషల్ కిడ్స్ కోసం పని చేస్తూనే ఉంటాను '' అన్నారు వల్లీసుధీర్.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బ్యూటిప్స్

అందమైన ఆరోగ్యానికి ఏడు సూత్రాలు

- చర్మం పేలవంగా ఉంటే స్వచ్ఛమైన కొబ్బరి నూనె రాయాలి. రాత్రి పడుకునే ముందు ముఖానికి, మెడకు, చేతులకు కొబ్బరినూనె రాసి వేళ్లతో వలయాకారంగా మసాజ్ చేసుకుంటే చర్మం ఆరోగ్యవంతమవుతుంది. కొబ్బరినూనె సూర్యరశ్మిలోని అల్ట్రావయొలెట్ కిరణాల కారణంగా ఎదురయ్యే సమస్యల నుంచి చర్మాన్ని కాపాడుతుంది.
- ముఖం మీద మచ్చలు, ముడతలు, చర్మం చిరచిరలాడడం వంటి ఇబ్బందులు పోవాలంటే కలబంద గుజ్జు రాసి పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. కలబంద చెట్టు నుంచి ఆకు విరిచి దాని నుంచి గుజ్జు తీసుకుని నేరుగా ముఖానికి రాయడమే. ఇంట్లో చెట్టు లేకపోతే రెడీమేడ్ అలోవెరా జెల్ వాడవచ్చు.
- పాలుగారే చర్మం కోసం రోజూ ముఖానికి మిల్క్ ఫేస్ ప్యాక్ వేయాలి. రెండు స్పూన్‌ల పాలలో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ శనగపిండి కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ప్యాక్ కలుపుకోవడానికి సమయం లేకపోతే పాలలో దూదిని ముంచి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత శుభ్రం చేసినా ఫలితం ఉంటుంది.
- చర్మం పొడిబారకుండా తేమగా ఉండాలంటే తేనె వాడాలి. సబ్బుతో ముఖం కడిగి తుడిచిన తర్వాత టీ స్పూన్ తేనెను అరచేతిలో వేసుకుని వేళ్లతో ముఖానికి పట్టిస్తూ వలయాకారంగా మసాజ్ చేయాలి. ముఖం, మెడకు పట్టించడం పూర్తయిన తర్వాత ఐదు నిమిషాల సేపు ఆరనిచ్చి గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి.
- తరుముకొస్తున్న వార్ధక్య లక్షణాలను నిలువరించడంలో బొప్పాయి చాలా బాగా పని చేస్తుంది. బాగా పండిన బొప్పాయి పండు గుజ్జు టేబుల్ స్పూన్, టీ స్పూన్ తేనె కలిపి ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తర్వాత శుభ్రం చేయాలి.



ఇప్పటి వరకు మనం చెప్పుకున్నవన్నీ చర్మానికి బయటి నుంచి చేసే చికిత్సలు. దేహం ఆరోగ్యంగా ఉంటే చర్మం కూడా నిగారిస్తుంది. అందుకు రోజుకు పది గ్లాసుల నీటిని తప్పకుండా తాగాలి. ఇక ఆహారం విషయానికి వస్తే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. శారీరక వ్యాయామం తగినంత ఉండాలి. అలాగే ఎనిమిది గంటల మంచినిద్ర కూడా. ఇవన్నీ పాటిస్తే మెదడు చురుగ్గా, దేహం ఉత్సాహంగా పని చేస్తాయి. స్వేదం రూపంలో వ్యర్థాలు వెళ్లిపోవడంతో చర్మ సౌందర్యం ఇనుమడిస్తుంది.

న్యూస్‌మేకర్

గిరిజన గూడెంలో తొలి మహిళా జడ్జి

తమిళనాడు తిరుపట్టూరు జిల్లా ఎలగిరి హిల్స్‌కు చెందిన 23 ఏళ్ల గిరిజనురాలు వి.శ్రీపతి సివిల్ జడ్జిగా అర్హత పొంది చరిత్ర సృష్టించారు. నిండు చూలాలుగా ఉండగా పరీక్ష రాసి మరీ ఆమె అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఇప్పటి వరకూ తమిళనాడులో గిరిజన మహిళా జడ్జి లేరు. శ్రీపతి పరిచయం.



● కుమార్తెతో శ్రీపతి

ఆరు నెలల క్రితం.

తమిళనాడు తిరుపట్టూరు జిల్లాలోని యలగిరి హిల్స్ నుంచి ఒక కారు చెన్నైకి బయలుదేరింది. నాలుగున్నర గంటల ప్రయాణం. లోపల ఉన్నది పచ్చి బాలింత. అంతకు ముందు రోజే ఆమెకు ప్రసవమయ్యి ఆడపిల్ల పుట్టింది. కాని మరుసటి రోజు చెన్నైలో 'తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్'(టి.ఎన్.పి.ఎస్.సి) ఎగ్జామ్ ఉంది. అందులో ఉత్తీర్ణత సాధిస్తే ఆమె 'సివిల్ జడ్జ్' పోస్ట్‌గా అర్హత సాధిస్తుంది. అందుకే ప్రయాణం చేస్తోంది. ఆమె పేరు వి. శ్రీపతి. వయసు 23. ఆమెకు తోడుగా ఉన్నది భర్త వెంకటేశన్, తండ్రి కలియప్పన్. కొండ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసుకుని తరతరాలుగా బతుకుతున్న 'మలయలి' తెగలో ఆడపిల్లలు చదువుకోవడం చాలా విశేషం. లా చేయడం ఇంకా విశేషం. సివిల్ జడ్జి కావడం అంటే చరిత్రే.

చురుకైన అమ్మాయి

తిరువణ్ణామలైలోని గిరిజన గూడెంలో కలియప్పన్ అనే మలయాళి రైతుకు తొలి కుమార్తెగా జన్మించిన శ్రీపతి పసిపాపగానే చురుగ్గా ఉండేది. తిరువణ్ణామలై గిరిజన గ్రామాల్లో చదువు సరిగ్గా లేదు. వీళ్ల గూడెం నుంచి బస్సెక్కాలంటే 15 కిలోమీటర్లు నడవాలి. అందుకే కుమార్తె చదువు కోసం కలియప్పన్ అక్కడినుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న యలగిరి హిల్స్ (తిరుపట్టూరు జిల్లా)కు మకాం మార్చాడు. ఇక్కడా కొండల్లో వ్యవసాయమే అయినా వీళ్లుండే అత్తనావూర్‌లో ఇంటర్ వరకూ చదివించే మిషనరీ స్కూల్ ఉంది. అక్కడే శ్రీపతి ఇంటర్ వరకూ చదువుకుంది. 'ఇప్పుడు చదివి ఏం చేయాలంటా' అని తోటి తెగవారు తండ్రిని, తల్లిని ప్రశ్నించి ఇబ్బంది పెట్టినా వాళ్లు తమ కుమార్తె చదవాల్సిందేనని ప్రోత్సహించారు. ఇంటర్ అయ్యాక లా చదవాలని నిశ్చయించుకుంది శ్రీపతి.

గిరిజనుల హక్కుల కోసం

'మా గిరిజనులకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు ఉన్నాయో మావాళ్లకు తెలియదు. వారిని చైతన్యవంతం చేయాలి. వారి హక్కులు వారు పొందేలా చేయాలి. అందుకే లా చదవాలని నిశ్చయించుకున్నాను' అంది శ్రీపతి. ఇంటర్‌లో మంచి మార్కులు రావడంతో ఐదేళ్ల లాకోర్సులో చేరింది. చదువు సాగుతుండగానే అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేసే వెంకటేశన్‌తో వివాహం జరిగింది. చదువు పూర్తయ్యాక సివిల్ జడ్జి పోస్ట్ కోసం టి.ఎస్.పి.ఎస్.సి పరీక్ష రాసే సమయానికి నిండు చూలాలు. అయినప్పటికీ బిడ్డకు జన్మనిచ్చి పరీక్ష రాసింది. ఇప్పుడు రిజల్ట్స్ వచ్చి సివిల్ జడ్జిగా పోస్ట్ వచ్చింది. ఈ సంగతిని ప్రస్తావిస్తూ తమిళనాడు సి.ఎం స్టాలిన్, తమిళ సినీ ప్రముఖులు అభినందనలు తెలియచేశారు. 'తమిళ మీడియంలో చదువుకున్నవారికి ఉద్యోగాల్లో అవకాశం కల్పించే విధంగా ద్రవిడ మోడల్‌ను ప్రవేశ పెట్టడం వల్లే శ్రీపతి సివిల్‌జడ్జి కాగలిగిందని... ఇలా మారుమూల ప్రాంతాల వారికి అవకాశం దక్కాలని' స్టాలిన్ ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఇంటిప్స్

కార్పెట్ మీద బబుల్ గమ్, చూయింగ్ గమ్ లాంటివి పడి అవి ఎంతకూ ఊడి రాకపోతుంటే వ్యాక్యూమ్ క్లీనర్‌తో తొలగించవచ్చు.



ఉడెన్ సోఫా మీద స్టిక్కర్లు వంటివి అతికించినప్పుడు ఆ స్టిక్కర్ తీసేసినా, గమ్ మరకలు అలాగే ఉండిపోతాయి. అలాంటప్పుడు కాటన్ క్లాత్ మీద కొంచెం కొబ్బరినూనె వేసి గమ్ మీద రుద్దితే సులువుగా వదులుతుంది.



ఎంపవర్‌మెంట్

గేమ్ చేంజర్





వీడియో గేమ్స్ అంటే పవర్‌ఫుల్ వెపన్స్, పవర్‌ఫుల్ ఫైట్స్ మాత్రమేనా? 'కాదు' అంటుంది ఉమెన్ ఎంపవర్‌మెంట్‌కు పెద్ద పీట వేసిన 'గో నిషా గో' పదిహేను నుంచి పందొమ్మిది సంవత్సరాల మధ్య వయసు ఉన్న అమ్మాయిలకు రుతుచక్రం, పెళ్లి, చదువు, కెరీర్... మొదలైన వాటి గురించి అవగాహన కలిగిస్తోంది ఫ్రీ మొబైల్ గేమ్ గో నిషా గో. ఈ గేమ్ అంతర్జాతీయ స్థాయిలో 'బెస్ట్ సీరియస్ గేమ్' అవార్డ్ గెలుచుకుంది...



చాలామంది అమ్మాయిలకు బంగారు కలలు ఉంటాయి. అయితే రకరకాల కారణాల వల్ల ఆ కలలు సాకారం చేసుకోలేక పోతారు. 'ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా నా కలను సాకారం చేసుకుంటాను' అనే పట్టుదల ఉంటే కలను నెరవేర్చుకోవడం అసాధ్యమేమీ కాదు.

దిల్లీలోని ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన 'నిషా' కల్పిత పాత్ర. 'గో నిషా గో' గేమ్‌లో ప్రధాన పాత్ర.

'నా ప్రయాణంలో ధైర్యమే నా ఆయుధం' అనుకుంటే తడబడడం ఉండదు. అధైర్యం అసలే ఉండదు. దీనికి ఉదాహరణ నిషా. పందొమ్మిది సంవత్సరాల నిషా ఎన్నో కలలు కంటుంది. ఆ కలల దారిలో నిషాకు ఎదురైన అనుభవాలకు 'గో నిషా గో' అద్దం పడుతుంది. మొబైల్ గేమ్ 'గో నిషా గో' యువ యూజర్‌లకు మార్గ నిర్దేశం చేస్తుంది. బాల్య వివాహాలను నిరాకరించడం నుంచి ఆర్థిక స్వాతంత్ర్యం వరకు కీలక అంశాలపై అవగాహన కలిగించే గేమ్ ఇది.

డిజిటల్ గేమ్ ప్లాట్‌ఫామ్ 'గేమ్ ఆఫ్ చాయిస్ నాట్ చాన్స్' నుంచి వచ్చిన తొలి గేమ్ 'గో నిషా గో'. 'క్రియేటివ్ నాన్–ప్రాఫిట్ సంస్థ గర్ల్ ఎఫెక్ట్ భాగస్వామ్యంతో దిల్లీ, రాజస్థాన్, బిహార్‌లలోని రెండు వందల మందికి పైగా అమ్మాయిలతో మాట్లాడాం. కౌమారదశలో వారు ఎదుర్కొన్న సమస్యలపై ఎన్నో ప్రశ్నలు అడిగాం. రకరకాల సవాళ్లు ఎదురైనప్పుడు సలహాల కోసం ఎవరి దగ్గరకు వెళతారు... ఇలాంటివి ఎన్నో అడిగాం' అంటుంది 'గేమ్ ఆఫ్ చాయిస్–నాట్ చాన్స్' కంట్రీ డైరెక్టర్ కవితా అయ్యగారి. రుతుస్రావం నుంచి సంతానోత్పత్తి వరకు ఎన్నో అంశాలపై అమ్మాయిలకు విశ్వసనీయమైన సమాచారం అందుబాటులో లేదనే విషయం కవిత బృందానికి అర్థమైంది. తాము ఎదుర్కొనే సమస్యల గురించి మాట్లాడటానికి అమ్మాయిలు సంకోచించడం, సామాజిక కట్టుబాట్ల పేరుతో తల్లిదండ్రుల ఒత్తిడి... మొదలైన విషయాలను బృందం గ్రహించింది.

ఏ సలహా దొరకక, ఏ దారి కనిపించక అయోమయంలో ఉన్న అమ్మాయిలకు 'నిషా' గేమ్ ఒక దారి చూపుతుంది. నైతికస్థైర్యాన్ని ఇస్తుంది. ఈ గేమ్ మెన్‌స్ట్రుయెల్ హెల్త్ హెల్ప్‌లైన్‌తో సహా రకరకాల ఆరోగ్య అంశాలకు సంబంధించిన ఉత్పాదనలు, సేవలు, మహిళల సమస్యలపై పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు సంబంధించి వీడియో లింక్‌లను అందిస్తుంది. 'గో నిషా గో' గూగుల్ ప్లేస్టోర్‌లో ఉచితంగా అందుబాటులో ఉంది.

> ### అవగాహన పెంచుతోంది...
>
> 'గో నిషా గో' గేమ్ ఆడని వారితో పోల్చితే ఆడేవారిలో వివిధ విషయాలపై అవగాహన మెరుగు అవుతున్నట్లు అధ్యయన ఫలితాలు తెలియజేస్తున్నాయి. విషయ అవగాహనతో పాటు ఆత్మస్థైర్యం కూడా ఈ ఆట పెంచింది. ఈ గేమ్ ప్రభావంతో ఆగిపోయిన చదువును తిరిగి కొనసాగించిన వారు. 'నాకు పై చదువులు చదువుకోవాలని ఉంది. ఇప్పుడే పెళ్లి వద్దు' అని తల్లిదండ్రులతో ధైర్యంగా చెప్పిన వారు. ఆర్థిక స్వాతంత్ర్యంపై దృష్టి పెట్టినవారు ఎంతో మంది ఉన్నారు. హోవార్డ్ డెలాఫీల్డ్ ఇంటర్నేషనల్(హెచ్‌డిఐ) 'గేమ్ ఆఫ్ చాయిస్–నాట్ చాన్స్' సోషల్ ఇంపాక్ట్ ప్రాజెక్ట్ కింద 'గో నిషా గో'కు శ్రీకారం చుట్టింది.
>
> 
>
> 'హెచ్‌డీఐ' అనేది సామాజిక, పర్యావరణ, ఆరోగ్య సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను అన్వేషించే మహిళల నేతృత్వంలోని బృందం.
>
> 'మా అమ్మ తన కలలు, లక్ష్యాల పట్ల చాలా స్పష్టతతో ఉన్న వ్యక్తి. అమెరికాలో చదువుకోవాలనే కోరిక ఆమెకు ఉండేది. తన చదువు కోసం పెళ్లిని వాయిదా వేయాలని, గ్రాడ్యుయేషన్ పూర్తయిన తరువాతే పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులతో ధైర్యంగా చెప్పింది. తన కలల గురించి గట్టిగా నిలబడకపోతే ఆమె జీవితం మరోలా ఉండేది' అంటుంది 'హెచ్‌డిఐ' కో–ఫౌండర్ సుసాన్ హోవార్డ్.

కిచెన్‌టిప్స్



గులాబ్ జామున్‌లు గట్టిగా అయితే పంచదార పాకంతో సహా వాటిని ప్రెషర్ కుక్కర్ లో పెట్టి సన్నటి మంటమీద ఐదు నిమిషాలు ఉడికిస్తే మృదువుగా మారతాయి.



పనీర్ వంటకం చేసేటప్పుడు నీళ్లకు బదులుగా పాలు వాడితే గ్రేవీ మెత్తగా ఉంటుంది.

టేబుల్ స్పూన్ ఫ్రూట్ జామ్‌ను ఒక గ్లాను చల్లటి పాలలో వేసి మిక్సీలో బ్లెండ్ చేస్తే క్షణాల్లో రుచికరమైన ఫ్రూట్ షేక్ రెడీ అయిపోతుంది.



క్వార్టర్స్‌లో రామ్‌కుమార్ రామనాథన్



భారత డేవిస్‌కప్ ప్లేయర్ రామ్‌కుమార్ రామనాథన్ అగ్రశ్రేణి ఆటతీరుతో టాప్‌సీడ్ ఆటగాడికి షాకిచ్చాడు. బెంగళూరు ఓపెన్ ఏటీపీ-100 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో వైల్డ్ కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగిన రామ్‌కుమార్ అద్భుతమైన విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత ప్లేయర్ 1-6, 6-4, 6-4తో టాప్ సీడ్ ల్యూకా నర్డి (ఇటలీ)ని ఓడించాడు. తొలి సెట్‌లో నర్డి ధాటికి రామ్‌కుమార్ తేలిపోయాడు. సెట్ ఆరంభంలోనే అతని సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఇటలీ స్టార్ ప్లేయర్ అలవోకగా తొలి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. అయితే తర్వాతి సెట్లలో భారత ఆటగాడు దూకుడు కనబరిచాడు. రెండో సెట్‌లో 3-2తో ఆధిక్యంలో ఉన్న దశలో కీలకమైన బ్రేక్ పాయింట్ సాధించిన రామ్‌కుమార్ అదే జోరుతో సెట్ గెలిచి 1-1తో సమం చేశాడు. మూడో సెట్‌లో రామ్ సంధించిన ఏస్‌లకు టాప్‌సీడ్ ఆటగాడు బదులివ్వలేకపోయాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసిన భారత ఆటగాడు ఈ సెట్‌లోనూ దూకుడు పెంచి మ్యాచ్ గెలిచాడు. నర్డి 4 ఏస్‌లు సంధిస్తే... రామ్‌కుమార్ 9 ఏస్‌లు సంధించాడు.

మరో సమరానికి సన్నద్ధం

- నేటినుంచి భారత్, ఇంగ్లండ్ మూడో టెస్టు
- ఆధిక్యంపై ఇరు జట్ల దృష్టి
- ఉ.గం.9.30నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్షప్రసారం

తొమ్మిది రోజులు...భారత్, ఇంగ్లండ్ రెండో, మూడో టెస్టు మ్యాచ్‌ల మధ్య విరామం! చూస్తుంటే ఒక సిరీస్ 1-1తో ముగిసిపోయింది. ఇప్పుడు కొత్తగా మూడు టెస్టుల సిరీస్ మొదలవుతున్నట్లుగా అనిపిస్తోంది. ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్ ఆడుతున్న నేపథ్యంలో కొత్త ఉత్సాహంతో, కొత్త వ్యూహాలతో బరిలోకి దిగేందుకు ఇది పనికొచ్చింది. ఇప్పుడు సిరీస్‌లో ఆధిక్యం ప్రదర్శించేందుకు మరో పోరుకు రంగం సిద్ధమైంది. విరామం తర్వాత పైచేయి ఎవరిదనేది ఆసక్తికరం.





2024 టి20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు రోహిత్ శర్మనే కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. బోర్డు కార్యదర్శి జై షా ఈ విషయాన్ని నిర్ధారించారు.

రాజ్‌కోట్: టెస్టు సిరీస్‌లో 1-1తో సమంగా ఉన్న స్థితిలో మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లేందుకు భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి. నేటినుంచి జరిగే మూడో టెస్టులో ఇరు జట్లు హోరాహోరీగా తలపడేందుకు సిద్ధమయ్యాయి. ఉత్కంఠభరితంగా సాగిన తొలి టెస్టులో ఇంగ్లండ్ విజయం సాధించగా...రెండో టెస్టులో భారత్‌కు భారీ విజయం దక్కింది. అయితే గత పర్యటనతో పోలిస్తే ఇంగ్లండ్ కాస్త మెరుగైన ప్రదర్శన కనబర్చగా...భారత్ కోణంలో చూస్తే అనూహ్యంగా గట్టి పోటీ ఎదురైంది. బుధవారం జరిగిన కార్యక్రమంలో రాజ్‌కోట్ మైదానాన్ని 'నిరంజన్ షా స్టేడియం'గా బీసీసీఐ పేరు పెట్టింది.

సర్ఫరాజ్ అరంగేట్రం!

రెండో టెస్టుతో పోలిస్తే భారత తుది జట్టులో మార్పులు ఖాయమయ్యాయి. గాయంతో వైజాగ్ టెస్టుకు దూరమైన రవీంద్ర జడేజా తిరిగి జట్టులోకి వస్తున్నాడు. తన సొంత మైదానంలో అతడు చెలరేగిపోతే ఇంగ్లండ్‌కు కష్టాలు తప్పవు. అయ్యర్‌పై వేటు పడటంతో అతని స్థానంలో బ్యాటర్‌గా సర్ఫరాజ్ ఖాన్‌కు తొలి అవకాశం దక్కవచ్చు. వికెట్ కీపర్‌గా ఆంధ్ర ఆటగాడు కేఎస్ భరత్‌ను తప్పించి ధ్రువ్ జురేల్‌ను ఎంపిక చేయవచ్చని కూడా తెలుస్తోంది. అయితే జురేల్‌ను ఆడిస్తారా లేక భరత్‌కు చివరి చాన్స్ ఇస్తారా చూడాలి. మిడిలార్డర్‌లో అనుభవలేమి కనిపిస్తుండటంతో బ్యాటింగ్ భారం ప్రధానంగా టాప్-3పైనే ఉంది. గత మ్యాచ్‌లో జైస్వాల్ తానేంటో నిరూపించుకోగా, గిల్ కూడా కీలక సెంచరీ సాధించాడు. రోహిత్ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఇప్పుడైనా ఆడాల్సి ఉంది. బౌలింగ్‌లో అశ్విన్, కుల్దీప్‌లను ఇంగ్లండ్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. బుమ్రా స్థాయి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముకేశ్ స్థానంలో సిరాజ్ వస్తాడు.

ఇద్దరు పేసర్లతో...

తొలి రెండు టెస్టుల్లో ఒకే ఒక పేసర్‌కే పరిమితమైన ఇంగ్లండ్ ఈ సారి వ్యూహం మార్చింది. రెండో పేసర్‌గా అండర్సన్‌తో పాటు వుడ్ తుది జట్టులోకి వచ్చాడు. స్పిన్నర్లలో హార్ట్‌లీ ఇప్పటికే సత్తా చాటగా, రేహన్ పర్వాలేదనిపించాడు. వుడ్ రాకతో ఆఫ్‌స్పిన్నర్ బషీర్‌పై వేటు పడింది. అయితే రూట్ ఆఫ్ స్పిన్ జట్టుకు అదనపు బలంగా మారింది కాబట్టి సమస్య ఉండకపోవచ్చు. ఓడినా, గెలిచినా ఆ జట్టు బ్యాటింగ్ శైలిలో మార్పు ఉండకపోవచ్చు. ఓపెనర్లు క్రాలీ, డకెట్‌లతో పాటు పాటు పోప్ దూకుడు కొనసాగిస్తున్నాడు. ఇంకా ప్రభావవంతమైన ఇన్నింగ్స్ ఆడని రూట్, బెయిర్‌స్టో రాణించాల్సి ఉంది. స్టోక్స్ బ్యాటింగ్‌లో ఎలా చెలరేగుతాడో చూడాలి. అతని నాయకత్వ ప్రతిభకు కూడా ఈ మ్యాచ్ పరీక్ష కానుంది.

పిచ్, వాతావరణం

ఎప్పటిలాగే ఈ పిచ్ బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. పరుగుల వరదకు అవకాశం ఉంది. అయితే జడేజా చెప్పినదాన్ని బట్టి చూస్తే మ్యాచ్ సాగిన కొద్దీ పగుళ్లు ఏర్పడి స్పిన్‌ను అనుకూలిస్తుంది. కాబట్టి టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ తీసుకోవడం సరైన నిర్ణయం అవుతుంది. మంచి వాతావరణం, వర్షసూచన లేదు.

జట్ల వివరాలు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, రజత్, సర్ఫరాజ్, జడేజా, భరత్/ జురేల్, అశ్విన్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్. **ఇంగ్లండ్:** స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, రేహన్, హార్ట్‌లీ, వుడ్, అండర్సన్.

100 - 500 - 700

ఈ టెస్టులో పలు ఆటగాళ్లకు వ్యక్తిగతంగా ఇది చిరస్మరణీయ మ్యాచ్ కానుంది. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కెరీర్‌లో ఇది 100వ టెస్టు మ్యాచ్. ఈ ఘనత సాధించిన 16వ ఇంగ్లండ్ ఆటగాడిగా స్టోక్స్ నిలుస్తాడు. మరో వికెట్ తీస్తే భారత స్పిన్నర్ అశ్విన్ 500 వికెట్ల ఘనతను అందుకుంటాడు. ఈ మైలురాయిని చేరిన 9వ ఆటగాడిగా నిలుస్తాడు. మరో 5 వికెట్లు తీస్తే అండర్సన్ 700 వికెట్ల ఘనతను అందుకుంటాడు.

చైనాకు భారత మహిళల షాక్

3-2తో సింధు బృందం విజయం

- హాంకాంగ్‌పై పురుషుల జట్టు గెలుపు
- ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్





షా ఆలమ్ (మలేసియా): బ్యాడ్మింటన్‌లో మేటి జట్టయిన చైనాకు భారత్ చేతిలో ఎదురుదెబ్బ తగిలింది.. ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో చక్కటి ప్రదర్శనతో భారత మహిళల జట్టు 3-2తో చైనా బృందాన్ని కంగు తినిపించింది. అన్నింటికి మించి భారత స్టార్ షట్లర్ పూసర్ల వెంకట సింధు చాన్నాళ్ల తర్వాత విజయంతో ఈ సీజన్‌ను ప్రారంభించింది. గాయాలు వెన్నంటే వైఫల్యాలతో గత సీజన్ ఆసాంతం నిరాశపర్చిన ఆమె ఈ ఏడాది గట్టి ప్రత్యర్థిపై ఘనమైన విజయంతో సత్తా చాటుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో సింధు 21-17, 21-15తో హన్ యుపై గెలిచి జట్టును 1-0తో ఆధిక్యంలో నిలిపింది. రెండు ఒలింపిక్ పతకాల విజేత అయిన సింధు కేవలం 40 నిమిషాల్లోనే తనకన్నా మెరుగైన ర్యాంకర్ ఆట కట్టించింది. రెండో గేమ్‌లో సింధు ఒక దశలో 10-13తో వెనుకబడినా...తర్వాతి 13 పాయింట్లలో 11 గెలుచుకొని విజేతగా నిలవడం విశేషం. అనంతరం జరిగిన డబుల్స్ పోటీల్లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీ 19-21, 16-21తో లియు షెంగ్ షు-తన్ నింగ్ జంట చేతిలో ఓడటంతో స్కోరు 1-1తో సమమైంది. ఆ వెంటనే జరిగిన రెండో సింగిల్స్‌లో అష్మిత చాలిహ 13-21, 15-21తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ వాంగ్ జి యి చేతిలో ఓడిపోవడంతో భారత్ 1-2తో వెనుకబడింది. ఈ దశలో మరో తెలుగమ్మాయి పుల్లెల గాయత్రి... ట్రిసా జాలీతో కలిసి డబుల్స్ బరిలో దిగి మ్యాచ్ గెలుపొందడంతో భారత శిబిరం ఊపిరి పీల్చుకుంది. గాయత్రి-ట్రిసా ద్వయం 10-21, 21-18, 21-17తో లి యి జింగ్-లు జు మిన్ జంటపై నెగ్గడంతో భారత్ 2-2తో చైనాను నిలువరించింది. దీంతో అందరి దృష్టి నిర్ణాయక పోరుపైనే పడింది. ఇందులో అంతగా అనుభవం లేని 472 ర్యాంకర్ అన్‌మోల్ ఖర్బ్ 22-20, 14-21, 21-18తో ప్రపంచ 149వ ర్యాంకర్ వు లు యుపై అసాధారణ విజయం సాధించి భారత్‌ను గెలిపించింది. తొలిసారి ఈ టోర్నీలో బరిలోకి జాతీయ చాంపియన్ అన్‌మోల్ తీవ్ర ఒత్తిడిని అధిగమించి విజయాన్ని అందుకోవడం విశేషం.

ప్రణయ్ ఓడినా...

పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ 4-1తో హాంకాంగ్‌పై జయభేరి మోగించింది. తొలి సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్ 18-21, 14-21తో ఎన్గ్ క లాంగ్ అంగుస్ చేతిలో ఓడినా... తుది విజయం మనదే అయింది. ప్రపంచ నంబర్‌వన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి 21-16, 21-11తో లుయి చున్ వాయ్-యింగ్ సింగ్ చొయ్ ద్వయంపై అలవోక విజయం సాధించింది. రెండో డబుల్స్‌లో ఎమ్.ఆర్.అర్జున్-ధ్రువ్ కపిల జంట 21-12, 21-7తో చౌ హిన్ లాంగ్-హంగ్ కుయె చున్ జోడీపై నెగ్గింది. 3-1తో విజయం ఖాయమవగా... ఆఖరి సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 21-14, 21-18తో జాసన్ గునవాన్‌పై గెలుపొందడంతో ఆధిక్యం 4-1కు పెరిగింది. మహిళల గ్రూప్ 'డబ్ల్యూ'లో రెండే జట్లు ఉండటంతో భారత్, చైనా ఈ మ్యాచ్‌కు ముందే నాకౌట్‌కు అర్హత సాధించాయి. పురుషుల విభాగంలో మాత్రం గురువారం జరిగే పోరులో చైనాతో భారత్ తలపడుతుంది.

బెంగాల్ వారియర్స్ అవుట్

కోల్‌కతా: ప్రొ కబడ్డీ లీగ్ 'ప్లే ఆఫ్స్' రేసులో నిలవాలంటే మిగిలివున్న రెండు మ్యాచ్‌ల్ని కచ్చితంగా గెలవాల్సిన స్థితిలో బెంగాల్ వారియర్స్ 26-29తో పుణేరి పల్టన్ చేతిలో ఓడిపోయింది. దీంతో హరియాణా స్టీలర్స్‌కు నాలుగో సెమీస్ బెర్తు దాదాపు ఖాయమైంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పుణేరి రెయిడర్లు ఆకాశ్ షిండే 10, పంకజ్ మోహితే 6 పాయింట్లు సాధించగా, బెంగాల్ జట్టులో నితిన్ కుమార్ (5), మణిందర్ (4) రాణించారు. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 45-43తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. ఢిల్లీ తరఫున అశు మలిక్ (18) అదరగొట్టాడు. తలైవాస్ జట్టులో నరేందర్ కూడా 18 పాయింట్లు సాధించాడు.

భారత్ పోరాడినా...

రూర్కెలా: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 0-1 తేడాతో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. నెదర్లాండ్స్ తరఫున 27వ నిమిషంలో ఆల్బర్స్ ఫెలిస్ ఏకైక గోల్ నమోదు చేసింది. మ్యాచ్‌లో ఓడినా అత్యంత బలమైన వరల్డ్ నంబర్‌వన్ జట్టును చక్కటి డిఫెన్స్‌తో చాలా వరకు నిలువరించడంలో భారత మహిళలు సఫలమయ్యారు.

క్యారీ 8 క్యాచ్‌లు!



అడిలైడ్: ఆస్ట్రేలియా వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ దేశవాళీ వన్డే మ్యాచ్‌లో అత్యధిక క్యాచ్‌లు పట్టిన వికెట్ కీపర్‌గా ప్రపంచ రికార్డును సమం చేశాడు. క్వీన్స్‌లాండ్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో సౌత్ ఆస్ట్రేలియా కీపర్ క్యారీ 8 క్యాచ్‌లు అందుకోవడం విశేషం. గతంలో డెరెక్ టేలర్, జేమ్స్ పైప్ ఈ ఘనత సాధించారు.

న్యూజిలాండ్ 211 ఆలౌట్

హామిల్టన్: రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ డేన్ పీట్ (5/89) తిప్పేయడంతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకే ఆలౌటైంది. దీంతో సఫారీకి 31 పరుగుల ఆధిక్యం లభించింది. విలియమ్సన్ (43; 7 ఫోర్లు), లాథమ్ (40; 1 ఫోర్, 1 సిక్స్) మినహా ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. అంతకుముందు 220/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండోరోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 242 పరుగులకే ఆలౌటైంది. విలియం ఓ రూర్కీ 4 వికెట్లు తీశాడు.

శ్రీలంక క్లీన్‌స్వీప్

పల్లెకెలె: అఫ్గానిస్తాన్‌లో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. బుధవారం జరిగిన ఆఖరి వన్డేలో లంక 7 వికెట్ల తేడాతో అఫ్గాన్‌పై ఘన విజయం సాధించింది. అఫ్గాన్ 48.2 ఓవర్లలో 266 పరుగుల వద్ద ఆలౌటైంది. రహ్మత్ షా (65; 7 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్జాయ్ (54; 4 ఫోర్లు) రాణించారు. శ్రీలంక 35.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 267 పరుగులు చేసి గెలిచింది. పతుమ్ నిసాంక (101 బంతుల్లో 118; 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగా...అవిష్క ఫెర్నాండో (91; 10 ఫోర్లు, 5సిక్స్‌లు) శతకం చేజార్చుకున్నాడు.

నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా నబీ...

ఐసీసీ వన్డే ఆల్‌రౌండర్స్ కొత్త ర్యాంకింగ్స్‌లో అఫ్గాన్ ఆటగాడు మొహమ్మద్ నబీ నంబర్‌వన్ స్థానాన్ని అందుకున్నాడు. అతి పెద్ద వయసులో (39 ఏళ్ల ఒక నెల) ఈ ఘనత సాధించిన ఆటగాడిగా నబీ నిలిచాడు. 1739 రోజులు (మే 7, 2019నుంచి) నంబర్‌వన్ ఆల్‌రౌండర్ ర్యాంక్‌లో కొనసాగిన షకీబ్ అల్ హసన్ ఎట్టకేలకు రెండో స్థానానికి పడిపోయాడు.

సినిమా


రొమాంటిక్ బచ్చన్



● రవితేజ, భాగ్యశ్రీ బోర్సె

ప్రేమికుల దినోత్సవం రోజున రొమాంటిక్ మూడ్‌లోకి వెళ్లిపోయారు మిస్టర్ బచ్చన్. 'మిరపకాయ్' వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ తర్వాత హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రంతో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా 'మిస్టర్ బచ్చన్' నుంచి ఓ రొమాంటిక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. పనోరమా స్టూడియోస్, టీ-సిరీస్ సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాకు చెందిన ఓ కీలక షెడ్యూల్ చిత్రీకరణ కారైకుడిలో ముగిసింది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, కెమెరా: అయనంక బోస్.

సింగమ్ వర్సెస్ సైతాన్



● అర్జున్ కపూర్

బాలీవుడ్ సింగమ్ ఫ్రాంచైజీలో రూపొందుతున్న తాజా చిత్రం 'సింగమ్ ఎగైన్'. అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, టైగర్ ష్రాఫ్, అర్జున్ కపూర్, దీపికా పదుకోన్, కరీనా కపూర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. 'సింగమ్' ఫ్రాంచైజీ దర్శకుడు రోహిత్ శెట్టి 'సింగమ్ ఎగైన్' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. కాగా ఈ సినిమాలో అర్జున్ కపూర్ విలన్ పాత్రలో నటిస్తున్నట్లు పేర్కొని, ఆ పాత్రను సైతాన్‌గా అభివర్ణిస్తూ, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేశారు రోహిత్ శెట్టి. 'ఈ తుఫానుకు సిద్ధంగా ఉండండి' అంటూ అర్జున్ పాత్రను ఉద్దేశించి, సోషల్ మీడియాలో షేర్ చేశారు అజయ్ దేవగన్. రోహిత్ శెట్టి, అజయ్ దేవగన్, జ్యోతీ దేశ్‌పాండే నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. మరోవైపు 'సింగమ్ ఫ్రాంచైజీ'లో భాగంగా 2011లో 'సింగమ్', 2014లో 'సింగమ్ రిటర్న్స్' ఇప్పుడు 'సింగమ్ ఎగైన్' సినిమాల్లో అజయ్ దేవగన్ హీరోగా నటిస్తున్నారు.

స్పైడర్ మేన్‌ను దాటిన డెడ్ పూల్!



● 'డెడ్ పూల్ అండ్ వోల్వరైన్' పోస్టర్

హాలీవుడ్ సూపర్ హీరోస్ ఫిల్మ్స్‌లో 'డెడ్ పూల్' ఫ్రాంచైజీ ఒకటి. 2016లో వచ్చిన 'డెడ్ పూల్', 2018లో వచ్చిన 'డెడ్ పూల్ 2' సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టాయి. ప్రేక్షకులను అమితంగా అలరించాయి. తాజాగా 'డెడ్ పూల్' సిరీస్‌లోని మూడో భాగం 'డెడ్ పూల్ అండ్ వోల్వరైన్' విడుదలకు సిద్ధమవుతోంది. ర్యాన్ రేనాల్డ్స్, హ్యూ జాక్‌మెన్ ప్రధాన పాత్రల్లో, ఎమ్మా కొరిన్, మోరెనా బక్కరిన్, రాబ్ డెలానీ కీలక పాత్రల్లో నటించారు. షాన్ లెవీ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. జూలై 26న 'డెడ్ పూల్ అండ్ వోల్వరైన్' చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇటీవల ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ విడుదలైన 24 గంటల్లో 365 మిలియన్ వ్యూస్‌ను సాధించింది. 24 గంటల్లో ఇన్ని వ్యూస్ రావడంతో ఇదే ప్రపంచ రికార్డు అని మేకర్స్ పేర్కొన్నారని హాలీవుడ్ అంటోంది. గతంలో ఈ రికార్డు 2021లో విడుదలైన 'స్పైడర్‌మేన్: నో వే హోమ్' ట్రైలర్ పేరిట ఉండేది. 24 గంటల్లో 'స్పైడర్ మేన్: నో వే హోమ్' ట్రైలర్ 355.5 మిలియన్ వ్యూస్ సాధించింది. ఇప్పుడు 'డెడ్ పూల్ అండ్ వోల్వరైన్' ట్రైలర్ రాకతో 'స్పైడర్‌మేన్: నో వే హోమ్' సెకండ్ ప్లేస్‌లోకి వెళ్లింది.



● వాణీ కపూర్

లండన్ కాలింగ్

లండన్‌కు వెళ్లేందుకు రెడీ అవుతున్నారట హీరోయిన్ వాణీ కపూర్. విహార యాత్ర కోసం కాదు. షూటింగ్ కోసం సూట్‌కేస్ సర్దుకోనున్నారు వాణీ కపూర్. దాదాపు రెండేళ్ల తర్వాత ఆమె హిందీ చిత్రం అంగీకరించారు. పరేష్ రావల్, వాణీ కపూర్, అపర్‌శక్తి ఖురానా ప్రధాన పాత్రధారులుగా ఫ్యామిలీ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనుందని సమాచారం. నవ్యజోత్ గులాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ కథ రీత్యా వాణీ కపూర్, అపర్‌శక్తి సోదరీ సోదరుడుగా నటించనున్నారట. ప్రస్తుతం మానవ సంబంధాలు ఏ విధంగా మారుతున్నాయి? ఈ మార్పులు వారి కుటుంబాలపై ఎలాంటి ప్రభావాలను చూపిస్తున్నాయి? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని టాక్. ఈ సినిమా చిత్రీకరణను ముందుగా వేసవిలో లండన్‌లో ప్లాన్ చేస్తున్నారట. ఎక్కువ శాతం షూటింగ్ అక్కడే జరుగుతుందట. వీలైనంత త్వరగా షూటింగ్ పూర్తి చేసి, ఈ ఏడాది చివర్లో విడుదల చేయాలన్నది చిత్ర యూనిట్ ప్లాన్ అని భోగట్టా.

ఇట్లా నవ్వే...



● సిద్ధు జొన్నల గడ్డ, అనుపమ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు' (2022) చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఆ చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' రూపొందింది. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగ వంశీ నిర్మించిన ఈ సినిమా మార్చి 29న విడుదల కానుంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'టిల్లు స్క్వేర్' ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఇట్లా నవ్వే మా బతుకులు నవ్వులపాలు చేస్తారు తర్వాత', 'సర్.. ఒక ఆడపిల్ల తండ్రిగా అడుగుతున్నాను.. మీ అబ్బాయిని ఇలాగేనా పెంచేది', 'సర్.. నేనూ ఒక మగపిల్లాడి తండ్రిగా చెబుతున్నాను.. మేమేం పెంచలేదు.. వాడే పెరిగిండు','ఎవరి పరిస్థితిని కూడా అర్థం చేసుకునే పరిస్థితిలో నేను లేనిప్పుడు' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''తొలి భాగం కన్నా రెండో భాగంలో వినోదం రెట్టింపు ఉంటుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: సాయి ప్రకాశ్ ఉమ్మడిసింగు, సంగీతం: రామ్ మిరియాల, నేపథ్య సంగీతం: ఎస్. తమన్.

వినోదాల బంగారు గుడ్డు




● 'బంగారు గుడ్డు' పోస్టర్

సంపూర్ణేష్ బాబు, సురభి శుక్లా జంటగా గోపీనాథ్ నారాయణ మూర్తి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బంగారు గుడ్డు'. కేఎం ఇలంజెళియన్, ఎం. కోటేశ్వర రాజు తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం, ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. గోపీనాథ్ నారాయణమూర్తి మాట్లాడుతూ– ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రం 'బంగారు గుడ్డు'. మంచి భావోద్వేగాలూ ఉంటాయి. ఈ మూవీలోని ఓ ప్రత్యేక పాటతో హీరోయిన్ కిరణ్ రాథోడ్ రీ ఎంట్రీ ఇస్తున్నారు'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: షమీర్ టాండన్, కెమెరా: అఖిల్ శశిధరన్, నేపథ్య సంగీతం: ఆర్ఎస్ రాజ్‌ప్రతాప్.

రీల్స్


హరోం హర...



● సుధీర్ బాబు

సుధీర్ బాబు హీరోగా నటించిన చిత్రం 'హరోం హర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మాళవికా శర్మ హీరోయిన్. సుమంత్ జి. నాయుడు నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమాకి చేతన్ భరద్వాజ్ సంగీతదర్శకుడు. ఈ చిత్రం నుంచి 'హరోం హర...' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకు కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, చేతన్ భరద్వాజ్ పాడారు. ''చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో ఈ కథ జరుగుతుంది. ఈ సినిమా కోసం సుధీర్ బాబు కుప్పం యాసలో డైలాగులు చెప్పారు'' అన్నారు మేకర్స్.

తండ్రీ కొడుకుల ప్రయాణం



● సముద్ర ఖని, ధనరాజ్

హాస్య నటుడు ధనరాజ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రామం రాఘవం'. ఈ చిత్రంలో సముద్ర ఖని, ధనరాజ్ తండ్రీ కొడుకులుగా నటిస్తున్నారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో తెలుగు, తమిళ భాషల్లో పృథ్వీ పోలవరపు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం డిజిటల్ గ్లింప్స్‌ను హీరో రామ్ తన 'ఎక్స్' ఖాతాలో విడుదల చేసి, సినిమా విజయం సాధించాలన్నారు. దర్శకుడు హరీష్ శంకర్ మీడియా గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. తండ్రీ కొడుకుల భావోద్వేగాల ప్రయాణంతో రూపొందిన ఈ చిత్రానికి సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గా ప్రసాద్.

ప్రేమ అందమైనది



● తాన్వీ, శ్రీ కమల్

'నువ్వే కావాలి', 'మన్మథుడు', 'మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాల దర్శకుడు కె.విజయ భాస్కర్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' ఉపశీర్షిక. ఈ చిత్రంలో శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష హీరో హీరోయిన్లు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''టాకీ పార్టు పూర్తయింది. త్వరలోనే పాటల చిత్రీకరణకు విదేశాలకు వెళ్లనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్ఆర్ ధ్రువన్, కెమెరా: సతీష్.

స్వార్థం ఉండదు!



● పృథ్వీ, సుమయా

పృథ్వీ అంబర్, సుమయా రెడ్డి జంటగా నటిస్తున్న చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వంలో సుమయా రెడ్డి నిర్మించిన ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'ప్రేమ అనేది ఓ అనిర్వచనీయమైన నిర్వచనం', 'అబ్బాయిల ప్రేమలో స్వార్థం ఉండదు.. అమ్మాయిల స్వార్థంలోనే ప్రేమ ఉంటుంది' అనే డైలాగ్స్ ఈ సినిమా టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: రథన్, కెమెరా: రాజ్ తోట.

సాక్షి బిజినెస్
గురువారం
15-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	268	71,823
నిఫ్టీ ▲	97	21,840

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,715	▲	58
డోజోన్స్	38,259	▽	13
ఎఫ్‌టీఎస్ఈ 100	7,568	▲	56
డాక్స్	16,945	▲	65
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,866	▲	36
నికాయ్	37,703	▽	261

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,590	▽	804
బంగారం (99.5 స్వచ్ఛత)	61,344	▽	800
వెండి (కేజీ)	69,150	▽	1,892

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.70	83.72
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.54	106.10
€	యూరో	ఒకటి	87.95	90.29
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.66	55.89
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.79	54.70
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.19	63.87
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.23	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.71	23.50
¥	చైనా యువాన్	ఒకటి	10.42	12.49

16 నుంచి అగ్రిటెక్ ప్రదర్శన



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అగ్రిటెక్ సౌత్ 2024 ప్రదర్శన ఫిబ్రవరి 16 నుంచి జరగనుంది. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వేదికగా మూడు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహిస్తోంది. అగ్రి విజన్ 2024 పేరుతో రెండు రోజుల పాటు సదస్సు సైతం ఏర్పాటు చేశారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, అనుబంధ రంగాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 100కు పైగా కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించనున్నాయి.

ఎన్ఎండీసీ లాభం 62% అప్

రూ. 5.75 మధ్యంతర డివిడెండు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రభుత్వ రంగ మైనింగ్ దిగ్గజం ఎన్ఎండీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సుమారు రూ. 1,470 కోట్ల లాభం ప్రకటించింది. గత క్యూ3లో నమోదైన రూ. 904 కోట్లతో పోలిస్తే ఇది 62 శాతం అధికం. ఇక సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ. 3,925 కోట్ల నుంచి రూ. 5,746 కోట్లకు పెరిగింది. వ్యయాలు రూ. 2,693 కోట్ల నుంచి రూ. 3,517 కోట్లకు పెరిగాయి. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను షేరు ఒక్కింటికి రూ. 5.75 చొప్పున కంపెనీ మధ్యంతర డివిడెండు ప్రకటించింది. ఫిబ్రవరి 27 దీనికి రికార్డు డేట్‌గా ఉంటుంది.



జీవీకే పవర్ నష్టాలు రూ. 77 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రా (జీపీఐఎల్) రూ. 77.39 కోట్ల నికర నష్టం (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) ప్రకటించింది. గత క్యూ3లో కంపెనీ రూ. 3,402 కోట్ల నికర లాభం నమోదు చేసింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 343 కోట్ల నుంచి రూ. 155 కోట్లకు తగ్గింది. వ్యయాలు రూ. 356 కోట్ల నుంచి రూ. 226 కోట్లకు తగ్గాయి.



ఎం అండ్ ఎం లాభం జూమ్

క్యూ3లో రూ. 2,658 కోట్లు

ముంబై: ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా(ఎంఅండ్ఎం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 34 శాతం జంప్‌చేసి రూ. 2,658 కోట్లను తాకింది. వివిధ విభాగాలలో అమ్మకాలు పుంజుకోవడం లాభాల్లో వృద్ధికి సహకరించింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 1,984 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 15 శాతం వృద్ధితో రూ. 35,299 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 30,621 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ కాలంలో ఆటో, వ్యవసాయ పరికరాల విభాగాలు మార్కెట్ వాటాను పెంచుకున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో అనిష్ షా పేర్కొన్నారు. ఆటో విభాగం లాభాలు రెట్టింపైనట్లు తెలియజేశారు. కాగా, స్టాండెలోన్ నికర లాభం 11 శాతం అధికమై రూ. 2,454 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 16 శాతం ఎగసి



రూ. 25,624 కోట్లను తాకింది. వాహన అమ్మకాలు 20 శాతం వృద్ధితో 2,11,443 యూనిట్లకు చేరగా.. 4 శాతం తక్కువగా 1,00,522 ట్రాక్టర్లు విక్రయమయ్యాయి. గత క్యూ3లో 1,04,850 ట్రాక్టర్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఎస్‌యూవీ విభాగంలో కంపెనీ 21 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నట్లు ఆటో, ఫామ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ జెజురికర్ తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో ఎం అండ్ ఎం షేరు 0.7% బలపడి రూ. 1,658 వద్ద ముగిసింది.

ఆస్ట్రేలియాలో మలబార్ గోల్డ్ తొలి షోరూం ప్రారంభం

హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో తొలి షోరూంను ఏర్పాటు చేసింది. మాజీ ఆస్ట్రేలియా క్రికెటర్ బ్రెట్ లీ కొత్త షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. తద్వారా ఆస్ట్రేలియాలో షోరూంను ఆవిష్కరించిన తొలి భారత జ్యువెలరీ బ్రాండ్‌గా చరిత్ర సృష్టించింది. 'భారత్, ఆస్ట్రేలియాల మధ్య బలమైన ఆర్థిక, ద్వైపాక్షిక వాణిజ్య బంధానికి ఇది తార్కాణం. ఆసీస్ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన పెట్టుబడులు, స్థానికంగా ఉద్యోగ కల్పన లక్ష్యంగా మా వృద్ధి ప్రణాళిక రూపొందించాము' అని సంస్థ చైర్మన్ ఎం.పీ.అహ్మద్ తెలిపారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రపంచవ్యాప్తంగా 13 దేశాల్లో 340 షోరూంల్లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తుంది.



టోకు ధరలు తగ్గాయ్

జనవరిలో 0.27% • మూడు నెలల కనిష్టం • ఆహార ధరల ఊరట

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2024 జనవరిలో 0.27 శాతంగా నమోదయ్యింది. అంటే 2023 జనవరితో పోల్చితే ఈ బాస్కెట్‌లో మొత్తం ఉత్పత్తుల ధర 2024 జనవరిలో 0.27 శాతం పెరిగిందన్నమాట. గడచిన మూడు నెలల్లో ఇదే అతి తక్కువ టోకు ద్రవ్యోల్బణం. ఆహార ధరల తగ్గుదల దీనికి కారణం. నిజానికి 2023 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ టోకు ధరల సూచీ క్షీణతలో కొనసాగింది. దీనినే ప్రతి ద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు. నవంబర్‌లో మొదటిసారి ప్లస్‌లోకి వచ్చింది. సంబంధిత నెల్లో 0.39 శాతంగా నమోదయ్యింది. డిసెంబర్‌లో సూచీ 0.73 శాతానికి పెరిగింది. తిరిగి తాజా సమీక్షా నెల్లో 0.27 శాతానికి తగ్గింది.




తయారీ, ఇంధనం–విద్యుత్ క్షీణతలోనే...

- ఫుడ్ ఆర్టికల్స్‌లో ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం 9.38 శాతం ఉంటే, జనవరిలో ఈ రేటు 6.85 శాతానికి తగ్గింది. ఇందులో ఒక్క కూరగాయల ధరలు 26.3 శాతం నుంచి 19.71 శాతానికి తగ్గాయి. ఆలూ ధరలు పెరక్కపోగా తగ్గాయి. పండ్లు, గుడ్లు, పాలు, చేప, పాలు ధరలు కూడా తగ్గాయి.
- ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో 2.41 క్షీణతలో ఉంటే, జనవరిలో ఈ క్షీణ రేటు 0.51 శాతంగా నమోదయ్యింది.
- తయారీ ఉత్పత్తుల ధరలు కూడా క్షీణతలో ఉన్నాయి. డిసెంబర్‌లో ఈ రేటు మైనస్ 0.71 శాతంగా ఉంటే, తాజా సమీక్ష నెల్లో మైనస్ 1.13 శాతంగా నమోదయ్యింది.

నష్టాల్లోంచి.. లాభాల్లోకి!

- ఆదుకొన్న ఆఖరి గంట కొనుగోళ్లు
- మెరుగైన ఆర్థిక గణాంకాల దన్ను
- రాణించిన ఇంధన, మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు

ముంబై: ఆఖరి గంట కొనుగోళ్లతో ఆరంభ నష్టాలు భర్తీ చేసుకున్న స్టాక్ సూచీలు బుధవారం లాభాలతో గట్టెక్కాయి. ఇంధన, మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో రంగాల షేర్లు రాణించి సూచీలను నష్టాల్లోంచి లాభాల్లోకి నడిపాయి. మెరుగైన దేశీయ స్థూల ఆర్థిక గణాంకాల నమోదు ఇన్వెస్టర్లను కొనుగోళ్లకు ప్రోత్సహించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లోని ప్రతికూల సంకేతాల ప్రభావంతో ఉదయం సూచీలు భారీ నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే 745 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ చివరికి 268 పాయింట్లు లాభపడి 71,823 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 70,809 వద్ద కనిష్టాన్ని, 71,939 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 310 పాయింట్ల పతనం నుంచి తేరుకొని 97 పాయింట్ల లాభంతో 21,840 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 21,530 – 21,871 శ్రేణిలో కదలాడింది. కాగా ఫార్మా, ఐటీ, టెక్ షేర్లు



అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈలో స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1.16%, 1.26 % చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 3,930 కోట్ల షేర్లను విక్రయించగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,898 కోట్ల షేర్లు కొన్నారు. అమెరికా ద్రవ్యోల్బణం అంచనాలకు మించి పెరగడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- అమెరికా ద్రవ్యోల్బణం అంచనాలకు మించి నమోదవడంతో 'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు' వాయిదా ఆందోళనలు, ఇది ఐటీ రంగ క్లయింట్ల వ్యయాల కేటాయింపులపై ప్రతికూల ప్రభావాన్ని చూపొచ్చనే అంచనాలతో ఐటీ షేర్లు నష్టాలు చవిచూశాయి. టెక్ మహీంద్రా 3.50%, ఎంఫసిస్ 2.50% కోఫోర్జ్ 2%, టీసీఎస్ 1%, ఇన్ఫోసిస్ 1%, ఎల్‌టీఐఎం 0.50% చొప్పున నష్టపోయాయి.
- ప్రభుత్వ రంగ ఎస్‌బీఐ షేరు 4% లాభపడి రూ.743 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 5% ఎగసి రూ.748 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. వృద్ధిపై విశ్వాసం, మార్జిన్ల నిర్వహణ, ఆస్తుల ఆదాయాల మెరుగుపై యాజమాన్యపు సానుకూల అవుట్‌లుక్ వ్యాఖ్యలతో క్యూ3 ఆర్థిక ఫలితాల ప్రకటన నాటి నుంచి 15 ట్రేడింగ్ సెషన్లలో ఈ షేరు 24% ర్యాలీ చేసింది.
- ఫెమా నిబంధనల ఉల్లంఘన ఆరోపణలతో తన అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఈడీ ప్రాథమిక విచారణ ప్రారంభించినట్లు వార్తలు వెలుగులోకి రావడం పేటీఎం షేరు వరుసగా రెండో రోజూ లోయర్ సర్క్యూట్ తాకింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే 10% పతనమై రూ.342 వద్ద లాకైంది.

ఒకటి ఓకే.. రెండు నిరాశ!

మూడు కంపెనీల లిస్టింగ్ తీరిది..

ముంబై: ఇటీవల పబ్లిక్ ఇష్యూ పూర్తి చేసుకున్న మూడు కంపెనీలు బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. వీటిలో రాశి పెరిఫెరల్స్ లిస్టింగ్ మెప్పించగా.., క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు నిరాశపరిచాయి.

- రాశి పెరిఫెరల్స్ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.311)తో పోలిస్తే 8% ప్రీమియంతో రూ. 335 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 10% ర్యాలీ చేసి రూ.343 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. లాభాల స్వీకరణతో చివరికి 3% లాభంతో రూ.321 వద్ద నిలిచింది.
- జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.414)తో పోలిస్తే 4% డిస్కౌంట్‌తో రూ.396 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 12% క్షీణించి రూ.365 కనిష్టాన్ని తాకింది. ఆఖరికి 11% నష్టంతో రూ.368 వద్ద ముగిసింది.



- క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.468)తో పోలిస్తే 7% డిస్కౌంట్‌తో రూ.435 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 10% పతనమై రూ.421 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 7.25% నష్టంతో రూ.434 వద్ద ముగిసింది.

పాబ్లోతో క్రిస్మ్ జట్టు..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయ లగ్జరీ హోమ్ ఫర్నిషింగ్స్ దిగ్గజం పాబ్లోతో దేశీ ఇంటీరియర్ డిజైన్ స్టూడియో క్రిస్మ్ జట్టు కట్టింది. దీని ప్రకారం పాబ్లోకి భారత్‌లో తమ సంస్థ మాస్టర్ ఫ్రాంచైజీగా ఉంటుందని సంస్థ డైరెక్టర్లు కిరణ్ కుమార్, శైలజ వెల్లడించారు. లగ్జరీ విల్లాలు, విశాలవంతమైన గృహాలు, స్టూడియో అపార్ట్‌మెంట్స్ వంటి సెగ్మెంట్స్‌పై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు కిరణ్ పేర్కొన్నారు. రెండు అంతస్థుల్లో 20,000 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన తమ క్రిస్మ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో మాడ్యులర్ కిచెన్లు, డిజైనర్ వార్డ్‌రోబ్‌లు, బెడ్స్, సోఫాలు, లైటింగ్ సొల్యూషన్స్ మొదలైనవి ఉన్నట్లు వివరించారు. అధునాతన హోమ్ డిజైన్‌లను అందించేందుకు ఇప్పటికే కెస్సీబోమర్, బ్లమ్, మైలే లాంటి అంతర్జాతీయ బ్రాండ్స్‌తో కూడా తమకు ఒప్పందాలు ఉన్నాయని పేర్కొన్నారు.



భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2024

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర 21 ఉన్నత స్థాయి సర్వీసుల్లో పోస్టుల భర్తీకి సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1056
» **విద్యార్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన విద్యలో ఉత్తీర్ణత ఉండాలి. అర్హత కోర్సు ఫైనల్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** 21–32 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 2024, మార్చి 5
» **ప్రిలిమినరీ పరీక్ష తేది:** 2024, మే 26
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in, upsconline.nic.in

నీట్(యూజీ)-2024

దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్)–యూజీ(నీట్ యూజీ–2024) పరీక్షకు నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు.

» **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీతో సైన్స్‌లో ఇంటర్మీడియట్ /ప్రీ–డిగ్రీ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 17 ఏళ్లు నిండి ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.03.2024.
» **పరీక్ష తేది:** 05.05.2024.
» **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/NEET

ఏపీ సెట్-2024

ఆంధ్రా యూనివర్సిటీ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష(ఏపీ సెట్)–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఉత్తీర్ణత ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాలల లెక్చరర్లుగా కొలువు పొందేందుకు అర్హత లభిస్తుంది.

» **సబ్జెక్టులు:** జనరల్ పేపర్ ఆన్ టీచింగ్అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్–1), ఆంత్రోపాలజీ, హిస్టరీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్–అట్మాస్ఫియరిక్–ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్స్, ఇన్విరాన్‌మెంటల్ సైన్స్, జాగ్రఫీ, హిందీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, లా, లైఫ్ సైన్సెస్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మేనేజ్‌మెంట్, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సంస్కృతం,సోషియాలజీ, సోషల్ వర్క్, తెలుగు, ఉర్దూ, విజువల్ ఆర్ట్స్.
» **అర్హత:** కనీసం 55శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** గరిష్ట వయోపరిమితి లేదు.
» **పరీక్ష విధానం:** పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్–2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు.
» **పరీక్ష వ్యవధి:** మూడు గంటలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 14.02.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.03.2024.
» **పరీక్ష తేది:** 28.04.2024.
» **వెబ్‌సైట్:** apset.net.in.

జీఏటీ-బీ, బీఈటీ-2024

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్–బయో టెక్నాలజీ(జీఏటీ–బీ)2024,జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం నిర్వహించే బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ)–2024 ప్రకటన వెలువడింది. ఎన్‌టీఏ నిర్వహించే ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ద్వారా వివిధ ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్శిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు.

కోర్సుల వివరాలు

» **జీఏటీ–బీ కోర్సులు:** ఎంఎస్సీ(బయోటెక్నాలజీ, అగ్రి బయోటెక్నాలజీ, సంబంధిత విభాగాలు), ఎంటెక్(బయో టెక్నాలజీ, సంబంధిత విభాగాలు), ఎంవీఎస్సీ(యానిమల్ బయోటెక్నాలజీ).
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎంబీబీఎస్, బీడీఎస్, బీవీఎస్సీ, బీఎఫ్ఎస్సీ, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీపీటీ, బీటెక్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» **బీఈటీ కోర్సులు:** ఈ పరీక్షలో ప్రతిభ ఆధారంగా పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందవచ్చు.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంబీబీఎస్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎంవీఎస్సీ, ఎంఫార్మసీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు, దివ్యాంగులు,మహిళలు 31ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తుకు చివరితేది:** 06.03.2024.
» **పరీక్ష తేది:** 20.04.2024
» **వెబ్‌సైట్:** https://dbt.ntaonline.in or www.nta.ac.in

అవుతారా.. స్పెషలిస్ట్ ఆఫీసర్!

» పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో ఎస్‌వో కొలువులు
» నాలుగు విభాగాల్లో 1,025 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక

బ్యాంక్ ఉద్యోగాల ఆశావహులకు శుభవార్త! బీటెక్, ఎంబీఏ తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకుని.. బ్యాంకింగ్ రంగంలో కొలువు కోరుకుంటున్న అభ్యర్థులకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్వాగతం పలుకుతోంది. 1,025 స్పెషలిస్ట్ ఆఫీసర్(ఎస్‌వో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది!! ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. బ్యాంకింగ్ రంగంలో ఉన్నత స్థాయి అవకాశాలను అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. పీఎన్‌బీ ఎస్‌వో పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..



పంజాబ్ నేషనల్ బ్యాంక్.. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ముఖ్యమైంది. ఐబీపీఎస్ ద్వారా క్లర్క్స్, పీఓ పోస్టుల భర్తీ చేపట్టే పీఎన్‌బీ.. స్పెషలిస్ట్ పోస్టులకు మాత్రం సొంతంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తోంది. తాజాగా నాలుగు విభాగాల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

మొత్తం 1,025 పోస్టులు

పీఎన్‌బీ తాజా నోటిఫికేషన్ ద్వారా నాలుగు విభాగాల్లో మొత్తం 1,025 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో ఆఫీసర్–క్రెడిట్ 1000 పోస్టులు, మేనేజర్–ఫారెక్స్ 15 పోస్టులు, మేనేజర్–సైబర్ సెక్యూరిటీ 5 పోస్టులు, సీనియర్ మేనేజర్–సైబర్ సెక్యూరిటీ–5 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- పోస్టులను అనుసరించి బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, సీఏ/సీఎంఏ/సీఎఫ్ఏ ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** క్రెడిట్ ఆఫీసర్‌కు 21–28 ఏళ్లు; ఫారెక్స్ మేనేజర్, సైబర్ సెక్యూరిటీ మేనేజర్‌కు 25–35 ఏళ్లు; సీనియర్ మేనేజర్ సైబర్ సెక్యూరిటీ పోస్టుకు 27–38 ఏళ్లు ఉండాలి. నిబంధనలను అనుసరించి రిజర్వ్‌డ్ కేటగిరీ వర్గాలకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక విధానం

స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి రెండంచెల ఎంపిక విధానాన్ని అనుసరిస్తారు. తొలుత రాత పరీక్ష ఉంటుంది. అందులో ప్రతిభ ఆధారంగా మలిదశలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

రాత పరీక్ష.. ఇలా

తొలి దశలో రాత పరీక్షను రెండు విభాగాల్లో (పార్ట్–1, పార్ట్–2) 100 మార్కులకు చొప్పున నిర్వహిస్తారు. పార్ట్–1లో రీజనింగ్ 25 ప్రశ్నలు–25 మార్కులు; ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–25 మార్కులు; క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు –50 మార్కులకు పరీక్ష ఉంటుంది. అదేవిధంగా పార్ట్–2లో ప్రొఫెషనల్ నాలెడ్జ్ పేరుతో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 50 ప్రశ్నలు–100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇలా మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతుంది. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కును తగ్గిస్తారు. పరీక్షకు లభించే సమయం రెండు గంటలు.

పర్సనల్ ఇంటర్వ్యూ

తొలిదశ రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. పార్ట్–2లోని ప్రొఫెషనల్ సబ్జెక్ట్ విభాగంలో పొందిన మార్కులను పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో చోటు సాధించిన వారికి పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. ఇంటర్వ్యూలో బ్యాంకింగ్ నాలెడ్జ్,అభ్యర్థులు ఎంచుకున్న విభాగానికి సంబంధించిన పరిజ్ఞానం, పని అనుభవం తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

తుది ఎంపిక

తుది నియామకాలు ఖరారు చేసే క్రమంలో.. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇంటర్వ్యూలో ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులు పొందాలి.

వేతనాలు

- జేఎంజీఎస్–1కు రూ.36,000–రూ.63,840తో ప్రారంభ వేతన శ్రేణి ఉంటుంది.
- ఎంఎంజీఎస్–2కు రూ.48,170–రూ.69, 810 శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.
- ఎంఎంజీఎస్–3కు రూ.63,840–రూ.78,230 శ్రేణిలో ప్రారంభ వేతనం ఉంటుంది.

విధులివే

- **ఆఫీసర్ క్రెడిట్:** బ్యాంక్ క్రెడిట్ విభాగాలు, కార్పొరేట్ బ్రాంచ్‌లు, ట్రేడ్ ఫైనాన్స్ సెంటర్స్, ఫైనాన్స్ విభాగం, కార్పొరేట్ క్రెడిట్ విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- **మేనేజర్–ఫారెక్స్:** బ్యాంకుకు సంబంధించి ఏడీ బ్రాంచ్‌లు; బ్యాక్ ఆఫీస్‌లు/ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాల్లో ఫారెన్ ఎక్స్ఛేంజ్‌కు సంబంధించిన లావాదేవీలకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- **మేనేజర్, సీనియర్ మేనేజర్–సైబర్ సెక్యూరిటీ:** బ్యాంకుకు సంబంధించిన ఆన్‌లైన్ కార్యకలాపాలకు ఎలాంటి అడ్డంకులు రాకుండా.. సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్స్ సమర్థవంతంగా పనిచేసేలా నిరంతర పర్యవేక్షణ, నిర్వహణ వంటి బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది.

జీఎం స్థాయికి

స్పెషలిస్ట్ ఆఫీసర్‌గా కొలువులో చేరిన వారు భవిష్యత్తులో జనరల్ మేనేజర్‌వరకూ పదోన్నతులు పొందే అవకాశముంది. సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్ పోస్టులకు.. పని తీరు, ప్రతిభ, సర్వీసు ఆధారంగా పదోన్నతి లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఫిబ్రవరి 25.
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** మార్చి/ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** https://www.pnbindia.in/Recruitments.aspx

రాత పరీక్షలో రాణించేలా

రీజనింగ్

రీజనింగ్ ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు పకడ్బందీగా వ్యవహరించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

అర్థమెటిక్‌పై పట్టుతో ఈ విభాగంలో రాణించొచ్చు. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా సాధన చేస్తే.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందొచ్చు. అదే విధంగా.. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా సాధన చేయాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగం కోసం అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి.. బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను చదవాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

క్లుప్తంగా...

రెండు జిల్లాలకు కొత్త కలెక్టర్లు

పశ్చిమగోదావరికి సమిత్‌కుమార్, అల్లూరికి విజయ సునీత

సాక్షి, అమరావతి: రెండు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమిస్తూ.. పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు కలెక్టర్‌గా పనిచేస్తున్న సమిత్‌కుమార్‌ను పశ్చిమగోదావరి జిల్లాకు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.ప్రశాంతిని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.విజయ సుసునీతను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. పౌరసరఫరాల సంస్థ వైఎస్ చైర్మన్ అండ్ ఎండీ జి.వీరపాండ్యన్‌కు పౌరసరఫరాల శాఖ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డెరెక్టర్‌గా పనిచేస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి రాహుల్ పాండేను తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పోలవరం డిజైన్ల ఆమోదంపై నేడు నిర్ణయం

ఢిల్లీలో సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా నేతృత్వంలో సమావేశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు డిజైన్లను వేగంగా ఆమోదించడం ద్వారా గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం స్పందించింది. ప్రత్యేక సమావేశం నిర్వహించి డిజైన్ల ఆమోదంపై నిర్ణయం తీసుకోవాలని సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరాను కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో డిజైన్లపై సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా సమావేశం నిర్వహించనున్నారు. పోలవరం ప్రాజెక్టు సీఈ సుధాకర్ బాబు, ఎస్ఈ నరసింహమూర్తి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. నిర్ణీత ప్రమాణాలకు లోబడి ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజ్‌ను నియంత్రించడం కోతకు గురైన ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని యథాస్థితికి తేవడం, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణపై చర్చించనున్నారు. డిజైన్ల రూపకల్పనలో అంతర్జాతీయ నిపుణుల ఏజెన్సీని అందుబాటులోకి తేవడంపై నిర్ణయం తీసుకోనున్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో-ప్రెసిడెంట్‌గా ప్రభాకర్‌రెడ్డి



సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన కర్నాటి ప్రభాకర్ రెడ్డి పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో - ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఆయిల్‌పామ్ ఉత్పత్తిపై ఏపీ ప్రభుత్వం, హెచ్‌యూఎల్ చర్చలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ ఉత్పత్తిని పెంపొందించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హిందూస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్)తో చర్చలు జరిపింది. ఈమేరకు హెచ్‌యూఎల్ లీగల్ కార్పొరేట్ వ్యవహారాలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవ్ బాజ్‌పేయి, హెచ్‌యూఎల్ సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్ యోగేశ్ మిశ్రా నేతృత్వంలో కంపెనీ ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం.. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఆహార ఉత్పత్తి శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో భేటీ అయ్యారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేరుగా రైతులకు, పరిశ్రమలకు ప్రయోజనం చేకూర్చేలా పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దీని ద్వారా దిగుమతులను తగ్గించుకోవచ్చన్నారు. ఏపీలో ఆయిల్‌పామ్‌ను 30 వేల హెక్టార్లలో సాగుకు 15 వేల మంది రైతుల భాగస్వామ్యం అవసరమని హెచ్‌యూఎల్ ప్రతిపాదించింది. నర్సరీల పెంపకం, రాష్ట్రంలో ఆయిల్ పామ్ మిల్ ఏర్పాటు ద్వారా రూ.300 కోట్లకు పైగా పెట్టుబడులు రాబట్టొచ్చని తెలిపింది. ఆయిల్‌పామ్ మిల్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి ఉద్యోగాలు వస్తాయని పేర్కొంది. దేవ్ బాజ్‌పేయి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

• తెలంగాణ

రాజ్యసభ అభ్యర్థులుగా రేణుకాచౌదరి, అనిల్‌కుమార్ యాదవ్

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన రాజ్యసభ అభ్యర్థులుగా కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్‌లను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వీరి పేర్లను ఖరారు చేసినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు.

బీఆర్ఎస్ అభ్యర్థిగా వద్దిరాజు

బీఆర్ఎస్ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేరును పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్రం నుంచి మూడు స్థానాలకు జరిగే ఎన్నికకు సంబంధించి గురువారంతో నామినేషన్ల దాఖలు గడువు ముగియనుంది.

మినీ స్టూడియోతో హార్సిలీహిల్స్‌కు మహర్దశ

- ఇప్పటివరకు వందకు పైగా సినిమాల షూటింగ్
- 1996 తర్వాత కళ తప్పిన కొండ
- ఈ మధ్యకాలంలో వెబ్‌సిరీస్‌లు, సినిమాలతో సందడి
- కొండపై స్టూడియో నిర్మిస్తే అందుబాటులోకి సౌకర్యాలు
- చిత్రనిర్మాణాలు, వెబ్ సిరీస్‌లకు వెసులుబాటు
- స్థానికంగా యువతకు ఉపాధి, ఆర్థిక ప్రయోజనాలు
- స్టూడియో నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు



హార్సిలీహిల్స్‌పై సైతాన్ వెబ్‌సిరీస్ చిత్రీకరణ (ఫైల్)

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ వేసవి విడిది కేంద్రం.. హార్సిలీహిల్స్‌పై మినీ స్టూడియోను నిర్మిస్తే ఈ ప్రాంతానికి మహర్దశ పట్టనుంది. దీని ఏర్పాటు దిశగా జరుగుతున్న ప్రయత్నాలతో హార్సిలీహిల్స్ భవిష్యత్‌లో సినిమా చిత్రీకరణలకు ప్రముఖ కేంద్రంగా మారనుంది. తద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధితోపాటు ఆర్థికంగానూ ప్రయోజనాలు లభిస్తాయని చెబుతున్నారు. ఎత్తయిన కొండల సొగసులు, ప్రకృతి అందాలు, దట్టమైన అటవీప్రాంతం, చుట్టూ కొండలతో హార్సిలీహిల్స్ ఇప్పటికే ప్రముఖ పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే వందకుపైగా చిత్రాలు ఇక్కడ చిత్రీకరణ జరుపుకున్నాయి. 1966లో సూపర్‌స్టార్ కృష్ణ నటించిన కన్నెమనసులు సినిమాతో మొదలై ఎన్నో కన్నడ, తెలుగు, తమిళ సినిమాల షూటింగ్ ఇక్కడ జరిగింది. అయితే ఏ ప్రభుత్వం ఇక్కడ షూటింగ్ కోసం చర్యలు చేపట్టలేదు. దీంతో 1996లో కృష్ణ నటించిన ఎన్‌కౌంటర్ సినిమా తర్వాత పెద్ద నటులెవరూ హార్సిలీహిల్స్ వైపు కన్నెత్తి చూడలేదు. ఈ పరిస్థితుల్లో ప్రముఖ దర్శక నిర్మాత మహీ వీ రాఘవ కొండపై మినీ స్టూడియో, అమ్యూజ్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో హార్సిలీహిల్స్‌కు మంచి రోజులు రానున్నాయని అంటున్నారు.

మళ్లీ ఈ మధ్యే సందడి..

ఈ మధ్యకాలంలో హార్సిలీహిల్స్ పరిసర ప్రాంతాల్లో సినిమాలు, వెబ్ సిరీస్ చిత్రీకరణల సందడి నెలకొంది. మహీ వీ రాఘవ ఈ ప్రాంతంలో సినిమా షూటింగ్ చేస్తే నిర్మాణ వ్యయం భారీగా తగ్గించుకునే అవకాశం ఉందని గుర్తించి ఇటువైపు అడుగులు వేశారు. ఆయన దర్శకత్వం వహించిన పాఠశాల, యాత్ర-2 చిత్రీకరణలు ఈ ప్రాంతంలోనే జరిగాయి. సైతాన్ వెబ్ సిరీస్‌ను సైతం ఇక్కడే చేశారు. ఇంకా విడుదలకాని 'సిద్ధా లోకం ఎలా ఉంది' కూడా ఇక్కడే నిర్మాణం జరుపుకుంది. మహీ వీ రాఘవే కాకుండా ఇంకా పలువురు సినిమాలు, వెబ్ సిరీస్‌లను చిత్రీకరిస్తున్నారు.

మినీ స్టూడియోతో ఎన్నో సౌకర్యాలు

కొండపై మినీ స్టుడియో నిర్మాణం కోసం రెండెకరాల భూమిని కేటాయించాలని మహీ వీ రాఘవ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మినీ స్టూడియోతో ఎన్నో రకాలుగా స్థానికులు లబ్ధి పొందడమే కాకుండా, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. వ్యాపారపరంగా ఆర్థికంగానూ ప్రయోజనాలు ఉంటాయి. స్టూడియో ద్వారా సినిమాలు, వెబ్ సిరీస్‌కోసం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుంది. లైట్స్, చిన్న కెమెరాలు, జనరేటర్లు, వాహనాలు, వెబ్ సిరీస్ కోసం అవసరమైనవి షూటింగ్ కోసం వెంట తీసుకురావాల్సిన పరిస్థితి ఉండదు. షూటింగ్‌కు వచ్చేవారికి విడిది సౌకర్యాలు, భోజనం, షూటింగ్‌లో పనులు.. ఇలా ప్రతి విషయంలోనూ స్థానికులకు ఆర్థికంగా ప్రయోజనం లభిస్తుంది. పెద్ద సినిమాలు లేకున్నా ఏడాదికి రెండు వెబ్ సిరీస్‌ల చిత్రీకరణ జరిగినా రూ.5 నుంచి రూ.10 కోట్లు ఖర్చవుతుంది. కాబట్టి స్థానికులకు వివిధ రకాలుగా ఆదాయం లభిస్తుంది.

స్థానికులకు ఆదాయం, తక్కువ ఖర్చుతో చిత్రీకరణే లక్ష్యం..



హార్సిలీహిల్స్‌పై మినీ స్టూడియో ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతాన్ని షూటింగ్‌లకు కేంద్రంగా చేయాలన్నదే లక్ష్యం. ఇక్కడి ప్రదేశాలను వెబ్‌సైట్‌లో పెట్టి సినిమా చిత్రీకరణలకు అనువనే విషయాన్ని తెలియజేస్తాం. మదనపల్లె, ఆరోగ్యవరం, పరిసర ప్రాంతాల చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తూ ప్రచారం చేస్తాం. పురాతన కట్టడాలు, భవనాలు, పల్లెలు హార్సిలీహిల్స్ పరిసరాల్లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ సినిమాలు, వెబ్ సిరీస్‌లు తక్కువ ఖర్చుతో చిత్రీకరణ చేసుకునేలా ప్రణాళిక రూపొందిస్తాం. అనుభవజ్ఞులైన వారిని నియమించి సహకారం అందిస్తాం. స్థానికులకు ఆదాయ మార్గాలు పెంచేలా చూస్తాం.

–మహీ వీ రాఘవ, ప్రముఖ దర్శకనిర్మాత

ఆ సర్క్యులర్ ప్రకారం నడుచుకోండి

శ్రీశైలంలో మహాకుంభాభిషేకంపై హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని అన్ని దేవస్థానాల్లో ఆగమ సంకరణం జరగకుండా దైవ సంబంధ కార్యక్రమాలు నిర్వహించాలంటూ 2013లో దేవదాయ శాఖ కమిషనర్ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారమే శ్రీశైలంలో నిర్వహించే మహా కుంభాభిషేకం, ఇతర పూజాది కార్యక్రమాలను నిర్వహించాలని హైకోర్టు బుధవారం దేవదాయ శాఖ అధికారులను ఆదేశించింది. మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల నిర్వహణకు శ్రీశైలం దేవస్థానం ఈవో జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను, వీటిని ఏ పద్ధతిలో నిర్వహించాలో ఆలయ ప్రధాన అర్చకులు, అధ్యాపకులు, వేదపండితులు కమిషనర్‌కు ఇచ్చిన లేఖను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. తదుపరి విచారణను మార్చి 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 16 నుంచి శ్రీశైలం దేవస్థానంలో జరిగే మహా కుంభాభిషేకం, ఇతర పూజాది కార్యక్రమాలను వైదిక స్మార్త ఆగమ పద్ధతులతో పాటు ఇప్పటికే నిరూపితమైన ధార్మిక విధానంలో కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పురోహితులు పన్నాల వెంకట బుచ్చిరామ శాస్త్రి, కోన బాల వెంకట సుబ్బారావు మరో ఇద్దరు దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ కృష్ణమోహన్ ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సర్వ సత్యనారాయణ ప్రసాద్, వీఎస్ఆర్ ఆంజనేయులు, ప్రభుత్వం తరఫున రజనీరెడ్డి, అఖిల భారత వీర శైవ ఆగమ పరిషత్ తరఫున న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపించారు.

హైవేల నిర్వహణ పదేళ్లు కాంట్రాక్టర్లదే

- జాతీయ రహదారుల డ్యామేజీ లయబిలిటీ కాలపరిమితి రెట్టింపు
- రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం
- హైవేల నిర్మాణంలో నాణ్యత పెరుగుతుందని అధికారుల వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారుల నిర్వహణ, మరమ్మతులకు సంబంధించి కాంట్రాక్టర్ల బాధ్యత కాలాన్ని రెట్టింపు చేసింది. అందుకోసం జాతీయ రహదారుల డ్యామేజీ లయబిలిటీని ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచింది. ఈమేరకు కాంట్రాక్టర్లకు విధి విధానాలను నిర్దేశించింది. దేశంలో భారీగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు జాతీయ రహదారుల నిర్వహణ లోపం కూడా ఓ ప్రధాన కారణమని నిపుణుల కమిటీ ఇటీవల నివేదించింది. 2022లో దేశంలో సంభవించిన 4.61 లక్షల రోడ్డు ప్రమాదాల్లో 1.68 లక్షల మంది దుర్మరణం చెందారు. వాటిలో అత్యధికంగా 33 శాతం ప్రమాదాలు జాతీయ రహదారులపైన జరిగినవే. మొత్తం ప్రమాద మృతులు 1.68 లక్షల మందిలో జాతీయ రహదారులపై ప్రమాదాల్లోనే 24 శాతం మంది అంటే 41 వేల మంది దుర్మరణం చెందారు. 2021లో కంటే 2022లో జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు 12 శాతం పెరిగాయి. మృతుల సంఖ్య 9శాతం పెరిగింది. జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత లోపాలు, నిర్వహణ లోపం రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. దీంతో హైవేల నిర్వహణ విధానాన్ని మరింత పకడ్బందీగా రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం జాతీయ రహదారులను నిర్మిస్తున్న కాంట్రాక్టు సంస్థలు ఐదేళ్ల పాటు వాటి నిర్వహణ చేపడుతున్నాయి. ఆ ఐదేళ్లలో రోడ్ల నిర్వహణ, గుంతలు పూడ్చడం, ఇతరత్రా మరమ్మతులు చేస్తాయి. ఆ తర్వాత ఆ బాధ్యతను ఎన్‌హెచ్‌ఏఐకి అప్పగిస్తున్నాయి. కానీ పలు కాంట్రాక్టు సంస్థలు కేవలం ఐదేళ్లే నాణ్యతతో ఉండేలా హైవేలను నిర్మిస్తున్నాయని ఎన్‌హెచ్‌ఏఐ ఆడిటింగ్ నివేదిక వెల్లడించింది. ఐదేళ్ల తర్వాత ఆ రోడ్లు దెబ్బతింటున్నాయి. వాటి నిర్వహణ భారం ఎన్‌హెచ్‌ఏఐపై పడుతోంది. దీనికి పరిష్కారంగానే నిర్వహణ బాధ్యతను పదేళ్లకు పెంచాలని ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించింది. ఈపీసీ, యాన్యుటీ, బీవోటీ పద్ధతుల్లో నిర్మించే జాతీయ రహదారులకు ఈ నిబంధన వర్తిస్తుంది.

తక్షణం అమలులోకి

ఎన్‌హెచ్‌ఏఐ నూతన విధానాన్ని తక్షణం అమల్లోకి తెచ్చింది. ఇప్పటికే ఆమోదించిన జాతీయ రహదారుల నిర్మాణాలకు కొత్త విధానాన్ని వర్తింపజేసింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ చేపట్టినవాటికి, త్వరలో చేపట్టబోయే వాటికి కూడా ఈ విధానం వర్తిస్తుంది. దేశవ్యాప్తంగా రూ.7.81 లక్షల కోట్లతో 25,713 కిలోమీటర్ల హైవేల నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ ఆమోదించింది. వాటిలో ఈపీసీ విధానంలో 56 శాతం, 42శాతం యాన్యుటీ విధానంలో, 2 శాతం బీవోటీ విధానంలో నిర్మించనుంది. వీటి నిర్మాణాన్ని చేపట్టే కాంట్రాక్టు సంస్థలు పదేళ్లపాటు వాటి నిర్వహణ, మరమ్మతుల బాధ్యతను చేపట్టాలి. తాజా నిర్ణయం వల్ల జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత పెరుగుతుందని, నిర్వహణ కూడా సక్రమంగా ఉంటుందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారవర్గాలు తెలిపాయి.

ఫేక్ పోస్టింగ్‌ల నిందితుడు అరెస్టు

వైఎస్సార్ సోషల్ మీడియా సభ్యుడి పేరుతో ఫేక్ అకౌంట్ సృష్టి



వివరాలను తెలియజేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) సుధాకర్

కడప అర్బన్: అసభ్య దూషణలతో ఫేక్ పోస్టులు పెడుతూ దీన్ని వైఎస్సార్ సోషల్ మీడియాకు ఆపాదించేందుకు యత్నించిన టీడీపీ కుట్రలు బహిర్గతమయ్యాయి. విశాఖకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, టీడీపీ సానుభూతిపరుడైన పినపాల ఉదయ్ భూషణ్ ఫేస్‌బుక్‌లో జుగుప్సాకరంగా వైఎస్ షర్మిల, నర్రెడ్డి సునీతపై పోస్టింగ్‌లు పెడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఐపీ అడ్రస్ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. బుధవారం కడపలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ మీడియాకు ఈ వివరాలను వెల్లడించారు. సాక్ష్యాధారాలతో దొరికిపోయినప్పటికీ తన భర్తను పోలీసులు అన్యాయంగా అరెస్టు చేశారంటూ నిందితుడు ఉదయ్ భార్య ఏకంగా విశాఖలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఆరోపణలు చేయడం ఆ పార్టీతో వారి అనుబంధాన్ని రుజువు చేస్తోంది. ఒకవైపు షర్మిలతో తాను రూపొందించిన స్క్రిప్టు చదివిస్తూ కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేయిస్తున్న చంద్రబాబు మరోవైపు తన శిష్య గణం ద్వారా ఆమె వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ పోస్టింగ్‌లకు పురిగొల్పుతున్నట్లు స్పష్టమవుతోందని పరిశీలకులు పేర్కొంటున్నారు. ఎవరినైనా సరే తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుని అవసరం తీరాక బురద చల్లడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని వ్యాఖ్యానిస్తున్నారు.

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని తండ్రీకుమారుల అరెస్టు

పులివెందులకు తరలింపు



విశాఖపట్నంలోని మహారాణిపేట సామ్రాట్ ఎన్‌క్లేవ్‌లో నివసిస్తున్న నిందితుడు పినపాల ఉదయ్ ఈ ఏడాది జనవరి 13వతేదీన పులివెందులకు చెందిన వర్రా రవీంద్రారెడ్డి పేరుతో ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్ సృష్టించాడు. వైఎస్ఆర్ సోషల్ మీడియా సభ్యుడైన రవీంద్రారెడ్డి ఫోటోను ప్రొఫైల్ పిక్‌గా పెట్టి సదరు ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి షర్మిల, సునీతపై అసభ్యకర పదజాలంతో పోస్టులు పెడుతున్నాడు. తన పేరు, ఫోటోను వినియోగించి దుష్ప్రచారానికి పాల్పడటంపై రవీంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఈనెల 3న క్రైం.నెం. 45/2024 కేసు నమోదైంది. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ పర్యవేక్షణలో పులివెందుల డీఎస్పీ కేఎస్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐ సి.శంకర్ రెడ్డి, సైబర్ క్రైం సీఐలు శ్రీధర్‌నాయుడు, మధు మల్లేశ్వర్‌రెడ్డిలను రెండు బృందాలుగా విభజించి దర్యాప్తు ప్రారంభించారు.

ఫేక్ అకౌంట్ సృష్టించి..

ఫేస్‌బుక్ డేటా బేస్ ఆధారంగా నిందితుడు ఉపయోగించిన ఐపీ అడ్రస్‌ను ట్రాక్ చేసి విశాఖకు చెందిన పినపాల ఉదయ్ భూషణ్‌గా గుర్తించారు. టీడీపీకి వీరాభిమాని అయిన నిందితుడు పార్టీ తరఫున పలు వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా గ్రూపుల్లో అసభ్యకరమైన మెస్సేజ్‌లు, పోస్టులు పెడుతున్నట్లు నిర్ధారించారు. సైబర్ క్రైమ్ పోలీసులు అత్యాధునిక టెక్నాలజీ ద్వారా నిందితుడు ఉన్న ప్రదేశాన్ని గుర్తించి అతడి నివాసం వద్ద ఈనెల 13న అరెస్ట్ చేశారు. నేరానికి ఉపయోగించిన యాపిల్ ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్, అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి, సైబర్ క్రైం సీఐలు శ్రీధర్‌నాయుడు, మధుమల్లేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ జీవన్‌రెడ్డి, పులివెందుల ఎస్ఐ అరుణ్‌రెడ్డి తదితర సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ వ్యవహారంలో ఇతర కుట్రదారులెవరన్నది తేల్చేందుకు క్షుణ్నంగా దర్యాప్తు చేపట్టారు.

ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చూడండి

- కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు, గనుల శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం
- మీ ఇసుక విధానం ఏమిటో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం
- ఇసుక ధర ఎలా నిర్ణయిస్తారు, ఎలా రవాణా చేస్తారో చెప్పాలని స్పష్టీకరణ
- రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలకు అనుమతివ్వడం లేదన్న ప్రభుత్వం
- తదుపరి విచారణ ఈ నెల 21కి వాయిదా

సాక్షి, అమరావతి : కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని అన్ని ఇసుక రీచ్‌లలో అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇరు జిల్లాల కలెక్టర్లను, గనుల శాఖ అధికారులను హైకోర్టు బుధవారం ఆదేశించింది. అలాగే రాష్ట్రంలో ఇసుక విధానం ఏమిటి? ఇసుక ధరను ఎలా నిర్ణయిస్తారు? రీచ్‌ల నుంచి ఇసుక రవాణా ఎలా జరుగుతుందో తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇసుక అక్రమ తవ్వకాలను నిరోధించేందుకు తీసుకుంటున్న చర్యలను కూడా వివరించాలని చెప్పింది. భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్)ను ఆదేశించింది. అక్రమ తవ్వకాలపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కు ఇచ్చే నివేదికను సైతం తమ ముందుంచాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

పల్నాడు జిల్లా అమరావతి మండలంలో జేపీ వెంచర్స్ సంస్థ అక్రమంగా ఇసుక తవ్వి తరలిస్తోందని, అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ జీవీఎస్ఎస్ ప్రసాద్ మరికొందరు గత ఏడాది దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది జంపన శ్రీదేవి వాదనలు వినిపిస్తూ నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో ఇసుక తవ్వి, పెద్ద పెద్ద లారీల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని తెలిపారు. ఈ కేసులో కోర్టు సహాయకారి (అమికస్ క్యూరీ)గా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తి వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలో ఇసుక తవ్వకాల్లో ఓ కంపెనీకే గుత్తాధిపత్యం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపూడి వెంకట యజ్ఞదత్ స్పందిస్తూ.. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు ఇసుక అక్రమ తవ్వకాలపై ఎంవోఈఎఫ్, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారని, ఆ నివేదికను ఎన్‌జీటీ ముందు ఉంచుతామని చెప్పారు. గనుల శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది (జీపీ) కామిరెడ్డి నవీన్ కుమార్ వాదనలు వినిపిస్తూ, రాష్ట్రంలో ఎక్కడా ఇసుక అక్రమ తవ్వకాలకు అనుమతివ్వడంలేదని తెలిపారు. తవ్విన ఇసుకను ఓ చోట డంప్ చేస్తారని, అవసరాల మేర రవాణా చేస్తారని చెప్పారు. ఎక్కడా అక్రమాలు లేవన్నారు.

ఐబీకి దగ్గరగా ఏపీ విద్యావిధానం

ఐబీ ప్రతినిధి ఆశిష్



ప్రవీణ్ ప్రకాశ్‌తో మాట్లాడుతున్న ఐబీ ప్రతినిధి ఆశిష్

సాక్షి, అమరావతి: ఏపీలో అందిస్తున్న విద్యా బోధన, ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా విధానాలు దాదాపు ఐబీ పాఠ్య ప్రణాళిక (కరికులం)కు దగ్గరగా ఉన్నాయని ఐబీ ప్రతినిధి ఆశిష్ అన్నారు. ఇది ఏపీలో ఐబీ సిలబస్‌ను అమలు చేయడం చాలా సులభతరం చేసిందని పేర్కొన్నారు. బుధవారం ఆయన పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌తో వెలగపూడి సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బోధన విధానాలు, మూల్యాంకన పద్ధతులు, బోధన, అభ్యసన, పరికరాలు వినియోగించడంలో దాదాపుగా రాష్ట్ర విద్యా విధానాలు ఐబీ కరికులంతో సరిపోలుతున్నాయని ప్రశంసించారు. ఫౌండేషన్, ప్రాథమిక, మాధ్యమిక, ఉపాధి సంబంధ కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రస్తుత జాతీయ విద్యా విధానంలో భాగంగా అమలు చేయడం అద్భుతమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని, సైన్స్, గణితం, టెక్నాలజీలతో పాటు ఆంగ్ల విద్య అవసరాన్ని కూడా ప్రభుత్వం గుర్తించి అందరికీ ఉచితంగా అందజేయడంలో ముఖ్యమంత్రి జగన్ చొరవ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రపంచంలో వచ్చే మార్పులకు తగిన విధంగా విద్యావిధానంలో ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకురావడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అగ్రగామిగా నిలిచిందన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రపంచీకరణ నైపుణ్యాలను అందించడం సీఎం జగన్ ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. సమావేశంలో పాఠశాల విద్య డైరెక్టర్ పి.పార్వతి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి, జి.కేశవరెడ్డి, వై.గిరిబాబు యాదవ్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ముగ్గురు దుర్మరణం.. ఐదుగురికి గాయాలు
- మృతుల్లో ఆటో డ్రైవర్, ఇద్దరు మహిళా కూలీలు
- బాపట్ల జిల్లా ఏల్చూరు సమీపంలో ఘటన



ప్రమాదంలో గాయపడి విలవిల్లాడుతున్న క్షతగాత్రులు

అద్దంకి: మిరపకాయల కోత కూలీలతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొట్టిన దుర్ఘటనలో ఆటో డ్రైవర్ సహా ఇద్దరు మృతి చెందగా.. మరో ఐదుగురు గాయపడ్డారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు సమీపంలోని అద్దంకి –నార్కెట్‌పల్లి రహదారిలో కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల పాఠశాల సమీపంలో బుధవారం సాయంత్రం దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలు అదే గ్రామానికి చెందిన ఆటోలో వెళ్లారు. మిరప కాయల కోత పనులు పూర్తి చేసుకుని సాయంత్రం అదే ఆటోలో ఇళ్లకు బయలుదేరారు. ఆటో కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల పాఠశాలకు సమీపంలోకి రాగా.. కారు ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొట్టి తిరగబడింది. సమాచారం అందుకున్న సీఐ నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తన జీప్‌లో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ అల్లాహు (50), కూలీలు వెంకాయమ్మ (62), మౌలమ్మ (75) మృతిచెందారు. గాయపడిన మిగిలిన ఐదుగురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

కలబుర్గి కందిపప్పుకు భలే గిరాకీ

- కళ్యాణ కర్ణాటకలో వేధిస్తున్న దాల్ మిల్లుల కొరత
- ప్రధాన మార్కెట్‌గా రాయచూరు ఏపీఎంసీ యార్డు



రాయచూరులోని రాజేంద్ర గంజ్ ఏపీఎంసీ మార్కెట్ యార్డు ప్రవేశ ద్వారం


నాణ్యమైన కందిపప్పు

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలోని కలబుర్గి జిల్లా కందిపప్పు మంచి రుచికి పేరుగాంచింది. ఈ రకం కంది బ్యాళ్లు బీదర్, కలబుర్గి జిల్లాల్లో ఎక్కువగా పండిస్తున్నారు. అయితే జిల్లాల్లో మార్కెటింగ్ సౌకర్యం, దాల్ మిల్లులు లేకపోవడంతో ప్రత్యేక గుర్తింపు లేకుండా పోయింది. కళ్యాణ కర్ణాటకలో బీదర్, కలబుర్గి జిల్లాలకు సమీపంలో ఉన్న రాయచూరు జిల్లాలో వ్యాపారులు, దాల్ మిల్లులుండడంతో కందిపప్పుకు ప్రధాన మార్కెట్‌గా ఎదిగింది. కలబుర్గి జిల్లా కంది పప్పుకు పేటెంట్ హక్కులు రావడంతో అధిక మొత్తంలో పంటను పండిస్తున్నారు. బ్రాండ్ వ్యాల్యూని సద్వినియోగం చేసుకొని కందులను పప్పులుగా మార్చుకొని విక్రయించేలా రైతాంగం ఎదగాలని జిల్లాధికార యంత్రాంగం సూచిస్తోంది. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాధికార యంత్రాంగం రూపొందించిన అడ్వాంటేజ్ కలబుర్గి డివిజన్ సమావేశంలో కంది పప్పును చేర్చేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు.

వర్షాధార పంటగా ఖరారు

జిల్లాలో లక్ష టన్నుల మేర ఉత్పత్తి అవుతున్న కంది పంటను వర్షాధారిత పంటగా నిర్ణయించారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో సాధారణంగా 1.50 లక్షల హెక్టార్లలో పంటను పండిస్తారు. ఈ ఏడాది కరువు అధికంగా నెలకొంది. కలబుర్గి, సేడం, చిత్తాపుర, గురుమఠకల్ ప్రాంతాల్లో కంది పంటను అధికంగా పండిస్తున్నారు. నీటి వనరులు ఉండే భూముల్లో ఎకరాకు 12–15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. తగిన సమయంలో వానలు కురిస్తే ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు ఉత్పత్తి అవుతుంది. కలబుర్గి, సేడం, చిత్తాపుర, గురుమఠకల్‌లో పండే కంది పంటకు మంచి బేరం ఉంది. ఈ కంది పప్పు బ్రాండ్ పేరుతో మధ్య దళారులు లబ్ధి పొందుతున్నారు.

ధరల పతనంపై రైతుల్లో భయం

కాగా కందిపప్పు ధరలు తగ్గుముఖం పడతాయనే భయం రైతుల్లో నెలకొంది. ప్రతి క్వింటాల్ రూ.5,800 కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఉత్తర కర్ణాటకలోని కలబుర్గి, రాయచూరు, బీదర్, కొప్పళ, బాగల్‌కోట, విజయపుర జిల్లాల్లో 11.99 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు కంది పంటను పండిస్తున్నారు. ప్రభుత్వం 1,82,875 మెట్రిక్ టన్నుల కందులను కొనుగోలు చేయాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏపీఎంసీ మార్కెట్‌లో ప్రతి క్వింటాల్‌కు రూ.4,105–5,472 ధర పలుకుతోంది. రైతులు కంది పంట రాశులు చేస్తున్న సమయానికి దాని ధర తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. కంది పంట పండిస్తున్న రైతులు కలబుర్గి, సేడం, చిత్తాపుర, గురుమఠకల్‌లో దాల్ మిల్లుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోలేరా ?


మాట్లాడుతున్న సిద్దనగౌడ

రాయచూరు రూరల్: దేవదుర్గ తాలూకాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు సిద్దనగౌడ ఆరోపించారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ కానిస్టేబుల్ హన్మంతరాయపై ఎమ్మెల్యే కరెమ్మ కుటుంబ సభ్యులు దాడి చేశారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాలూకాలో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక రవాణాను అడ్డుకోవడంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు.

కాటికాపరులకు పెన్షన్‌పై వినూత్న ఆందోళన


ఆందోళన చేస్తున్న కాటికాపరులు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని శ్మశానాల్లో విధులు నిర్వహించే కాటికాపరులకు పెన్షన్ పెంచాలని కోరుతు కాటికాపరుల సమితి అధ్యక్షుడు వీరేష్ నేతృత్వంలో వినూత్న ఆందోళన చేపట్టి మాట్లాడారు. బుధవారం భోవి సమాజం శ్మశాన వాటికలో గుంతలు తవ్వి గొంతు వరకు భూమిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి సిద్దరామయ్య చర్యలు చేపట్టాలన్నారు. 45 ఏళ్లకు పైబడిన కాటికాపరులకు రూ.3 వేలు పెన్షన్ పెంచాలని కోరుతూ శ్మశానం వద్ద తహసీల్దార్ సురేష్‌వర్మకు వినతిపత్రం సమర్పించారు.

వేశ్యావాటిక నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్ట్

హుబ్లీ: నగరంలోని నవనగర ఓ ఇంట్లో వేశ్యావాటిక నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి ఓ మహిళను కాపాడారు. ఈ కేసుకు సంబంధించి ఆ ఇంటి యజమానిని, ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ఇంట్లో మహిళలను తెచ్చి పెట్టుకొని వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు ఈ దాడి చేశారు. ఘటనపై ఏపీఎంసీ నగర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అక్రమ బియ్యం, గోధుమల పట్టివేత


బియ్యం, గోధుమల నిల్వను స్వాధీనపరచుకున్న అధికారులు

బళ్లారిఅర్బన్: తాలూకా సరిహద్దుల్లోని కుంటనహాళ్ గ్రామంలోని గోదాముపై బుధవారం ఆహార పౌరసరఫరాల శాఖ అధికారులు దాడి చేసి అక్రమంగా నిల్వ చేసిన చౌకడిపోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ప్రభుత్వం అన్నభాగ్య పథకం కింద పేదలకు అందిస్తున్న బియ్యాన్ని ఓ వ్యాపారి అక్రమంగా సేకరించి ఆ గ్రామంలో గోధుమలు నిల్వ చేసే గోదాములో నిల్వ ఉంచి లారీలోకి లోడ్ చేస్తున్న విషయం తెలిసిన అధికారులు గ్రామానికి వెళ్లి దాడి చేశారు. సుమారు రూ.2,93,320 విలువ గల రేషన్ బియ్యం, రూ.41,850 విలువ గల గోధుమలను సీజ్ చేసినట్లు అధికారి తెలిపారు. సుమారు 40 కేజీల బరువుగల 252 ప్యాకెట్ల బియ్యం కలిపి మొత్తం 10,080 కేజీల బియ్యం , అలాగే 50 కేజీల బరువుగల సంచుల్లోని 15 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం చేసుకొన్నారు. పీడీహళ్లి(హగరి) పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి బియ్యాన్ని ఏపీఎంసీకి తరలించినట్లు అధికారి తెలిపారు.

సరిగా సమాచారం అందించరూ


వినతిపత్రం సమర్పిస్తున్న సభ్యులు

రాయచూరు రూరల్: సమాచార హక్కును సక్రమంగా అందించేందుకు శాఖాపరంగా అధికారులు సహకరించాలని మానవ హక్కుల సంరక్షణ, అవినీతి నిర్మూలన సమితి డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో తిమ్మప్పస్వామి మాట్లాడారు. జిల్లాలో 35 శాఖలకు చెందిన సమాచారాన్ని సమాచార హక్కు కింద అందించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

మాతాశిశు ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ

బళ్లారి రూరల్: విమ్స్ ఆసుపత్రి ఆడిటోరియం వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో జిందాల్ ఆర్థిక సౌజన్యంతో తల్లిశిశువు(మదర్ అండ్ చైల్డ్) ఆసుపత్రి నిర్మాణానికి బుధవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.80 కోట్లతో జిందాల్ సంస్థ ఆసుపత్రిని నిర్మించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రికి అవసరమయ్యే రూ.25 కోట్లను రాష్ట్రప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. కాగా ఈ ఆసుపత్రి నిర్మాణానికి ఏడాదిన్నర క్రితమే అప్పటి బీజేపీ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. అప్పటి ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై శిలాఫలకాన్ని ఆరంభించారు. ప్రభుత్వం మారడంతో ఇప్పటికి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నారు. అదేవిధంగా విమ్స్‌లో సర్జికల్ స్టోర్, నందిని క్యాంటీన్, అంబులెన్స్ డ్రైవర్లకు, ఇంజినీరింగ్ సామగ్రికి గదులను డైరెక్టర్ ప్రారంభించారు. విమ్స్ పీడియాట్రిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ దుర్గప్ప, విభాగ వైద్యులు, జిందాల్ అధికారులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న డాక్టర్ గంగాధరగౌడ

నలుగురు అధికారుల సస్పెండ్

గంగావతి: ఇళ్ల స్థలాల కేటాయింపునకు ఫారం–3 మంజూరులో ఆర్థికపరమైన అరాచకాన్ని సృష్టించారనే ఆరోపణలతో బుధవారం కుష్టిగిలో నలుగురు అధికారులను సస్పెండ్ చేశారు. కుష్టిగి పురసభ కమిషనర్‌గా పని చేస్తున్న ఉమేష్, రెవెన్యూ శాఖ అధికారులు రాఘవేంద్ర, చిరంజీవి, పురసభ ముఖ్యాధికారి ఖాజా హుస్సేన్‌లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలను జారీ చేయగా, వీరిలో ఉమేష్ సస్పెన్షన్‌కు మినహాయింపు లభించినట్లు తెలిసింది.

కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

హుబ్లీ: నగరంలోని కిమ్స్ ఆవరణ వెనుకభాగంలో గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం, తల, మెదడుతో పాటు కుళ్లిన స్థితిలో మృతదేహం కనిపించింది. ఆస్పత్రి హాస్టల్ కాంపౌండ్ వెనుక డ్రైనేజీ శుభ్రం చేస్తుండగా సిబ్బందికి ఈ మృతదేహం కనిపించడంతో తక్షణమే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 4–5 నెలల క్రితమే ఈ వ్యక్తి చెందినట్లుగా అనుమానిస్తున్నారు. ఘటన స్థలానికి విద్యానగర పోలీసులు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకారం


గురుచంద్రయాదవ్

గంగావతి: గంగావతి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా గురుచంద్ర యాదవ్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బదిలీ కావడంతో ఖాళీ అయిన ఈ పోస్టుకు ఇటీవల రాయచూరు జిల్లా మాన్వి తాలూకా సిరివార పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న గురుచంద్రయాదవ్ గంగావతికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.

ఓబీసీ సెల్‌కు ఎంపిక

బళ్లారిఅర్బన్: బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడుగా రాఘవేంద్ర యాదవ్ ఎంపికయ్యారు. బుధవారం వాజ్‌పేయ్ లేఔట్‌లోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయనకు ఆదేశపత్రం అందించినట్లు జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు. పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి ఓబీసీ సెల్‌కు పార్టీ నేతల సమక్షంలో ఈ ఎంపికను చేసి ఆదేశపత్రం అందించినట్లు తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు డాక్టర్ అరుణ కామినేని, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమనగౌడ, సురేష్, రైతు మోర్చా అధ్యక్షుడు బినాథరెడ్డి, ఉపాధ్యక్షురాలు సాధన హిరేమఠ్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ద కాలంగా అటకెక్కిన ఆర్టికల్–371(జే)



కళ్యాణ కర్ణాటక చిత్రపటం

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక పరిధిలో రాజ్యాంగంలోని ఆర్టికల్–371(జే) అమలుపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రాంతీయ అసమానతలతో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం, విద్య, వైద్య, ఆరోగ్య, ఉద్యోగ రంగాల్లో ఇతర ప్రాంతాలతో సమానంగా ఉండాలనే ఉద్దేశ్యంతో రాజ్యాంగంలోని ఈ ఆర్టికల్‌ను 2014 ఫిబ్రవరి 20న అప్పటి ప్రధానమంత్రి మన్‌మోహన్ సింగ్ జారీ చేశారు. కళ్యాణ కర్ణాటక పరిధిలో బీదర్, కలబుర్గి, యాదగిరి, రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయనగర జిల్లాలు వస్తాయి. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రతి ఏడాది రూ.3000 కోట్ల నిధులు కేటాయిస్తారు. ఈ నిధులతో శాసన సభ్యులు రహదారులు, పాఠశాలలు, తాగునీటి పథకాలకు నిధులను వినియోగించు కోవాల్సి ఉంది. విద్య, ఉద్యోగ విషయాల్లో ఈ ప్రాంతం వారికి 75 శాతం, ఇతర ప్రాంతాల వారికి 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉన్నా ఆ పద్ధతి నేటికీ అమలు కాక కాగితాలకే పరిమితమైంది. కళ్యాణ కర్ణాటక పరిధిలో రాజ్యాంగంలోని ఆర్టికల్–371(జే)ను అమలు చేయడంలో నాడు కేంద్రమంత్రిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన కృషిపై అధికారులు నీళ్లు చల్లుతున్నారు.

గుండెపోటు మరణాలే అధికం

కోలారు: దేశంలో 35 శాతం గుండెపోటుతోనే మరణాలు సంభవిస్తున్నాయని, వీటిలో 40 ఏళ్ల లోపు వయస్సు వారే ఎక్కువగా గుండెపోటుకు గురవుతుండడం ఆందోళనకరమని బెంగళూరు జయదేవ హృద్రోగ సంస్థ మాజీ డైరెక్టర్ డాక్టర్ సీఎన్ మంజునాథ్ తెలిపారు. బుధవారం నగర సమీపంలోని దేవరాజ్ అరస్ ఉన్నత విద్యా సంస్థ రజత మహోత్సవ సభాంగణంలో నేషనల్ సైంటిఫిక్ కాన్క్లేవ్ ఆఫ్ సైంటిఫిక్ రీసెర్చ్ చర్చాగోష్టిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో 65 శాతం మరణాలకు జీవనశైలే కారణం అవుతోందన్నారు. హృద్రోగం, మధుమేహం, క్యాన్సర్ వల్ల అధిక మరణాలు నమోదవుతున్నాయన్నారు. దేశంలో సుమారు 8 వేల ఉన్నత విద్యా సంస్థలుండగా కొన్ని సంస్థలు మాత్రమే మూల పరిశోధనకు ప్రాధాన్యతనిస్తూ నిధులు, సమయం వెచ్చిస్తున్నాయన్నారు. వాటిలో దేవరాజ్ అరస్ అకాడమి కూడా ఒకటని శ్లాఘించారు. కోవిడ్ దేశానికి పెద్ద గుణపాఠం నేర్పిందన్నారు. కోవిడ్ టీకాను కేవలం ఏడాదిన్నర కాలంలో అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. పదేళ్ల తర్వాత క్యాన్సర్ వస్తుందని, ఐదేళ్ల తరువాత హృద్రోగ సమస్యలు వస్తాయని ముందుగానే తెలుసుకునేలా పరిశోధనలు జరగాలన్నారు. కార్యక్రమంలో అరసు శిక్షణా ట్రస్టు అధ్యక్షుడు, అకాడమి చాన్సలర్ జీహెచ్ నాగరాజ్, ఉపాధ్యక్షుడు జే రాజేంద్ర, కార్యదర్శి కేజీ హనుమంతరాజు, ట్రస్టీ రాజేష్ జగ్దాళె పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

27న ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం

హొసపేటె: బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఈ నెల 27న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బృహత్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునగౌడ తెలిపారు. బుధవారం ఆయన ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగులకు కరపత్రాలు అందించి, స్టిక్కర్లను అంటించిన అనంతరం మాట్లాడారు. ఈ సమావేశంలో ఉద్యోగులందరూ తప్పకుండా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వీరభద్రేష్, రాఘవేంద్ర, బసవరాజ్ పాల్గొన్నారు.


స్టిక్కర్లను అంటిస్తున్న దృశ్యం

మళ్లీ మోదీ సర్కార్ అభియాన్

కంప్లి: కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బంగారు హనుమంతు తెలిపారు. బుధవారం కూడ్లిగి పట్టణంలో మళ్లీ మోదీ ప్రభుత్వం అభియాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో పాటు అన్ని రాష్ట్రాల్లో అత్యధిక స్థానాల్లో మెజార్టీతో మోదీ ప్రభుత్వం తిరిగి రానుందన్నారు. గత పదేళ్లుగా ఇంతవరకు ఏ ప్రధానీ చేయని అభివృద్ధి నరేంద్ర మోదీ కాలంలో జరిగిందన్నారు. ముఖ్యంగా రైతాంగం, యువత, మహిళలకు అనేక పథకాలు అమలు చేశారన్నారు. మచ్చలేని నాయకుడిగా పాలించడం వల్లే ప్రజలు తిరిగి మోదీ పాలనకే మొగ్గు చూపుతున్నారన్నారు. అనంతరం విజయనగర యువమోర్చా అధ్యక్షులు కిచిడి వెంకటేష్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొంది తాము మోదీకి పూర్తి మద్దతు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా మండలి అధ్యక్షులు రాజు బణవికల్లు పాల్గొన్నారు.


కమలం గుర్తు గీస్తున్న కార్యకర్తలు

నకిలీ దాఖలాలతో భూమి రిజిస్ట్రేషన్

- సబ్ రిజిస్ట్రార్‌తో పాటు 8 మందిపై కేసు నమోదు

బళ్లారి అర్బన్: నకిలీ దాఖలాలు సృష్టించి వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న పలు ఉదంతాలకు తోడు తాజాగా ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మరో కేసు తాజాగా వెలుగు చూసింది. తాలూకాలోని బెణకల్ గ్రామానికి చెందిన అయ్యమ్మ అనే మహిళకు చెందిన సర్వే నెంబర్–114/ఏ/2బీలో ఒక ఎకరా 80 సెట్ల భూమిని ఎం.మల్లికార్జున అనే వ్యక్తి అయ్యమ్మ పేరిట నకిలీ దాఖలాలు సృష్టించి తన పేరున రిజిస్టర్ చేయించుకున్నాడు. దీనిపై భూమి మూల హక్కుదారురాలు అయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోకా పోలీస్ స్టేషన్‌లో బళ్లారి సబ్‌రిజిస్ట్రార్ రవికుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్‌కుమార్, గ్రామ లెక్కాధికారి శివకుమార్‌తో పాటు 8 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో నకిలీ రికార్డులతో రిజిస్ట్రేషన్‌కు సహకరించిన సిబ్బంది, బాధ్యులపై అసిస్టెంట్ కమిషనర్‌తో విచారణ జరిపించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా ప్రకటించారు.

సాధకులకు సన్మానం

మాలూరు: పట్టణంలోని శ్రీక్షేత్ర మారికాంబ ఆలయ ట్రస్టు పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. బుధవారం పట్టణంలోని కుంబేశ్వర రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలను ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.65 లక్షల వ్యయంతో అభివృద్ధి పరుస్తూ నిర్మించిన నూతన కట్టడాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం వివిధ రంగాల్లో సాధన చేసిన వారిని సన్మానించారు. ట్రస్టు అధ్యక్షుడు పి.వెంకటేష్, తహసీల్దార్ కె.రమేష్, బీఈఓ చంద్రకళ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల డిష్యుం..డిష్యుం

- కార్యాలయంలో ఘర్షణ పడి పరస్పరం కొట్టుకున్న కార్యకర్తలు


కాంగ్రెస్ కార్యకర్తలను అదుపు చేస్తున్న పోలీసులు

కోలారు: కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం రెండు గ్రూపుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుని పరస్పరం కొట్టుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. దీంతో జిల్లా కాంగ్రెస్‌లోని విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. రెండు గుంపుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుని పరస్పరం చేయి చేసుకున్నారు. కేపీసీసీ ఉపాధ్యక్షుడు పీఆర్ రమేష్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ సమక్షంలో బూత్ స్థాయి సమావేశాన్ని నగరంలోని కాంగ్రెస్ భవనంలో ఉదయం 11.30 గంటలకు నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ అనుచరులు ఫ్లెక్సీల్లో తమ నాయకుడి ఫోటో వేయలేదని అభ్యంతరం తెలిపారు. దీంతో ప్రారంభమైన వాగ్వాదం చివరికి చేయి చేసుకునే దాకా వెళ్లింది.

నాయకుల ఫొటోలు వేయలేదని ఆక్షేపణ

ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్, ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు రమేష్‌కుమార్‌ల ఫోటోలు వేయలేదని నగరసభ సభ్యుడు అంబరీష్ ఆక్షేపణ వ్యక్తం చేశారు. అప్పుడే కాంగ్రెస్ నాయకుడు శివకుమార్ గట్టిగా అరుస్తూ కాంగ్రెస్ నాయకుల ప్రసంగానికి అడ్డుపడి అనంతరం వేదికపైకి చేరి కేపీసీసీ జిల్లా కార్యాధ్యక్షుడు ఊరుబాగిలు శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చొక్కా పట్టుకుని కిందకు లాగి తలతో శ్రీనివాస్ తలను సినిమా స్టైల్‌లో ఢీకొట్టాడు. ఇదంతా ప్రత్యక్షంగా చూసిన కేపీసీసీ ఉపాధ్యక్షుడు పీఆర్ రమేష్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ ఖంగుతిని నిశ్చేష్టులై నిలబడిపోయారు. అక్కడే ఉన్న గల్‌పేట పోలీసులు మరింత మంది సిబ్బందిని రప్పించి పరిస్థితిని అదుపు చేశారు.

గత ఎన్నికల్లో అభ్యర్థి ఓటమికి కారకులు

జిల్లా కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా ఉన్న రెండు గ్రూపులు గత లోక్‌సభ ఎన్నికల్లో మరింత ఉధృతమై కాంగ్రెస్ అభ్యర్థి కెహెచ్ మునియప్ప ఘోర పరాజయానికి కారకులయ్యారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు కెహెచ్ మునియప్ప మళ్లీ కాంగ్రెస్ తరఫున పోటీ చేయడానికి సన్నద్ధమవుతున్న తరుణంలో కెహెచ్ మునియప్ప వ్యతిరేక వర్గంలో ఉన్న కేఆర్ రమేష్ కుమార్, ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్ వర్గం వారు కేహెచ్ మునియప్పకు టికెట్ తప్పించి తమకు అనుకూలమైన వ్యక్తికి ఇప్పించాలనే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ భవనంలో జరిగిన ఘటనపై స్పందించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఇదంతా కుటుంబ గొడవ అని, లోక్‌సభ ఎన్నికల నాటికి అందరూ ఒక్క తాటిపై నిలబడి అభ్యర్థి విజయానికి కృషి చేస్తారన్నారు.

రాజ్యసభ సభ్యునిగా రెండోసారి.!

- నాసిర్ హుస్సేన్‌కు కొనసాగింపు

సాక్షి,బళ్లారి: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మెంబరు(సీడబ్ల్యూసీ) నాసిర్ హుస్సేన్‌ను రెండోసారి రాజ్యసభ సభ్యుడుగా కాంగ్రెస్ పార్టీ తరుపున ఎంపిక చేశారు. రాష్ట్రంలో మూడు రాజ్యసభ సభ్యుల స్థానాలు ఖాళీ పడటంతో వారిలో అజయ్ మాకెన్, జీ.సీ. చంద్రశేఖర్‌లతో పాటు బళ్లారి జిల్లాకు చెందిన నాసిర్ హుసేన్ పేరును కూడా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. 2018 నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడుగా కొనసాగుతున్నారు. ఆయన పదవీ కాలం ముగియనుండటంతో మరోసారి అవకాశం కల్పిస్తారా, లేదా? అన్నది చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఆయన్ను రెండోసారి కూడా కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడుగా పేరు ప్రకటించడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో పలువురికి మోదం, మరికొందరికి ఖేదంగా మారింది. తనకు అవకాశం కల్పించాలని డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ కూడా కోరారు. అయితే నాసిర్ హుస్సేన్ ఢిల్లీలో హైకమాండ్‌తో తనకు ఉన్న పలుకుబడి, పరిచయాలతో మళ్లీ సునాయాసంగా రాజ్యసభకు ఎంపిక కావడానికి మార్గం సుగమం చేసుకున్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

హుబ్లీ: కాలు జారి చెరువులో పడి ఓ వ్యక్తి చెందిన ఘటన ధార్వాడ తాలూకా మురుకట్టిలో బుధవారం వెలుగు చూసింది. మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన భగవాన్ గోపీనాథ్(35) అనే వ్యక్తి మృతుడు. కూలీ పని కోసం వెళ్లి నింగప్ప పొలంలో గుడిసెలోనే నివాసం ఉండేవాడు. ఈ క్రమంలో స్నానం చేయడానికి చెరువు వద్దకు వెళ్లి కాలు జారడంతో ఈత రాక మునిగి చనిపోయినట్లు ధార్వాడ గ్రామీణ పోలీసులు తెలిపారు.

దాడి ఖండిస్తూ బస్సుల నిలిపివేత


బంద్‌తో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

గంగావతి: కేఎస్‌ఆర్‌టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని ఆర్టీసీ అధికారులను డిమాండ్ చేస్తూ బుధవారం డ్రైవర్లు, కండక్టర్లు బస్సులను బంద్ చేశారు. ఉదయం 9.30 గంటలకు గంగావతి నుంచి హులిగికి వెళ్లే బస్సులో కండక్టర్, డ్రైవర్లపై యువకుల బృందం చిన్న కారణానికి వాగ్వాదానికి దిగి దాడి చేశారని ఆరోపించారు. దీంతో సుమారు గంటకు పైగా బస్సుల సంచారాన్ని నిలిపి వేశారు. అనంతరం అధికారులు డ్రైవర్లు, కండక్టర్లను సముదాయించి బస్సులను యథాప్రకారం ప్రారంభించారు.

జీతం పెంచండి మహాప్రభో.!


సీఎంకు గోడు వినిపిస్తున్న ఆశా కార్యకర్తలు


రాయచూరు రూరల్: రాష్ట్రంలో ఆర్‌సీహెచ్ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలకు నెలకు రూ.15 వేల వేతనమివ్వాలని రాష్ట్ర ఆశా కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు డిమాండ్ చేశారు. బుధవారం బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఆశా కార్యకర్తలకు రూ.15 వేలు వేతనాలు చెల్లిస్తున్నారని, రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న 20 వేల మందికి ఇచ్చే ఇన్సెంటివ్‌లు తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఆరోగ్య శాఖ పరిధిలోకి వచ్చే కార్యకర్తలు ఎనిమిది పథకాలకు గాను రెండు పథకాలకు నెలకు అదనంగా రూ.2 వేలు, రూ.5 వేల వేతనం కలిపి రూ.7 వేలు ఇస్తున్నారన్నారు.

ఇంజినీర్‌పై దాడికి నిరసన


ఆందోళన చేస్తున్న సిబ్బంది

రాయచూరు రూరల్: జెస్కాం ఇంజినీర్‌పై కాంట్రాక్టర్ దాడి చేయడం తగదని జెస్కాం సిబ్బంది పేర్కొన్నారు. బుధవారం జెస్కాం కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో వారు మాట్లాడారు. మంగళవారం కార్యాలయంలో ఇంజినీర్ ఆనంద్ విధులు నిర్వహిస్తుండగా దాడి చేసిన కాంట్రాక్టర్ మహ్మద్ మార్జాపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

తాగునీటి కోసం ధర్నా


ధర్నాలో పాల్గొన్న మహిళలు

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్విలో తాగునీటి కోసం మహిళలు మంగళవారం పురసభ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోజుల తరబడి తాగునీరందక నానా ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు నిర్లక్ష్యం వీడి సక్రమంగా తాగునీటిని అందించాలని ఒత్తిడి చేశారు. అనంతరం పురసభ ముఖ్యాధికారికి వినతిపత్రం సమర్పించారు.